
'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 121

శనివారం 22-7-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



లంక సీత వయసు 81.
ఢిల్లీతో 61 ఏళ్ల అనుబంధం.
ఢిల్లీలో ఉండనని ఏడ్చిన రోజులు...
ఇంత నగరంలో ఎలా జీవించాలి...
అనే ఆందోళన.
జీవించడం ఎలాగో నేర్పిన గురువుది కూడా ఆ నగరమే.
తెలుగుదనంతో ఢిల్లీలో అడుగుపెట్టిన నాటి తరం అమ్మాయి.
తనలాగ ఎందరో...
వాళ్లకు బతికే దారేది... అనుకుంది.
అలాంటి అభాగ్యులకు అక్క అయింది...
వారి జీవికకు దారి చూపిస్తోంది.

బడుగు జీవుల దారిదీపం ఈ పెద్దక్క

ఆంధ్రప్రదేశ్, పశ్చిమగోదావరి జిల్లా, తణుకులో పుట్టిన లంక సీత దేశ రాజధానితో ముడివడిన తన జీవిత గమనాన్ని సాక్షితో పంచుకున్నారు. "నేను పుట్టింది అమ్మమ్మగారింట్లో తణుకులోనే, కానీ సొంతూరు నర్సాపురం. నాన్న ఉద్యోగరీత్యా నా చదువు కొంత కాలం నర్సాపురం, మరికొంత కాలం తణుకులో అమ్మమ్మగారింట్లో సాగింది. నాకు చదువంటే ఎంత ఇష్టమంటే ఇంగ్లిష్ పరీక్ష రాయడానికి టేబుల్ అందకపోతే నిలబడి పరీక్ష రాశాను తప్ప పరీక్ష మానలేదు. ఎస్ఎస్ఎల్‌సీ తర్వాత అనుకోకుండా పెళ్లి సంబంధం రావడం, మంచి సంబంధం, అబ్బాయికి సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగం అని పెళ్లి చేసి మా వారితో పాటు నన్ను ఢిల్లీకి పంపించారు మా వాళ్లు. పంజాబీల ఇంట్లో అద్దెకుండేవాళ్లం. ఇంగ్లిష్ అయితే నెగ్గుకొచ్చేదాన్ని, కానీ హిందీ అక్షరం కూడా మాట్లాడలేని పరిస్థితి. నాకు ఢిల్లీ అలవాటయ్యేలోపే భూకంపం వచ్చింది. మా ఓనర్ నన్ను గట్టిగా పిలుస్తూ పంజాబీలో, హిందీలో ఏదో చెప్తోంది. అర్థం చేసుకునేలోపు ఆవిడే వచ్చి బయటకు లాక్కు వెళ్లింది. ఆ తర్వాత తెలిసింది నాకు అది భూకంపం అని. ఢిల్లీలో ఉండనని ఏడవడం అప్పుడు మొదలైంది. ఆ తర్వాత ఒక రోజు కడుపు నొప్పి కారణంగా మా వారిని హాస్పిటల్‌లో చేర్చారు. అది గుండెనొప్పి అని ఆయన దూరమైన తర్వాత తెలిసింది నాకు. కంపాషన్ గ్రౌండ్స్‌లో నాకు ఉద్యోగం ఇచ్చారు. ఉద్యోగంలో చేరిన తర్వాత ఇల్లు దాటి ఢిల్లీ వీధులు, సిటీ బస్సులతో నా జీవన యానం మొదలైంది. ఆఫీసులో ఉన్నా సరే నా కళ్లు వర్షించడానికి సిద్ధంగా ఉన్న నీలిమేఘాల్లా ఉండేవి. ఉద్యోగంలో పని నేర్చుకోవడం, ప్రైవేట్‌గా చదువుకోవడం మొదలు పెట్టిన తర్వాత నా మీద నాకు నమ్మకం కలిగింది. నా కళ్లు కన్నీళ్లను మరచిపోయాయి.

■ మళ్లీ చదువు!

ఇంటర్, బీఏ, ఎంఏ, ఆ తర్వత జర్నలిజం చేశాను. చైనా సామాజిక జీవనం పట్ల అధ్యయనం చేయాలనే ఉద్దేశంతో చైనీస్ భాష నేర్చుకోవడానికి లింగ్విస్టిక్స్‌లో చేరాను. కానీ ఉద్యోగంలో ప్రమోషన్ తర్వాత పని భారం కారణంగా ఇతర వ్యాపకాల మీద దృష్టి పెట్టలేకపోయాను. ఆర్థిక, సామాజిక పరిశోధన రంగంలో పని చేశాను. సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్‌గా ఉన్న సమయంలో అమ్మ కోసం నాలుగేళ్ల ముందే రిటైర్మెంట్ తీసుకున్నాను. ఉద్యోగంలో నా పని సామాజిక స్థితిగతుల మీద అధ్యయనం కావడంతో 2002లో సైరస్ (సీత ఆల్ ఇండియా రీసెర్చ్ అండ్ సోషల్ సర్వీసెస్) స్థాపించి విశ్రాంత జీవితాన్ని సమాజం కోసమే అంకితం చేశాను.

■ మహిళ పరిస్థితి మారలేదు!

ప్రభుత్వ ఉద్యోగం ఉండి కూడా దేశ రాజధాని నగరంలో నన్ను నేను నిలబెట్టుకోవడానికి ఎంత కష్టపడాల్సి వచ్చిందో నాకు తెలుసు. నాలాగ తన కాళ్ల మీద తాము నిలబడాల్సిన స్థితిలో ఉన్న మహిళల కోసం ఏదైనా చేయాలనిపించింది. మహిళలు, యువకులు, వృద్ధులకు కూడా ఉపయోగపడేవిధంగా సైరస్ పేరుతో స్వచ్ఛంద సంస్థను స్థాపించాను. మహిళలకు ఉద్యోగ ప్రయత్నాల్లో సహాయం చేయడం, ఉపాధి మార్గాలను తెలియచేసి సహకారం అందించడం, తాగుబోతు భర్తల కారణంగా బాధలు పడుతున్న వాళ్లకు ఆసరాగా నిలవడం, మగవాళ్లకు కౌన్సెలింగ్ ఇచ్చి తాగుడుకు బానిసలు కాకుండా కుటుంబం పట్ల బాధ్యతగా వ్యవహరించే వరకు పర్యవేక్షిస్తూ ఆ కుటుంబాలను నిలబెట్టడం వంటి ప్రయత్నాలు మొదలుపెట్టాం. పిల్లలకు పోషకాహారం అందించడం, స్కూలుకి పంపేలా చూడడం, వృద్ధుల ఆరోగ్య సంరక్షణతోపాటు వారిని సమాజంలో ఉత్సాహంగా పాల్గొనేటట్లు చేయడం, యువతను చైతన్యవంతం చేయడం వంటి కార్యక్రమాలతో పని చేస్తోంది సైరస్.

■ వర్తమానమే ప్రధానం!

మా సైరస్ సంస్థలో పన్నెండు మందిమి ఉన్నాం. మేమందించే మా సేవలలో మాకు సహకరించే డాక్టర్లు, లాయర్‌లు, టీచర్‌లు, వాలంటీర్‌లున్నారు. మేము ఎవరి దగ్గరా ఆర్థిక సహకారం తీసుకోలేదు. మా కార్యక్రమాలకు వస్తురూపేణా సహకరించేవాళ్లున్నారు. నా పెన్షన్‌లో సగం ఈ సర్వీస్‌కే ఖర్చవుతుంది. నాకు పిల్లలు లేరు. పిల్లలతో కలిసి గడపడానికి ఎప్పుడూ ఏదో ఒక కార్యక్రమం చేస్తూ నా పిల్లలకే చేసినట్లు సంతోషపడుతుంటాను. సమాజానికి సేవ చేయడంతో పాటు తెలుగు కథలు, వ్యాసాలు రాయడం, అనేక ప్రదేశాల్లో పర్యటించడం, పరిశోధన వ్యాసాలు రాయడం నా హాబీలు. నేను నమ్మే తాత్వికత ఒక్కటే... 'గతాన్ని మార్చలేం. అందుకే గతంలో జరిగిన చేదు సంఘటనల గుర్తు చేసుకుంటూ మనసు పాడు చేసుకోకూడదు. భవిష్యత్తులో ఏం జరుగుతుందో ఊహించలేం. మనం వండుకున్న అన్నాన్ని తినే వరకు ఉంటామో లేదో మనకే తెలియదు. అలాంటప్పుడు భవిష్యత్తు కోసం ఆలోచిస్తూ ఉండడం వృథా. ఇక వర్తమానమే ప్రధానం. వర్తమానంలో జీవించాలి' ఇదే నన్ను నడిపిస్తున్న చోదక శక్తి'' అన్నారు లంక సీత.

– వాకా మంజులారెడ్డి
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

లెప్రసీ ఆశ్రమం దత్తత

వైజాగ్‌లో వొకేషనల్ సెంటర్ ప్రారంభించి చదువు మానేసిన వాళ్లకు కుట్లు, అల్లికలతోపాటు టైలరింగ్, వెదురుతో కళాకృతుల తయారీ, టీవీ మెకానిజం, ఏసీ రిపేర్‌లలో సర్టిఫికేట్ కోర్సులు నిర్వహించాం. కరోనా వరకు నిరంతరాయంగా సాగాయి. ఇప్పుడు వాటిని తిరిగి గాడిలో పెట్టాలి. హైదరాబాద్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లలో మెడికల్ క్యాంపులు పెట్టి అవసరమైన వారిని అనంతర చికిత్స కోసం ఉచితంగా వైద్యమందించే హాస్పిటల్స్‌తో అనుసంధానం చేస్తాం. రిపబ్లిక్ డే, ఇండిపెండెన్స్ డే, గాంధీ జయంతి, చిల్డ్రన్స్ డే వంటి సందర్భాల్లో పిల్లలకు పోటీలు నిర్వహిస్తాం. ఢిల్లీలో అల్పాదాయ వర్గాలు నివసించే నాలుగు కాలనీలు, ఒక లెప్రసీ ఆశ్రమాన్ని దత్తత తీసుకున్నాం. దుస్తులు, పాత్రలు, బ్యాండేజ్ క్లాత్, మందులు పంపిణీ చేస్తాం. దత్తత తీసుకున్న కాలనీల పిల్లలకు స్కూలుకు వెళ్లడానికి అవసరమైన సమస్తం సమకూరుస్తున్నాం.

– **లంక సీత,** ప్రెసిడెంట్, సైరస్ స్వచ్ఛంద సంస్థ




మహిళలు, పిల్లలకోసం సేవా కార్యక్రమాలు

● గెలుపు దారి

బుడి బుడి నడకల నుంచి సూపర్ స్పీడ్ వరకు...



తన బృందంతో అనుశ్రీ గోయెంకా

సక్సెస్ అనేది రాత్రికి రాత్రి వచ్చేది కాదు. నిద్రలేని రాత్రులు ఎన్నో గడపాల్సి ఉంటుంది. తీసుకున్న నిర్ణయాలను పునఃసమీక్షించుకోవాల్సి ఉంటుంది. ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ, విజయం కోసం ఎదురు చూస్తూ ఏఐ ఇంగ్లిష్ ట్యూటర్ స్టార్టప్ 'స్పార్క్ స్టూడియో' ద్వారా ఘన విజయం సాధించింది అనుశ్రీ గోయల్...

కొన్ని సంవత్సరాల క్రితం... స్టాన్‌ఫోర్డ్(యూఎస్)లో యూత్ ఫెయిల్యూర్ స్టార్టప్‌ల గురించి పాల్ గ్రహమ్ విశ్లేషణాత్మకమైన ప్రసంగం ఇచ్చాడు. 'స్టార్టప్‌కు సంబంధించిన సమస్త విషయాలపై దృష్టి పెడుతున్నారు. ప్రజలు బాగా కోరుకునేది ఏమిటి అనే కీలకమైన విషయాన్ని మాత్రం మరిచిపోతున్నారు' పాల్ గ్రహమ్ అన్నప్పుడు హాల్‌లో చప్పట్లు మారుమోగాయి.

ఆ ప్రేక్షకులలో అనుశ్రీ గోయెంకా ఉంది.

అనుశ్రీకి గ్రహమ్ ఉపన్యాసం ఎంతో స్ఫూర్తిని ఇచ్చింది.

అహ్మదాబాద్‌లో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ చేసిన అనుశ్రీ మానిటర్ గ్రూప్‌లో కన్సల్టంట్‌గా అయిదు సంవత్సరాలు పనిచేసింది. ఆ తరువాత స్క్రోల్ మీడియా, స్విగ్గీలో పని చేసింది. ఉద్యోగం యాంత్రికం అనిపించిందో, ఇంతకంటే చేయడానికి ఏం లేదు.. అనే నిర్లిప్తత ఆవహించిందో తెలియదు కానీ చేస్తున్న ఉద్యోగాన్ని వదిలి కొత్త దారిలోకి వచ్చింది.

'వ్యాపారంపై నా ముద్ర ఉండాలి. అది నాకు సంతోషం కలిగించేలా ఉండాలి' అనుకుంటూ రంగంలోకి దిగింది అనుశ్రీ.

పది సంవత్సరాలు కార్పొరేట్ ప్రపంచంలో పనిచేసిన అనుశ్రీ గ్రహమ్ ప్రసంగాన్ని పదేపదే గుర్తు తెచ్చుకుంటూ బెంగళూరు కేంద్రంగా 'స్పార్క్ స్టూడియో'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం మొదలుపెట్టింది. 'స్పార్క్ స్టూడియో' అనేది పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఎక్స్‌ట్రా కరిక్యులర్ లెర్నింగ్ అండ్ కమ్యూనికేషన్ ప్లాట్‌ఫామ్.

మొదట 'స్పార్క్ స్టూడియో' ఐడియాను శ్రేయోభిలాషులు, ఇండస్ట్రీ ఎనలిస్ట్‌లకు చెప్పినప్పుడు–

'సక్సెస్ కావడం కష్టం' అంటూ ఎన్నో కారణాలు చెప్పారు.

అయినా వెనకడుగు వేయలేదు అనుశ్రీ.

'మన దేశంలో హై–క్వాలిటీ ఆర్ట్స్, లిబరల్ ఎడ్యుకేషన్‌కు కొరత ఉంది' తాను తరచుగా విన్న మాట 'స్పార్క్ స్టూడియో'కు శ్రీకారం చుట్టడానికి కారణం అయింది. పిల్లలకు ఆన్‌లైన్ బోధన చేయడానికి 'స్పార్క్ స్టూడియో' ద్వారా దేశవ్యాప్తంగా పేరున్న పెయింటర్‌లు, మ్యూజిషియన్‌లు, ఇతర ఆర్టిస్ట్‌లను ఒకే వేదిక మీదికి తీసుకు వచ్చింది అనుశ్రీ.



● అనుశ్రీ

'స్పార్క్ స్టూడియో' ప్రారంభమైన కొద్ది నెలల తరువాత...

'ఎక్స్‌ట్రా కరిక్యులర్ మార్కెట్‌లో విపరీతమైన పోటీ ఉంది. మీరు చాలా ఆలస్యంగా దీనిలోకి అడుగు పెట్టారు. ఇప్పటికే ఎంతోమంది సక్సెస్ సాధించారు. ఇప్పుడు మీరు కొత్తగా వచ్చి చేసేదేమిటి?' ఇలాంటి కామెంట్స్ ఎన్నో వినిపించాయి.

'వంద వ్యాపారాల్లో నీదొకటి అయినప్పుడు దానిపై నీదైన ముద్ర, శైలి ఉండాలి' అని గ్రహమ్ చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. తన స్నేహితులైన కౌస్తుబ్ ఖడే, జ్యోతిక సహజనందన్, నమిత గోయెంకాలతో ఒక టీమ్‌గా ఏర్పడింది అనుశ్రీ.

> నమ్మకమే వెన్నెముకగా ఉన్న వ్యాపారం ఇది. నమ్మకాన్ని డబ్బుతో కొనలేము. కష్టపడి సంపాదించుకోవాలి.
> – అనుశ్రీ గోయెంకా

'నేను బాగా పేరున్న స్కూల్‌లో చదువుకున్నాను. అయితే హై–క్వాలిటీ ఆర్ట్స్ కరికులమ్‌కు అక్కడ చోటు లేదు. స్పార్క్ స్టూడియో ద్వారా విద్యార్థులకు ఉపయోగపడే నిర్మాణాత్మకమైన కరికులమ్‌ను డిజైన్ చేశాము. పిల్లలు యానిమేషన్, మ్యూజిక్, ఫొటొగ్రఫీ...ఎన్నో నేర్చుకోవచ్చు. తమ పిల్లలు ఎన్నో కళలు నేర్చుకోవచ్చు అనే ఆలోచన తల్లిదండ్రులకు బాగా నచ్చింది. ఆర్ట్స్, మ్యూజిక్ ద్వారా పిల్లల్లో భాషా నైపుణ్యం, జ్ఞాపకశక్తి పెరుగుతుంది అని ఎంత నచ్చజెప్పినా, వారు డబ్బు ఖర్చు చేయడానికి సిద్ధంగా లేకపోవడం అసలు సమస్య. మార్కెట్ అంటే ఇదే అనే విషయం ఆలస్యంగా అర్థమైంది. ఇలా ఎన్నో విలువైన పాఠాలు నేర్చుకున్నాను' అంటుంది అనుశ్రీ.

రెండు సంవత్సరాల 'స్పార్క్ స్టూడియో' ప్రయాణం లాభాలు లేవు, నష్టాలు లేవు అన్నట్లుగా ఉండేది. అప్పటికే కొన్ని ప్రసిద్ధ ఎక్స్‌ట్రాకరిక్యులర్ ఎడ్‌టెక్ స్టార్టప్‌లు మూత పడ్డాయి. ఈ నేపథ్యంలో 'ఏం మిస్ అవుతున్నాం' అంటూ ఆలోచిస్తున్న సమయంలో అనుశ్రీకి తట్టిన ఐడియా....పబ్లిక్ స్పీకింగ్ కోర్స్, ఇంగ్లీష్ కమ్యూనికేషన్. ఈ రెండు అంశాలు చేర్చడంతో అప్పటి వరకు బుడి బుడి నడకల 'స్పార్క్ స్టూడియో' వేగం పుంజుకుంది.

సక్సెస్‌ఫుల స్టార్టప్‌గా నిలిచింది.

'నమ్మకమే వెన్నెముకగా ఉన్న వ్యాపారం ఇది. నమ్మకాన్ని డబ్బుతో కొనలేము. కష్టపడి సంపాదించుకోవాలి' అంటుంది అనుశ్రీ గోయెంక.

కిచెన్ టిప్స్

● కాయగూరలు తరిగే చెక్కని నిమ్మచెక్కతో రుద్ది కాసేపయ్యాక కడిగేయండి. మరకలు పోతాయి. ఎప్పుడైనా దానిపై మాంసం కోసినా.. నిమ్మచెక్కతో రుద్దాలి. క్రిములు వృద్ధి చెందకుండా ఉంటాయి ● నిమ్మచెక్కలని సన్నగా తరిగి కాసిని నీళ్లలో వేసి ఆ పాత్రని మైక్రో ఓవెన్‌లో కొన్ని నిమిషాలు ఉంచి తీసేయండి. అలా చేస్తే దుర్వాసనలు తొలగిపోవడంతో పాటూ లోపల పడి ఉన్న పదార్థాలని శుభ్రం చేయడం కూడా తేలికవుతుంది ● ఫ్రిజ్‌లో ఓ మూలగా నిమ్మచెక్కని పెట్టి చూడండి. అందులోంచి వచ్చే దుర్వాసనలు పోతాయి. ● స్టీలు కుళాయిలపై నీటిమరకలు పడుతుంటాయి. అవి తెల్లగా మారాలంటే వాటిని నిమ్మచెక్కతో రుద్ది కడిగితే చాలు.



న్యూస్‌మేకర్ - జ్యోతి



అదిగో మన పి.టి.ఉష

విశాఖ తీరంలో ఒక సెక్యూరిటీ గార్డ్ కడుపున పరుగుల కెరటం పుట్టింది.
పి.టి. ఉషలా హర్డిల్స్‌లో అద్భుత ప్రతిభ చూపుతోంది.
బ్యాంకాక్‌లో జరిగిన 25వ ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో
జ్యోతి యర్రాజీ మహిళల 100 మీటర్ల హర్డిల్స్ రేసులో గోల్డ్ మెడల్ సాధించింది.
50 ఏళ్ల ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ చరిత్రలో 100 మీటర్ల హర్డిల్స్‌లో
స్వర్ణ పతకం సాధించిన తొలి భారతీయ అథ్లెట్‌గా జ్యోతి యర్రాజీ నిలిచింది.
త్వరలో ప్రపంచ చాంపియన్‌షిప్‌లోనూ ఆమె మెరిస్తే తెలుగు ఖ్యాతి మరింత రెపరెపలాడనుంది.

జూలై 13, గురువారం. బ్యాంకాక్‌లో ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో 100 మీటర్ల హర్డిల్స్ పోటీ.

ట్రాక్ మీద జ్యోతి యర్రాజీ చిరుతలా సిద్ధంగా ఉంది. కాని ఆ రోజు వాతావరణం ఆమె పక్షాన లేదు. వాన పడటం వల్ల ట్రాక్ తడిగా ఉంది. 100 మీటర్ల హర్డిల్స్‌ను జాతీయ స్థాయిలో 12.82 సెకన్లలో పూర్తి చేసి రికార్డు సాధించి ఉంది జ్యోతి. ఇప్పుడు అంతకన్నా తక్కువ సమయంలో పూర్తి చేస్తే మరో రికార్డు స్థాపించవచ్చు. పోటీ మొదలైంది. అందరూ వాయువేగంతో కదిలారు. వింటి నుంచి సంధించిన బాణంలా జ్యోతి దూసుకుపోతోంది. హర్డిల్స్ మీదుగా లంఘిస్తూ గాలిలో పక్షిలా సాగుతోంది. కాని 6వ హర్డిల్‌కు వచ్చేసరికి తడి వల్ల కొద్దిగా రిథమ్ తప్పింది. వెంటనే సర్దుకుని పోటీని 13.09 సెకన్లలో పూర్తి చేసి మొదటిస్థానంలో నిలిచింది. 50 ఏళ్లుగా సాగుతున్న ఆసియా అథ్లెటిక్స్‌లో 100 మీటర్ల హర్డిల్స్‌లో తొలి స్వర్ణపతకం సాధించిన ఘనమైన రికార్డు ఇప్పుడు జ్యోతి వశమైంది. బుడాపెస్ట్‌లో జరగనున్న ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఎంపికైంది. అక్కడ ప్రతిభ చూపి ఆ తర్వాత పారిస్ ఒలింపిక్స్‌కు క్వాలిఫై కావడం కోసం ఇదే 100 మీటర్ల హర్డిల్స్‌ను 12.77 సెకన్లలో పూర్తి చేయగలిగితే చాలు ఆ పోటీల్లో పాల్గొని ఒలింపిక్స్ విజేతగా నిలిచే అవకాశం కూడా ఉంటుంది. అందుకే క్రీడాభిమానులు ఆమెపై ఆశలు పెట్టుకున్నారు. ఆమెను హర్షధ్వానాలతో ప్రోత్సహిస్తున్నారు.





● కుటుంబ సభ్యులతో జ్యోతి

సెక్యూరిటీ గార్డు కూతురు

జ్యోతి యర్రాజీ విశాఖ పోర్ట్ స్కూల్‌లో చదువుకుంది. ఆటలు తెలిసిన కుటుంబం కాదు. తండ్రి సూర్యనారాయణ సెక్యూరిటీ గార్డ్. తల్లి ఒక ప్రయివేటు ఆస్పత్రిలో ఆయాగా పని చేసేది. వారిరువురికీ కుమార్తెను చదివించడమే ఎక్కువ. స్పోర్ట్స్‌లో ప్రవేశపెట్టడం కష్టం. కాని జ్యోతి డ్రిల్ పీరియడ్‌లో తోటి పిల్లలతో పరుగెత్తేది. పాఠశాలకు చేరువలోనే విశాఖ పోర్ట్ స్టేడియం ఉండటంతో అక్కడ సీనియర్ అథ్లెట్ల ప్రాక్టీస్‌ను పరిశీలించడం దినచర్యగా చేసుకుంది. తొలుత సబ్ జూనియర్ స్థాయిలో అంతర పాఠశాలల అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొనేది. 2015 రాష్ట్రస్థాయి పోటీల్లో పసిడి పతకం సాధించడంతో తోటి అథ్లెట్ల సలహాతో హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ హాస్టల్‌లో కోచ్ రమేష్ వద్ద శిక్షణ పొందింది. ఆమె ఆర్థిక స్థితి చూసి ఊరు వెళ్లాలంటే రమేషే డబ్బు ఇచ్చేవారు. అలాగే ఆమె సీనియర్ కర్నాటపు సౌజన్య (అప్పట్లో సికింద్రాబాద్–లింగంపల్లి రూట్ టి.సిగా పని చేసేది) కూడా ఆర్థికంగా సాయం చేసేది. జూనియర్ స్థాయి వరకే అక్కడ సదుపాయం ఉండటంతో సీనియర్స్ స్థాయిలో గుంటూరులోని అథ్లెటిక్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కి వచ్చింది. విదేశీ కోచ్‌ల ప్రోత్సాహం దక్కడంతో నేషనల్స్ మెడల్ సాధించగలిగినా సెంటర్ కొనసాగకపోవడంతో అన్వేషణ తిరిగి మొదలైంది.

మలుపుతిప్పిన భువనేశ్వర్

అయితే జ్యోతి ప్రతిభ జాతీయ స్థాయిలో తెలియడం వల్ల 2019లో రిలయన్స్ ఆధ్వర్యంలో ఒడిశాలోని భువనేశ్వర్‌లో నడిచే అథ్లెటిక్స్ హై–పెర్ఫార్మెన్స్ సెంటర్ నుంచి ఆమెకు పిలుపు వచ్చింది. 5.9 అడుగుల ఎత్తు, పొడుగు కాళ్లు ఉన్న జ్యోతికి వంద మీటర్ల పరుగుతో పాటు హర్డిల్స్‌లో కూడా శిక్షణనివ్వడం మొదలుపెట్టాడు ఇంగ్లండ్ నుంచి వచ్చిన కోచ్ జేమ్స్ హిల్లర్. దాంతో కర్ణాటకలో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్–యూనివర్శిటీ అథ్లెటిక్స్ మీట్‌లో 100 మీటర్ల హర్డిల్స్‌ను 13.03 సెకన్లతో పూర్తి చేసి స్వర్ణం గెలుచుకుంది జ్యోతి. 2020 ఫిబ్రవరిలో జరిగిన ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో మరో స్వర్ణం వచ్చింది. 2022 సెప్టెంబర్‌లో గుజరాత్‌లో జరిగిన జాతీయ పోటీల్లో 12.79 సెకన్లతో రికార్డు స్థాపించింది. ఇప్పుడు బ్యాంకాక్ ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 'ఫాస్టెస్ట్ ఆసియన్ ఉమెన్ ఇన్ హండ్రెడ్ మీటర్స్ హర్డిల్స్' రికార్డు స్థాపించింది. ఆమెకు జాతీయ క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, రిలయన్స్ ఫౌండేషన్ చైర్ పర్సన్ నీతా అంబానీ అభినందనలు తెలియచేశారు.

– డాక్టర్ మాడిమి సూర్యప్రకాశరావు,
సాక్షి విశాఖ స్పోర్ట్స్

బ్యూటిప్

అరటి తొక్కతో సహా పండుని ముక్కలుగా తరిగి పేస్టు చేయాలి. ఈ పేస్టుకు రెండు టీస్పూన్ల పచ్చి పాలు పోసి మరోసారి గ్రైండ్ చేసి పదిహేను నిమిషాలు రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి. తెరువాత ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పూతలా వేసుకుని, ఇరవై నిమిషాలు ఆరాక కడిగేయాలి. అరటి పండులో ఉన్న విటమిన్ బి 6, బి12, ప్రోటీన్, ఫైబర్, మెగ్నీషియం, పొటాషియం చర్మానికి పోషణ అందించి ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ ప్యాక్‌ను వారానికి రెండుసార్లు వేసుకోవడం వల్ల ముఖ చర్మం నిగారింపుని సంతరించుకుంటుంది.






'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 121

శనివారం 22-7-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



500లో 100

టెస్టుల్లో విరాట్ 29వ సెంచరీ


తొలి ఇన్నింగ్స్‌లో 438 ఆలౌట్ - 11లో



రికార్డుల ర్యాలీకి 'ఇన్ఫీ' అడ్డుకట్ట

సెన్సెక్స్ 888 పాయింట్లు క్రాష్

నిఫ్టీ 234 పాయింట్లు నష్టం - 11లో



'జ్ఞానవాపి'లో శాస్త్రీయమైన సర్వే

కాశీ ఆలయాన్ని ఆనుకుని ఉన్న జ్ఞానవాపి మసీదులో శాస్త్రీయపరమైన సర్వే చేపట్టాలని వారణాసిలోని ఓ కోర్టు ఆదేశించింది.

వివరాలు 6లో ▸



రిషి సునాక్‌కు చుక్కెదురు

యూకేలో 3 సీట్లకు జరిగిన ఉప ఎన్నికల్లో రెండింటిని రిషి సునాక్ చెందిన అధికార కన్జర్వేటివ్ పార్టీ కోల్పోయింది.

వివరాలు 6లో ▸



ప్రధానితో శ్రీలంక అధ్యక్షుడి భేటీ

భారత పర్యటనలో ఉన్న శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమ్ సింఘే ప్రధాని మోదీతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

వివరాలు 6లో ▸



వారిలో నైపుణ్యాలు పెంచాలి

ఉద్యోగులకు, కార్మికులకు తగిన శిక్షణ ఇచ్చి నైపుణ్యాలను అభివృద్ధి చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

'రాహుల్' పిటిషన్‌పై విచారణ వాయిదా



పరువు నష్టం కేసులో హైకోర్టు తీర్పుని సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం విచారించింది. ఈ కేసులో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసి తదుపరి విచారణను ఆగస్టు 4కి వాయిదా వేసింది.

వివరాలు 6లో ▸

వలంటీర్లపై విషం కక్కడం సరికాదు



ప్రజలంతా కావాలనుకుంటున్న వలంటీర్ వ్యవస్థపై ప్రతిపక్షాలు విషం కక్కడం సరికాదని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాద రావు అన్నారు. శ్రీకాకుళంలోని ఫాజుల్‌బాగ్‌పేటలో శుక్రవారం నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

వివరాలు 10లో ▸

గిరిజన ఉత్సవాలకు విశాఖ సిద్ధం



రాష్ట్ర స్థాయి గిరిజన ఉత్సవాలకు విశాఖ నగరాన్ని సర్వం సిద్ధం చేశారు. సిరిపురంలో ఉన్న విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీఎంఆర్‌డీఏ) చిల్డ్రన్ ఎరీనాలో శనివారం, ఆదివారం ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు.

వివరాలు 7లో ▸


తిరుపతి జిల్లా వెంకటగిరిలో జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం



ఇదీ వీళ్ల సంస్కారం!

వెంకటగిరి సభలో ప్రతిపక్షాలపై నిప్పులు చెరిగిన సీఎం జగన్

- చంద్రబాబు, దత్తపుత్రుడు, సొంతపుత్రుడు, బావమరిది కేరెక్టర్ ఏంటో ప్రజలకు బాగా తెలుసు
- ఇలాంటి కేరెక్టర్ లేని వాళ్లంతా మంచి చేస్తున్న మన వలంటీర్లపై దుష్ప్రచారం చేస్తున్నారు
- స్క్రిప్టు 'ఈనాడు'ది.. నిర్మాత చంద్రబాబు.. నటన దత్తపుత్రుడు
- వలంటీర్లు మన ఊరి పిల్లలు.. మన కుటుంబ సభ్యులు..
- ఎండొచ్చినా, వానొచ్చినా, వరదొచ్చినా వెనకాడని సేవకులు



- ఇలాంటి వారిపై తప్పుడు మాటలు మాట్లాడుతున్నారు
- స్త్రీలను లోబర్చుకుంటారని ఒకరు.. హ్యూమన్ ట్రాఫికింగ్ చేస్తారని ఇంకొకరు..
- అబద్ధాలకు రెక్కలు తొడిగి విష ప్రచారం చేస్తున్నారు
- 2.6 లక్షల మంది వలంటీర్లలో 60 శాతం మంది మహిళలే
- బీజేపీతో పొత్తు.. చంద్రబాబుతో కాపురం.. ఇచ్చేది తన పార్టీ బీఫాం.. టీడీపీకి బీ టీం..
- చంద్రబాబుపై పోటీ ఒక డ్రామా, బీజేపీతో స్నేహం మరో డ్రామా.. ప్రత్యేక పార్టీ అన్నది ఇంకో డ్రామా

- వివరాలు 2లో ▸

వీరి కేరెక్టర్లు ఇవీ..




బాబుగారి వలంటీర్ ఈ దత్తపుత్రుడు.. మన వలంటీర్లు అమ్మాయిలను లోబర్చుకున్నారంటాడా? ఇతను ఇదే కార్యక్రమంగా పెట్టుకుని అమ్మాయిలను లోబర్చుకుని వారిని పెళ్లి చేసుకోవడం, నాలుగేళ్లు కాపురం చేయడం.. మరలా వదిలేయడం.. మళ్లీ ఇంకొకరిని పెళ్లి చేసుకోవడం, మళ్లీ వదిలేయడం.. ఆ తర్వాత మళ్లీ పెళ్లి.. మళ్లీ వదిలేయడం.. ఇదే పని. పైగా ఒకరితో వివాహ బంధంలో ఉండగానే ఇంకొకరితో అక్రమ సంబంధం. ఈయన మన వలంటీర్ల కేరెక్టర్ గురించి మాట్లాడతాడు.



పట్టపగలే మందు తాగుతూ పది మంది అమ్మాయిలతో స్విమ్మింగ్ పూల్ పక్కనే డ్యాన్స్‌లు చేసేవారు ఇంకొకరు. యూట్యూబ్‌లోకి వెళ్లి చూస్తే.. నిస్సిగ్గుగా డ్యాన్స్‌లు చేస్తూ కనిపిస్తాడు.



అమ్మాయి కనిపిస్తే చాలు ముద్దన్నా పెట్టాలంట.. లేదా కడుపన్నా చేయాలంటాడు ఇంకొక దౌర్భాగ్యుడు.



మరో కేరెక్టర్ వయసు 75 ఏళ్లు. టీవీ షోలో మాట్లాడుతూ.. ఆహా బావా.. నువ్వు సినిమాల్లోనే చేశావు. నేను నిజ జీవితంలోనే చేశాను అంటూ.. చేసిన వెధవ పనులను ఈ ముసలాయన గొప్పగా చెప్పుకుంటాడు.

పార్లమెంట్‌లో మణిపూర్ రగడ

- మణిపూర్ హింసాకాండ వరుసగా రెండో రోజు శుక్రవారం సైతం పార్లమెంట్‌ను కుదిపేసింది. ఈ అంశంపై తక్షణమే చర్చ ప్రారంభించాలంటూ విపక్షాలు పట్టుబట్టాయి. నినాదాలు, నిరసనలతో హోరెత్తించడంతో ఉభయ సభలు స్తంభించాయి.



- వివరాలు 6లో ▸

ఇక ఉద్దానం 'సురక్షితం'

- కిడ్నీ వ్యాధుల భయాలు వెంటాడుతున్న ఉద్దానం ప్రాంతానికి 100 కి.మీ. పైగా దూరంలోని హిరమండలం రిజర్వాయర్ నుంచి సురక్షిత జలాలు కదిలాయి. భూగర్భ పైప్‌లైన్ల ద్వారా ఉద్దానానికి నీటి తరలింపు తొలిదశ ట్రయల్ రన్ విజయవంతమైంది.



- వివరాలు 8లో ▸

బొట్టు పెట్టి ఆహ్వానం

- అమరావతిలో పేదల ఇళ్ల పండుగ
- గృహ నిర్మాణాలకు 24న సీఎం జగన్ భూమిపూజ
- కృష్ణాయపాలెం లే అవుట్‌లో పైలాన్ ఆవిష్కరణ
- వెంకటాయపాలెంలో సీఎం బహిరంగ సభ
- షీర్ వాల్ టెక్నాలజీతో 3 రోజుల్లో మోడల్ హౌస్ రెడీ



కృష్ణాయపాలెం లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న మోడల్ హౌస్

సాక్షి ప్రతినిధి, గుంటూరు, సాక్షి, అమరావతి, మంగళగిరి: పేదల ఇళ్ల పండుగకు అమరావతి ముస్తాబవుతోంది. 'నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు' పథకం కింద సీఆర్‌డీఏ పరిధిలో కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన 50 వేల మందికిపైగా పేదలకు ఇళ్ల పట్టాలను ఇప్పటికే పంపిణీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా గృహ నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 24వతేదీన పేదల ఇళ్ల నిర్మాణానికి కృష్ణాయపాలెంలో భూమి పూజ చేయనున్నారు. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు

మిగతా 10వ పేజీలో ▸

ఆతిథ్యానికి అందలం

- ఇప్పటికే మూడు ఒబెరాయ్ లగ్జరీ రిసార్టులకు శంకుస్థాపన చేసిన సీఎం వైఎస్ జగన్
- మరో రెండు లగ్జరీ హోటళ్లకు కేబినెట్ ఆమోదం
- రూ.525 కోట్లతో మేఫెయిర్ సంస్థ విల్లాల అభివృద్ధి.. ఇప్పటికే విశాఖలో 40 ఎకరాలు కేటాయింపు
- తిరుపతిలో రూ.218 కోట్లతో ఎంఆర్‌కేఆర్ 5 స్టార్ హోటల్
- పట్టాలెక్కిన ప్రాజెక్టుల ద్వారా సుమారు 11,800 ఉద్యోగాలు
- రూ.69.37 కోట్లతో గండికోట, పేరూరు, అన్నవరంలలో పర్యాటక వసతుల మెరుగు



సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో సంక్షేమం, అభివృద్ధిలో దూసుకెళ్తున్న రాష్ట్రం.. పర్యాటక రంగం అభివృద్ధిలోనూ వేగంగా ముందుకెళ్తోంది. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికతో రాష్ట్రంలో పర్యాటక రంగంలో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయి. లగ్జరీ విల్లాలు, 5 స్టార్, 7 స్టార్ హోటళ్ల ఏర్పాటుతో పర్యాటకులను ఆకర్షించడంతోపాటు స్థానికులకు ఉపాధి అవకాశాలూ పెరుగుతాయి. సులభతర వాణిజ్యంలో భాగంగా

మిగతా 10వ పేజీలో ▸

వైద్యవిద్య పీజీ సీట్ల భర్తీ ప్రక్రియ ప్రారంభం

- 2023–24 విద్యాసంవత్సరానికి వైద్యవిద్య పీజీ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. దీనికి సంబంధించి ఎంసీసీ షెడ్యూల్ విడుదల చేసింది. 50 శాతం ఆల్ ఇండియా కోటా సీట్లు, డీమ్డ్, కేంద్ర వర్సిటీల్లో 100% సీట్లకు ఈ నెల 27 నుంచి ఆగస్టు 1వ తేదీ మధ్య నీట్–పీజీ అర్హత సాధించిన అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.



- వివరాలు 8లో ▸

వివేకా కేసు దర్యాప్తులో సీబీఐ హ్యాండ్సప్!

- అప్రూవర్ కట్టుకథలు... వాంగ్మూలాల అసత్య ప్రచారం
- రెండున్నరేళ్ల దర్యాప్తులో సాధించింది శూన్యం
- బెడిసికొట్టిన గూగుల్ టేక్ అవుట్ కథ
- ఒక్క ఆధారాన్ని కనుగొనలేకపోయిన వైనం
- వివేకా శత్రువులతో సునీత కుమ్మక్కుకు సీబీఐ దన్ను

8లో

ఇదండీ సంగతి



గోదావరి తగ్గుముఖం

భద్రాచలం వద్ద 41 అడుగులకు తగ్గిన నీటి మట్టం

- మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- పోలవరం ప్రాజెక్టు నుంచి 7.75 లక్షల క్యూసెక్కులు దిగువకు
- ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి 9.73 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి..



సాక్షి, అమరావతి/సాక్షి, అమలాపురం/ధవళేశ్వరం/చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)/పోలవరం రూరల్/యలమంచిలి: నదీ పరివాహక ప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పట్టడం.. ఉప నదుల్లో వరద ఉధృతి తగ్గడంతో గోదావరిలో వరద ప్రవాహం క్రమేణా తగ్గుతోంది. ఫలితంగా భద్రాచలం వద్దకు వస్తున్న వరద శుక్రవారం రాత్రి 7 గంటలకు 8.50 లక్షల క్యూసెక్కులకు.. వరద మట్టం 41 అడుగులకు తగ్గింది. దీంతో భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించుకున్నారు. అలాగే, భద్రాచలం నుంచి అఖండ గోదావరి మీదుగా పోలవరం ప్రాజెక్టులోకి 7,75,079 క్యూసెక్కులు చేరుతోంది. వరద మట్టం స్పిల్ వే కు ఎగువన 32.5, దిగువన 24.22, ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద 33.35, దిగువ కాఫర్ డ్యామ్ వద్ద 23.65 మీటర్లుగా నమోదైంది. ప్రాజెక్టు 48 గేట్ల ద్వారా 7,75,079 క్యూసెక్కులను అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి 9,84,970 క్యూసెక్కులు చేరుతుండగా.. గోదావరి డెల్టాకు 11,100 క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగులుగా ఉన్న 9,73,870 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. మరోవైపు..

మిగతా 10వ పేజీలో ▸

కృష్ణా నదిలో పెరుగుతున్న వరద

- 'ఆల్మట్టి'లోకి 70,780 క్యూసెక్కులు..
- 'తుంగభద్ర'కు 13,340 క్యూసెక్కుల ప్రవాహం
- సాగర్‌లోకి 5,988 క్యూసెక్కులు..

10లో

సోషల్ మీడియా యాక్టివ్ యూజర్లు 500 కోట్లు



- తూర్పు, మధ్య ఆఫ్రికాల్లో తక్కువగా సోషల్ మీడియా యూజర్లు
- డిజిటల్ అడ్వయిజరీ సంస్థ కెపియోస్ అధ్యయనంలో వెల్లడి

- వివరాలు 6లో

400 కిలోల టమాటాలు చోరీ



- మహారాష్ట్రలోని పుణేలో ఘటన
- అక్కడ రూ.100– 200 వరకు పలుకుతున్న కిలో టమాట ధర

- వివరాలు 6లో


సభాప్రాంగణానికి సీఎం వస్తుండగా.. జై జగన్.. అంటూ నినాదాలు చేస్తున్న ప్రజలు, అభిమానులు


సభాప్రాంగణం నిండిపోవడంతో బయట నుంచే సీఎం జగన్ ప్రసంగాన్ని వింటున్న అశేష జనవాహినిలో ఓ భాగం

ఇదీ వీళ్ల సంస్కారం!

నిజంగా ఇలాంటి కేరెక్టర్ లేని వీరంతా మంచి చేస్తున్న మన వలంటీర్ల గురించి తప్పుడు మాటలు ప్రచారం చేస్తుంటే ఇది కలియుగం కాక మరేంటి అని అడుగుతున్నాను. మంచి చేస్తున్న వలంటీర్లను మంచి చేయకుండా ఆపడానికి కేరెక్టర్ లేని వీళ్లంతా కుయుక్తులు పన్నుతున్నారు. నిజంగా ఇలాంటి వారి మెదడు తెరిచి చూస్తే అన్నీ పురుగులే కనిపిస్తాయి. వీళ్ల పర్సనల్ లైఫ్ అంతే.. పబ్లిక్ లైఫ్‌లోనూ అంతే. ఎక్కడ చూసినా కుళ్లు బుద్ధులు.. కుట్రలే కనిపిస్తాయి.

– ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


సభాప్రాంగణం నిండిపోవడంతో బయటే వేచి ఉన్న అశేష జనవాహిని

చంద్రబాబు, దత్తపుత్రుడు, సొంతపుత్రుడు, బావమరిది కేరెక్టర్ ఏంటో ప్రజలకు బాగా తెలుసు

ప్రతిపక్షాలపై నిప్పులు చెరిగిన సీఎం జగన్

సాక్షి, తిరుపతి: వలంటీర్ల వ్యవస్థ వల్ల ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందన్న బాధతో, భవిష్యత్‌పై కలత చెందిన చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు, సొంతపుత్రుడు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని, వీరంతా సంస్కార హీనులని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. ఎండైనా, వానైనా, చలైనా, వరదలొచ్చినా, పండగరోజైనా, సెలవు రోజైనా నిక్కచ్చిగా సేవ చేస్తున్న వలంటీర్ల కేరెక్టర్‌పై దుష్ప్రచారం చేయడం దుర్మార్గమని నిప్పులు చెరిగారు. చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు, సొంతపుత్రుడు, బావమరిది కేరెక్టర్ ఏంటో ప్రజలకు బాగా తెలుసన్నారు. తిరుపతి జిల్లా వెంకటగిరిలో శుక్రవారం ఆయన వైఎస్సార్ నేతన్న నేస్తం ఐదో విడత నిధుల విడుదల కార్యక్రమంలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. కొన్ని విషయాలు మాట్లాడకూడదనుకున్నా పరిస్థితులు చూసినప్పుడు తప్పడం లేదన్నారు. ఎక్కడైనా మంచి చేస్తున్న వ్యవస్థలను, మనుషుల్ని సంస్కారం ఉన్న ఏ ఒక్కరూ అవమానించరని, కానీ మంచి చేస్తున్న మన వలంటీర్ల గురించి ఇటీవల సంస్కారం కోల్పోయి కొందరు మాట్లాడుతున్నందు వల్ల ఈ మాటలు చెప్పాల్సి వస్తోందని చెప్పారు. వలంటీర్లంతా మన ఊళ్లో, మన కళ్లెదుటే నాలుగేళ్లుగా కనిపిస్తున్నారని, మనందరికీ తెలిసినవాళ్లేనన్నారు. ఒకటో తేదీ రాగానే సూర్యోదయానికన్నా ముందే చిక్కటి చిరునవ్వుతో తలుపుతట్టి, గుడ్ మార్నింగ్ చెబుతూ ఇదిగో మీ పెన్షన్ అంటూ అవ్వాతాతలను చిరునవ్వులతో పలకరించే కుటుంబ సభ్యులు మన వలంటీర్లు అని చెప్పారు. అవినీతికి, వివక్షకు తావు లేకుండా, మనందరి ప్రభుత్వం తీసుకొస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి గడప వద్దకూ.. కాళ్లకు బలపం కట్టుకుని మరీ వెళ్లి.. కులం, మతం, వర్గం, ప్రాంతం చివరకు వారు ఏ పార్టీ వారు అని కూడా చూడకుండా అవ్వాతాతలకు మేలు చేస్తున్న మనవళ్లు, మనవరాళ్ల వ్యవస్థపై కొందరు తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తప్పుడు మాటలకు స్క్రిప్ట్ ఈనాడు రామోజీరావుది అయితే నిర్మాత చంద్రబాబు.. నటన, మాటలు, డైలాగులు అన్నీ దత్తపుత్రుడివి అని తెలిపారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

నిస్సిగ్గు రాతలు

- వలంటీర్లు స్త్రీలను లోబర్చుకుంటారని ఒకరంటారు. గ్రామ వలంటీర్లు అమ్మాయిలను హ్యూమన్ ట్రాఫికింగ్ చేస్తున్నారు.. ముంబయికో, ఎక్కడికెక్కడికో పంపించేస్తున్నారు అని ఇంకొకరు నిస్సిగ్గుగా అంటారు. దీన్ని తాటికాయంత అక్షరాలతో ఈనాడు పత్రిక, సిగ్గులేని ఆంధ్రజ్యోతి పత్రిక, ఇంకో సిగ్గులేని టీవీ–5 మీడియా రాస్తాయి. ఇటువంటి వారంతా బురద జల్లుతారు. అబద్ధాలకు రెక్కలు తొడుగుతారు.
- 2.60 లక్షల మంది మన పిల్లలు గ్రామ స్థాయిలో సేవలందిస్తున్నారు. ఇందులో 60 శాతం నా చెల్లెమ్మలే. మన వలంటీర్లు అంతా కూడా చదువుకున్న సంస్కారవంతులే. వీరంతా సేవా భావంతో పని చేస్తున్నారు. ఇలాంటి మన సేవామిత్రలు, సేవారత్నాలు, సేవా వజ్రాలు అయిన మన వలంటీర్ల కేరెక్టర్‌ను తప్పుపట్టింది ఎవరో తెలుసా?


వెంకటగిరి సభలో మాట్లాడుతున్న సీఎం జగన్

- ఒకరు పదేళ్లుగా చంద్రబాబుకు వలంటీర్‌గా పని చేస్తున్న ప్యాకేజీ స్టార్. ఇంకొకరు చంద్రబాబు నాయుడు. మరొకరు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5. వీరంతా ఒక గజదొంగల ముఠా. వీళ్లు వలంటీర్ల కేరెక్టర్ గురించి మాట్లాడుతున్నారు. వలంటీర్ పిల్లల కేరెక్టర్ ఎలాంటిదో అదే గ్రామంలో వారి సేవలందుకుంటున్న కోట్ల మందికి తెలుసు.

వీరికి మంచి చేసిన చరిత్రే లేదు

- ఇచ్చేది తన పార్టీ బీ–ఫారమ్. నిజానికి టీడీపీకి బీ–టీమ్. చంద్రబాబు మీద పోటీ ఒక డ్రామా. బీజేపీతో స్నేహం మరో డ్రామా. తనది ప్రత్యేక పార్టీ అన్నది ఇంకో డ్రామా. అంతటికీ స్క్రిప్ట్ ఈనాడు రామోజీరావుది. నిర్మాత చంద్రబాబు. నటన, మాటలు, డైలాగులు అన్నీ దత్తపుత్రుడివి. ఇవీ నిజాలు.
- ఎందుకు ఈ స్థాయికి దిగజారిపోయారంటే వీరికి మంచి చేసిన చరిత్ర లేదు. ఫలానా మంచి చేశాం .. అందుకే మాకు తోడుగా ఉండండి అని చెప్పుకోవడానికి కూడా ఒక్కటంటే ఒక్కటి మంచి చేసిన చరిత్ర లేదు. ఉన్నదంతా వంచన, వెన్నుపోట్లు మాత్రమే. ఇదీ వీళ్ల జీవిత చరిత్ర.

ఇదీ మన చరిత్ర

- మరోవైపు మీ బిడ్డ ప్రభుత్వం కేవలం 50 నెలల్లోనే ఎలాంటి అవినీతి, లంచాలకు తావులేకుండా ఏకంగా రూ.2.25 లక్షల కోట్లు నేరుగా బటన్ నొక్కి నా అక్కచెల్లెమ్మల అకౌంట్లలో జమ చేసింది. 30 లక్షల ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం మన చరిత్ర. అందులో 22 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టడం మన చరిత్ర. ప్రతి ఏటా 44 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు.. 84 లక్షల మంది పిల్లలకు మంచి చేస్తూ.. రూ.26 వేల కోట్లకు పైగా అమ్మఒడి పథకం ద్వారా నిలవడం మన చరిత్ర.
- దాదాపు కోటి మంది పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు ఆసరాగా.. వారికి తోడుగా నిలబడుతూ రూ.19,178 కోట్లు వాళ్ల చేతుల్లో పెట్టడం, సున్నా వడ్డీ కింద రూ.3,615 కోట్లు ఇవ్వడం మీ బిడ్డ చరిత్ర.
- నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా చేయూత అనే పథకం ద్వారా మరో రూ.14,129 కోట్లు ఇచ్చాం. వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడేటట్టుగా

ఇంటింటికీ ధైర్యంగా వెళ్తున్నాం

- మేనిఫెస్టో అంటే చంద్రబాబు మాదిరిగా చెత్తబుట్టలో పడేయడం కాదు. దాన్నొక బైబిల్, ఖురాన్, భగవద్గీతగా భావించాం. ఏకంగా 98 శాతం హామీలను నెరవేర్చి.. గడప గడపకూ తిరుగుతూ ప్రజల వద్దకు వెళ్తున్నాం. ఈ మేనిఫెస్టోను వాళ్ల చేతుల్లో పెడుతూ మీరే చదివి మీ బిడ్డని ఆశీర్వదించండని అడుగుతున్న చరిత్ర మనది.
- ఏకంగా 26 జిల్లాలు చేసిన చరిత్ర మనది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి మన ప్రభుత్వం రానంతవరకు 4 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఉంటే మీ బిడ్డ హయంలో ఏకంగా 50 శాతం పెరిగి 6 లక్షలకు చేరాయి. 2.06 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చిన చరిత్ర మనది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి.. ఉద్యోగులను ఆదుకున్న చరిత్ర కూడా మనదే.
- స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో 11 మెడికల్ కాలేజీలు ఉంటే.. ఈ నాలుగేళ్లలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మరో 17 కడుతున్నాం. రాష్ట్రంలో నాలుగు చోట్ల ఆరు పోర్టులుంటే.. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగేళ్లలో మరో 4 పోర్టులు కడుతున్నాం. 10 ఫిషింగ్ హార్బర్లు, మరో 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు కూడా కనిపిస్తున్నాయి. ఇవన్నీ పేదలపట్ల, రాష్ట్రం పట్ల ప్రేమతో చేస్తున్నాం.

వ్యాపారాలు సైతం చూపించడం ఇంకో చరిత్ర. రైతు భరోసాగా ఇప్పటికే దాదాపుగా 50 లక్షల పైచిలుకు రైతన్నలకు రూ.31 వేల కోట్లు నేరుగా జమ చేయడం మన చరిత్ర.

గొప్ప చదువుల కోసం తాపత్రయం

- మన పిల్లలు చదవాలి, చదువుల కోసం పిల్లలు ఇబ్బంది పడకూడదు, ఏ తల్లి, తండ్రీ తమ పిల్లల చదువుల కోసం అప్పుల పాలు కాకూడదని.. వారికి తోడుగా ఉంటూ విద్యా దీవెన పథకం ద్వారా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ తీసుకొచ్చాం. పిల్లలకు మెస్ చార్జీలకు.. బోర్డింగ్, లాడ్జింగ్ ఖర్చుల కోసం వసతి దీవెన పథకం తీసుకొచ్చాం. ఈ రెండు పథకాలకు ఈ 50 నెలల్లో రూ.15 వేల కోట్లు ఇచ్చాం.
- మన పిల్లలకు ఇంగ్లిష్ మీడియం విద్య, నాడు–నేడుతో రూపురేఖలు మారుతున్న స్కూళ్లు, మూడో తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్ల కాన్సెప్ట్, మూడో తరగతి నుంచే టోఫెల్‌లో సైతం ప్రిపరేషన్, ఆరో తరగతి నుంచే ప్రతి క్లాస్‌రూమ్‌లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ఉండేలా ప్రతి తరగతి గదిని డిజిటలైజేషన్ చేయడం, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబుల పంపిణీ, రోజుకొక మెనూతో పిల్లలకు గోరుముద్ద పథకాన్ని తీసుకురావడం, స్కూళ్లు తెరిచేటప్పటికే ఆ పిల్లల చిక్కటి చిరునవ్వుల మధ్య కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా విద్యా కానుక పంపిణీ.. ఇది మన పిల్లల భవిష్యత్ కోసం చేస్తున్న మన చరిత్ర.

అప్పటికీ, ఇప్పటికీ తేడా చూడండి

- మనిషి కేరెక్టర్, విశ్వసనీయత విషయంలో కానీ, మేనిఫెస్టోకి ఇస్తున్న విలువ గురించి కానీ, చేస్తున్న మంచి విషయంలో కానీ గత ప్రభుత్వానికి, ఇప్పటి ప్రభుత్వానికి మధ్య తేడా మీరే గమనించండి. మనకు ఎలాంటి పాలకుడు, పాలన కావాలన్నది ఆలోచన చేయండి. మీ బిడ్డకు వాళ్ల మాదిరిగా ఒక అబద్ధాన్ని నిజమని నమ్మించే ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 లేదు. మీ బిడ్డ దేవుడి దయను, మిమ్మల్ని మాత్రమే నమ్ముకున్నాడు. రాబోయే రోజుల్లో వాళ్లు ఇంకా అబద్ధాలు చెబుతారు. ఇవాళ వలంటీర్ల గురించి ఏ రకంగా దుష్ప్రచారం చేస్తున్నారో.. రాబోయే రోజుల్లో మీ బిడ్డ గురించి, మీ బిడ్డ ప్రభుత్వం గురించి, ఎమ్మెల్యేల గురించి, మంత్రుల గురించి అదే మాదిరిగా దారుణంగా అబద్ధాలు చెప్తారు. ఇవేవీ నమ్మొద్దు. మీ ఇంట్లో మంచి జరిగిందా? లేదా? అన్నది మాత్రమే కొలమానంగా తీసుకోండి. మీ బిడ్డ ప్రభుత్వం వల్ల మీ ఇంట్లో మంచి జరిగితే మీ బిడ్డకు మీరే తోడుగా నిలబడండి.

మారుతున్న గ్రామాల ముఖచిత్రం

- ప్రతి గ్రామం రూపురేఖలు మారుతున్నాయి. ప్రతి గ్రామంలో వలంటీర్లు కనిపిస్తారు. సెక్రటేరియట్ వ్యవస్థ, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లు కనిపిస్తాయి. ప్రతి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కనిపిస్తుంది. ఇంగ్లిష్ మీడియం స్కూళ్లు కనిపిస్తాయి.
- కొత్తగా 108, 104 అంబులెన్స్ వాహనాలు 1,600 పైచిలుకు కుయ్ కుయ్‌మంటూ వినిపిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ రూపురేఖలు మారాయి. గతంలో సరిగా నిర్వహించకుండా.. కేవలం 1,000 వ్యాధులకు పరిమితమైన ఆరోగ్యశ్రీని.. 3,250 వ్యాధులకు విస్తరించాం. ఆరోగ్య ఆసరా కూడా తీసుకొచ్చాం. కోవిడ్ టైంలో మనం చేసిన యుద్ధం ఇంకొక చరిత్ర.
- అమ్మఒడి, ఆసరా, సున్నా వడ్డీ, చేయూత, ఇళ్ల పట్టాలు, ఇళ్ల నిర్మాణం ద్వారా మహిళా సాధికారత విషయంలో దేశం మొత్తం మన రాష్ట్రం వైపు చూసేలా చేశాం. సామాజిక న్యాయంలో ఎవరూ చేయని విధంగా ప్రతి అడుగులో నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఏకంగా 50 శాతం నామినేటెడ్ పదవులు, 50 శాతం నామినేషన్ మీద ఇచ్చే కాంట్రాక్టుల కోసం ఏకంగా చట్టం చేసి అమలు చేస్తున్న చరిత్ర మనది.
- రాష్ట్రంలో ఎప్పుడూ జరగని విధంగా అసైన్డ్ భూములు మీద హక్కులు ఇచ్చిన చరిత్ర మనది. 2 లక్షల ఎకరాలకు పైగా చుక్కల భూముల్ని రిజిస్ట్రేషన్ చేసుకోలేని అధ్వాన్నమైన పరిస్థితుల్లో రైతులు ఉంటే.. భూముల సమస్యలను తొలగించి రైతన్నల చేతిలో పెట్టిన చరిత్ర మనది.

నేతకు జీవం పోశాం

- కంప్యూటర్‌లో బటన్ నొక్కి 80,686 మందికి రూ.193.64 కోట్లు జమ
- అర్హులైన ప్రతి చేనేత కుటుంబానికి ఏటా రూ.24 వేలు.. ఇప్పటిదాకా ఇలా రూ.969.77 కోట్లు సాయం
- నేతన్నల పెన్షన్ కోసం రూ.1,396.45 కోట్లు
- గత ప్రభుత్వ బకాయిలతో కలిపి ఆప్కోకు రూ.468.84 కోట్లు
- ఇతర పథకాల ద్వారా రూ.871 కోట్లు
- నాలుగేళ్లలో నేతన్నల కోసం మొత్తంగా రూ.2,835.06 కోట్లు వ్యయం

ఐదో విడత వైఎస్సార్ నేతన్న నేస్తం నిధులు విడుదల చేస్తూ సీఎం జగన్


వైఎస్సార్ నేతన్న నేస్తం చెక్కుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, తిరుపతి: రాష్ట్రంలో నేతన్నకు తోడుగా నిలిచి, అన్ని విధాలా చేయి పట్టుకుని నడిపిస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. నేతకు, ఆప్కోకు జీవం పోయడమే కాకుండా చేనేత వస్త్రాలకు మార్కెటింగ్‌పై కూడా దృష్టి పెట్టామని చెప్పారు. ఇంతకు ముందు లేని విధంగా అమెజాన్, మింత్ర, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల మీద నేతన్నల వస్త్రాలను అమ్మే ఏర్పాటు చేశామని, తద్వారా వారి జీవితాల్లో వెలుగు నింపామని తెలిపారు. శుక్రవారం ఆయన తిరుపతి జిల్లా వెంకటగిరిలో వైఎస్సార్ నేతన్న నేస్తం ఐదో విడత కార్యక్రమాన్ని ప్రారంభించారు. కంప్యూటర్‌లో బటన్ నొక్కి రాష్ట్ర వ్యాప్తంగా 80,686 మంది నేతన్నల ఖాతాల్లో రూ.193.64 కోట్లు నేరుగా జమ చేశారు. అర్హులై ఉండి సొంత మగ్గం కలిగిన ప్రతి చేనేత కుటుంబానికి ఈ ఏడాది కూడా రూ.24,000 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. నేతన్నల మగ్గాలు ప్రపంచంతో మాట్లాడే నేల వెంకటగిరి అని చెప్పారు. అలాంటి ఈ గడ్డపై నుంచి ఐదో ఏడాది వైఎస్సార్ నేతన్న నేస్తం కార్యక్రమం జరుపుకుంటున్నందుకు ఆనందంగా ఉందన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా, మహిళా సాధికారత పరంగా అన్ని విధాలా మేలు చేయడంలో.. అంబేడ్కర్, పూలే భావజాలాన్ని అమలు చేయడంలో దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే కూడా మనం ముందున్నామని స్పష్టం చేశారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

బీసీలు బ్యాక్ బోన్ క్లాసులు

- బీసీలంటే బ్యాక్ వర్డ్ క్లాసులు కాదు.. బ్యాక్ బోన్ క్లాసులుగా మారుస్తానని ఎన్నికల వేళ చెప్పాను. ఆ రోజు చెప్పిన మాటకు కట్టుబడి ఈ నాలుగేళ్లలో ప్రతి పనిలోనూ నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు కనిపించే విధంగా అడుగులు వేశాను. ఈ కోవలోనే నవరత్నాలు తీసుకు వచ్చాను. నేతన్న నేస్తం తీసుకొచ్చాను. సొంత మగ్గం కలిగి ఉన్న ప్రతి నేతన్నకు ఏటా రూ.24 వేల చొప్పున వరుసగా ఇస్తూ పోతున్నా. ఇలా ఐదు విడతలుగా రూ.1.20 లక్షలు ప్రతి నేతన్న చేతిలో పెట్టాం.
- 80,686 మంది చేనేత అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మల కుటుంబాలకి మేలు జరిగేలా ఇవాళ రూ.194 కోట్లు జమ చేస్తున్నాం. ఈ ఒక్క పథకం ద్వారా మాత్రమే ఐదు దఫాలుగా రూ.970 కోట్లు జమ చేసి నేతన్నలకు తోడుగా నిలబడ్డాం.
- చంద్రబాబు హయాంలో 2014–19 మధ్య కాలంలో ఆత్మహత్యలు చేసుకున్న 77 నేతన్నల కుటుంబాలకు కనీసం సహాయం కూడా చేయలేదు. మీ బిడ్డ సీఎం అయ్యాక ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షలు చొప్పున ఇచ్చాం. ఇకపై అలా జరగకుండా నవరత్నాలు తీసుకొచ్చాం.

హామీలు గాలికొదిలేసిన గత ప్రభుత్వం

- నేతన్నలకు ఇచ్చిన హామీలన్నీ చంద్రబాబు గెలిచాక గాలికి వదిలేశారు. వారికి రూ.1.50 లక్షలతో ఉచితంగా ఇళ్లు కట్టిస్తామన్నారు. మగ్గం షెడ్లు కట్టిస్తామన్నారు. బడ్జెట్‌లో రూ.1000 కోట్లు ఏటా కేటాయిస్తామన్నారు. ఒక్కో కుటుంబానికి రూ.లక్ష బ్యాంకు రుణాలిస్తామన్నారు. చేనేత కార్మికులకు రుణమాఫీ చేస్తామన్నారు. ఇలా ఎన్నో హామీలిచ్చి చివరకు చేనేతలను మోసం చేశారు. ఏటా రూ.1000 కోట్లు ఖర్చు చేస్తామన్న వారు ఐదేళ్లకు కలిపి రూ.450 కోట్లు కూడా ఖర్చు చేయలేదు. దీంతో నేతన్నల కుటుంబాలు అతలాకుతలం అయ్యాయి.

మన ప్రభుత్వంలో ఆ పరిస్థితి మార్చేశాం

- మనందరి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నికలప్పుడు చెప్పిన మాట నెరవేరుస్తూ 2019 డిసెంబర్ 21న నా పుట్టిన రోజునాడు వైఎస్సార్ నేతన్న నేస్తం తీసుకొచ్చాం. ఆ రోజు నుంచి ఈ రోజు వరుసగా ఐదో దఫా సహాయం చేశాం.

వెంకటగిరికి వరాలు

వెంకటగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం రామ్‌కుమార్‌రెడ్డి నిధులు అడిగారు. ఆల్తూరుపాడు ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి అడుగులు ముందుకు వేయకుండా అడ్డుకున్న పరిస్థితి చూశాం. రివైజ్డ్ ప్రాజెక్టు కాస్ట్ ఎస్టిమేషన్ తయారుచేయిస్తే రూ.553 కోట్లు అవుతుందన్నారు. ఇందుకు అనుమతులు మంజూరు చేస్తాను. 6 మండలాల్లో డ్రెయిన్లు, సీసీరోడ్ల కోసం రూ.20 కోట్లు మంజూరు చేస్తున్నా. మున్సిపాల్టీలో డ్రెయిన్లు, సీసీరోడ్లకు సంబంధించి ప్రతి గడపకూ తిరగమని రామ్‌కు చెబుతున్నాను. ఒక్కోసచివాలయానికి రూ.50 లక్షలు కేటాయిస్తాం. వెంకటగిరికి ఇరిగేషన్ ట్యాంకుకు సంబంధించిన నిధులూ మంజూరు చేస్తాను. బీసీ కమ్యూనిటీ హాల్, ఎస్సీ గురుకుల స్కూల్ మంజూరు చేస్తున్నా. పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటిస్తున్నా.


- సామాజిక పింఛన్ల రూపంలో రూ.1,396 కోట్లు, నవరత్నాల్లో ఇతర పథకాల ద్వారా మరో రూ.871 కోట్లు వారి చేతిలో పెట్టాం. బకాయిలతో కలిపి ఆప్కోకు రూ.468 కోట్లు, నేతన్న నేస్తం ద్వారా రూ.970 కోట్లు.. మొత్తంగా రూ.3,706 కోట్లు నేతన్నల సంక్షేమం కోసం ఖర్చు చేయగలిగాం. గత చంద్రబాబు ప్రభుత్వంలో ఐదేళ్లకి కలిపి రూ.450 కోట్లు ఎక్కడ? మీ బిడ్డ ప్రభుత్వంలో 50 నెలల్లో రూ.3,706 కోట్లు ఎక్కడ? ఒక్కసారి మీరే ఆలోచించండి.

జాతర ఇవాళే వచ్చినట్లుంది



గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో నేత పనులు గిట్టుబాటు కాక చేనేత కార్మికులు ఎంతో మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇప్పుడు మీరొచ్చాక (సీఎం జగన్) వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా ఆ పరిస్థితులు మారిపోయాయి. నవరత్నాల పథకాల ద్వారా ఎంతగానో లబ్ధి పొందుతున్నాం. నా భర్తకు కిడ్నీలో రాళ్లు వస్తే రూపాయి ఖర్చు కాకుండా ఆరోగ్య శ్రీ ద్వారా ఆపరేషన్ చేయించాం. పిల్లలకు స్కూల్లో రుచికరమైన భోజనం పెడుతున్నారు. మీ (సీఎం) పుణ్యమా అని టిడ్కో ఇల్లు కూడా వచ్చింది. సీఎం జగనన్న మేలు ఎప్పటికీ మరచిపోం. రెండు నెలల తర్వాత వచ్చే వెంకటగిరి జాతర.. ఇవాళే వచ్చినంత ఆనందంగా ఉంది.

– సోమా విజయలక్ష్మి, చేనేత కార్మికురాలు, వెంకటగిరి



The new Seltos is here to take you on an exhilarating drive experience. With an unstoppable attitude, the redesigned Seltos is the new benchmark of badass traits – distinctive design language, connected technology, premium cabin space, and a powerful driving experience. Discover the new Seltos that is here to awaken the badass in you.

Technology. Reborn.

Badass 2.0 redefines the segment, yet again

Dual Screen Panoramic Display



26.03 cm (10.25") HD Touchscreen Navigation + Full Digital Cluster with 26.04 cm (10.25") Color LCD MID give you an immersive and futuristic drive experience.

Most Powerful Turbo Petrol Engine



with 160 ps power, enjoy best-in-class superior performance and fuel efficiency.

Intelligent Dual Zone Fully Automatic Air Conditioner



ensures a comfortable drive for both, the driver and the co-driver.

Voice Activated Dual Pane Panoramic Sunroof



gives you a mesmerising view of the world above.

BOSE Premium Sound System with 8 Speakers



lets you enjoy an elevated audio experience.

Kia Connect* Skill with Amazon Alexa



lets you control your Kia from the comfort of your home.

Host of other Badass Features: Electric Parking Brake with Auto Hold | Smart 20.32 cm (8") Head-up Display | Front Ventilated Seats with 8-Way Power Driver's Seat | Dual Sports Exhaust (1.5 TGDi Only) | Star Map LED Connected Tail Lamps | Sequential LED Turn Indicators | R18 (46.20 cm) Crystal Cut Glossy Black Alloy Wheels | Ambient Mood Lights with LED Sound Mood Lamps | GT Line & X-Line Differentiated Body Kit | Smart Pure Air Purifier with Virus and Bacteria Protection | Star Map Sweeping LED Light Guide | Exclusive Matte Graphite Exterior Color | Premium Sliding Cup Holder Cover

Safety. Reborn.

Badass 2.0 with 17 Autonomous ADAS Level 2 Features~ + Robust 15 Standard Safety Features across variants

Smart Cruise Control with Stop and Go lets you set and maintain any cruising speed for an effortless drive.

Lane Keep Assist and Departure Warning proactively supports in keeping the car within its lane.

Front Collision Warning and Avoidance Assist scans the road ahead to detect and warn you of any impending collision.

Blind Spot Collision Warning looks out for hard-to-spot traffic at the rear of the vehicle.

Leading Vehicle Departure Alert detects and alerts when the vehicle in front begins to move.

Safe Exit Warning alerts in case of an approaching object to ensure you safely exit from the car.

Kia Service

Connected • Adaptive • Responsive • Engage

3 Years Unlimited kms Warranty | Extended Warranty Up to 5 Years | My Convenience Plus Best in Class Cost of Ownership^^ | Scratch Care Program^ | IoT Based Smart Services## | 24x7 | 3 Years Nationwide RSA**

BOOK NOW Call 1800 108 5000 | 093195 91407 | Visit www.kia.com/in | Book Kia Seltos | kiacare@kiaindia.net | Look for "Kia India" @

Scan to know more

Terms & Conditions Apply. *Ex-showroom price all India. The product & feature images shown in this ad is for representation purpose only. Features and specifications as shown may not be part of standard fitment and may vary. The colors shown are subject to availability and may not be available across all variants and may differ slightly from those shown in this ad. Segment is defined as Mid SUV whose length lies between 4 220 - 4 390 mm and width between 1 760 - 1 810 mm. ~Advanced Driver Assistance System (ADAS) is not a substitute for human eye and driver vigilance. It is an assistance feature that enhances driving experience and safety. Effectiveness of ADAS may vary based on actual situation and all objects around vehicle may not be detected. The driver shall remain responsible for safe, vigilant, and attentive driving. #Kia Connect comes with 3-year free subscription. Amazon Alexa device is not a standard car accessory & the customer needs to purchase from a third party. Kia Connect skill features may vary depending on the variant, device compatibility, software, and network availability both in the vehicle and Alexa device. Kia Connect skill is only available in India and can be interacted with in English and Hindi. **RSA coverage across India except Andaman & Nicobar Islands and Lakshadweep. ##IoT based workshops for live vehicle tracking for digital experience. ^^Computed cumulatively with all benefits from comprehensive coverage. ^Program coverage includes repair of 1 scratch free cost in an ownership period of 12 months from the date of sale, applicable for all new Seltos retailed up to 31st Dec, 2023. The specifications and features may vary depending on models/ variants. Kia India Pvt. Ltd. (Formerly known as Kia Motors India Private Limited) reserves the right to make any changes with respect to the trims, colors, specifications, Kia Connect features and other details of any model as mentioned in this ad or to discontinue any model without prior notice. For more details visit your local Kia dealership. Kia India Pvt. Ltd. (Formerly known as Kia Motors India Private Limited) urges you to follow traffic rules, these are meant to keep you safe on roads.

FOR INFORMATION CONTACT: ANDHRA PRADESH: VIJAYAWADA: SIMHA KIA, PH: 8688836501, ANANTAPUR: MGB KIA, PH: 8333929195, BHIMAVARAM: SIMHA KIA, PH: 8688836544, CUDDAPPAHA: HOSHI KIA, PH: 8688829739, GUNTUR: SIMHA KIA, PH: 8688836566, KAKINADA: KANTIPUDI KIA, PH: 7799740208, KURNOOL: MGB KIA, PH: 8500963906, NELLORE: HOSHI KIA, PH: 8688829718, RAJAHMUNDRY: KANTIPUDI KIA, PH: 7799740208, TIRUPATI: HOSHI KIA, PH: 8688829739, VISHAKHAPATNAM: LAKSHMI KIA, PH: 7997815777, TELANGANA: HYDERABAD: CAR KIA, JUBILEE HILLS, PH: 7997858880, GACHIBOWLI: PH: 7799906846, VIHAAN KIA, KUKATPALLY, PH: 9394812345, AUTOMOTIVE KIA, KONDAPUR, PH: 6309908117, NAGOLE, PH: 6309908118, KARIMNAGAR: MALIK KIA, PH: 7730911111, KHAMMAM: AUTOMOTIVE KIA, PH: 6309908189, MAHBUBNAGAR: AUTOMOTIVE KIA, PH: 9704111425, NALGONDA: AUTOMOTIVE KIA, PH: 6309908183, SECUNDERABAD: VIHAAN KIA, PH: 9738312345, WARANGAL: MALIK KIA, PH: 9703433333

INNOCEAN-050/23

సాక్షి

శనివారం, 22 జూలై 2023

లంకకు స్నేహహస్తం

'నేను రణిల్ విక్రమసింఘేను... రణిల్ రాజపక్సను కాదు' అన్నారు శ్రీలంక అధ్యక్షుడు విక్రమ సింఘే భారత్ పర్యటనకొచ్చేముందు. అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి ఏడాది కావొస్తుండగా తన తొలి విదేశీ పర్యటనకు ఆయన మన దేశాన్నే ఎంచుకున్నారు. సందర్భం ఏమైనా కావొచ్చుగానీ, రణిల్ అలా వ్యాఖ్యానించక తప్పని పరిస్థితులైతే శ్రీలంకలో ఈనాటికీ ఉన్నాయి. రణిల్‌ను ఇప్పటికీ రాజపక్స ప్రతినిధిగానే చాలామంది పరిగణిస్తున్నారు. నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటి, ఎక్కడా అప్పుపుట్టని స్థితి ఏర్పడిన పర్యవసానంగా నిరుడు జనాగ్రహం కట్టలు తెంచుకుని అప్పటి దేశాధ్యక్షుడు గొటబయ రాజపక్స, ఆయన కుటుంబీకులు దేశం విడిచి పారిపోవాల్సి వచ్చింది. అనంతర కాలంలో ఐఎంఎఫ్ 290 కోట్ల డాలర్ల రుణం ఇవ్వడానికి అంగీకరించాక దేశం కాస్త కుదుటపడిన మాట వాస్తవమే అయినా ఇప్పటికీ సుదీర్ఘ విద్యుత్ కోతలు, ఆహార సంక్షోభం, అధిక ధరలు పీడిస్తున్నాయి. సుమారు 68 శాతం మంది జనాభా అర్ధాకలితో గడుపుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో విక్రమసింఘే భారత పర్యటనకొచ్చారు. ఆపత్సమయాల్లో ఆదుకోవటం నిజమైన మిత్ర ధర్మం. భారత్ ఆ ధర్మాన్ని పాటిస్తోంది. ఆహారం, మందులు, ఇంధనంతో సహా మానవతా సాయం కింద మన దేశం రణిల్ ఏలుబడి మొదలయ్యాక 400 కోట్ల డాలర్ల సహాయం అందించింది. ఆ తర్వాతే ఐఎంఎఫ్ రుణం మంజూరైంది. శ్రీలంక దాదాపు 8,300 కోట్ల డాలర్ల మేర అప్పుల్లో కూరుకుపోగా, అందులో సగం విదేశీ రుణాలే.

హిందూ మహాసముద్రంలో భౌగోళికంగా అత్యంత కీలక ప్రాంతంలో ఉండటం లంకకు వరం. మన దేశం నుంచి ఎప్పటినుంచో సాయం పొందుతున్న శ్రీలంకకు పదిహేనేళ్ల క్రితం చైనా స్నేహ హస్తం అందించటంలోని మర్మం అదే. ఎల్‌టీటీఈని ఎదుర్కొనడానికి కావాల్సిన 370 కోట్ల డాలర్ల విలువైన ఆయుధాలు, మందుగుండు, ఎఫ్ 7 జెట్ ఫైటర్లు, విమాన విధ్వంసక తుపాకులు, జేవై–11 రాడార్ ఇవ్వటంతో లంక, చైనాల మధ్య అనుబంధం పెరిగింది. ఆ తర్వాత వ్యూహాత్మక సహకార భాగస్వామ్యం కింద నాటి అధ్యక్షుడు మహిందా రాజపక్స చైనాకు తలుపులు బార్లా తెరిచారు. నౌకాశ్రయాల కోసం చైనా సాయం తీసుకున్నారు. అప్పటినుంచి కథ అడ్డం తిరిగింది. దేశంలో మౌలిక సదుపాయాల రంగంలో నిర్మించిన 70 శాతం ప్రాజెక్టులు చైనావే. ఒక్క హంబన్‌టోటా నౌకాశ్రయ నిర్మాణం కోసమే ఏటా 3 కోట్ల డాలర్ల వడ్డీ చెల్లించాల్సి వచ్చేది. సింగపూర్‌కు గట్టి పోటీ ఇస్తుందనుకున్న హంబన్‌టోటా నౌకాశ్రయం పడకేసింది. దాన్ని నిర్వహించటం చేతకాక 99 ఏళ్లపాటు చైనాకు ధారాదత్తం చేయడానికి లంక అంగీకరించాల్సివచ్చింది. ఏమైతేనేం శ్రీలంక విదేశీ రుణాల్లో 10 శాతం చైనావే. కానీ నిరుడు ఆర్థిక సంక్షోభం తలెత్తిన సమయంలో ఆ రుణాలపై కనీసం వడ్డీ మాఫీకి కూడా చైనా సిద్ధపడలేదు. ఒక లెక్క ప్రకారం 2025 వరకూ శ్రీలంక ఏటా 400 కోట్ల చొప్పున రుణాలు చెల్లించాల్సిన స్థితిలో పడింది. గత ఏణ్ణర్ధంగా సాగుతున్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధం దేశాన్ని మరింత కుంగదీసింది. లంకనుంచి తేయాకు దిగుమతుల్లో రష్యా అగ్రభాగాన ఉండేది. కానీ యుద్ధం కారణంగా అవి గణనీయంగా నిలిచిపోయాయి. ఇక అటు రష్యా నుంచీ, ఇటు ఉక్రెయిన్ నుంచీ టూరిస్టుల రాక పడిపోయింది. మన దేశం నుంచీ, ఐఎంఎఫ్ నుంచీ అందుతున్న సాయం లంకను ఇప్పుడిప్పుడే ఒడ్డుకు చేరుస్తోంది. భారత్ నుంచి వెళ్తున్న టూరిస్టుల కారణంగా లంక పర్యాటకం పుంజుకుంటున్నదనీ, దాని విదేశీ మారకద్రవ్య నిల్వలు పెరుగుతున్నాయనీ శుక్రవారం మన విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ మోహన్ క్వాత్రా అనడంలో అతిశయోక్తి లేదు. మన ఇతిహాసం రామాయణం లంకతో ముడిపడి వుంటుంది. అలాగే బౌద్ధానికి సంబంధించి అనేక చారిత్రక ప్రదేశాలు అక్కడున్నాయి. ఇవన్నీ ఇక్కడినుంచి వెళ్లే యాత్రీకులకు ప్రత్యేక ఆకర్షణ. కానీ నిరంతర విద్యుత్ కోతలు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్‌ఎంఈ) రంగాన్ని కుంగదీస్తున్నాయి. కనీసం జెనరేటర్లతో నడిపిద్దామన్నా ఇంధన కొరత పీడిస్తోంది. దేశ జీడీపీలో ఈ రంగం వాటా 52 శాతం. పరిశ్రమల్లో వీటి వాటా 75 శాతం. ఉపాధి కల్పనలోనూ దీనిదే ఆధిక్యత. అందుకే పెట్రోలియం ఉత్పత్తుల సరఫరా కోసం శ్రీలంకకు పైప్ లైన్ నిర్మించే అంశాన్ని అధ్యయనం చేయాలని రెండు దేశాలూ నిర్ణయించాయి. ద్వైపాక్షిక సంబంధాలను పటిష్టం చేసుకోవటం, ఇంధనం, ఆర్థిక, డిజిటల్ రంగాల్లో భారత్‌తో భాగస్వామ్యం తదితర అంశాల్లో ప్రధాని నరేంద్ర మోదీ, రణిల్ మధ్య ఒప్పందాలు కుదిరాయి.

అయితే ఇరు దేశాల మధ్యా సమస్యలు లేకపోలేదు. లంక ఉత్తర తీరంలోని తమిళ జాలర్ల జీవనానికి భారత్ నుంచి వచ్చే చేపల బోట్లు గండికొడుతున్నాయని లంక ఆరోపిస్తోంది. సరిగ్గా మన ఆరోపణ కూడా ఇలాంటిదే. తమ సాగర జలాల పరిధిలో చేపలు పడుతున్నారన్న సాకుతో తరచు లంక నావికాదళం తమిళ జాలర్లను నిర్బంధిస్తోందనీ, గత రెండేళ్లుగా 619 మంది జాలర్లు అక్కడి జైళ్లలో మగ్గుతున్నారనీ తమిళనాడు సీఎం స్టాలిన్ మోదీ దృష్టికి తీసుకొచ్చారు. గతంలో మన దేశం అప్పగించిన కచ్చాతీవు దీవిని వెనక్కు తీసుకోవాలని కోరారు. ఇక లంక తమిళులకు గతంలో ఇచ్చిన వాగ్దానం మేరకు వారు నివసించే ప్రాంతంలో ఎన్నికలు నిర్వహించాలనీ, స్వయంపాలనకు అవకాశమీయాలనీ, వారు గౌరవప్రదంగా జీవించటానికి తోడ్పడాలనీ మన దేశం అడుగుతోంది. రణిల్ తాజా పర్యటన ఇలాంటి సమస్యల పరిష్కారానికి దోహదపడితే ఇరు దేశాల సంబంధాలూ భవిష్యత్తులో మరింత పటిష్టమవుతాయి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, తిథి: శు.చవితి ఉ.6.15 వరకు తదుపరి పంచమి, నక్షత్రం: పుబ్బ ప.2.45 వరకు తదుపరి ఉత్తర, వర్జ్యం: రా.10.35 నుండి 12.21 వరకు, దుర్ముహూర్తం: ఉ.5.39 నుండి 7.22 వరకు, అమృతఘడియలు: ఉ.7.40 నుండి 9.26 వరకు.

సూర్యోదయం : 5.39
సూర్యాస్తమయం: 6.33
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

ఉమ్మడి బాటలో భిన్నాభిప్రాయాలు

ఆదేశిక సూత్రాలకే పరిమితమైన ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ) అంశం మళ్లీ తెరమీదికొచ్చింది. వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత, పోషణ, భరణం వంటి కుటుంబ, వ్యక్తిగత అంశాల్లో ఒకే పౌర నియమాలను రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆదేశిక సూత్రాలలో చేర్చడమంటే ఒక విస్తృత ప్రయోజనమున్న చట్టాన్ని బీరువాలకు పరిమితం చేయడం కాదనీ, దేశ ప్రజలందరికీ ఒకే చట్టం ఉండాలన్నది ప్రజాస్వామిక వ్యవస్థకు గీటురాయనీ ఒక వాదన. అదే ఆదేశిక సూత్రాలలో ఉన్న సమానత్వం, విద్య, వైద్యం, ఉపాధి వగైరా లాంటి అంశాలకు చట్టాలు ఎందుకు చేయరనీ, ఇది కేవలం ఎన్నికల ఎత్తుగడ మాత్రమేననీ మరొక వాదన.

సమానత్వ సిద్ధాంతం

అభిప్రాయం



పి. వేణుగోపాల్ రెడ్డి

మిగిలిన చట్టాల మాదిరిగానే ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ) కూడా 1948 లోనే రాజ్యాంగంలో ఒక చట్టంగా చోటు చేసుకోకపోవడానికి ప్రధాన కారణం, ఆనాటి పరిస్థితులు. అందరికీ మానసిక సంసిద్ధత సమకూరిన తరువాతనే దానిని తెచ్చే ఆలోచన చేయడం మంచిదన్నది ఒక దశలో రాజ్యాంగ పరిషత్ అనివార్యంగా తీసుకున్న నిర్ణయం. ఫలితంగానే ఆ ఆలోచన ఆదేశిక సూత్రాలకు (44వ అధికరణ) పరిమితమైంది. ప్రపంచ చరిత్రలోనే అత్యంత హింసాత్మక, విషాద ఘట్టంగా చెప్పుకొనే భారతదేశ విభజన, నాటి మత ఉద్రిక్తతలు రాజ్యాంగ పరిషత్ పెద్దలను అలాంటి వాయిదా నిర్ణయానికి పురిగొల్పాయి.

ఆదేశిక సూత్రాలలో చేర్చడమంటే ఒక విస్తృత ప్రయోజనమున్న చట్టాన్ని బీరువాలకు పరిమితం చేయడమైతే కాదు. దేశ ప్రజలందరికీ ఒకే చట్టం ఉండాలన్నది ప్రజాస్వామిక వ్యవస్థకు గీటురాయి. మతసూత్రాల ఆధారంగా పర్సనల్ లా చెల్లుబాటు అయితే రాజ్యాంగమే చెబుతున్న సెక్యులరిస్టు వ్యవస్థలో ఆ భావనకే భంగపాటు. షాబానో విడాకుల కేసు, మనోవర్తి వివాదం మొదలు (1985) ఇటీవలి కాలం వరకు సుప్రీంకోర్టు కూడా ఉమ్మడి పౌర స్మృతి గురించి కేంద్రానికి గుర్తు చేయడమే కాదు, ఒక సందర్భంలో నిష్టూరమాడింది కూడా.

రాజకీయ చర్చలు, చట్టసభలలో వాగ్యుద్ధాల స్థాయి నుంచి ఎన్నికల హామీ వరకు ఉమ్మడి పౌర స్మృతి ప్రయాణించింది. స్వాతంత్య్రం వచ్చిన తరువాత 1948 నవంబర్ 23న తొలిసారి దీని రూపకల్పన ఆలోచన తెరమీదకు వచ్చింది. రాజ్యాంగ పరిషత్‌లో ఈ ప్రస్తావన తెచ్చినవారు కాంగ్రెస్ సభ్యుడు మీను మసానీ. ఇప్పుడు ఆ పార్టీ ఈ అంశం మీద నీళ్లు నమలడం ఒక వైచిత్రి. అంబేడ్కర్, నెహ్రూ, పటేల్, కృపలానీ వంటి వారంతా దీనిని సమర్థించారు. దీని గురించి ప్రతికూల వైఖరి తీసుకుంటున్నవారు ఈ చట్టం ద్వారా మేలు పొందేది మహిళలే అన్న వాస్తవాన్ని విస్మరించకూడదు. రాజ్యాంగ పరిషత్‌లో హన్సా మెహతా సహా 15 మంది మహిళలు దీని కోసం తపించారు. ఈ స్ఫూర్తి బుజ్జగింపు ధోరణిలో కొట్టుకుపోకుండా చూసుకోవలసిన బాధ్యత ఇవాళ్టి కాంగ్రెస్ పార్టీ నాయకత్వానిదే. ఉమ్మడి పౌర స్మృతితో దేశం సంతరించుకునే అంశాలుగా చెప్పినవి: స్త్రీ పురుష సమానత్వం, జాతీయ సమైక్యత, సమగ్రత, లౌకికవాదం, వ్యక్తిగత హక్కుల రక్షణ, న్యాయవ్యవస్థ ఆధునీకరణ, భిన్న ఆచారాల సమన్వయం. ఇవన్నీ స్వాతంత్య్రం వచ్చిన ఏడున్నర దశాబ్దాలకు కూడా పౌరులందరికీ సమానంగా లేక పోవడం ఒక దుఃస్థితిని సూచిస్తుంది.



మద్రాస్ నుంచి రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికైన మహమ్మద్ ఇస్మాయిల్ దీన్ని వ్యతిరేకించినవారిలో మొదటివారు. నజీరుద్దీన్ అహ్మద్, మెహబూబ్ అలీ బేగ్, బి.పోకార్ సాహెబ్, అహమ్మద్ ఇబ్రహీం, హస్రత్ మొహానీ ఆయన వెనుక నిలిచారు. ఈ వ్యతిరేకతను వ్యక్తం చేయడానికి వారు ఎన్నుకున్న నినాదం 'ఇంక్విలాబ్ జిందాబాద్'. ఇది కూడా ఒక చారిత్రక వైచిత్రి. వీరి వాదనలోని అంశాలు తమ మత, సాంస్కృతిక అస్తిత్వాన్ని కాపాడుకోవడం, ఉమ్మడి పౌర స్మృతి వస్తే ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లుతుందని చెప్పడం. ఇప్పుడు కూడా అవే కారణాలు వినిపిస్తున్నాయి. అందుకే దీని మీద చర్చ అనివార్యం. ఇందుకు దోహదం చేస్తున్నదే 22వ లా కమిషన్ పిలుపు.


ఏదో ఒక కాలంలో ప్రతి మతం స్త్రీని చిన్నచూపు చూసిన మాట వాస్తవం. ఒకనాడు హిందూధర్మం కూడా ఇలాంటి బంధనాలలోనే ఉన్నా, హిందూ కోడ్‌తో చాలావరకు ఆ దుఃస్థితి నుంచి మహిళకు రక్షణ దొరికింది. ఇలాంటి రక్షణ ఏ మతం వారికైనా లభించాల్సిందే. విడాకులు, వివాహం వంటి వ్యక్తిగత అంశాల్లో దేశ పౌరులందరికీ ఒకే న్యాయం అందించాలన్నదే యూసీసీ ధ్యేయం. విడాకులు పొందిన మహిళ ఎలాంటి ఆంక్షలు లేకుండా పునర్ వివాహం చేసుకునే వెసులుబాటు, దత్తత చట్టం అందరికీ ఒకే విధంగా ఉండడం కూడా ఇందులో భాగమే. ఆస్తిహక్కుకు, వివాహ వయసు 21 సంవత్సరాలు వంటి నియమాలకు మత, వర్గ, ప్రాంతాలతో నిమిత్తం లేకుండా యూసీసీ పాటు పడుతుంది. ఇవన్నీ స్వాగతించవలసిన అంశాలు.

13వ శతాబ్దానికి చెందిన అల్లావుద్దీన్ ఖిల్జీ కూడా ఢిల్లీ మత పెద్దను కాదని షరియాలో మార్పులు తెచ్చాడు. 1937 నుంచి మాత్రమే భారతీయ ముస్లింలు అమలు చేసుకుంటున్న ముస్లిం పర్సనల్ లా విషయంలో ఇంత రాద్ధాంతం చేయడంలో అర్థం కనిపించదు. అలా అని ఆ పర్సనల్ లా యథాతథంగా అమలు చేయగలిగే శక్తి, కాఠిన్యం ఇవాళ వారిలోనూ లేవు. పాకిస్తాన్, ఈజిప్ట్, ట్యునీషియా వంటి దేశాల అనుభవాలు కూడా పర్సనల్ లా శిలాశాసనం కాదనే రుజువు చేస్తున్నాయి. సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ ఇటీవలనే హదిత్ (ముస్లిం న్యాయసూత్రాలు) పునర్ నిర్మాణానికి ఒక సంఘాన్ని నియమించారు. ఈ న్యాయసూత్రాలు ఉగ్రవాదానికి తోడ్పడకుండా ఉండేందుకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారని వార్తలు వచ్చాయి. యూసీసీని బీజేపీ తీసుకువచ్చే ప్రయత్నంలో ఉన్నది కాబట్టి అది హిందువుల కోసమేనని చెప్పడం ఆత్మవంచన. రాజ్యాంగ చరిత్ర ఒక మలుపు తీసుకుంటున్న సమయంలో మోకాలడ్డే ప్రయత్నం సరికాదు.

వ్యాసకర్త 'ఏకలవ్య ఫౌండేషన్' వ్యవస్థాపక ఛైర్మన్
pvg2020@gmail.com

ఎన్నికల రాద్ధాంతం

అభిప్రాయం



సంగిరెడ్డి హనుమంత రెడ్డి

"ఒక ఇంట్లో ఒకరికి ఒక చట్టం, మరొకరికి మరొక చట్టం ఉంటే ఆ ఇల్లు నడుస్తుందా? అలాంటి కపట వ్యవస్థతో దేశం ఎలా పనిచేస్తుంది?" అన్నారు బీజేపీ ఎన్నికల కార్యకర్తల సభలో ప్రధాని మోదీ. ఈ చర్చ సరైన వేదికపై చేయాలి. ప్రజలను రెచ్చగొట్టరాదు. ప్రశాంత జీవనానికీ, భిన్న కుల, మత, జాతి, సంస్కృతుల మధ్య భారతీయతకూ 'భిన్నత్వంలో ఏకత్వం' కారణం. ఈ భిన్నత్వం స్థానంలో వైదిక ఏకత్వాన్ని రుద్దాలన్నది 'సంఘ్' ఆకాంక్ష.

ఈ పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోనే ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ) చట్టాన్ని తేవాలన్నది మోదీ ఆలోచన. ఎన్నికలకు ముందు ముస్లిం మహిళల న్యాయసాధనకు పూనుకుంటారాయన. హిందూ స్త్రీలను పట్టించుకోరు. సాధికారితకు మహిళా రిజర్వేషన్ చట్టం చేయరు. యూసీసీని అమలు చేయమని సుప్రీంకోర్టు అనేక సందర్భాలలో ఆదేశించినా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. 2024 ఎన్నికల లబ్ధికి ఇప్పుడు ఈ చట్టాన్ని ముందుకుతెచ్చారు.

వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత, పోషణ, భరణం వంటి కుటుంబ, వ్యక్తిగత అంశాల్లో ఒకే పౌర నియమాలను రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ మతాల ప్రజలు తరతరాలుగా ఆచరిస్తున్న పద్ధతులు, సంప్రదాయాలు అనేకం ఉన్నాయి. భార్యాభర్తలకు, కూతురు కొడుకులకు వేరువేరు దుస్సంప్రదాయాలున్నాయి. అయితే భావజాలం కుదరని చోట చట్టాలతో, చట్టాలు పనిచేయనిచోట భావజాలంతో వీటిని సరిదిద్దాలి.

ఏకరీతి పౌరసూత్రాల ప్రస్తావన ప్రాథమిక హక్కుల్లో లేదు. రాజ్య విధానాల ఆదేశిక సూత్రాలు ఆసక్తికరమైనవి. వీటి ప్రకారం ప్రభుత్వం శాసన, కార్యనిర్వాహక విధులు నిర్వహించాలి. ఇవి మార్గదర్శకాలే. వీటిని న్యాయవ్యవస్థ ద్వారా అమలుచేయలేము. వీటిని న్యాయస్థానాలలో సవాలు చేయగల చట్టాలను చేయరాదు. సంస్కరణల ద్వారా ఈ సూత్రాలను సాధించాలి. దేశ పౌరులకు ఏకరీతి పౌర నియమావళిని పదిలపర్చే పని రాజ్యం చేయాలని ఆదేశిక సూత్రం 44 చెప్పింది. ఒకేసారి చట్టం చేయరాదనీ, సంస్కరణలతో సాధించాలనీ వివరించింది. ఆదేశిక ఆదేశాలలో సమానత్వం, విద్య, వైద్యం, ఉపాధి, జీవన వేతనాలు, పోషకాహార సరఫరా వగైరా చాలా అంశాలున్నాయి. వీటి అమలుకు మాత్రం చట్టాలు చేయరు.

యూసీసీ అమలులో చిక్కులున్నాయి. దీనిపై ఇప్పటి వరకు జరిగిన రాజ్యాంగ, శాసన చర్చలను పరిగణించాలి. విభిన్న జాతుల, మతాల దేశంలో ఇది ఆచరణ సాధ్యం కాదని తేల్చింది. ఇది కోరదగ్గదే కాని ఐచ్ఛికంగా ఉండాలన్నారు రాజ్యాంగ ముసాయిదా సభ అధ్యక్షులు అంబేడ్కర్. యూసీసీ కంటే వివిధ కుటుంబ సంస్కరణలు స్త్రీ, శిశువుల శ్రేయస్సుకు హామీనివ్వగలవు. యూసీసీ ముస్లింల పైనే కాదు, ఇతర అల్పసంఖ్యాక వర్గాలపై, గిరిజనులపై కూడా దుష్ప్రభావం చూపుతుంది. ఇది అనవసరం, అవాంఛనీయం అని 21వ లా కమిషన్ చెప్పింది. అయినా మరలా 22వ లా కమిషన్‌కు నివేదించడం, అదీ 30 రోజుల స్వల్ప వ్యవధిలో ప్రభావితుల అభిప్రాయాలు కోరడం ఆశ్చర్యం.

అన్ని మతాల వ్యక్తిగత చట్టాలు మధ్యయుగ మహిళా ద్వేషాలే. ఈ విషయంపై చర్చ జరగదు. 'సంఘ్' ముస్లిం వ్యక్తి చట్టాలనే విమర్శిస్తుంది. వైదికమత నియంతృత్వాన్ని స్థాపిస్తుంది. మత స్వేచ్ఛ హక్కునిచ్చే అధికరణ 25, మత సంస్థల స్థాపన, నిర్వహణ హక్కులను కల్పించే అధికరణ 26, మత మైనారిటీలకు ప్రత్యేక హక్కులనిచ్చిన అధికరణ 29లను యూసీసీ బలహీనపరుస్తుంది.

ఉన్న చట్టాలను అమలుచేస్తూనే ఏకీకృతాన్ని సాధించవచ్చు. హిందువులకు కులరహిత ఏకరీతి సూత్రాలను శాసించాలి. ఆ తర్వాతే ఆదేశిక సూత్రాల జోలికి పోవాలి. మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని, రాజ్యాంగ హక్కులను, ప్రజాస్వామ్య విలువలను, దేశ సమాఖ్య తత్వాన్ని, సమానత్వ అధికరణలను తుంగలో తొక్కింది. అధికరణ 47 ప్రకారం ప్రజారోగ్యానికి పోషకాహార స్థాయి, జీవన ప్రమాణాలను పెంచాలి. ఆరోగ్యానికి హానికరమైన మత్తుపానీయాలను, మాదక ద్రవ్యాలను నిషేధించాలి. యూసీసీ కంటే ఇవి చాలా ముఖ్యం.

సంఘ్‌కు ముస్లింల గుంపు కావాలి. వారిని చూపి హిందుత్వవాదులను రెచ్చగొట్టాలి. అయితే ప్రతిపక్షాలు దీనికి లౌకిక పౌర ప్రత్యామ్నాయ విరుగుడు పద్ధతులను చేపట్టలేదు. ఇప్పుడు విడవమంటే పాముకు కోపం, కరవమంటే కప్పకు కోపం. యూసీసీ వద్దంటే ముస్లింవాదులనీ, వైదిక వ్యతిరేకులనీ నింద. సమర్థిస్తే ముస్లిం వ్యతిరేకులనీ, వైదికవాదులనీ ముద్ర.

చట్టసభలో ఒక బిల్లును ప్రవేశపెట్టే ముందు దాని ముసాయిదాను సమర్పించాలి. ఆ అంశంలో వాస్తవ పరిస్థితిని తెలపాలి. సంబంధిత గణాంకాలను జోడించాలి. ఆ చట్ట ప్రయోజనాలను వివరించాలి. మోదీ ప్రభుత్వం ఏ చట్టంలోనూ రాజ్యాంగబద్ధంగా ఇవ్వవలసిన ఈ వివరాలను బిల్లుకు జోడించలేదు. ఇల్లు, దేశం ఒకటి కావనీ; రాజ్యాంగ సమానత్వ అమలే ప్రజాస్వామ్యమనీ, పాలకవర్గ కపటమే దేశాన్ని దిగజార్చిందనీ ప్రధాని గ్రహించాలి. కుటుంబ అంశాల్లో ప్రతి మతం పురుషాధిక్య రాజ్యమే. దీన్ని మతాలన్నీ సరిదిద్దుకోవాలి. ఎన్నికల్లో యూసీసీ ప్రభావం లేకుండా చేయాలి.

వ్యాసకర్త ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి
మొబైల్: 949020 4545

సోషల్ మీడియా

అసలు రహస్యం



మణిపూర్ మంటల వెనుక ఉన్నది జాతుల హింస కాదనీ, గనుల కోసం ఆ ప్రాంతాన్ని తవ్వడానికి వీలుగా గిరిజనులను అక్కడినుంచి తరమడమనీ ఒక చిన్న పిల్లాడు అన్నాడు. కొన్ని శక్తులేవో కచ్చితంగా దీన్నుంచి లాభం పొందనున్నాయి.

– వీనా బక్షి, దర్శకురాలు

వదిలించుకున్నాను!




నేను పొగ తాగడం మానేసి ఏడాది పైనే అవుతోంది. అది మనిషిని నిర్వీర్యం చేసే ప్రాణాంతక వ్యసనం. సిగరెట్లకు దూరంగా ఉంటున్న ప్రతి క్షణానికీ నేను కృతజ్ఞుడిని. పొగ తాగడంలో ఏ స్టైలూ లేదూ, అదేమీ 'కూల్' పనీ కాదు. అది మనసుకూ, శరీరానికీ అనారోగ్యకరమైనది మాత్రమే. చెప్పాలంటే ఇప్పటికీ నేను వ్యసనంతో పోరాడుతున్నాను. కానీ చావడం కంటే ఈ పోరాటాన్నే కోరుకుంటాను.

– హన్సల్ మెహతా, దర్శకుడు

అగ్నిధారలు కురిపించిన సున్నితుడు!

సాగరమంత సాహితీ సృజనకారుని ముఖచిత్ర పరిచయం దుస్సహం. ఏం తెలుసని చెప్పాలి? ఎంత తెలుసునని వివరించాలి? శృంగారం, భక్తి, ప్రేమ, విరహం, అగ్నిధారలు, వెన్నెల మెరుపులు, సముద్ర గర్భం లోతు, సాయం సంధ్యా సమయపు ఆహ్లాదం, మంచు, పులుగు, పుష్ప సౌకుమార్యం... ఇంత వైవిధ్య భరితం ఆయన కవిత్వం! ఒక్క మాటలో ఆయనే తన ఆత్మకథలో... ఓ కవితా చివురును 'అంతా నేనే... అన్నీ నేనే / అలుగు నేనే... పులుగు నేనే/ వెలుగు నేనే... తెలుగు నేనే' అని చెప్పుకున్నారు. ఆయనే... 'అగ్నిధార' కురిపించిన దాశరథి కృష్ణమాచార్యులు.



దాశరథి

దాశరథి 1925 జులై 22న నేటి మహబూబాబాద్ జిల్లా చిన్న గూడురులో జన్మించారు. నాటి హైదరాబాద్ నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల్లో పాల్గొన్నారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ'ని నినదించిన, 'అగ్నిధార' లను కురిపించిన కవి. తెలంగాణ ప్రజల కన్నీళ్లను కలంతో ప్రపంచానికి అందించిన మానవతా వాది. మహాకవి ఇక్బాల్ రాసిన 'ఏ పొలమున నిరుపేదకు దొరకదో తిండి / ఆ పొలమున గల పంటను కాల్చేయండి' అనే ఓ విప్లవ గీతం ఆయనలో ఉద్రేకాన్నీ, కవిత వెనుక ఐక్యతా సహజమైన సున్నిత ఆత్మనూ తాను పట్టుకొని మురిసి పోయానని' చెప్పుకొన్న ఔన్నత్యం ఆయనది.

'ఓ నిజాము పిశాచమా కానరాడు నిన్ను బోలిన రాజు మాకెన్నడేని' అని గర్జించిన కంఠం కూడా కృష్ణమాచార్యవారిదే. దాశరథి కృష్ణమాచార్యులు వైవిధ్యమైన వస్తువులతో కథలు, నాటికలు; 1960–78 సంవత్సరాల మధ్య 124 చిత్రాలకు కొన్ని వందల గీతాలు, కవితలు కాక 'మీర్జా గాలిబ్' రచించిన ఉర్దూ గజల్స్‌ను తెలుగులో 'గాలిబ్ గీతాలు'గా వెలువరించారు. ఉద్యమ నేపథ్యమున్న కవి భక్తిని కూడా అంతే ఆర్ద్రంగా ఆవిష్కరించడం చదువరికి రసానుభూతిని అందిస్తుంది. ఆయన రాసిన సినిమా పాటలు 'ఖుషి, ఖుషిగా నవ్వుతూ', 'కన్నయ్యా నల్లని కన్నయ్యా, 'ఒక పూల బాణం'.'విన్నవించుకోన' 'ఆవేశం రావాలి ఆవేదన కావాలి', 'నను పాలింపగ నడచి'... ఇలా ప్రతీపాట ఓ పూలచెండు పరిమళం. ఓ ప్రశ్నల పరంపర. ఒక శృంగార రసవద్ఘట్టం.'ఆ చల్లని సముద్ర గర్భం' అనే గీతంలో ఆయన లేవనెత్తిన ప్రశ్నలు దశాబ్దాలు గడచినా... ప్రశ్నలుగానే మిగిలిపోవటం పాలకుల చేతకానితనమేమో. 'అన్నార్తులు అనాథలుండని ఆ నవయుగ మదెంతదూరం' అని ప్రశ్నిస్తారు. నిజమే. (నేటికి కూడా) అదెంత దూరమో!

'చిన్న చిన్న దేవుళ్ళు చిల్లర మల్లర దేవుళ్ళు/ చేయిచాపు దేవుళ్ళు/ శతకోటి దేవుళ్ళు'... ఇవి ఆయన రచించిన భక్తి గీతంలోని పంక్తులు. సమాజంలో పవిత్రమైన కోరికలు లేని భక్తి కన్నా స్వార్థ పూరిత భక్తిని ఆయన పరోక్షంగా ప్రకటించటంలో 'వేదన' ఇందులో కనిపిస్తుంది. దశాబ్దాలు గడచినా ప్రభుత్వాల 'రూపు మారింది. పాలకుల తరం మారింది. కాని... ప్రజల తలరాతల్లో మార్పు రాలేదు. హిట్లర్ ఉన్నానంటున్నాడు. ఉన్నానంటున్నాడు/ నయా నయా ఫాసిస్టులు భువిలో / నాట్యం చేస్తూ వస్తున్నారు. కాకుంటే ఆకారాలు మారాయి' అన్న దాశరథి వ్యాఖ్యానాలు నిత్యసత్యాలు, ఆయన కవిత్వం అజరామరం.

– భమిడిపాటి గౌరీశంకర్, తెలుగు ఉపన్యాసకులు

(నేడు దాశరథి కృష్ణమాచార్య జయంతి)

వ్యవసాయ రంగంలో నూతన అధ్యాయం

విశ్లేషణ



కన్నోజు శ్రీహర్ష

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వ్యవసాయానికి అనువైన రాష్ట్రం. ఉద్యాన వన పంటలకు పెట్టింది పేరు. వ్యవసాయాన్ని కేవలం ఒక వృత్తికే పరిమితం చేయకుండా ఇంటిగ్రేటెడ్ (సమగ్ర) విధానం ద్వారా నేడు దూసుకుపోతోంది. నవ్యాంధ్ర ప్రదేశ్‌గా అవతరించిన తర్వాత 2014 నుండి 2018 వరకు వ్యవసాయం అంతంత మాత్రంగానే ఉండేది. పొరుగు రాష్ట్రమైన తెలంగాణకి ఏపీ రైతులు వలస వెళ్లే పరిస్థితి ఉండేది. పెట్టుబడి సాయం, కనీస మద్దతు ధర లాంటివి అప్పటి ప్రభుత్వాలు విస్మరించాయి. కానీ 2019 తర్వాత వ్యవసాయ రంగంలోనే అద్భుతమైన విధానాలను ప్రస్తుత ప్రభుత్వం తీసుకువచ్చింది. 'రైతు బాగుంటేనే, దేశం బాగుంటుంది' అన్న నినాదంతో ప్రభుత్వం 2019 నుంచే రైతులకు 'వైఎస్సార్ రైతు భరోసా' పేరుతో ఏటా రెండు పంటలకు ఎకరానికి రూ. 13,500 చొప్పున పెట్టుబడి సాయంగా అందిస్తోంది. కేంద్ర ప్రభుత్వ 'పీఎం కిసాన్' పథకం కింద చేస్తున్న సాయాన్ని కలుపుకొని రాష్ట్ర ప్రభుత్వం దీన్ని అందిస్తోంది. ఇతర రాష్ట్రాల్లో ఈ పథకం అమ లులో ఉన్నప్పటికీ మన రాష్ట్రంలో మాత్రం కౌలు రైతులకు సైతం ప్రభుత్వం పెట్టుబడి సహాయాన్ని అందించడం విశేషం. రైతు మరణిస్తే బీమా సౌకర్యం 7 లక్షల రూపాయలను ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాలోకి జమ చేస్తోంది. మొదటిసారి మన రాష్ట్రంలో పెట్టుబడి సహాయాన్ని 'ఇన్‌పుట్ క్రెడిట్' పద్ధతి ద్వారా ప్రభుత్వం అందిస్తోంది.

వ్యవసాయ రంగంలో కీలకమైన ఇంటిగ్రేటెడ్ విధానాన్ని ప్రభుత్వం అమలుచేస్తోంది. 'రైతు భరోసా కేంద్రాల'ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల ద్వారా రైతులు తమ పంటలకు అవసరమైన విత్తనాలను, పరికరాలను, ఇతర సాంకేతిక సహాయాన్ని సైతం ఇక్కడి నుండే పొంది వ్యవసాయం చేస్తున్నారు. 'ఒన్ స్టాప్ షాప్' నినాదంతో ఒక 'సమగ్ర' వ్యవసాయ విధానాన్ని దేశంలోనే మొదటగా ఏపీ ప్రభుత్వం తీసుకువచ్చింది. 2022 లో జరిగిన 'ఆసియా -పసిఫిక్' సదస్సులో సైతం రైతు భరోసా కేంద్రాలపై ప్రపంచ బ్యాంకు అద్భుతమైన ప్రశంసలు అందించింది. రైతుల కోసం ప్రభుత్వం 'వైఎస్సార్ పొలం బడి' విధానాన్ని తీసుకువచ్చింది. పంటల వైవిధ్యం కోసం, వ్యవసాయ ఆధునికీకరణ కోసం రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తోంది. పంటల బీమా కోసం 'ఈ-క్రాప్' విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది.



ఉద్యాన పంటలకు రాష్ట్రం పెట్టింది పేరు. సుమారు 314 లక్షల మెట్రిక్ టన్నుల పంటలను రాష్ట్రంలో పండిస్తున్నా. రైతు ఉత్పత్తి కేంద్రాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోంది. విలువ జోడించిన (వాల్యూ ఏడెడ్) మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసి, స్మార్ట్ వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహిస్తోంది.

పశుపోషణ వ్యవసాయ రంగంలో చాలా కీలమైన అంశం. రైతు భరోసా కేంద్రాల ద్వారా మేతను ప్రభుత్వం అందిస్తోంది. 'జగనన్న పాలవెల్లువ', 'జగనన్న జీవన క్రాంతి' ద్వారా ప్రభుత్వం పాడి పరిశ్రమల ఏర్పాటుకు సహాయం చేస్తోంది. ఎప్పుడూ లేని విధంగా 'మత్స్యకారుల భరోసా'ని 10 లక్షల రూపాయల వరకు పెంచింది. 9 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం ద్వారా మత్స్యకారులకు ఎంతో మేలు చేస్తోంది. నర్సాపూర్లో 'ఫిషింగ్ యూనివర్సిటీ'ని ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నది.

'డా॥ వైఎస్సార్ వ్యవసాయ ల్యాబ్స్' ఏర్పాటు చేసి వాటి ద్వారా రైతులకు అందించే విత్తనాలు, ఎరువులు వంటి వాటి నాణ్యతను పరిశీలిస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ ద్వారా రైతుల అనుమానాలను తీర్చడానికి '155251' నంబర్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది.

అన్ని జిల్లాల్లో సాగు ఆధారిత భూమి ఉన్నందు వలన అందరి రైతులకు మేలు చేసే విధంగా గ్లోబల్ పద్ధతులను పాటిస్తోంది. 'ఆంధ్రప్రదేశ్ సమగ్ర సాగు, వ్యవసాయ పరివర్తన ప్రాజెక్టు'ను ప్రపంచ బ్యాంకు గ్రాంటు ద్వారా చేపడుతోంది. ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యాలు సుస్థిరమైన, వాతావరణ అనుకూలమైన పద్ధతులను పాటించడం. రైతుల జీవన ఉపాధిని పెంచే విధంగా జపాన్ వారి సహకారంతో ప్రభుత్వం ఓ ప్రాజెక్టును చేపడుతోంది. అదనంగా వచ్చే సంవత్సరం 10 లక్షల ఎకరాల్లో ప్రాకృతిక సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు నిర్ణయించింది.

వ్యవసాయ రంగం పురోగమించాలంటే ఎగుమతులు, ఆహార పరిశ్రమలు నెలకొల్పడం చాలా కీలకం. అందుకే ప్రభుత్వం చిన్న, మధ్య తరహా పోర్టుల నిర్మాణం చేపడుతోంది. ఈ పోర్టుల ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల, చేపల ఎగుమతులు గణనీయంగా పెరగ నున్నాయి. కృష్ణా జిల్లాలో ప్రభుత్వం మెగా ఫుడ్ పార్కును నిర్మిస్తోంది. వచ్చే 2025 నాటికి వ్యవసాయ రంగాన్ని మరింతగా ప్రోత్సహించి రూ 4.5 నుండి 6 లక్షల కోట్ల వరకు రాష్ట్ర స్థూల ఉత్పత్తి ఉండే విధంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. 'రైతు రాజ్యం'గా జగనన్న సర్కారు అవతరించబోతోంది.


వ్యాసకర్త పరిశోధక విద్యార్థి । 89851 30032

లెక్చరర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలకు అభ్యర్థుల ఎంపిక పూర్తి

సాక్షి, అమరావతి: ఆయుష్ శాఖలో 2021, సెప్టెంబరు 28న జారీచేసిన అనుబంధ నోటిఫికేషన్ ద్వారా హోమియోపతి లెక్చరర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలకు ప్రొవిజినల్‌గా ఎంపికైన వారి వివరాలను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని ఆ సంస్థ కార్యదర్శి జి. ప్రదీప్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాల నియామకాలకు సంబంధించిన రాత పరీక్షను ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 3 వరకూ ఏపీపీఎస్సీ నిర్వహించింది. అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను గత నెల 14 నుంచి ఈనెల 14 వరకూ పరిశీలించింది.

పంద్రాగస్టుకు ఘనంగా ఏర్పాట్లు

- ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దు
- ప్రభుత్వ పథకాలు ప్రతిబింబించేలా శకటాలను రూపొందించండి
- రాజ్‌భవన్‌లో గవర్నర్ ఎట్ హోంకు ఏర్పాట్లుచేయండి
- వివిధ శాఖల ఉన్నతాధికారులకు సీఎస్ ఆదేశాలు



సాక్షి, అమరావతి: వచ్చేనెల 15న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి 77వ భారత స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లుచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కేఎస్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వీటికి సంబంధించి శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడంలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా చూస్తూ విస్తృత ఏర్పాట్లుచేయాలన్నారు. అదేరోజు సాయంత్రం రాజ్‌భవన్‌లో ఎట్ హోం కార్యక్రమానికి కూడా ఏర్పాట్లుచేయాలని సీఎస్ వారిని ఆదేశించారు. మొత్తం ఏర్పాట్లన్నింటినీ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, విజయవాడ పోలీస్ కమిషనర్ పర్యవేక్షించాలన్నారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ సంక్షేమాభివృద్ధి పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహనకు ఆయా శాఖల వారీగా ప్రత్యేక శకటాల ప్రదర్శనను ఏర్పాటుచేయాలని జవహర్‌రెడ్డి ఆదేశించారు. ఈ వేడుకలకు హాజరయ్యే అతిథులందరికీ ప్రొటోకాల్ సహా తగిన ఏర్పాట్లు కూడా చేయాలన్నారు. రాజ్‌భవన్, హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయం సహా ఇతర ప్రముఖ కార్యాలయాల భవనాలను విద్యుద్దీపాలతో అలంకరించాలని కూడా సీఎస్ సూచించారు.

పోలీసు శాఖ విస్తృత బందోబస్తు..

మరోవైపు.. వీడియో లింక్ ద్వారా సమావేశంలో పాల్గొన్న డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. పోలీస్ శాఖ పరంగా విస్తృత బందోబస్తు, ట్రాఫిక్ నిర్వహణ తదితర అంశాలకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఏర్పాట్లన్నింటినీ విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా, ఏపీఎస్పీ అదనపు డీజీపీలు పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తారని చెప్పారు. రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ టి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. శకటాల ప్రదర్శనకు ఇప్పటివరకూ 13 శాఖలు ముందుకొచ్చాయని, పర్యాటక శాఖ శకటం కూడా ఏర్పాటుచేస్తే బాగుంటుందని ఆయన చెప్పారు. ఈ వేడుకలను ప్రజలందరూ తిలకించేందుకు వీలుగా స్క్రీన్‌లు ఏర్పాటుచేయడంతోపాటు ఆలిండియా రేడియో, దూరదర్శన్ సహా వివిధ చానాళ్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లుచేస్తున్నామన్నారు. ఇక వేడుకల అనంతరం ఆయా శకటాలను విజయవాడ నగరంలోని ఏలూరు రోడ్డు, బందరు రోడ్డులో తిప్పనున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు ప్రత్యేక బస్సులు..

అనంతరం.. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొనేందుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ కూడా మాట్లాడారు. అంతకుముందు.. రాష్ట్ర ప్రొటోకాల్ విభాగం సంచాలకులు ఎం. బాలసుబ్రహ్మణ్యంరెడ్డి వివిధ శాఖలపరంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి (హెచ్‌ఆర్) చిరంజీవి చౌదరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీసీఎల్ఏ కార్యాలయంలో ఉద్యోగుల గ్రీవెన్స్ డే

సాక్షి, అమరావతి: రెవెన్యూ ఉద్యోగుల గ్రీవెన్స్ డే సందర్భంగా మంగళగిరిలోని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) కార్యాలయంలో శుక్రవారం ఏపీ రెవెన్యూ జేఏసీ తరఫున పలువురు ఉద్యోగులు అదనపు సీసీఎల్ఏ ఇంతియాజ్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. మహిళా ఉద్యోగులకు ప్రత్యేకంగా రెస్ట్ రూమ్ ఏర్పాటు చేయాలని, అంతర్గత ఫిర్యాదుల కమిటీని పునరుద్ధరించాలని కోరారు. కంప్యూటర్ ఆపరేటర్లు లేని సెక్షన్లలో వారిని కేటాయించాలన్నారు. ఆయా అంశాలపై అదనపు సీసీఎల్ఏ సానుకూలంగా స్పందించారని, నిర్దేశిత సమయంలో వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గెజిటెడ్ సూపరింటెండెంట్లు జే శ్రీనివాసరావు, ఎస్ వెంకటేశ్వరరావు, పాషా, సూపరింటెండెంట్లు చిరంజీవి, నిషాంత్, నాగవీణ తెలిపారు.

క్లుప్తంగా...

జ్ఞానవాపి మసీదులో శాస్త్రీయ సర్వే

వారణాసి: యూపీలోని కాశీలో ప్రఖ్యాత కాశీ విశ్వనాథుని ఆలయాన్ని ఆనుకుని ఉన్న జ్ఞానవాపి మసీదులో శాస్త్రీయ సర్వే చేపట్టాలని వారణాసిలోని ఓ కోర్టు శుక్రవారం ఆదేశాలిచ్చింది. హిందూ ఆలయ ప్రాంతంలోనే మసీదు నిర్మాణం జరిగిందా అనే విషయం నిర్ధారించేందుకు శాస్త్రీయమైన సర్వే చేపట్టాలంటూ కొందరు హిందూ భక్తులు వేసిన పిటిషన్‌ను జడ్జి ఏకే విశ్వేశ్ సమర్థించారు. ఈ నెల 14వ తేదీ వరకు హిందు, ముస్లిం వర్గాల వాదనలను విన్న కోర్టు తాజాగా తీర్పు వెలువరించింది. మసీదు కాంప్లెక్స్‌లో సర్వే చేపట్టాలంటూ పురావస్తు శాఖ(ఏఎస్‌ఐ)ని ఆదేశించింది. అవసరమైతే తవ్వకాలు కూడా జరిపేందుకు అనుమతినిచ్చింది. తదుపరి విచారణను ఆగస్టు 4వ తేదీకి వాయిదా వేసింది. అయితే, దీనిని ముస్లిం వర్గం వ్యతిరేకించింది. ఏఎస్‌ఐ సర్వే కారణంగా మసీదు కాంప్లెక్స్‌కు నష్టం జరిగే అవకాశం ఉందని తెలిపింది. వారణాసి కోర్టు ఉత్తర్వులను ఎగువ కోర్టులో సవాల్ చేస్తామని మసీదు యాజమాన్యం తరఫు లాయర్ తౌహీద్ ఖాన్ చెప్పారు.

దేశంలోని కోర్టుల్లో 6.36 లక్షల పెండింగ్ కేసులు

న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా ఉన్న వివిధ కోర్టుల్లో 6.36 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు కేంద్రం తెలిపింది. ఇందులో ఆర్థిక శాఖకు సంబంధించినవే 1.79 లక్షల వరకు ఉన్నాయంది. లోక్‌సభలో శుక్రవారం ఓ ప్రశ్నకు న్యాయశాఖ మంత్రి అర్జున్‌రాం మేఘ్‌వాల్ ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. మొత్తం 6,36,605 పెండింగ్ కేసుల్లో ఆర్థిక శాఖతో సంబంధమున్నవి 1.79 లక్షల కేసులు కాగా, రక్షణ శాఖకు సంబంధించినవి 87 వేలు, విద్యాశాఖకు సంబంధించిన 17 వేల కేసులు ఉన్నాయని వివరించారు.

పాక్‌లో ముగ్గురు హిందూ బాలికల కిడ్నాప్

కరాచీ: పాకిస్తాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో హిందూ వ్యాపారి ముగ్గురు కూతుళ్లను కిడ్నాప్ చేసి, బలవంతంగా మతం మార్చి ముగ్గురు యువకులు వారిని పెళ్లిళ్ల చేసుకున్నారు. పాకిస్తాన్ దరేవార్ ఇతేహాత్ సంస్థ చీఫ్ శివ కచ్చి ఈ విషయం తెలిపారు. ధార్కి ప్రాంతానికి చెందిన హిందూ వ్యాపారి లీలా రామ్ ముగ్గురు కూతుళ్లు చాందిని, రోష్ని, పరమేశ్ కుమారిలను కొందరు అపహరించుకుపోయారు. బలవంతంగా ఇస్లాంలోకి మార్చి అపహరించిన ముగ్గురు ముస్లింలు వారిని పెళ్లిళ్ల చేసుకున్నారని శివ కచ్చి చెప్పారు.

267 X 176

సెక్షన్ 267 కింద చర్చకు విపక్షాల పట్టు

176 కింద చర్చిద్దామంటున్న ప్రభుత్వం... దాంతో ప్రతిష్టంభన



మణిపూర్ అమానవీయ ఘటనపై పార్లమెంటులో చర్చించాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం అంగీకరించినప్పటికీ ఏ నిబంధన కింద చర్చించాలన్న దానిపై పీటముడి నెలకొంది. 267 కింద మణిపూర్‌పై రాజ్యసభలో పూర్తి స్థాయిలో చర్చ జరిపి తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తనంతట తానుగా ఒక ప్రకటన చేయాలని విపక్ష పార్టీలు పట్టుబడుతున్నాయి. దానికి బదులుగా నిబంధన 176 కింద చర్చకు సిద్ధమని కేంద్రం తేల్చి చెప్పింది. దీంతో పార్లమెంటులో వాయిదాల పర్వం కొనసాగుతోంది. ఈ రెండు నిబంధనలకున్న ప్రాథమికమైన తేడా చర్చా సమయం. నిబంధన 267 కింద సుదీర్ఘంగా చర్చించే అవకాశం ఉంటే, నిబంధన 176 కింద స్వల్ప కాలిక చర్చ మాత్రమే జరుగుతుంది.

–సాక్షి, నేషనల్ డెస్క్

రూల్ 267

■ రూల్స్ ఆఫ్ ప్రొసీజర్ అండ్ కండక్ట్ ఆఫ్ బిజినెస్ ఇన్ ది కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్ (రాజ్యసభ) ప్రకారం రూల్ 267 కింద చర్చ సుదీర్ఘంగా సాగుతుంది. ఆ రోజు ఏదైనా అంశంపై చర్చకు సభ్యులు ముందుగా నోటీసులు ఇచ్చి ఉంటే రాజ్యసభ చైర్మన్ వాటిని పూర్తిగా రద్దు చేసి దేశ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై చర్చకు అనుమతినిస్తారు. ఈ చర్చ సందర్భంగా సభ్యులు ప్రభుత్వాన్ని ఏదైనా ప్రశ్నించే అవకాశం లభిస్తుంది. చర్చ ఎన్ని గంటలు కొనసాగించాలన్న దానిపై ప్రత్యేకంగా ఎలాంటి నిబంధనలు లేవు. చర్చ జరపడానికి తీర్మానం, దానిపై ఓటింగ్ వంటి వాటికి అవకాశం ఉంటుంది.

రూల్ 176

■ స్వల్పకాలిక వ్యవధిలో ముగిసే చర్చలు 176 నిబంధన కింద జరుపుతారు. ఈ నిబంధన కింద రెండున్నర గంటలకు మించి చర్చ కొనసాగదు. ఈ నిబంధన కింద సభ్యుడెవరైనా అప్పటికప్పుడు రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు నోటీసు ఇవ్వొచ్చు. ఆ నోటీసులో చర్చకు గల కారణాలు వివరించాలి. ఆ నోటీసుకి మద్దతుగా మరో ఇద్దరు సభ్యులు సంతకాలు చేయాలి. రాజ్యసభ చైర్మన్ చర్చకు అంగీకరించిన తర్వాత ఆ రోజైనా, ఆ మర్నాడైనా చర్చకు అనుమతినిస్తారు. ఈ చర్చకు సంబంధిత మంత్రి మాత్రమే సమాధానమిస్తారు. ఇదంతా రెండున్నర గంటల్లోనే ముగిసిపోతుంది. లాంఛనంగా తీర్మానం, దానిపై ఓటింగ్ వంటివి ఉండవు.

గతంలో 267 కింద చర్చ జరిగిందా?

పార్లమెంటు రికార్డుల ప్రకారం రూల్ 267 కింద 1990 నుంచి 2016 వరకు 11 సార్లు చర్చలు జరిగాయి. 2016లో చివరిసారిగా పెద్ద నోట్ల రద్దుపై అప్పటి రాజ్యసభ చైర్మన్ హమీద్ అన్సారీ రూల్ 267 కింద చర్చకు అనుమతినిచ్చారు. ఆ తర్వాత ఇప్పటివరకు ఆ నిబంధన కింద ఏ నోటీసును చైర్మన్ అనుమతించలేదు. గత శీతాకాల సమావేశాల్లో వాస్తవాధీన రేఖ వెంబడి చైనా పెత్తనం పెరిగిపోవడం, ధరల పెరుగుదల వంటి అంశాలపై చర్చించడానికి రూల్ 267 కింద విపక్ష సభ్యులు ఇచ్చిన నోటీసుల్ని ఎనిమిది సార్లు రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కార్ తోసిపుచ్చారు. ఈ నిబంధన కింద చర్చకు అనుమతిస్తే సభలో గందరగోళం నెలకొనడం మినహాయించి సమగ్రమైన చర్చ జరిగే అవకాశం లేదని ఆయన అభిప్రాయపడుతున్నారు. రోజంతా సభా కార్యక్రమాలన్నీ రద్దు చేసి అత్యవసరంగా చర్చ జరిపే ప్రజా ప్రాముఖ్యత అంశాలు ఉండవని కొందరు అధికార పక్ష ఎంపీలు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. మణిపూర్‌పై స్వల్ప కాలిక చర్చ జరిపి కేంద్రం హోంశాఖ మంత్రి అమిత్ షాతో సమాధానమివ్వాలని అధికార పక్షం భావిస్తూ ఉంటే, ప్రతిపక్షాలు సుదీర్ఘంగా చర్చించాక ప్రధాని నరేంద్ర మోదీయే బదులివ్వాలన్న పట్టుదలతో ఉన్నాయి. ఎవరికివారే మెట్టు దిగకపోవడంతో సభా కార్యక్రమాలు తుడిచిపెట్టుకుపోతున్నాయి.

పార్లమెంట్‌లో 'మణిపూర్' రగడ

- రెండో రోజూ విపక్షాల ఆందోళన
- స్తంభించిన ఉభయసభలు



లోక్‌సభలో ప్యానెల్ స్పీకర్ రాజేంద్ర అగర్వాల్‌కు అతి సమీపంలో ప్లకార్డుల ప్రదర్శన

సాక్షి, న్యూఢిల్లీ: మణిపూర్ హింసాకాండ వరుసగా రెండో రోజు శుక్రవారం సైతం పార్లమెంట్‌ను కుదిపేసింది. ఈ అంశంపై తక్షణమే చర్చ ప్రారంభించాలంటూ విపక్షాలు పట్టుబట్టాయి. నినాదాలు, నిరసనలతో హోరెత్తించడంతో ఉభయ సభలు స్తంభించాయి. మణిపూర్ అంశంపై చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పలువురు కేంద్ర మంత్రులు ప్రకటించారు. అయినా విపక్షాలు వెనక్కి తగ్గలేదు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే నోరు విప్పాలని డిమాండ్ చేస్తూ విపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో ఎలాంటి కార్యకలాపాలు జరగకుండానే పార్లమెంట్ ఉభయ సభలు సోమవారానికి వాయిదా పడ్డాయి. మణిపూర్ అంశంపై 267 నిబంధన కింద పూర్తిస్థాయిలో చర్చించాలని, అనంతరం ప్రధానమంత్రి ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. అయితే, 176 నిబంధన కింద చర్చకు సిద్ధమని కేంద్ర ప్రభుత్వం తేల్చిచెప్పింది. ఇందుకు ప్రతిపక్ష ఎంపీలు అంగీకరించలేదు.

మణిపూర్ రక్తమోడుతోంది

మణిపూర్ అంశంపై లోక్‌సభ, రాజ్యసభలో చర్చించాలని కోరుతూ మంగళవారం ఉదయం ఉభయ సభల ప్రారంభానికి ముందే కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, బీఆర్ఎస్ సహా ఇతర పార్టీలు వాయిదా తీర్మానం నోటీసులిచ్చాయి. లోక్‌సభ ఆరంభమైన వెంటనే ప్రతిపక్ష ఎంపీలు తమ స్థానాల్లో లేచి నిల్చున్నారు. ప్లకార్డులు ప్రదర్శించారు. మణిపూర్‌కు రక్తమోడుతోందని పేర్కొన్నారు. మణిపూర్‌లో కొనసాగుతున్న దారుణ హింసపై తక్షణమే చర్చ చేపట్టాలని పట్టుబట్టారు. ప్రధాని మోదీ మౌనం వీడాలని, సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ బిగ్గరగా నినాదాలు చేశారు. శాంతించాలంటూ విపక్షాలకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పదేపదే విజ్ఞప్తి చేశారు. సభ సక్రమంగా కొనసాగడం, ప్రశ్నోత్తరాలు నిర్వహించడం మీకు ఇష్టం లేదా? అంటూ ప్రతిపక్షలపై అసహనం వ్యక్తం చేశారు. నినాదాలతో సమస్యకు పరిష్కారం లభించదని, చర్చలే అందుకు మార్గమని సూచించారు. సభా కార్యక్రమాలకు ఆటంకం కలిగించవద్దని కోరారు. అయినప్పటికీ ప్రతిపక్ష ఎంపీలు వెనక్కి తగ్గలేదు. ఈ సమయంలో మాట్లాడేందుకు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు స్పీకర్ అనుమతి ఇచ్చారు. మణిపూర్ ఘటనలపై చర్చకు సిద్ధమేనని రాజ్‌నాథ్ స్పష్టం చేశారు. ''మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించడం చాలా హేయమైన చర్య అని, ఈ ఘటన యావత్ దేశం తలదించుకునేలా చేసిందని ప్రధానమంత్రి మోదీ స్వయంగా చెప్పారు. మణిపూర్ అంశంపై చర్చించాలని ప్రభుత్వం కోరుకుంటోంది. అయినా ప్రతిపక్షాలు పార్లమెంట్‌లో చర్చ జరగకుండా గందరగోళం సృష్టిస్తున్నాయి. ఈ అంశంపై చర్చకు విపక్షాలు సీరియస్‌గా లేవని భావిస్తున్నా'' అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. అయినా ప్రతిపక్షాలు వెనక్కి తగ్గలేదు. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటల దాకా వాయిదా వేశారు. సభ పునఃప్రారంభమైన తర్వాతా గందరగోళం కొనసాగుతుండడంతో స్పీకర్ స్థానంలో ఉన్న రాజేంద్ర అగర్వాల్ సభను సోమవారానికి వాయిదా వేశారు.

రాజ్యసభలోనూ ఆందోళన

మణిపూర్ అంశంపై చర్చకు రాజ్యసభలోనూ విపక్షాలు పట్టుబట్టాయి. సభా కార్యకలాపాలను అడ్డుకున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఓబ్రియాన్ పార్లమెంట్‌లో ఉపయోగించే పదాలపై పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. మణిపూర్ సమస్యపై మాట్లాడేందుకు సభలో ప్రధానమంత్రి ఉండాలని గురువారం ప్రతిపక్షాలు కోరాయని అన్నారు. అయితే ప్రధానమంత్రి, మణిపూర్ అనే పదాలను రికార్డు నుంచి తొలగించారని సభాపతి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమయంలో విపక్షాలు ఆందోళన కొనసాగించడంతో రాజ్యసభ తొలుత మధ్యాహ్నం 2.30 గంటల దాకా, ఆ తర్వాత సోమవారానికి వాయిదా పడింది.

లోక్‌సభలో 'ఇండియా' ప్లకార్డులు

ప్రతిపక్ష కూటమి 'ఇండియా' ప్లకార్డులు తొలిసారిగా శుక్రవారం లోక్‌సభలో దర్శనమిచ్చాయి. మణిపూర్ హింసపై ప్రధాని సమాధానం చెప్పాలంటూ ఈ ప్లకార్డులను సభలో ప్రదర్శించారు. 'ఇండియా సమాధానం కోరుతోంది. మౌనాన్ని కాదు', 'పార్లమెంట్‌లో ప్రధాని మాట్లాడాలని ఇండియా కోరుతోంది' అని ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.

భారత్, శ్రీలంకల మధ్య విజన్ డాక్యుమెంట్

ప్రధాని మోదీతో శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమ్ సింఘే భేటీ

న్యూఢిల్లీ: భారత్‌లో రెండు రోజుల పర్యటనకు వచ్చిన శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమ్ సింఘే శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఇరువురు నేతల మధ్య విస్తృత స్థాయిలో చర్చలు జరిగాక ఆర్థిక భాగస్వామ్య విస్తరణకు ఒక విజన్ డాక్యుమెంట్‌ను ఆమోదించారు. ఈ మేరకు ప్రధాని మోదీ ఒక పత్రికా ప్రకటనని విడుదల చేశారు. గత ఏడాది శ్రీలంక ఆర్థిక సంక్షోభంలో మునిగిపోయి ఉన్నప్పుడు భారత్ ఒక స్నేహితుడిలా ఆదుకుందని, ఇరు దేశాల మధ్య భద్రత, అభివృద్ధి ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నందున అన్నింటిని దృష్టిలో పెట్టుకొని ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. శ్రీలంకతో ఆర్థిక భాగస్వామ్యం పెంపొందించుకోవడానికి విజన్ డాక్యుమెంట్‌ను ఆమోదించడంతో పాటు పర్యాటకం, వాణిజ్యం, విద్యుత్, ఉన్నత విద్య, నైపుణ్యాల అభివృద్ధి, అనుసంధానం వంటి రంగాల్లో పరస్పరం సహకరించుకోవడానికి ఇరు దేశాలు అంగీకరించాయి. నావికా బలగం, వైమానిక దళం, ఇంధనం, ప్రజల మధ్య అనుసంధానం వంటివి కూడా బలోపేతం చేసే దిశగా ఇరు దేశాలు అడుగులు వేస్తున్నాయి. మరోవైపు శ్రీలంకలో తమిళుల ఆకాంక్షలను తీర్చడానికి సహకరించాలని ప్రధాని మోదీ విక్రమ్ సింఘేను కోరారు. మత్స్యకారుల అంశంలో మానవీయ కోణంలో ఆలోచిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



ఢిల్లీలో ప్రధాని మోదీతో విక్రమ్ సింఘే కరచాలనం

30న పీఎస్ఎల్వీ సీ-56 ప్రయోగం

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని మొదటి ప్రయోగవేదిక నుంచి ఈనెల 30న ఉదయం 6.30 గంటలకు పీఎస్ఎల్వీ సీ-56 ప్రయోగాన్ని నిర్వహించనున్నామని షార్ వర్గాలు తెలిపాయి. ఈ ప్రయోగాన్ని ఈనెల 23న నిర్వహించాల్సి ఉంది. చంద్రయాన్-3 మిషన్‌ను లూనార్ ఆర్బిట్‌లోకి పంపే ప్రక్రియలో ఇస్రో శాస్త్రవేత్తలంతా నిమగ్నమై ఉండడంతో ఈ ప్రయోగాన్ని 30కి పొడిగించారు. ఈ ప్రయోగంలో 422 కిలోలు బరువు కలిగిన సింగపూర్‌కు చెందిన ఏడు ఉపగ్రహాలను రోదసీలోకి పంపనున్నారు. 351 కిలోల డీఎస్-ఎస్ఏఆర్ (షార్ట్ ఫర్ సింథటిక్ ఆపర్చర్ రాడార్) అనే ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్, 23.58 కిలోలు బరువు కలిగిన ఆర్కేడ్, 23 కేజీల వెలాక్స్-ఏఎం, 12.8 కిలోలు బరువు కలిగిన ఓఆర్‌బీ-12 స్ట్రైడర్, 3.84 కేజీల బరువున్న గలాసియా-2, 4.1 కేజీల బరువైన స్కూబ్-11, 3.05 కేజీల నులయన్ అనే ఉపగ్రహాలను లోయర్ ఎర్త్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టనున్నారు. ఈ ప్రయోగం పూర్తిగా వాణిజ్యపరమైంది కావడం విశేషం.

హత్యలు, లూటీలు, గృహ దహనాలు

- మణిపూర్‌లోని బి.ఫైనోమ్ గ్రామంలో రెచ్చిపోయిన అల్లరిమూక
- మహిళలను నగ్నంగా ఊరేగించడానికి ముందు రాక్షసకాండ
- మే 4న జరిగిన దారుణంపై జూన్ 21న ఎఫ్ఐఆర్ నమోదు



నిందితుడి ఇంటికి నిప్పుపెడుతున్న స్థానికులు

ఇంఫాల్: మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళల పట్ల అల్లరిమూక సాగించిన అమానుష కాండ దేశవ్యాప్తంగా సంచలనాత్మకంగా మారింది. మే 4న జరిగిన ఈ దురాగతం సోషల్ మీడియా ద్వారా ఈ నెల 19న బాహ్య ప్రపంచానికి తెలిసింది. కాంగ్‌పోక్పి జిల్లాలోని బి.ఫైనోమ్ గ్రామంలో ఆ రోజు దాదాపు వెయ్యి మందితో కూడిన అల్లరిమూక పెను విధ్వంసమే సృష్టించినట్లు ఎఫ్ఐఆర్‌ను బట్టి తెలుస్తోంది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో పోలీసుల కళ్లెదుటే ఈ దారుణం చోటుచేసుకోవడం గమనార్హం. మే 4న జరిగిన ఈ దురాగతంపై జూన్ 21న సైకుల్ పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదయ్యింది. మహిళలను నగ్నంగా ఊరేగించడానికి ముందు సాయుధ దుండగులు గ్రామంలో రాక్షసంగా వ్యవహరించారు. తుపాకులు ధరించి, ఊళ్లోకి ప్రవేశించారు. ఇళ్లను లూటీ చేశారు. నగదు, ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆహార ధాన్యాలు దోచుకున్నారు. పశువులను సైతం లాక్కెళ్లారు. తర్వాత ఇళ్లకు నిప్పుపెట్టారు. వాహనాలను ధ్వంసం చేశారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. ఊళ్లో ఈ ఘోరాన్ని కళ్లారా చూసిన ఐదుగురు వ్యక్తులు రక్షణ కోసం పోలీసుల వద్దకు చేరుకున్నారు. అక్కడికి వచ్చిన ముష్కరులు ఆ ఐదుగురిపై దాడి చేశారు. ఇద్దరు గిరిజన మహిళలను అపహరించి, నగ్నంగా మార్చారు. ఊరేగింపుగా పొలాల్లోకి తీసుకెళ్లారు. వారి శరీర భాగాలను తడుముతూ, సెల్‌ఫోన్లలో చిత్రీకరిస్తూ రాక్షసానందం పొందారు. ఓ మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. 21 ఏళ్ల బాధిత యువతి సోదరుడిని కొట్టి చంపారు. తన సోదరిని అల్లరిమూక నుంచి కాపాడుకొనేందుకు అతడు ప్రయత్నించడమే ఇందుకు కారణం. దుండగులు తొలుత వారి తండ్రిని హత్య చేశారు.

గిరిజనుడి తల నరికివేత

మణిపూర్‌లో పోలీసుల సమక్షంలోనే దాదాపు వెయ్యి మంది సాయుధ ముష్కరులు ఇద్దరు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసింది. మణిపూర్‌లో జరిగిన మరో దారుణం తాజాగా వెలుగులోకి వచ్చింది. కుకీ గిరిజన తెగకు చెందిన డేవిడ్ థీక్ అనే వ్యక్తి తలను నరికేసి, చేతితో తీసుకెళ్తున్న భయానక వీడియో సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యింది. బిష్ణుపూర్ జిల్లాలో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఈ నెల 2వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు జరిగిన ఘర్షణలో డేవిడ్ థీక్‌ను ప్రత్యర్థి వర్గం హత్య చేసింది. ఈ ఘర్షణలో డేవిడ్‌తోపాటు మొత్తం ముగ్గురు చనిపోయారు. డేవిడ్ తలను వెదురు కర్రలతో చేసిన కంచెపై పడేసిన దృశ్యం వీడియోలో కనిపించింది.

లేఖలు రాసినా అధికారులు స్పందించలేదు

జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మ వెల్లడి

న్యూఢిల్లీ: మణిపూర్‌లో మహిళలపై హింసను అరికట్టడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ గత మూడు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని మూడుసార్లు కోరారని, లేఖలు రాశానని, అయినా స్పందన రాలేదని జాతీయ మహిళా కమిషన్(ఎన్‌సీడబ్ల్యూ) చైర్‌పర్సన్ రేఖా శర్మ శుక్రవారం చెప్పారు. మణిపూర్‌లో మహిళల పట్ల జరుగుతున్న దురాగతాలపై తమకు ఎన్నో ఫిర్యాదులు అందాయని తెలిపారు. అయితే, ఇద్దరు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించడంపై జూన్ 12న ఎన్‌సీడబ్ల్యూకు ఫిర్యాదు అందిందని, అయినా చర్యలు తీసుకోలేదంటూ వచ్చిన వార్తలను ఆమె ఖండించారు. ఆ దారుణ ఘటనపై తమకు సమాచారం లేదని వెల్లడించారు. మే 4న జరిగిన ఘోర సంఘటనను సుమోటోగా విచారణకు స్వీకరించామని తెలిపారు. సంబంధిత అధికారుల నుంచి వివరణ కోరామని పేర్కొన్నారు. మహిళలపై అకృత్యాలను ఆపాలంటూ మణిపూర్ అధికారులకు తాను రాసిన లేఖలను రేఖాశర్మ బయటపెట్టారు. మే 18న, 29న, జూన్ 19న ఆమె ఈ లేఖలు రాశారు.

11 రోజులపాటు పోలీసు కస్టడీకి నలుగురు నిందితులు

మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన కేసులో ఇప్పటివరకు నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టగా, నలుగురు నిందితులను 11 రోజులపాటు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు థౌబాల్ జిల్లాలోని వాంగ్‌జింగ్ గ్రామంలో ఇంకా అరెస్టు కాని ఓ నిందితుడి ఇంటిని స్థానికులు శుక్రవారం మధ్యాహ్నం ధ్వంసం చేసి నిప్పుపెట్టారు. ప్రస్తుతం ఆ నిందితుడు పరారీలో ఉన్నాడు.

బాధితురాలు మాజీ సైనికుడి భార్య

యుద్ధంలో పాల్గొని దేశాన్ని కాపాడాను గానీ మణిపూర్‌లో ముష్కరమూక నుంచి తన భార్యను రక్షించుకోలేకపోయానని మాజీ సైనికుడొకరు ఆవేదన వ్యక్తం చేశాడు. అతడు అస్సాం రెజిమెంట్‌లో సుబేదార్‌గా సేవలందించాడు. మే 4న మణిపూర్‌లో అల్లరిమూక నగ్నంగా ఊరేగించిన ఇద్దరు గిరిజన మహిళల్లో ఒక బాధితురాలు తన భార్యేనని చెప్పాడు. తాను కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నానని, పాకిస్తాన్ సైన్యంతో పోరాడానని తెలిపాడు. మే 4న జరిగిన భయానక సంఘటనను గుర్తుచేసుకున్నాడు. తన భార్యతోపాటు ఇంటిని, తోటి గ్రామస్తులను రక్షించలేకపోయానని కన్నీటి పర్యంతమయ్యాడు.

మోదీ ఇంటిపేరు వ్యాఖ్యల కేసు

రాహుల్ గాంధీ పిటిషన్‌పై విచారణ ఆగస్టు 4కి వాయిదా



న్యూఢిల్లీ: మోదీ ఇంటి పేరు వ్యాఖ్యలపై పరువు నష్టం కేసులో తనకి పడిన రెండేళ్ల జైలు శిక్షను నిలిపివేయడానికి నిరాకరించిన హైకోర్టు తీర్పుని సవాల్ చేస్తూ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం విచారించింది. ఈ కేసులో ప్రతివాదులైన గుజరాత్ మాజీ మంత్రి పూర్ణేశ్ మోదీ, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వాలను నోటీసులు పంపింది. దీనిపై రెండు వారాల్లోగా స్పందించాలని ఆదేశించిన జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ పి.కె. మిశ్రాలతో కూడిన సుప్రీం బెంచ్ తదుపరి విచారణను ఆగస్టు 4కి వాయిదా వేసింది. రాహుల్ గాంధీ తరపున కోర్టుకు హాజరైన సీనియర్ అడ్వొకేట్ అభిషేక్ సింఘ్వి గత 111 రోజులుగా రాహుల్ ఎంతో వ్యధ అనుభవిస్తున్నారని, ఇప్పటికే ఒక పార్లమెంట్ సెషన్‌కు దూరమయ్యారని కోర్టుకు చెప్పారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటు పడడంతో ఎంపీగా ఆయన కోల్పోయిన వయనాడ్ నియోజకవర్గం ఎన్నికల నోటిఫికేషన్ ఏ క్షణంలోనైనా రావచ్చునని, అందుకే త్వరితగతిన ఈ కేసుని విచారించాలని కోరారు.

సోషల్ మీడియా యాక్టివ్ యూజర్లు 500 కోట్లు

న్యూఢిల్లీ: సోషల్ మీడియా వినియోగదారుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ఇంటర్నెట్ సదుపాయం అందరికీ అందుబాటులోకి రావడంతో ప్రపంచవ్యాప్తంగా 500 కోట్ల మంది సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటున్నారని తాజా అధ్యయనంలో వెల్లడైంది. అంటే ప్రపంచ జనాభాలో 64% మంది సామాజిక మాధ్యమాల్లో అత్యధికంగా కాలం గడుపుతున్నారు. గత ఏడాదితో పోల్చి చూస్తే వినియోగదారులు 3.7% పెరిగినట్టు డిజిటల్ అడ్వైజరీ సంస్థ కెపియోస్ అధ్యయనంలో వెల్లడైంది.

- తూర్పు, మధ్య ఆఫ్రికా దేశాల్లో సోషల్ మీడియా యూజర్ల సంఖ్య తక్కువగా ఉంది. ప్రతీ 11 మందిలో ఒక్కరికే సోషల్ మీడియాలో ఖాతాలున్నాయి.
- భారత్‌లో ప్రతీ ముగ్గురిలో ఒకరు సోషల్ మీడియాలో చురుగ్గా ఉన్నారు
- రోజుకి సగటున 2 గంటల 26 నిమిషాలు సోషల్ మీడియాలో గడుపుతున్నారు
- బ్రెజిల్ వాసులు అత్యధికంగా సగటున 3 గంటల 49 నిమిషాలు సోషల్ మీడియాలో ఉంటే, జపాన్ వాసులు అత్యంత తక్కువగా గంటలోపు మాత్రమే సోషల్ మీడియాని చూస్తున్నారు.
- సోషల్ మీడియా యూజర్లకి దాదాపుగా ఏడు యాప్స్‌లో ఖాతాలుంటున్నాయి. వీటిలో వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ట్విటర్ ప్రధానమైనవి.

బీజేపీని ఇండియా ఓడించడం ఖాయం

నేను ఎలాంటి పదవినీ ఆశించడం లేదు: మమతా బెనర్జీ



కోల్‌కతా: 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా (ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్, ఇంక్లూజివ్ అలయెన్స్) కూటమి బీజేపీని తప్పక ఓడిస్తుందని టీఎంసీ అధినేత్రి, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. అమరుల వార్షిక దినోత్సవ ర్యాలీలో ఆమె ప్రసంగించారు. 'బీజేపీని ఓడించేందుకు 26 రాజకీయ పార్టీలు ఏకం కావడం సంతోషంగా ఉంది. వారందరికీ ధన్యవాదాలు. ఇకపై బీజేపీ హారేగా.. భారత్ జీతేగా అనేదే మా నినాదం. మా భవిష్యత్ కార్యక్రమాలన్నీ ఇండియా వేదికగానే జరుగుతాయి'అని ఆమె స్పష్టం చేశారు. కూటమి గెలుపుపైనే తన దృష్టంతా ఉందని, ఏ పదవినీ ఆశించడం లేదని తెలిపారు. దేశంలో శాంతిని, బీజేపీ ఓటమినే తాము కోరుకుంటున్నామన్నారు. ప్రజలు బీజేపీని అధికారం నుంచి తొలగించాల్సిన సమయం ఆసన్నమైందని మమత తెలిపారు. 2024లోనూ బీజేపీయే మళ్లీ అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్యం ఉండదన్న విషయం మనందరం గుర్తుంచుకోవాలని చెప్పారు. మణిపూర్ సంక్షోభంపై ఆమె తీవ్రంగా స్పందించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న 'బేటీ బచావో' మన కూతుళ్లను కాపాడుకుందాం పథకం ఇప్పుడు 'బేటీ జలావో' మన కూతుళ్లను కాల్చివేద్దాంగా మారిందన్నారు. ప్రతిపక్ష కూటమిలోని నేతలంతా మణిపూర్ ప్రజలకు అండగా నిలుస్తారని చెప్పారు.

400 కిలోల టమాటాలు చోరీ

పుణే: టమాటాల ధర ఆకాశాన్నంటుతున్న వేళ ఈ కూరగాయ దొంగతనాలు కూడా పెరుగుతున్నాయి. మహారాష్ట్రలోని పుణేకు చెందిన ఓ రైతు ఇంట్లో ఉంచిన నాలుగు క్వింటాళ్ల టమాటాలను దొంగలు ఎత్తుకుపోయారు. ఈ మేరకు షిరూర్ తహశీల్‌కు చెందిన రైతు అరుణ్ ధోమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం తన పొలంలో పండించిన 400 కిలోల టమాటాలను కోసి 20 క్రేట్లలో ఇంటికి తీసుకువచ్చాడు. తెల్లారాక చూస్తే అవి కనిపించలేదు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం టమాటా కిలో ధర రూ.100 నుంచి రూ.200 వరకు పలుకుతోంది. ఇటీవలి పుణేకే చెందిన ఓ రైతు తను పండించిన 18 వేల క్రేట్ల టమాటాలను రూ.3 కోట్లకు అమ్మి వార్తల్లోకెక్కిన విషయం తెలిసిందే.

ఉప ఎన్నికల్లో రిషి సునాక్‌కు నిరాశ

లండన్: యూకేలో తాజాగా జరిగిన ఉప ఎన్నికలు భారత సంతతికి చెందిన ప్రధానమంత్రి రిషి సునాక్‌కు నిరాశను మిగిల్చాయి. ఎన్నికలు నిర్వహించిన మూడు సీట్లలో రెండింటిని అధికార కన్జర్వేటివ్ పార్టీ కోల్పోయింది. అతికష్టమ్మీద మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్‌కు చెందిన ఉక్స్‌బ్రిడ్జి అండ్ సౌత్ రుయిస్లిప్ స్థానాన్ని నిలబెట్టుకోగలిగింది. పార్టీ గేట్ కుంభకోణం ఆరోపణలపై బోరిస్ జాన్సన్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది జాతీయ ఎన్నికలు జరగనున్న వేళ ఈ ఫలితాలు అధికార పార్టీలో కలవరం కలిగిస్తున్నాయి. ఉత్తర ఇంగ్లండ్‌లోని సెల్బీ అండ్ ఎయిన్‌స్టీ నియోజకవర్గంలో 20 వేల మెజారిటీతో ప్రతిపక్ష లేబర్ పార్టీకి చెందిన 25 ఏళ్ల కీర్ మాథెర్ రికార్డు విజయం సాధించారు. బోరిస్ జాన్సన్ సన్నిహితుడు నిగెల్ ఆడమ్స్ రాజీనామాతో ఈ సీటుకు ఎన్నిక జరిగింది. సోమర్సెట్ అండ్ ఫ్రోమ్ ఉప ఎన్నికలో లిబరల్ డెమోక్రాట్ సారా డైక్ 21 వేలకు పైగా ఓట్లతో విజయం సాధించారు.

కార్మికుల్లో నైపుణ్యాలు పెంచాలి

- నూతన సాంకేతికతల వినియోగంలో శిక్షణ ఇవ్వాలి
- జీ–20 కార్మిక మంత్రుల సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ



ఇండోర్: అత్యాధునిక సాంకేతికతలను వినియోగించడంలో ఉద్యోగులకు, కార్మికులకు తగిన శిక్షణ ఇవ్వాలని, వారిలో నైపుణ్యాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. కొత్త తరం కార్మికులకు కొత్త తరం విధానాలను అందుబాటులోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. శుక్రవారం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జీ-20 దేశాల కార్మిక, ఉద్యోగ కల్పన శాఖ మంత్రుల సదస్సులో ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా భవిష్యత్తులో మొబైల్ వర్క్‌ఫోర్స్ అనేది వాస్తవ రూపం దాల్చబోతోందని ఉద్ఘాటించారు. ప్రస్తుతం కొనసాగుతున్న నాలుగో పారిశ్రామిక విప్లవ హయాంలో ఉద్యోగాల సృష్టికి టెక్నాలజీకి ఒక ముఖ్యమైన సాధనంగా మారిందని గుర్తు చేశారు. నూతన ఉద్యోగాల కల్పనలో ఇకపైకూడా టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. భవిష్యత్తులో ఉద్యోగులకు, కార్మికులకు స్కిల్లింగ్, రీ-స్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్ అనేది కీలకం కాబోతోందని అభిప్రాయపడ్డారు. ఆధునిక సాంకేతికతల వినియోగంలో నైపుణ్యాలు తప్పనిసరిగా పెంచుకోవాలని సూచించారు. వర్క్‌ఫోర్స్‌ను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఇందులో భాగంగా భారత్‌లో 'స్కిల్ ఇండియా మిషన్' ప్రారంభించామని తెలియజేశారు.

నైపుణ్యాలను పంచుకోవాలి

నైపుణ్యాలను అభివృద్ధి చేయడంతోపాటు వాటిని ఇతర దేశాలతో పంచుకొనే విషయంలో జీ-20 దేశాలు చొరవ తీసుకోవాలని ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు. దీనివల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. నైపుణ్యాల సమాచారం ఇచ్చిపుచ్చుకోవాలన్నారు. భారత్‌లో కోవిడ్-19 వ్యాప్తి ఉధృతంగా ఉన్న సమయంలో ఫ్రంట్‌లైన్ ఆరోగ్య సిబ్బంది, ఇతర ఉద్యోగులు, కార్మికులు ఎనలేని సేవలు అందించారని, వారు తమ నైపుణ్యాలను, అంకితభావాన్ని ప్రదర్శించారని మోదీ కొనియాడారు. సేవా సంస్కృతిని చాటిచెప్పారని, సాటి మనుషుల పట్ల కరుణ కురిపించారని ప్రశంసించారు. నైపుణ్యం కలిగిన కార్మికులను ప్రపంచానికి అందించగల అతిపెద్ద దేశంగా ఎదిగే సామర్థ్యం భారత్‌కు ఉందని స్పష్టం చేశారు. సాంకేతికతలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని, టెక్నాలజీ ఆధారిత ఉద్యోగాలను సృష్టించడంలో భారత్‌కు అపార అనుభవం ఉందని వెల్లడించారు. నైపుణ్యాభివృద్ధిపై తాము ప్రత్యేకంగా దృష్టి పెట్టామని చెప్పారు. కౌశల్ వికాస్ యోజన కింద కృత్రిమ మేధ, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డ్రోన్స్ వంటి రంగాల్లో నైపుణ్యాలు పెంచుతున్నామని పేర్కొన్నారు. ఈ-శ్రమ్ పోర్టల్‌లో 21.8 కోట్ల మంది కార్మికులు నమోదయ్యారని మోదీ తెలిపారు.

క్లుప్తంగా...

ఏపీ ఆగ్రోస్ ఇన్‌చార్జి ఎండీగా శేఖర్‌బాబు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్ఏఐడీసీఎల్) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా జి.శేఖర్‌బాబుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారం వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాల కృష్ణ ద్వివేది ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం శేఖర్‌బాబు ఏపీ స్టేట్ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వీసీ, ఎండీగా పని చేస్తున్నారు. ఇప్పటి వరకు ఏపీఎస్ఏఐడీసీఎల్ వీసీ, ఎండీగా కొనసాగిన ఎస్.కృష్ణమూర్తి అభ్యర్థన మేరకు ఆయన్ని ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేస్తూ.. రాష్ట్ర కాపు సంక్షేమ, అభివృద్ధి సంస్థ ఎండీగా నియమించారు.

మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కేపై కేసు కొట్టివేత

మంగళగిరి: రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలంటూ 2015లో గుంటూరు జిల్లా మంగళగిరిలో ధర్నా నిర్వహించిన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)తో పాటు మరో 13 మందిపై నమోదు చేసిన కేసును శుక్రవారం విజయవాడ ఎమ్మెల్యే, ఎంపీల ప్రత్యేక కోర్టు కొట్టివేసింది. ప్రత్యేక హోదా సాధన కోసం ఎమ్మెల్యే ఆర్కే ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి ధర్నా నిర్వహించారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక హోదా కోసం ధర్నా చేసిన ఎమ్మెల్యే ఆర్కేతో పాటు నాయకులు మున్నెడ్డి శ్రీనివాసరెడ్డి, బండారు సాయిబాబు, దోనపాటి నాగేశ్వరరావు, మొగిలి మధు, పచ్చల శ్యామ్‌బాబు, ఎండీ ఫిరోజ్, షేక్ హస్సన్, కుర్రా పిచ్చియ్య, కట్టిపోగు చక్రవర్తి, మువ్వా బాలకృష్ణారెడ్డి, మురికిపూడి విజయ్ వర్ధన్, తురకా గోపిలపై అక్రమ కేసులు బనాయించింది. ఈ కేసు విచారణను మంగళగిరి కోర్టు విజయవాడ ఎమ్మెల్యే, ఎంపీల ప్రత్యేక కోర్టుకు బదలాయించింది. శుక్రవారం తుది విచారణ జరగ్గా ఎమ్మెల్యే ఆర్కేతో పాటు 13 మందిపై కేసును కోర్టు కొట్టివేసింది.

రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏం చేశావ్ పవన్?

- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు



సాక్షి, అమరావతి: రాష్ట్రం కోసం త్యాగం చేస్తానంటూ గొప్పలు చెబుతున్న పవన్ కళ్యాణ్... అసలు రాష్ట్రం కోసం ఇప్పటి వరకు ఏం చేశారో చెప్పాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పవన్ పార్టీ పెట్టింది... పాలేరుతనం చేస్తున్నది... అంతా చంద్రబాబు ప్రయోజనాల కోసమేనని, రాష్ట్రం కోసం కాదని ఆయన ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఎన్నికల్లో ఓడించి ఇంటికి పంపిస్తా... జైలుకు పంపిస్తా... అంటూ పవన్ చేసిన వ్యాఖ్యలను యోనారాజు ఖండించారు. సీఎం వైఎస్ జగన్‌పై ఇష్టానుసారం ఏకవచనంతో నోరుపారేసుకుంటే సహించేదిలేదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రజలకు మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కొనే సత్తా లేక ప్యాకేజీ తీసుకుని పెత్తందారులతో కలిసి పవన్ కుట్ర రాజకీయాలకు తెరతీశాడని ఆరోపించారు.

కోర్టులో కులవాదులకు భంగపాటు తప్పదు

- రిలే దీక్షలో బహుజన నేతలు



తాడికొండ: అమరావతి ఆర్–5 జోన్‌లో పేదల ఇళ్ల నిర్మాణాలను వ్యతిరేకిస్తూ కులవాదులు వేసిన కేసులో మరోసారి భంగపాటు తప్పదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,027వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును సైతం వ్యతిరేకిస్తూ పేదలను ఈ ప్రాంతం నుంచి తరిమేయాలంటూ తప్పుడు కేసులు వేసిన వారికి తగిన బుద్ధి రావాలంటే వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నేతలు పులి దాసు, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, కారుమూరి పుష్పరాజ్, ఎస్.జోషి పాల్గొన్నారు.

బీజేపీతో పవన్ పొత్తు సిగ్గుచేటు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ) : ఎంతోమంది త్యాగాలు చేసి ఏర్పాటు చేసుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర బీజేపీ ప్రభుత్వం అమ్మేస్తుంటే.. ఆ పార్టీతో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పొత్తులు పెట్టుకోవడం సిగ్గుచేటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీవీ శ్రీనివాసరావు విమర్శించారు. ఇదే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో ఏడాది క్రితం పవన్ కళ్యాణ్..జనసైనికులతో స్టీల్‌ప్లాంట్ వద్ద పెద్ద ఎత్తున పాదయాత్ర చేసి.. ఇప్పుడు బీజేపీ పంచన చేరడం విడ్డూరంగా ఉందన్నారు. జగదాంబ జంక్షన్ సమీపంలోని నండూరి ప్రసాదరావు భవన్‌లో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. పవన్‌వి నిలకడలేని మాటలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా , పోలవరం నిధులను కేంద్రం ఇవ్వలేదన్నారు.

పర్యావరణ హితులు.. మన డ్వాక్రా మహిళలు

మొక్కల పెంపకంలో మహిళలకు పాత్ర • జాతీయ రహదారుల వెంబడి చెట్ల పెంపకం అప్పగింత

- తొలుత ప్రకాశం జిల్లాలో ప్రాజెక్టు
- రూ.1.57 కోట్ల ప్రాజెక్టులో 761 గ్రూపులకు భాగస్వామ్యం
- 7,610 మందికి ఉపాధి, ఆర్థిక ప్రయోజనాలు
- జాతీయ రహదారుల వెంబడి వ్యాపారావకాశాలూ వారికే
- సీఎం వైఎస్ జగన్ సంకల్పం
- ఎన్‌హెచ్ఏఐతో సంప్రదింపులు జరపాలని అధికారులకు ఆదేశం



రహదారి వెంట మొక్క నాటుతున్న డ్వాక్రా మహిళలు

సాక్షి ప్రత్యేక ప్రతినిధి నాగా వెంకటరెడ్డి

రాష్ట్రంలోని మహిళల అభ్యున్నతి, సాధికారతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పలు చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా డ్వాక్రా సంఘాలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తూ వారి కుటుంబాల ఆర్థిక ఉన్నతికి కృషి చేస్తున్నారు. ఇప్పుడు డ్వాక్రా సంఘాల మహిళలను పర్యావరణ హితులుగా కూడా మారుస్తున్నారు. జాతీయ రహదారుల వెంబడి మొక్కల పెంపకంలో వీరిని భాగస్వాములను చేస్తున్నారు. టోల్ ప్లాజాలు, నగర శివార్లలో వ్యాపార అవకాశాలను ఏ మేరకు కల్పించవచ్చనేది కూడా పరిశీలించాలని సీఎం జగన్ సెర్ప్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమాల ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు మహిళలకు ఆర్థికంగా కూడా తోడ్పాటు లభిస్తుంది. స్వయం సమృద్ధికి బాటలు వేసుకోనున్నారు. మహిళల జీవన ప్రమాణాలు కూడా పెంపొందుతాయి.

రూ.1.57 కోట్ల ప్రాజెక్టులో 761 సంఘాల భాగస్వామ్యం

నేషనల్ రూరల్ లైవ్లీ మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం), నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) మధ్య గత ఏడాది కుదిరిన ఎంవోయూ ప్రకారం రాష్ట్ర పరిధిలోని జాతీయ రహదారుల వెంబడి మొక్కలు నాటి వాటిని అయిదేళ్ల పాటు రక్షించి ఎన్‌హెచ్ఏఐకి అప్పజెప్పాలి. ఈ బాధ్యతను గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని 'సెర్ప్' తీసుకుంది. తొలుత ఎన్‌హెచ్– 544డి పరిధిలోని గిద్దలూరు – వినుకొండ సెక్షన్‌లో ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలంలోని కేశినేనిపల్లి– ఉమ్మడివరం గ్రామాల మధ్య ఉన్న 17.74 కిలోమీటర్ల రోడ్డుకు ఇరువైపులా (మొత్తం 35.48 కి.మీ) 5,907 మొక్కలు నాటాలి. గుంతలు తవ్వకం, మొక్కలు కొని నాటడం , కంచె ఏర్పాటు, నీటి సరఫరా, ఎరువులు వేయడం, అయిదేళ్ల పాటు పెంచే బాధ్యతలను త్రిపురాంతకం, పెదారవీడు మండలాల్లోని 21 గ్రామాలకు చెందిన 761 డ్వాక్రా సంఘాల్లోని 7,610 మంది సభ్యులకు 'సెర్ప్' అప్పగించింది. ఇందుకోసం ఎన్‌హెచ్ఏఐ అయిదేళ్లకు రూ.1.57 కోట్లు ఇస్తుంది. త్రిపురాంతకం, పెదారవీడు మండల సమాఖ్యలు, ఆరు గ్రామైక్య సంఘాలు ఈ ప్రాజెక్టు పర్యవేక్షణ బాధ్యతలను నిర్వర్తించనున్నాయి.

ఏడాదిలో 3 నెలలు ఉపాధి.. దినసరి వేతనం రూ.400

ప్రాజెక్టులో భాగస్వాములవుతున్న ఒక్కో డ్వాక్రా సభ్యురాలికి ఏడాదికి సుమారు మూడు నెలలు ఉపాధి లభిస్తుంది. సగటున దినసరి వేతనం రూ.400 వస్తుంది. తద్వారా ఏడాదికి రూ.36 వేలు చొప్పున అయిదేళ్లలో రూ.1.80 లక్షలు సమకూరుతుందని. ఈ స్వయం సహాయక సంఘాలకు గ్రామైక్య సంఘాలు నేతృత్వం వహిస్తాయి. డీఆర్‌డీఏ, సెర్ప్ ఉన్నతాధికారుల మార్గదర్శనం చేస్తారు. కాంట్రాక్టు వ్యవస్థను దరిజేరనీయకుండా డ్వాక్రా సంఘాలే నీటి సరఫరాకు ట్యాంకర్లు, గుంతలు తవ్వేందుకు యంత్ర పరికరాలు, ఎరువులు సమకూర్చే బాధ్యతలను తీసుకున్నందున వ్యాపార వ్యవహారాలలోనూ వారికి అనుభవం వస్తుంది. ఎన్‌హెచ్ఏఐ నిర్దేశించిన మేరకు 5,907 బొగోనియా, స్పాథోడియా, మిల్లింగ్ టోనియా, మారేడు, పొగడ మొక్కలను ప్రభుత్వ నర్సరీలలోనే డ్వాక్రా సంఘాలు కొనుగోలు చేస్తున్నాయి.

పచ్చదనం పెంపునకు ప్రణాళిక

రాష్ట్రంలో పచ్చదనం పెంపునకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. జాతీయ స్థాయిలో 24.62 శాతం గ్రీనరీ ఉండగా రాష్ట్రంలో 22.86 ఉంది. ఈ వర్షాకాలంలో గ్రామీణ ప్రాంతాల్లోని కొండలపై కోటి మొక్కలు పెంచాలన్నది గ్రామీణాభివృద్ధి శాఖ లక్ష్యం. 660 మండలాల్లోని వెయ్యి కొండలనైనా ఎంపిక చేసుకుని ఒక్కో కొండపై కనీసం 10 వేల మొక్కల పెంపకం చేపట్టనుంది. సీడ్ బాల్స్ విధానంలో ఫలాలనిచ్చే ఉసిరి, రేగు, సీతాఫలం, వెలగ, నీడనిచ్చే వేప, కానుగ తదితర మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

ఉపాధి హామీలో మొక్కల పెంపకం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మొక్కల పెంపకం ఓ ముఖ్యాంశం. పొదుపు సంఘాల మహిళలు ఇందులో క్రియాశీలకంగా ఉన్నారు. రాష్ట్ర , జిల్లా, గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్ల వెంబడి మొక్కలు నాటి పెంచే ప్రక్రియను డ్వాక్రా సభ్యులు చేపట్టిన సంగతి తెలిసిందే. రానున్న కాలంలో జాతీయ రహదారుల వెంబడి చెట్ల పెంపకంలోనూ భాగస్వాములు కానున్నారు.

వ్యాపార అవకాశాలపైనా దృష్టి

గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని 8.64 లక్షలకు పైగా స్వయం సహాయక సంఘాలలో దాదాపు 90 లక్షల మంది సభ్యులు ఉన్నారు. పట్టణ ప్రాంతాల్లోని మెప్మాలో లక్ష గ్రూపులు, పది లక్షల మంది వరకు సభ్యులు ఉన్నారు. 2014 నాటికి రాష్ట్రంలో 4,193 కిలోమీటర్ల జాతీయ రహదారులు ఉండగా 2023 నాటికి 8,744 కిలోమీటర్లకు పెరుగుతాయని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తాజాగా తిరుపతిలో ప్రకటించారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ చొరవ, వేగం వల్లే ఇది సాధ్యమవుతోందన్నారు. ఈ జాతీయ రహదారులను ఉపయోగించుకొంటూ మహిళలకు పలు వ్యాపార అవకాశాలివ్వాలన్నది సీఎం జగన్ సంకల్పం. ఈమేరకు అధికారులకు సీఎం జగన్ పలు సూచనలు చేశారు. రహదారుల టోల్‌ప్లాజాలు, ప్రధాన కూడళ్లు, నగర శివార్లలోని ఎన్‌హెచ్ఏఐ స్థలాల్లో స్థానిక డ్వాక్రా సంఘాలతో ఫుడ్ ప్లాజాలు, అవుట్‌లెట్‌ల ఏర్పాటు, గ్రామీణ ఉత్పత్తుల విక్రయాలకు స్టాళ్ల ఏర్పాటు చేయించాలని, ఇందుకోసం ఎన్‌హెచ్ఏఐతో సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సూచించారని సెర్ప్ సీఈవో ఎండి ఇంతియాజ్ 'సాక్షి'కి తెలిపారు.



రైల్వే ప్రయాణికులకు ఎకానమీ మీల్స్

- సాధారణ మీల్స్ రూ.20, కాంబో మీల్స్ రూ.50
- ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో కౌంటర్ల ద్వారా సరఫరా



విజయవాడ స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌పై ఏర్పాటు చేసిన ఎకానమీ మీల్స్ కౌంటర్

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): సాధారణ రైలు ప్రయాణికులకు తక్కువ ధరకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించేందుకు రైల్వేశాఖ ఎకానమీ మీల్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. జనరల్ బోగీలలోని ప్రయాణికులకు సరసమైన ధరకు భోజనం అందించేందుకు సాధారణ మీల్స్ రూ.20, కాంబో మీల్స్ రూ.50కే ఇవ్వనుంది. ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కిచెన్ యూనిట్స్, జనాహార్ ఎక్స్‌టెన్షన్ కౌంటర్ల ద్వారా సరఫరా చేయనుంది. జనరల్ కోచ్‌ల దగ్గర ప్లాట్‌ఫామ్‌పై ఈ సర్వీసు కౌంటర్‌లను ఏర్పాటు చేసి ప్రయాణికులకు అందించనుంది. ఈ సర్వీసులను ఏర్పాటు చేసేందుకు దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో నాలుగు స్టేషన్‌లను రైల్వేశాఖ ఎంపిక చేయగా, అందులో హైదరాబాద్, రేణిగుంట, గుంతకల్లు స్టేషన్‌లు కూడా ఉన్నాయి. ఈ సందర్భంగా విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్ మాట్లాడుతూ రైలు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు భారతీయ రైల్వే నిత్యం కొత్త మార్గాలను అన్వేషిస్తూనే ఉంటుందన్నారు.

వలంటీర్ల సేవలకు సలాం

రూ.4.75 లక్షల సొంత నగదు అందజేసిన సంబేపల్లె ఎంపీపీ నాగశ్రీలక్ష్మి



సంబేపల్లె : జగనన్న నవరత్నాల పథకాలను సమర్థంగా అమలు చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటరీ వ్యవస్థ తీసుకొచ్చారని ఎంపీపీ ఆవుల నాగశ్రీలక్ష్మి చెప్పారు. అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండల కేంద్రంలో శుక్రవారం ఎంపీపీ సొంత నిధులు రూ.4.75 లక్షలను వలంటీర్లకు గ్రామ కార్యదర్శుల ద్వారా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వలంటీర్లు చేస్తున్న సేవలకు కొంతైనా వారి రుణం తీర్చుకోవాలన్న ఉద్దేశంతో ఈ ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం మండలంలోని 190 మంది వలంటీర్లకు ఒక్కొక్కరికి రూ.2,500 చొప్పున నగదును పంపిణీ చేశారు.

శ్రీసిటీలో 'కెర్రీ ఇండెవ్' లాజిస్టిక్స్ కేంద్రం ప్రారంభం



శ్రీసిటీలో కెర్రీ ఇండెవ్ లాజిస్టిక్స్ నెట్‌వర్క్ ప్రారంభోత్సవానికి హాజరైన అతిథులు

సత్యవేడు (తిరుపతి జిల్లా): భారత్‌లోని ప్రముఖ ఇంటిగ్రేటివ్–3పీఎల్ (థర్డ్ పార్టీ లాజిస్టిక్స్) సేవల సంస్థ కెర్రీ ఇండెవ్ లాజిస్టిక్స్ నెట్‌వర్క్, శ్రీసిటీలో 3 లక్షల చ.అ విస్తీర్ణంలో నిర్మించిన నూతన అత్యాధునిక లాజిస్టిక్స్ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించింది. మిత్సుబిషి ఎలక్ట్రిక్ ఇండియా ఆపరేషన్స్ కోసం ఇది పనిచేయనుంది. పరిశ్రమ ఆవరణలో జరిగిన ప్రారంభోత్సవ వేడుకల్లో మిత్సుబిషి ఎలక్ట్రిక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్)ఒబాటా మసకాజు ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. కెర్రీ ఇండెవ్ చైర్మన్ డాక్టర్ గ్జావియర్ బ్రిట్టో మాట్లాడుతూ..వేర్ హౌసింగ్, లాజిస్టిక్స్ వ్యాపార సంస్థలకు శ్రీసిటీ అత్యంత అనువైన వ్యూహాత్మక స్థానమని చెప్పారు. తమ ప్లాంట్ ఏర్పాటుకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించిన శ్రీసిటీ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఒబాటా మసకాజు మాట్లాడుతూ నూతన ప్లాంట్ ఏర్పాటులో కెర్రీ ఇండెవ్ లాజిస్టిక్స్, ఇండోస్పేస్ బృందాల అత్యుత్తమ కృషిని అభినందించారు. శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ..ప్రస్తుతం పారిశ్రామిక రంగంలో లాజిస్టిక్, వేర్‌హౌసింగ్ సేవల ప్రాముఖ్యతను వివరించారు. మిత్సుబిషి ఎలక్ట్రిక్ ప్లానింగ్ హెడ్ గణపతి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్వేతసౌధానికి మన ప్రభుత్వ బడి విద్యార్థులు

- తొలిసారి అమెరికా అధ్యక్ష భవనాన్ని సందర్శించే అవకాశం
- ఐరాసలో అభివృద్ధి చెందిన దేశాల విద్యార్థులతో చర్చలు
- కొలంబియా వర్సిటీ సదస్సు, వరల్డ్ బ్యాంకుల్లో ప్రసంగించే చాన్స్
- వివిధ దేశాల విద్యార్థులతో విజ్ఞానం పంచుకునేలా కార్యక్రమాలు
- సెప్టెంబర్‌లో అమెరికా వెళ్లనున్న రాష్ట్ర విద్యార్థులు



కొలంబియా వర్సిటీ డైరెక్టర్ రాధికా అయ్యంగార్‌తో మాట్లాడుతున్న కిషన్ కుమార్

సాక్షి, అమరావతి: పేదింటి విద్యార్థులు కూడా ప్రపంచస్థాయిలో రాణించాలనే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా.. మన రాష్ట్రంలోని ప్రభుత్వ బడుల్లో చదివే పది మంది విద్యార్థులకు అమెరికాలో పర్యటించే అరుదైన అవకాశం వచ్చింది. తొలిసారి విద్యార్థులకు అమెరికా అధ్యక్ష భవనమైన వైట్ హౌస్‌ను సందర్శించే చాన్స్ లభించింది. సెప్టెంబర్‌లో అమెరికా వెళ్లనున్న మన విద్యార్థులు ఆనెల 17 నుంచి 27 వరకు న్యూయార్క్ నగరంలోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో స్థిర అభివృద్ధి అనే అంశంపై జరిగే ప్రత్యేక సదస్సులో పాల్గొననున్నారు. ఈ సదస్సులో వివిధ దేశాల్లో విద్యావిధానం, కల్పించిన అవకాశాలపై చర్చించనున్నారు. ఇందులో అమెరికాతో పాటు కెనడా, ఆస్ట్రేలియా వంటి అభివృద్ధి చెందిన దేశాల విద్యార్థులు కూడా పాల్గొంటున్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు, 'మనబడి నాడు-నేడు' పథకంతో మారిన పాఠశాలల పరిస్థితులు, వసతులు, ఇంగ్లిష్‌లో బోధన, డిజిటల్ ఎడ్యుకేషన్ ఫలితంగా వచ్చిన మార్పులపై మన విద్యార్థులు సదస్సులో ప్రసంగించనున్నారు. ఆ తర్వాత కొలంబియా యూనివర్సిటీలో జరిగే సదస్సుల్లో కూడా రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రసంగించే అవకాశాన్ని ఆ వర్సిటీలోని సెంటర్ ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ (ఎడ్యుకేషన్) డైరెక్టర్ రాధికా అయ్యంగార్ కల్పించారు. ఈమేరకు గురువారం యూఎన్‌వో స్పెషల్ కన్సల్టేటివ్ స్టేటస్ మెంబర్ ఉన్నవ షకిన్ కుమార్‌కు అధికారికంగా తెలిపారు. అలాగే వాషింగ్టన్‌లోని ప్రపంచ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బ్యాంకు ఉన్నతాధికారులతో కూడా మన విద్యార్థులు మాట్లాడే అవకాశం లభించిందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న విద్యా సంస్కరణలపై వివిధ దేశాల ప్రతినిధులు అభినందనలు తెలుపుతున్నారని, పేద పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యనందించడంపై స్వయంగా వివరించేందుకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను సెప్టెంబర్‌లో జరిగే సదస్సుకు తీసుకెళతామని ఆయన 'సాక్షి'కి తెలిపారు. ఇదో అద్భుత అవకాశంగా ఆయన అభివర్ణించారు. ప్రధానంగా అమెరికా అధ్యక్ష భవనం సందర్శించేందుకు అమెరికా ప్రభుత్వంలోని బ్యూరో ఆఫ్ సౌత్ అండ్ సెంట్రల్ ఆసియా అఫైర్స్ విభాగం అవకాశం కల్పించిందన్నారు. త్వరలోనే పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, కమిషనర్ సురేష్ కుమార్ నేతృత్వంలో అమెరికా సందర్శించే విద్యార్థులను ఎంపిక చేస్తామని షకిన్ కుమార్ తెలిపారు. పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదని, ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలు అధిరోహించాలనేది సీఎం వైఎస్ జగన్ ఆకాంక్ష అని చెప్పారు. అందుకు అనుగుణంగా టోఫెల్, డిజిటల్ విద్య, స్మార్ట్ బోర్డుల బోధన, భాషా నైపుణ్యాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్న తీరును ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే స్వయంగా ప్రపంచ వేదికపై తెలియజేస్తారని ఆయన వివరించారు.

ఎన్ఐఏ అదుపులో ఆర్కే భార్య శిరీష

- ప్రకాశం జిల్లా ఆలకూరపాడులోని ఇంట్లో అదుపులోకి..
- కొద్దిసేపు టంగుటూరు పోలీస్ స్టేషన్‌లో ఉంచిన ఎన్ఐఏ
- అక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలింపు
- అరెస్టుకు కారణాలు, ఎక్కడికి తీసుకెళ్లారో చెప్పని ఎన్ఐఏ బృందం





మావోయిస్టు అగ్రనేత ఆర్కే భార్య నివసిస్తున్న ఇల్లు (ఇన్‌సెట్‌)లో ఆర్కే భార్య శిరీష

టంగుటూరు: మావోయిస్టు అగ్రనేత అక్కిరాజు హరగోపాల్ (రామకృష్ణ అలియాస్ ఆర్కే) సతీమణి శిరీష అలియాస్ పద్మని కేంద్ర దర్యాప్తు సంస్థ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) శుక్రవారం సాయంత్రం ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం ఆలకూరపాడులోని ఆమె ఇంట్లో అదుపులోకి తీసుకుంది. మూడు ప్రైవేటు కార్లలో ఆలకూరపాడుకు చేరుకున్న ఎన్ఐఏ బృందం ఇంటి పనుల్లో ఉన్న ఆమెను సాయంత్రం 6 గంటల సమయంలో అదుపులోకి తీసుకుని, బలవంతంగా కారులో తరలించేందుకు ప్రయత్నించింది. ఎందుకు అరెస్టు చేస్తున్నారని ఆమె కుటుంబ సభ్యులు ప్రశ్నించినా సమాధానం చెప్పలేదు. అనంతరం ఆమెను టంగుటూరు పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి, ఐదు నిమిషాలు అక్కడ ఉంచారు. అనంతరం సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై శ్రీరామ్, ఒంగోలు దిశ ఎస్సై ఫిరోజ్ ఫాతిమాల సమక్షంలో ఆమెను అక్కడ నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలించారు. ఎక్కడికి తీసుకెళ్లారన్నది తెలియరాలేదు. ఈ సమాచారాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు. ఆమెను ఏ కారణాలతో అదుపులోకి తీసుకున్నారో కూడా వెల్లడించలేదు.

గతంలోనూ తనిఖీ

ఆర్కే 2021 అక్టోబర్ 16న అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుమారుడు మున్నా సైతం ఉద్యమ బాటలో నడిచి ఎదురు కాల్పుల్లో మరణించాడు. ఆ తర్వాత 2022లో ఆలకూరపాడులో శిరీష ఇంట్లో ఎన్ఐఏ బృందం ఓసారి తనిఖీలు చేసింది. మావోయిస్టులకు సహకరించడం, నగదు సమకూర్చడం, వైద్య విద్యార్థినితో దళాలకు వైద్యం చేయించి, దళం వైపు ఆకర్షించేలా చేయడంలో శిరీషకు సంబంధం ఉందన్న ఆరోపణలతో 2022 జూలై 19న ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన ఎన్ఐఏ బృందం ఆమె ఇంట్లో తనిఖీ చేసింది. ఆ సమయంలో శిరీష వైద్యం నిమిత్తం విజయవాడ వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉంది. దీంతో విరసం నేత కళ్యాణరావును తీసుకొచ్చారు. శిరీష లేకుండా తలుపులు తీయడానికి ఆయన నిరాకరించడంతో తహసీల్దార్, వీఆర్వో సమక్షంలో తాళం పగలగొట్టారు. శిరీష ఇంటి నుంచి సాధారణ షాపుల్లో దొరికే కొన్ని పుస్తకాలు, పలు సీడీలను స్వాధీనం చేసుకున్నారు.

ఇది అక్రమ అరెస్టు: కళ్యాణరావు

శిరీషను ఎన్ఐఏ అదుపులోకి తీసుకొన్నట్లు తెలుసుకున్న విప్లవ రచయితల సంఘం నేత గంగుల కళ్యాణరావు హుటాహుటిన స్టేషన్‌కు వచ్చారు. కళ్యాణరావు, ఇతర బంధువులు ఎస్సై శ్రీరామ్‌తో మాట్లాడారు. అనంతరం కళ్యాణరావు మీడియాతో మాట్లాడుతూ.. శిరీషను అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. ఎన్ఐఏ బృందం తమ కుటుంబానికి ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా శిరీషను బలవంతంగా తీసుకెళ్లిందని, ఎక్కడ ఉంచారన్నదీ ఇప్పటివరకు తెలపకపోవడం దారుణమని చెప్పారు. ఎవరినైనా అరెస్టు చేసే ముందు కుటుంబ సభ్యులకు తెలపాలని అన్నారు. శిరీషను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.శిరీషపై పెట్టినవన్నీ బూటకపు కేసులేనని అన్నారు.

గిరిజన ఉత్సవాలకు సర్వం సిద్ధం

- విశాఖలో నేడు, రేపు వేడుకలు
- రాష్ట్రస్థాయి గిరిజన నృత్య, కళల పోటీలు
- గిరిజన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సన్మానం

సాక్షి, అమరావతి: రాష్ట్ర స్థాయి గిరిజన ఉత్సవాలకు విశాఖ నగరంలో సర్వం సిద్ధం చేశారు. విశాఖలోని సిరిపురంలో ఉన్న విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీఎంఆర్‌డీఏ) చిల్డ్రన్ ఎరీనాలో శనివారం, ఆదివారం ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రాష్ట్ర గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ (టీసీఆర్ అండ్ టీఎం) ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రస్థాయి గిరిజన నృత్య, చిత్రలేఖనం, కళల పోటీలు నిర్వహిస్తారు. పలు రంగాల్లో రాణిస్తున్న గిరిజన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను సన్మానిస్తారు. గిరిజన క్రాఫ్ట్ వస్తువులు, వెదురు, మైనంతో చేసిన ఆట బొమ్మలు, గిరిజన ఆహార ఉత్పత్తులతో ప్రదర్శన ఏర్పాటు చేస్తారు. ఈ ఉత్సవాలను ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర ప్రారంభిస్తారని టీసీఆర్, టీఎం మిషన్ డైరెక్టర్ ఇ.రవీంద్ర బాబు తెలిపారు. గిరిజన సంస్కృతి పరిరక్షణ, ఔత్సాహిక గిరిజన పారిశ్రామికవేత్తలకు గుర్తింపు కల్పించడం, కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని ఆయన వెల్లడించారు.

ఇవీ ప్రదర్శించనున్న నృత్యాలు...

ఈ ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రానికి చెందిన గిరిజనులు తమ సంప్రదాయ నృత్యాలు, కళలను ప్రదర్శిస్తారు. కోయ తెగకు చెందిన గిరిజనులు కొమ్ము కోయ నృత్యం (కేఆర్‌పురం ఐటీడీఏ), కోయ, కొండరెడ్డి తెగలవారు కొమ్ము కోయ నృత్యం (రంపచోడవరం ఐటీడీఏ), కోయ తెగవారు రేల కొమ్ముకోయ నృత్యం(చింతూరు ఐటీడీఏ), కొండు వయూర తెగవారు ధింసా (పాడేరు ఐటీడీఏ), సవర తెగవారు కందికొత్తలు నృత్యం (పార్వతీపురం ఐటీడీఏ), సవర తెగవారు సవర తాంగ్సెంగ్ నృత్యం(సీతంపేట ఐటీడీఏ) ప్రదర్శిస్తారు.

నేడు ఐటీడీఏ పీవోల కీలక సమావేశం

గిరిజనులకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను మరింత చేరువ చేసేందుకు తీసుకోవాల్సిన అంశాలపై కూడా ఈ ఉత్సవాల్లో చర్చించనున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో ఉన్న సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ)ల పీవోలు, మైదాన ప్రాంతానికి చెందిన కలెక్టర్లు, ఏజెన్సీలోని అన్ని మండలాల తహసీల్దార్‌లతో శనివారం విశాఖపట్నంలోని టీసీఆర్ అండ్ టీఎం కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, ఉన్నతాధికారులు పాల్గొని రాష్ట్రంలో గిరిజనుల ప్రగతికి సంబంధించిన అంశాలపై చర్చించి దిశానిర్దేశం చేయనున్నారు.

క్లుప్తంగా...


డీసీఎంఎస్ కమిటీల పదవీ కాలం పొడిగింపు

సాక్షి, అమరావతి: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్)ల్లోని పర్సన్ ఇన్‌చార్జి కమిటీల పదవీ కాలం మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల మినహా మిగిలిన తొమ్మిది ఉమ్మడి జిల్లాల పాలక వర్గాలు మరో ఆరు నెలల పాటు పదవిలో కొనసాగనున్నట్లు పేర్కొంది.

నేడు ఎస్ఎల్‌డీసీల సమావేశం

సాక్షి, విశాఖపట్నం : విద్యుత్ సరఫరా, గ్రిడ్ కార్యకలాపాలపై చర్చించేందుకు దక్షిణ భారత దేశాల స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎస్ఎల్‌డీసీ)ల సమావేశానికి విశాఖ నగరం వేదిక కానుంది. శనివారం ఉదయం రుషికొండ సమీపంలోని రాడిసన్ హోటల్‌లో సదస్సు జరుగనుంది. ఈ సదస్సులో దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల ఇంధన శాఖ కార్యదర్శులు, ఎస్ఎల్‌డీసీ అధికారులు, విద్యుత్ పంపిణీ సంస్థల ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. రాష్ట్ర ఇంధన శాఖ సెక్రటరీ విజయానంద్ నేతృత్వంలో సదస్సు జరుగనుంది.

25న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల



తిరుమల: తిరుమల శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల ఆగస్టు, సెప్టెంబర్ నెలల కోటాను ఈ నెల 25న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అదనపు కోటా కింద నాలుగు వేల టికెట్లను విడుదల చేస్తుంది. అలాగే అక్టోబర్ నెలకు సంబంధించి రోజుకు 15,000 టికెట్లు చొప్పున విడుదల చేయనుంది. కాగా, ఈ నెల 24వ తేదీన ఉదయం 11 గంటలకు అక్టోబర్ నెలకు సంబంధించిన శ్రీవాణి ట్రస్ట్ టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అదేరోజు మధ్యాహ్నం మూడు గంటలకు అక్టోబర్ నెలకు సంబంధించిన వయోవృద్ధులు, వికలాంగుల దర్శన టికెట్ల కోటాను కూడా విడుదల చేస్తుంది. భక్తులు టీటీడీ వెబ్‌సైట్ https:// tirupatibalaji.ap.gov.in లో దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని టీటీడీ కోరుతోంది.

26న తిరుమలలో పల్లవోత్సవం

మైసూరు మహారాజు జన్మించిన ఉత్తరాభాద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని టీటీడీ ఈ నెల 26న పల్లవోత్సవం నిర్వహించనుంది. ఇందులో భాగంగా సహస్రదీపాలంకారసేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి వారు ఊరేగింపుగా కర్ణాటక సత్రానికి వేంచేపు చేస్తారు. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, మైసూరు సంస్థానం ప్రతినిధులు స్వామి, అమ్మవార్లకు ఆహ్వానం పలికి ప్రత్యేక హారతి సమర్పిస్తారు.

ఏపీకి 4.2, తెలంగాణకు 8.5 టీఎంసీలు

- నాగార్జునసాగర్ నుంచి విడుదలకు కృష్ణా బోర్డు ఉత్తర్వులు



సాక్షి, అమరావతి: నాగార్జునసాగర్‌లో శుక్రవారానికి కనీస నీటి మట్టానికి ఎగువన లభ్యతగా ఉన్న 12.731 టీఎంసీలలో..జూలై అవసరాలకు ఏపీకి 4.2 టీఎంసీలు, జూలై నుంచి సెప్టెంబర్ వరకు అవసరాలకు తెలంగాణకు 8.5 టీఎంసీలను వాడుకోవడానికి కృష్ణా బోర్డు అనుమతిచ్చింది. ఆ మేరకు నీటిని విడుదల చేయాలని నాగార్జునసాగర్ సీఈని ఆదేశిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నాగార్జునసాగర్ నుంచి కుడి కాలువకు తాగునీటి అవసరాల కోసం 5 టీఎంసీలు విడుదల చేయాలని ఏపీ ఈఎన్‌సీ నారాయణరెడ్డి..సాగు, హైదరాబాద్ తాగునీటి అవసరాలకు 10 టీఎంసీలు కేటాయించాలని తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్‌లు కృష్ణా బోర్డుకు ప్రతిపాదనలు పంపారు. వాటిపై ఈ నెల 18, 19న కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే నేతృత్వంలో ఏపీ, తెలంగాణ ఈఎన్‌సీలతో కూడిన త్రిసభ్య కమిటీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చించింది. ప్రస్తుత సీజన్‌లో శ్రీశైలం నుంచి 1.386, నాగార్జునసాగర్ నుంచి 5.282 టీఎంసీలను తెలంగాణ వినియోగించుకున్నట్లు త్రిసభ్య కమిటీ తేల్చింది.

ఏపీలోకి రికార్డు స్థాయిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు

కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ సహాయ మంత్రి సోమ్ ప్రకాష్ వెల్లడి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గత ఆర్థిక సంవత్సరం (2022–23)లో రికార్డు స్థాయిలో 284.22 మిలియన్ల యూఎస్ డాలర్ల(రూ. 2,272 కోట్లకు పైగా)విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) వచ్చినట్లు కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ సహాయ మంత్రి సోమ్ ప్రకాష్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 2019 మే నుంచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తగ్గాయా? దీని వల్ల ఉద్యోగావకాశాలు తగ్గాయా అంటూ శుక్రవారం రాజ్యసభలో టీడీపీ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ ప్రశ్నకు కేంద్ర మంత్రి రాతపూర్వక సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఏమాత్రం తగ్గలేదని, పారిశ్రామికవేత్తలు ఎఫ్‌డీఐల రూపంలో భారీ ఎత్తున పెట్టుబడులు పెడుతున్నారని, ఉపాధి అవకాశాలు కూడా ఏమాత్రం తగ్గలేదని స్పష్టం చేశారు.

ఇక ఉద్దానం ‘సురక్షితం’

తాగునీటి తరలింపు తొలిదశ ట్రయల్ రన్ విజయవంతం

- హిర మండలం రిజర్వాయర్ నుంచి మెలియాపుట్టి శుద్ధి కేంద్రానికి జలాలు
- 32 కి.మీ. పొడవున భూగర్భ పైపులైన్ ద్వారా నీటి తరలింపు
- మరో 15 రోజుల్లో ఉద్దానం చివరి ప్రాంతం ఇచ్ఛాపురం వరకు ట్రయల్ రన్
- 40 ఏళ్లుగా పట్టి పీడిస్తున్న కిడ్నీ సమస్యలకు సీఎం జగన్ శాశ్వత పరిష్కారం
- రూ.700 కోట్లతో సమగ్ర రక్షిత మంచినీటి పథకం ద్వారా కష్టాలకు విముక్తి



ఉద్దానం ప్రాంతం కోసం హిరమండలం రిజర్వాయర్ నుంచి మెలియపుట్టి నీటిశుద్ధి కేంద్రానికి చేరుకున్న జలాలు

సాక్షి, అమరావతి: నలభై ఏళ్లుగా కిడ్నీ వ్యాధుల భయాలు వెంటాడుతున్న ఉద్దానం ప్రాంత ప్రజలకు భరోసా కల్పిస్తూ అక్కడకు వంద కి.మీ.పైగా దూరంలోని హిర మండలం రిజర్వాయర్ నుంచి సురక్షిత జలాలు కదిలాయి. భూగర్భ పైపులైన్ల ద్వారా ఉద్దానానికి నీటి తరలింపుపై గ్రామీణ మంచినీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు వారం రోజులుగా నిర్వహిస్తున్న తొలిదశ ట్రయల్ రన్ విజయవంతమైంది. దాదాపు 132 కి.మీ. మేర భూగర్భ పైపు లైన్‌ను నిర్మించగా మార్గమధ్యంలో మెలియాపుట్టి వద్ద నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటైంది. మొదటి దశలో 32 కి.మీ. పొడవున భూగర్భ పైపు లైన్ ద్వారా నీటిని తరలించారు. రానున్న 15 రోజులలో నీటి శుద్ధి కేంద్రం నుంచి ఉద్దానం చివరి ప్రాంతం ఇచ్ఛాపురం వరకు వంద కిలోమీటర్ల పొడవున ప్రధాన భూగర్భ పైపు లైన్ ద్వారా నీటి తరలింపు ట్రయల్ రన్ నిర్వహించనున్నారు.

ఏడాది పొడవునా ప్రతి ఇంటికీ..

దాదాపు 807 నివాసిత ప్రాంతాలకు కొళాయిల ద్వారా తాగునీటి సరఫరాకు ఉద్దానం ప్రాంతాన్ని పది క్లస్టర్లుగా వర్గీకరించారు. అక్కడ నివసిస్తున్న దాదాపు 8 లక్షల మంది ప్రజలకు ఏడాది పొడవునా ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

ట్రయల్ రన్‌కు ఐదు కోట్ల లీటర్లు..

ఉద్దానం తాగునీటి అవసరాల కోసం రోజూ 8.40 కోట్ల లీటర్ల చొప్పున హిర మండలం నుంచి తరలిస్తారు. ఇందుకోసం 1,300 హెచ్‌పీ సామర్థ్యంతో మూడు భారీ నీటి పంపింగ్ మోటార్లను హిర మండలం రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేశారు. మొదటి దశ ట్రయల్ రన్ కోసం ఐదు కోట్ల లీటర్లను మెలియాపుట్టి నీటి శుద్ధి కేంద్రం వద్దకు తరలించినట్లు అధికారులు తెలిపారు. మూడు మోటార్ల పనితీరును కూడా పరీక్షించారు.

మాట ప్రకారం.. ఖర్చుకు వెనుకాడకుండా

శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం, పలాస అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని దాదాపు ఏడు మండలాల పరిధిలో ఉద్దానం ప్రాంతం విస్తరించి ఉంటుంది. స్థానికులను దశాబ్దాలుగా పట్టి పీడిస్తున్న కిడ్నీ వ్యాధుల సమస్యను పరిష్కరించేందుకు సీఎం జగన్ రూ.700 కోట్లతో ఉద్దానానికి సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని మంజూరు చేయడం తెలిసిందే. ఏడాది పొడవునా నీరు అందుబాటులో ఉండటంతో ఖర్చుకు వెనుకాడకుండా హిర మండలం రిజర్వాయర్ నుంచి నీటి తరలింపు చేపట్టాలని నిర్ణయించారు. ఏడాది పొడవునా ఉద్దానం నీటి అవసరాలను తీర్చేందుకు ఒక టీఎంసీ కన్నా తక్కువ అవసరం కాగా హిర మండలం రిజర్వాయర్‌లో కనీస మట్టం స్థాయిలోనూ 2.67 టీఎంసీల నీరు అందుబాటులో ఉంటుంది. ఈ పథకంలో భాగంగా రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో వివిధ గ్రామాల్లో మొత్తం 571 ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రభుత్వం నూతనంగా నిర్మించింది.

వైద్యవిద్య పీజీ సీట్ల భర్తీ ప్రక్రియ ప్రారంభం

- ఆలిండియా కోటా సీట్లకు 27 నుంచి రిజిస్ట్రేషన్
- రాష్ట్రంలో సీట్లకు నేటినుంచి దరఖాస్తులు

సాక్షి, అమరావతి: 2023–24 విద్యాసంవత్సరానికి వైద్యవిద్య పీజీ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ప్రవేశాలకు సంబంధించి మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) షెడ్యూల్ విడుదల చేసింది. 50 శాతం ఆల్ ఇండియా కోటా సీట్లు, డీమ్డ్, కేంద్ర విశ్వవిద్యాలయాల్లో 100 శాతం సీట్లకు ఈ నెల 27 నుంచి ఆగస్టు ఒకటో తేదీ మధ్య నీట్-పీజీ అర్హత సాధించిన అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నెల 28 నుంచి ఆగస్టు రెండో తేదీ మధ్య వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పిస్తారు. ఆగస్టు మూడు, నాలుగు తేదీల్లో సీట్లు కేటాయిస్తారు. ఏడో తేదీ నుంచి 13వ తేదీలోగా కేటాయించిన కాలేజీల్లో అభ్యర్థులు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఆగస్టు 16వ తేదీకి తొలివిడత కౌన్సెలింగ్ ప్రక్రియ ముగుస్తుంది. 17వ తేదీ నుంచి సెప్టెంబర్ 6వ తేదీ వరకు రెండోవిడత, 7వ తేదీ నుంచి 27వ తేదీ మధ్య మూడోవిడత కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. మిగిలిపోయిన సీట్ల భర్తీకి స్ట్రే వేకెన్సీ రౌండ్ కౌన్సెలింగ్ సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 10వ తేదీ మధ్య ఉంటుంది.

రాష్ట్రంలో సీట్లకు 31లోగా దరఖాస్తు చేసుకోవాలి

2023–24 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య, డెంటల్ కళాశాలలు, స్విమ్స్ తిరుపతిలో రాష్ట్ర కోటా పీజీ, ఎండీఎస్ సీట్ల భర్తీకి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. మెడికల్ పీజీ ప్రవేశాల కోసం http://pgcq.ysruhs.com/ ఎండీఎస్ ప్రవేశాల కోసం https://mdscq.ysruhs.com/ వెబ్‌సైట్‌లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకో వాలి. శనివారం (నేడు) ఉదయం 11 గంటల నుంచి ఈ నెల 31వ తేదీ సాయంత్రం ఆరు గంటల్లోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. నీట్ పీజీ–2023, ఎండీఎస్–2023లో అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకోవచ్చు. నియమ, నిబంధనల్లో సందేహాల నివృత్తికి 8978780501, 7997710168, 9391805238, 9391805239, సాంకేతిక సమస్యలపై 7416563063, 7416253073, 90634 00829, పేమెంట్ గేట్‌వేపై స్పష్టత కోసం 8333883934 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు. అభ్యర్థనలను appgadmissions2021@gmail.comకు మెయిల్ కూడా చేయవచ్చని పేర్కొన్నారు.

వాతావరణ మార్పులతో దిగుబడులు ప్రభావితం

వాతావరణ మార్పులపై అధ్యయనానికి జాతీయస్థాయి పరిశోధన: విజయసాయిరెడ్డి

సాక్షి, అమరావతి: వాతావరణ మార్పుల ప్రభావంపై సర్వత్రా చర్చ మొదలైందని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వేణుంబాక విజయసాయిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి, మార్చిలో వడగాడ్పులు, ఏప్రిల్‌లో అకాల వర్షాలతో టమాటా సహా అన్ని కూరగాయలు ధరలు మండిపోతున్నట్లు వ్యవసాయరంగ నిపుణులు చెబుతున్నారన్నారు. గత నెల రోజులుగా ఆకాశాన్ని తాకుతున్న టమాటా ధరలు విస్తారంగా పండిన కాలంలో కిలో రూ.5 కూడా పలకని రోజులున్నాయని చెప్పారు. వాతావరణ మార్పుల వల్ల వరి, గోధుమ, మొక్కజొన్న దిగుబడులు 7– 8%, పండ్లు, కూరగాయల ఉత్పత్తి 15 – 20 శాతం వరకూ తగ్గే ప్రమాదం ఉందని వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయ రంగ సంస్థ ఎస్ఐసీఆర్ అంచనా వేసిందన్నారు. ఈ నేపథ్యంలో వాతావరణ మార్పులను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తూ వ్యవసాయ రంగానికి ఎప్పటికప్పుడు సూచలు చేసేందుకు నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎన్ఆర్ఎఫ్) ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు చెప్పారు. రుతుపవనాలతో పాటు సాగు రంగాన్ని ప్రభావితం చేసే అన్ని అంశాలపై రైతులకు ఈ సంస్థ మార్గదర్శకంగా ఉంటుందని తెలిపారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో వ్యవసాయ రంగానికి సంబంధించి పరిశోధనలు, అధ్యయనాలు నిర్వహించేందుకు ఇది నిధులు సమకూర్చుతుందన్నారు. రూ.50,000 కోట్లతో నెలకొల్పే ఎన్ఆర్ఎఫ్ బిల్లును కేంద్రం పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

ఏపీ ఇన్ పార్లమెంట్

రాజ్యసభ

అరటి ఉత్పత్తిలో అగ్రగామి ఆంధ్రప్రదేశ్

- రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



విజయసాయిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: అరటి ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ వెల్లడించారు. 2021–22లో ఆహార, వ్యవసాయోత్పత్తుల సంస్థ (ఎఫ్ఏవో) సేకరించిన గణాంకాల ప్రకారం 56.84 లక్షల టన్నుల అరటి ఉత్పత్తితో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. రాజ్యసభలో శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రమంత్రి జవాబిచ్చారు. దేశవ్యాప్తంగా ఆ ఏడాది అరటి ఉత్పత్తిలో ఏపీది 16.5 శాతం వాటాగా నమోదైందన్నారు. హార్టికల్చర్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా బనానా క్లస్టర్ కింద ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం పైలట్ దశ కింద ఎంపికైందని చెప్పారు. ప్రపంచం మొత్తం మీద పండించే అరటి పండ్లలో 26.5 శాతం వాటాతో భారత్ అగ్రస్థానంలో ఉన్నట్లు తెలిపారు. దేశంలో పెద్దఎత్తున అరటి ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రాల్లో ఏపీ తరువాత స్థానంలో మహారాష్ట్ర, తమిళనాడు మూడో స్థానంలో ఉన్నట్లు చెప్పారు.

సైబర్ దాడులు అరికట్టే బాధ్యత పోలీసులదే

సైబర్ దాడుల నివారణ, సైబర్ నేరాల విచారణ బాధ్యత ప్రాథమికంగా ఆయా రాష్ట్రాల పోలీసుశాఖదే అని ఐటీశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. సైబర్ నేరాల విచారణలో సాంకేతిక అవగాహన పెంచుకోవడానికి పోలీసు సిబ్బందికి ఎప్పటికప్పుడు శిక్షణ ఇవ్వవలసి ఉంటుందని విజయసాయిరెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు. సైబర్ నేరాల బారిన పడిన ప్రజలు తమ ఫిర్యాదును దాఖలు చేయడంలో సహకరించే విధంగా హోం శాఖ 1930 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. సైబర్ నేరాల బాధితులు ఈ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేస్తే ఫిర్యాదు చేయడానికి వాళ్ల సొంత భాషలోనే తగిన సాయం పొందవచ్చని చెప్పారు.

ఏపీలో వన్ డిస్ట్రిక్ట్ – వన్ ప్రొడక్ట్ కింద 38 ఉత్పత్తులు

దేశంలోని అన్ని జిల్లాల్లో సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి లక్ష్యంగా ప్రవేశపెట్టిన వన్ డిస్ట్రిక్ట్ – వన్ ప్రొడక్ట్ (ఓడీవోపీ) విధానం కింద ఆంధ్రప్రదేశ్‌లో 26 జిల్లాల నుంచి మొత్తం 38 ఉత్పత్తులు గుర్తించినట్లు విజయసాయిరెడ్డి మరో ప్రశ్నకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ సహాయమంత్రి సోం ప్రకాష్ తెలిపారు. ఓడీవోపీ కింద అనంతపురం జిల్లాలో కాటన్/జీన్స్ ప్యాంట్లు, చిత్తూరు జిల్లాలో వెంకటగిరి చీరలు, మామిడి గుజ్జు , తూర్పు గోదావరిలో పచ్చళ్లు, మ్యాంగో జెల్లీ, పండ్ల గుజ్జు, నిమ్మ వంటి పండ్ల ఆధారిత ఉత్పత్తులు, గుంటూరులో కారం, కృష్ణాజిల్లాలో మచిలీపట్నం కలంకారీ, కర్నూలులో రాయి నుంచి తొలచిన ఉత్పత్తులు, ప్రకాశం నుంచి గ్రానైట్, నెల్లూరు నుంచి ఉదయగిరి కర్రతో తయారుచేసే కత్తులు, చాకులు, శ్రీకాకుళం నుంచి పొందూరు ఖద్దరు, బుడితి కంచులోహ సామాన్లు, జీడిపిక్కలు, విశాఖపట్నం నుంచి సీఫుడ్ క్లస్టర్, విజయనగరం నుంచి మ్యాంగో జెల్లీ, పశ్చిమ గోదావరి నుంచి ప్రాసెస్ చేసిన రొయ్యలు, ష్రింప్, నరసాపురం క్రోకెట్ లేసెస్, కడప నుంచి బొరైట్స్, బేరియం కాంపౌండ్స్ గుర్తించినట్లు చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి అరకు కాఫీ, అనకాపల్లి నుంచి ఏటికొప్పాక చెక్కబొమ్మలు, అన్నమయ్య జిల్లా నుంచి కాటన్/జీన్స్ ప్యాంట్లు, బాపట్ల నుంచి గ్రానైట్ కటింగ్/పాలిషింగ్, ఏలూరు నుంచి బంగారు ఆభరణాలు, కాకినాడ నుంచి ఉప్పాడ జాందాని చీరలు, జీడిపిక్కలు, కోనసీమ నుంచి కొబ్బరి, పీచు, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్, ష్రింప్, పార్వతీపురం మన్యం నుంచి బొబ్బిలివీణ, ధాన్యం, ఎన్టీఆర్ జిల్లా నుంచి కొండపల్లి బొమ్మలు, నంద్యాల నుంచి బంగినపల్లి మామిడి, ఆళ్లగడ్డ స్టోన్ కార్వింగ్, పల్నాడు నుంచి దుర్గి స్టోన్ కార్వింగ్, మసాలా ఉత్పత్తులు, తిరుపతి నుంచి శ్రీకాళహస్తి కలంకారి హస్తకళలు, వెంకటగిరి చేనేత వస్త్రాలు, సత్యసాయి జిల్లా నుంచి ధర్మవరం పట్టుచీరలు, నిమ్మలకుంట తోలుబొమ్మలాటను గుర్తించినట్లు మంత్రి వివరించారు.

ఏపీలో 56,63,124 మంది లబ్ధిదారులు



మోపిదేవి వెంకటరమణారావు

రైతులకు ఆర్థికసాయం నిమిత్తం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎంకిసాన్) పథకం కింద ఏపీలో 56,63,124 మంది లబ్ధిదారులు ఉన్నారని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ తెలిపారు. ఆయా లబ్ధిదారులకు వాయిదా రూపంలో రూ.12,100 కోట్లకుపైగా లబ్ధి చేకూర్చినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు ప్రశ్నకు సమాధానమిచ్చారు.

లోక్‌సభ

సిఫార్సు లేకుండా నియామకం ఉండదు



బి.వి.సత్యవతి



అవినాశ్ రెడ్డి

హైకోర్టు/సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు లేకుండా కేంద్ర ప్రభుత్వం ఎవరినీ హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించదని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ తెలిపారు. అఖిల భారత న్యాయసేవలు (ఏఐజేఎస్) సంబంధించి కొన్ని రాష్ట్రాలు, హైకోర్టులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశాయని.. లోక్‌సభలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ బి.వి.సత్యవతి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. ఈ నేపథ్యంలో సామాజిక వైవిధ్యం కోసం న్యాయమూర్తుల నియామక సిఫార్సుల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ, మహిళలను పరిగణనలోకి తీసుకోవాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు విజ్ఞప్తి చేశామని తెలిపారు.

ఏపీలో 110 సాగరమాల ప్రాజెక్టులు

ఆంధ్రప్రదేశ్‌లో రూ.1.1 లక్షల కోట్ల విలువైన 110 ప్రాజెక్టులను సాగరమాలలో గుర్తించినట్లు కేంద్ర నౌకాయానశాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా పోర్టుల ఆధునికీకరణ, పోర్టుల కనెక్టివిటీ పెంచుతామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఆంధ్రప్రదేశ్‌లో సాగరమాల పథకంలో రూ.2,500 కోట్ల విలువైన 14 ప్రాజెక్టులకు పాక్షికంగా నిధులు సమకూర్చినట్లు తెలిపారు.

హైకోర్టు బదిలీ ప్రతిపాదన పెండింగ్‌లో లేదు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అమరావతి నుంచి కర్నూలుకు బదిలీ నిమిత్తం పూర్తి ప్రతిపాదన ఏదీ కేంద్రం వద్ద పెండింగ్‌లో లేదని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్ తెలిపారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో సంప్రదింపులు చేసి హైకోర్టు ప్రిన్సిపల్ సీటు ఎక్కడికి బదిలీ చేయాలనేది రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ అవినాశ్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. హైకోర్టు ఖర్చులకు రాష్ట్ర ప్రభుత్వం, రోజువారీ కార్యక్రమాల నిర్వహణకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిది బాధ్యత అని తెలిపారు. ప్రస్తుత అంశంలో ఏపీ ప్రభుత్వ, హైకోర్టు పూర్తి ప్రతిపాదన కేంద్రానికి పంపాల్సి ఉందని చెప్పారు.

వివేకా కేసు దర్యాప్తులో సీబీఐ హ్యాండ్సప్!

తండ్రి శత్రువులతో సునీత కుమ్మక్కుకు సీబీఐ దన్ను

సాక్షి, అమరావతి: ఊహించినట్లుగానే మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో సీబీఐ చేతులెత్తేసింది! ముందుగానే ‘అప్రూవర్’ గంతలు కట్టుకుని దర్యాప్తు ప్రారంభించిన సీబీఐ చివరికి సాధించింది శూన్యం!! నిందితుడు దస్తగిరితో చెప్పించిన తప్పుడు కథనం.. కేసు దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు వండివార్చిన వాంగ్మూలాలు మినహా రెండున్నరేళ్ల దర్యాప్తు తరువాత సీబీఐ సాధించింది ఏమీ లేదు! శాస్త్రీయ ఆధారం అంటూ తెరపైకి తెచ్చిన ‘గూగుల్ టేక్’ అవుట్ చివరకు వట్టిదేనని చేతులెత్తేసింది. సాక్షుల వాంగ్మూలాల పేరిట పరస్పర విరుద్ధమైన, అహేతుకమైన వాదనలు బెడిసికొట్టాయి. గతంలో దాఖలు చేసిన చార్జ్‌షీట్లలో పేర్కొన్న అభూత కల్పనలు, ఊహాజనితాలకు కొనసాగింపుగానే సీబీఐ తుది చార్జ్‌షీట్‌ను దాఖలు చేసి చేతులు దులిపేసుకున్నట్లు స్పష్టమవుతోంది.

సాధించింది శూన్యం

ఎలాంటి ఆధారాలు లేకుండా వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్ అవినాశ్‌రెడ్డి పేర్లను చార్జ్‌షీట్లలో సీబీఐ ఏకపక్షంగా చేర్చింది. వారికి వ్యతిరేకంగా ఒక్క ఆధారాన్ని కూడా చూపలేకపోయింది. గూగుల్ టేక్ అవుట్ పూర్తిగా అహేతుకమని నిపుణులు మొదటి నుంచి చెబుతూనే ఉన్నారు. యూటీసీ కాలమానానికి, భారత కాలమానానికి తేడా కూడా గుర్తించకుండా గతంలోని చార్జ్‌షీట్లో అభియోగాలను మోపడం సీబీఐ బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. తమ అభియోగాలు అవాస్తవమని న్యాయ విచారణలో వెల్లడవుతుందని గుర్తించిన సీబీఐ తుది చార్జ్‌షీట్లో నాలుక కరుచుకుంది. వివేకా హత్య జరిగిన రోజు రాత్రి సునీల్ యాదవ్ అక్కడ లేరని పేర్కొంది. గూగుల్ టేక్ అవుట్ ఆధారంగా భాస్కర్‌రెడ్డిని సీబీఐ అరెస్టు చేయడం పూర్తిగా తొందరపాటేనని స్పష్టమైంది.

వాంగ్మూలాల కట్టుకథలు

సాక్షులు చెప్పని విషయాలను కూడా 164 స్టేట్‌మెంట్ పేరిట నమోదు చేసుకుని మీడియాకు లీకులు ఇవ్వడం సీబీఐ దురుద్దేశాన్ని వెల్లడిస్తోంది. 2019 మార్చి 15న ఉదయం తాము హైదరాబాద్‌లో సమావేశంలో ఉండగా వైఎస్ జగన్ తమకు వివేకా మరణించారనే విషయాన్ని తెలియచేసినట్లు అజేయ కల్లం చెప్పారు. కానీ ఆయన ఫలానా సమయం అని ఏమీ చెప్పలేదు. కానీ ఉదయం 5.30 గంటలకే వైఎస్ జగన్ తమకు చెప్పారని అజేయ కల్లం వెల్లడించినట్లు సీబీఐ ఏకపక్షంగా వాంగ్మూలం నమోదు చేసుకుని మీడియాకు లీకులు ఇచ్చింది. దీన్ని అజేయ కల్లం వెంటనే ఖండించారు. అజేయ కల్లంను కలసిన అధికారి ఒకరు కాగా ఆయన పేరిట వాంగ్మూలం నమోదు చేసిన అధికారి మరొకరు కావడం గమనార్హం. ఇక అదే రోజు ఆ సమావేశంలో ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పీఏ కృష్ణమోహన్‌రెడ్డి ఉదయం 6.30 గంటలకు తనకు ఎంపీ అవినాశ్ రెడ్డి ఫోన్ చేసి వివేకా మరణించిన విషయాన్ని తెలిపారని సీబీఐకి వాంగ్మూలం ఇచ్చారు. వైఎస్ జగన్ నివాసంలో సహాయకుడు నవీన్ కూడా అదే చెప్పారు. ఆ ఇద్దరి వాంగ్మూలాలను సీబీఐ అదే విధంగా నమోదు చేసింది. మరి వారిద్దరు ఉదయం 6.30 గంటలకు తెలిసింది అన్నప్పుడు అదే సమావేశంలో పాల్గొన్న అజేయ కల్లం మాత్రం ఉదయం 5.30 గంటలకు తెలిసింది అని ఎలా చెప్పగలరు?

ఎంపీ టికెట్ నిర్ధారించేది వైఎస్ జగన్

కడప ఎంపీ టికెట్ అంశంపై లేని సందిగ్ధత ఉన్నట్టుగా చూపించేందుకు సీబీఐ విఫల యత్నాలు చేస్తోంది. తాజాగా షర్మిల వాంగ్మూలం పేరిట అదే ప్రచారాన్ని తెరపైకి తేవడం విడ్డూరంగా ఉంది. 2019 ఎన్నికల్లో కడప ఎంపీగా తనను పోటీ చేయమని వివేకా ఒత్తిడి చేశారని షర్మిల సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నారు. కానీ ఎంపీ టికెట్‌ను నిర్ణయించేది వివేకానో షర్మిలనో కాదు. నిర్ణయించేది పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఆయన అప్పటికే అవినాశ్‌రెడ్డిని ఎంపీ అభ్యర్థిగా నిర్ణయించేశారు. సిట్టింగ్ ఎంపీగా ఉన్న ఆయనే 2019 ఎన్నికల్లోనూ అభ్యర్థి అని మొదటి నుంచి చెబుతూ వచ్చారు. వివేకా కూడా అవినాశ్‌రెడ్డి తరపున ప్రచారం చేశారు.

తండ్రి శత్రువులతో సునీత కుమ్మక్కు

పులివెందులలో తన తల్లి విజయమ్మపై పోటీ చేసినప్పటికీ వైఎస్ వివేకా పార్టీలోకి వస్తానంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. సముచిత గౌరవం ఇచ్చారు. 2017 ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకాను అభ్యర్థిగా నిలిపారు. చంద్రబాబు పన్నాగంతో నాటి మంత్రి ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవి వైఎస్సార్‌సీపీ ఓటర్లను ప్రలోభాలకు గురి చేసి కుట్రతో వివేకానందరెడ్డిని ఓడించారు. వివేకా మరణించిన తరువాత ఆయన కుమార్తె సునీత టీడీపీ నేతలతో కుమ్మక్కు కావడం విస్మయపరిచింది. వివేకా ఓటమికి అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి కారణమంటూ సీబీఐకి తప్పుడు వాంగ్మూలం ఇచ్చారు. వివేకా హత్య కేసు దర్యాప్తులో పూర్తిగా విఫలమైన సీబీఐ తమ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు కట్టుకథలతో దర్యాప్తును పక్కదారి పట్టిస్తోందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

బెడిసికొట్టిన దస్తగిరి అప్రూవర్ కుట్ర

వివేకా హత్య కేసు దర్యాప్తులో సీబీఐ మొదట్లోనే పక్కదారి పట్టింది. హత్య చేశానని స్వయంగా అంగీకరించిన నిందితుడు దస్తగిరిని అప్రూవర్‌గా మార్చడం న్యాయ నిపుణులను విస్మయపరిచింది. వివేకాను హత్య చేస్తే తాము చూసుకుంటామని వైఎస్ భాస్కర్‌రెడ్డి భరోసా ఇచ్చారని ఎర్రగంగిరెడ్డి తనతో చెప్పినట్లు దస్తగిరి వాంగ్మూలంలో పేర్కొన్నాడు. అయితే తాను అలా చెప్పనే లేదని ఎర్ర గంగిరెడ్డి స్పష్టం చేశారు. ఇక వివేకా హత్యకు రూ.40 కోట్లతో డీల్ కుదిరినట్లు దస్తగిరి మరో కట్టుకథ చెప్పాడు. అందుకు సీబీఐ ఎలాంటి ఆధారాన్ని చూపించ లేదు. బెంగళూరులో ఓ భూ వివాదంలో రూ.8 కోట్లు వస్తాయని ఎర్ర గంగిరెడ్డి చెప్పినట్టుగా దస్తగిరి చెప్పాడు. అసలు ఆ వివాదమే లేదని స్పష్టమైంది. తనకు అడ్వాన్స్‌గా రూ.కోటి ఇచ్చారని చెప్పుకొచ్చిన దస్తగిరి రూ.2 వేల కోసం చివరికి రూ.500 కోసం సునీల్ యాదవ్‌తోపాటు ఇతరులను ప్రాథేయపడుతూ పెట్టిన వాట్సాప్ మెస్సేజ్‌లు వెలుగు చూశాయి. రూ.కోటి ఉన్న వ్యక్తి రూ.500 కోసం దేబిరించడం ఏమిటన్నది సీబీఐనే చెప్పాలి. దస్తగిరిని అప్రూవర్‌గా మార్చిన సీబీఐ హత్య ఆయుధాన్ని కూడా రికవరీ చేయలేకపోయింది.

‘గ్రీన్‌కో’లో ప్రమాదం.. ఇద్దరు కార్మికుల మృతి



మునారిక్ భోక్తా, సోనుకుమార్ మృతదేహాలు

పాణ్యం (నంద్యాల) : గ్రీన్‌కో పరిశ్రమ సొరంగ నిర్మాణంలో చోటుచేసుకున్న ప్రమాదంలో ఇద్దరు జార్ఖండ్ కూలీలు మరణించారు. దీంతో కోపోద్రిక్తులైన సుమారు 200 మంది ఆ రాష్ట్ర కార్మికులు ఫ్యాక్టరీ ఆవరణలో విధ్వంసానికి పాల్పడ్డారు. వివరాలివీ.. పాణ్యం మండల పరిధిలోని పిన్నాపురం గ్రామ సమీపంలో గ్రీన్‌కో సంస్థ హైడల్ ప్రాజెక్టును చేపడుతోంది. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు సొరంగం పనులు నత్తనడకన సాగుతున్నాయి. నాల్గవ సొరంగంలో పనులు చేయాలని శుక్రవారం జార్ఖండ్ కార్మికులకు గ్రీన్‌కో అధికారులు సూచించారు. కార్మికులు కింద బెడ్ లెవల్ పనులు చేస్తుండగా.. ఒక్కసారిగా పైనుంచి ఫాల్ట్‌జోన్‌పై బురద, గ్రిల్స్ భారీగా కూలిపడ్డాయి. దీంతో సొరంగంలో పనిచేస్తున్న జార్ఖండ్ రాష్ట్రం లవలాంగ్ గ్రామానికి చెందిన మునారిక్ భోక్తా (33), ఇదే రాష్ట్రం కర్నీబార్ గ్రామానికి చెందిన సోనుకుమార్ (20)పై పడడంతో వారి శరీరంలోకి కడ్డీలు చొచ్చుకుపోయాయి. పెద్దఎత్తున బురదపడడంతో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మరణించారు. ఆ సమయంలో ఏడుగురు కార్మికులు ఉండగా.. మరో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. వీరంతా బయటకొచ్చి కేకలు వేయడంతో సుమారు 200కు పైగా ఉన్న జార్ఖండ్ కార్మికులు అక్కడకు చేరుకుని అధికారులు, వాహనాలపై దాడికి తెగబడడంతో సిబ్బంది పరుగులు తీశారు.

భారీగా చేరుకున్న పోలీసులు

గ్రీన్‌కో సిబ్బంది సమాచారమివ్వడంతో నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డితో పాటు పలువురు సీఐలు, ఎస్ఐలు భారీగా ఘటనా స్థలికి చేరుకున్నారు. కంపెనీ అధికారులు బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లిస్తామని చెప్పడంతో వారు శాంతించారు.

క్లుప్తంగా...

నవోదయ టు జపాన్

సకూరా సైన్స్ హైస్కూల్ ప్రోగ్రాంలో పాల్గొన్న హరిచందన



రాజంపేట : జపాన్ దేశంలో శాస్త్ర సాంకేతిక పరిశోధనపై జరిగే సకూరా సైన్స్ హైస్కూల్ ప్రోగ్రాంకు అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం నారమరాజుపల్లెలోని జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థిని హరిచందన ఎంపికైంది. రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లెకు చెందిన రవీంద్రారెడ్డి, సంధ్యల కుమార్తె హరిచందన నవోదయలో విద్యనభ్యసించింది. గతేడాది పదో తరగతిలో అత్యున్నత మార్కులు సాధించింది. ఫలితంగా ఏపీ నుంచి ఆమె సకూరాకు ఎంపికై ంది. ఈ నెల 3న జపాన్‌కు వెళ్లి సకూరాలో పాల్గొని పర్యటన ముగించుకుని 20న ఇంటికి చేరుకుంది. ఈ సందర్భంగా హరిచందన మాట్లాడుతూ.. పలువురు శాస్త్రవేత్తలతో కలిసి అనేక చర్చల్లో పాల్గొన్నట్లు తెలిపింది. హరిచందనను ప్రిన్సిపాల్ గీత అభినందించారు.

రైల్వే ప్లాట్‌ఫాం పిల్లర్‌లో ఇరుక్కున్న చిన్నారి తల



రేణిగుంట(తిరుపతి జిల్లా): రేణిగుంట రైల్వే స్టేషన్లో ఓ చిన్నారికి ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే... రేణిగుంట రైల్వేస్టేషన్లోని 3వ నంబరు ప్లాట్ ఫాంపై రాజంపేటకు చెందిన సాయికుమార్ తన కుటుంబ సభ్యులతో కలసి చిత్తూరుకు వెళ్లేందుకు శుక్రవారం వేచి ఉన్నాడు. అతని కుమార్తె చిన్నారి సాయి యశస్వి (18 నెలలు) ఆడుకుంటూ తలను ఐరన్ పిల్లర్ మధ్యలో పెట్టడంతో ఇరుక్కుపోయింది. విషయం తెలుసుకున్న రైల్వే అధికారులు వెంటనే ప్రమాద స్థలానికి చేరుకుని ఎలక్ట్రికల్ కట్టర్‌తో పిల్లర్‌ను కట్ చేసి చిన్నారిని బయటకుతీశారు.

■ తెలంగాణ

తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/చార్మినార్: బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడం ఇది నాలుగోసారి. ఉమ్మడి ఏపీలో రెండుసార్లు అధ్యక్షుడిగా వ్యవహరించిన కిషన్‌రెడ్డి.. తెలంగాణలో తాజాగా రెండోసారి బాధ్యతలు స్వీకరించారు.

'ఈవీ' ఏటీఎం



- రాష్ట్రంలో 12 సౌర విద్యుత్ చార్జింగ్ కేంద్రాలు
- తొలుత అనంతపురం, విజయవాడ, తిరుపతి నగరాల్లో ఏర్పాటు
- కార్డు ద్వారా డబ్బు చెల్లించి వాహనదారుడే చార్జింగ్ పెట్టుకునే అవకాశం
- ఇవి గాక రాష్ట్రంలో 250 చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు కసరత్తు
- విద్యుత్ వాహనాల కొనుగోళ్లను ప్రోత్సహించే ప్రయత్నం

సాక్షి, అమరావతి:

విద్యుత్ వాహనాల (ఈవీల) కోసం రాష్ట్రంలో అత్యాధునిక సౌర విద్యుత్ చార్జింగ్ స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి. వాహనాల యజమానులు ఈ సౌర చార్జింగ్ కేంద్రాల్లో కార్డు ద్వారా వారే డబ్బులు చెల్లించి, వారే వాహనానికి చార్జింగ్ పెట్టుకోవచ్చు. విద్యుత్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు మద్దతుగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఈ చార్జింగ్ కేంద్రాలకు అనుమతినిచ్చింది. తొలుత అనంతపురం, విజయవాడ, తిరుపతి నగరాల్లో 12 కేంద్రాలకు ఆర్థిక సాయం కూడా అందిస్తోంది. ఈ నగరాల్లో సౌర విద్యుత్ ప్యానళ్లతో చార్జింగ్ కియోస్క్‌లను రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఎన్‌ఆర్‌ఈడీసీఏపీ) ఏర్పాటు చేస్తుంది. ఏటీఎం కార్డు ద్వారా డబ్బు చెల్లించి వాహనదారుడే చార్జింగ్ పెట్టుకోవచ్చు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ (నెడ్‌క్యాప్) చేస్తుంది.

రానున్న కాలం 'ఈవీ'లదే

దేశంలో వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు 2030 నాటికి 30% విద్యుత్ కార్లు, 80 శాతం విద్యుత్ టూ వీలర్లు, 70 శాతం విద్యుత్ కమర్షియల్ వెహికల్స్ ప్రవేశపెట్టాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా 1 గిగా టన్ కర్బన ఉద్గారాలు తగ్గుతాయని అంచనా వేసింది. దీంతోపాటు ఇంధనం దిగుమతులు తగ్గించటం ద్వారా 330 బిలియన్ డాలర్ల ఖర్చు తగ్గుతుంది. రానున్న ఎనిమిదేళ్లల్లో 66 శాతం వాహనదారులు విద్యుత్ వాహనాలనే వాడతారని ఈవీ మార్కెట్‌పై తాజా అధ్యయనాలు అంచనా వేస్తున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని కేంద్రం ఈ వినూత్న చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటును ప్రోత్సహిస్తోంది.

ఏడాదిలో 250 కేంద్రాలు

దేశంలో 2070 నాటికి ఉద్గారాలను జీరో స్థాయికి తీసుకురావాలనే జాతీయ లక్ష్యానికి అనుగుణంగా పర్యావరణ పరిరక్షణతో పాటు ఆర్థిక ప్రయోజనాల కోసం ఎలక్ట్రిక్ వాహనాల వైపు వెళ్లాలని ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. పెట్రోల్, డీజిల్ చార్జీలు భారంగా ఉన్న దిగువ మధ్యతరగతి, మధ్య తరగతి ప్రజలకు సహాయం చేయడానికి, స్థిరమైన రవాణాను అభివృద్ధి చేయడానికి రాష్ట్రం అంతటా చార్జింగ్ సదుపాయాలను అభివృద్ధి చేస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం దాదాపు 110 చార్జింగ్ స్టేషన్లు ఉన్నాయి. రాష్ట్ర, జాతీయ రహదారులపై ప్రతి 25 కిలోమీటర్లకు, నగరాల్లో ప్రతి 3 కిలోమీటర్లకు ఒక చార్జింగ్ స్టేషన్ అందుబాటులోకి తెచ్చేందుకు నెడ్‌క్యాప్ ప్రణాళికలు తయారు చేసింది. ప్రైవేట్ భూయజమానులతో కలిసి 4 వేల లొకేషన్లను గుర్తించింది. రాష్ట్రంలో ఏడాదిలో 250 చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనుంది. ప్రభుత్వ ఉద్యోగులకు వాయిదా పద్ధతిలో లక్ష ఈ–వాహనాల పంపిణీతో పాటు రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు వంటి ప్రోత్సాహకాలనిస్తోంది.

ఖర్చు తక్కువ



విద్యుత్ వాహనాలకు బ్యాటరీ చార్జింగ్, మెయింటెనెన్స్, ఆపరేషన్ ఖర్చులు తక్కువ. తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణించవచ్చు. ఈవీలు సురక్షితమైనవి కూడా. రాష్ట్రంలో సుమారు 40 వేల ఎలక్ట్రిక్ వాహనాలు నమోదయ్యాయి. వాటితో పాటు భవిష్యత్‌లో పెరగనున్న ఈవీలన్నిటి కోసం చార్జింగ్ కేంద్రాలను అందుబాటులోకి తెస్తున్నాం. – కె విజయానంద్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

అక్కడ పేదలకు ఇళ్లిస్తే.. మా భూముల ధరలు పడిపోతాయి

- ముఖ్యమంత్రికి అంత ప్రేమ ఉంటే కడపలో ఇచ్చుకోమనండి
- ప్రపంచస్థాయి రాజధానిని నాశనం చేసేందుకే పేదలకు ఇళ్లు
- హైకోర్టులో పిటిషనర్ల న్యాయవాది ఉన్నం మురళీధరరావు వాదన
- చట్ట ప్రకారమే కేటాయింపులు.. దీన్ని ఏ కోర్టూ తప్పుపట్టజాలదు
- త్రిసభ్య ధర్మాసనానికి నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం.. తీర్పు రిజర్వ్



సాక్షి, అమరావతి: రాజధానిలో పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తే తమ భూముల ధరలు అమాంతం పడిపోతాయని అమరావతి కోసం భూములిచ్చిన వ్యక్తుల తరఫు సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు హైకోర్టుకు నివేదించారు. రాజధాని ప్రాంతంలో పేదలకు 5 శాతం భూమిస్తూ చట్టం చేసేందుకు తాము గతంలో ఎంత మాత్రం అంగీకరించలేదన్నారు. ప్రపంచ స్థాయి రాజధానిని నాశనం చేయాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా ఇళ్లను కూడా నిర్మించి ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రికి పేదలపై అంత ప్రేమ ఉంటే రాజధాని ప్రాంతంలో కాకుండా కడపలో ఇళ్ల స్థలాలు ఇచ్చుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ సిటీకి కేటాయించిన భూముల్లో పేదల ఇళ్ల నిర్మాణానికి రంగం సిద్ధం చేస్తున్నారని చెప్పారు. రాజధానికి ఆదాయాన్ని సమకూర్చే ఎలక్ట్రానిక్ సిటీ ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలిస్తే చుట్టుపక్కల తమ భూముల ధరలు దారుణంగా పడిపోతాయన్నారు. రాజధాని వెలుపల పెద్ద సంఖ్యలో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని, అక్కడ పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చుకోవచ్చని పునరుద్ఘాటించారు. రాజధాని భూముల విషయంలో సీఆర్‌డీఏ, రైతులకు మధ్య ఉన్నది వ్యాపార ఒప్పందమన్నారు. రైతుల అనుమతి లేకుండా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి వీల్లేదన్నారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అనుమతినిచ్చిన సుప్రీంకోర్టు... పట్టాల మంజూరు హైకోర్టు తుది తీర్పునకు లోబడి ఉంటుందని స్పష్టం చేసిందన్నారు. అందువల్ల పట్టాల మంజూరు వ్యవహారం తేలకుండా ఇళ్ల నిర్మాణం చేపట్టడం తగదన్నారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం హడావుడిగా ఏర్పాట్లు చేస్తోందని, గృహ నిర్మాణాలను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని అభ్యర్థించారు. రాజధాని భూములపై సీఆర్‌డీఏకు పూర్తిస్థాయి యాజమాన్యపు హక్కులు లేవని, కేవలం షరతులతో కూడిన హక్కులు మాత్రమే ఉన్నాయని పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదుల్లో ఒకరైన దమ్మాలపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. భూ సమీకరణ కింద తీసుకున్న భూములను ఇతరులకు ఇవ్వడానికి వీల్లేదన్నారు. ల్యాండ్ పూలింగ్ స్కీం బాధ్యతలన్నింటినీ పూర్తి చేసిన తరువాతే రాజధాని భూములపై సీఆర్‌డీఏకు హక్కులు వస్తాయని పిటిషనర్ల తరఫున మరో న్యాయవాది కారుమంచి ఇంద్రనీల్ బాబు వాదించారు.

మా నినాదమే.. పేదలందరికీ ఇళ్లు

ఈ వాదనలను రాష్ట్ర ప్రభుత్వం, సీఆర్‌డీఏ, రెవెన్యూ శాఖల తరఫున హాజరైన అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, కాసా జగన్‌మోహన్‌రెడ్డి, పోతిరెడ్డి సుభాష్ తోసిపుచ్చారు. ఏ ప్రభుత్వమైనా ఇళ్ల పట్టాలు ఇచ్చేది ఇళ్లను నిర్మించుకోవడానికేనన్నారు. ఇళ్ల నిర్మాణం లేనప్పుడు ఇళ్ల పట్టాలు ఇచ్చి ప్రయోజనం ఏముంటుందన్నారు. ప్రభుత్వ నినాదమే 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' అని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు సైతం తన ఉత్తర్వుల్లో ఎక్కడా ఇళ్లు నిర్మించవద్దని చెప్పలేదన్నారు. ఈ విషయంలో స్పష్టత కావాలనుకుంటే పిటిషనర్లు సుప్రీంకోర్టుకు వెళ్లవచ్చన్నారు. ఎలక్ట్రానిక్ సిటీకి మరో చోట భూమి కేటాయిస్తామన్నారు. రాజధాని ప్రాంతంలో మొత్తం భూమిలో 5 శాతం పేదల ఇళ్ల కోసం కేటాయించాలని సీఆర్‌డీఏ చట్టం చెబుతోందన్నారు. చట్ట నిబంధనలకు లోబడి చేసే పనిని ఏ కోర్టు కూడా తప్పుబట్టడానికి వీల్లేదన్నారు. రాజధాని కోసం రైతులు మాత్రమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం కూడా 14 వేల ఎకరాలను ఇచ్చిందని రెవిన్యూ శాఖ తరఫు న్యాయవాది సుభాష్ తెలిపారు. అందులో 1,400 ఎకరాలు పేదలకిస్తే పిటిషనర్లు రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తులు జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ రవినాథ్ తిల్హరీలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఇళ్ల నిర్మాణంపై తన నిర్ణయాన్ని రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు వీలుగా చట్ట సవరణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని, తదనుగుణంగా జారీ చేసిన జీవోలను సవాలు చేస్తూ పలువురి చేత టీడీపీ పిటిషన్లను దాఖలు చేయించిన విషయం తెలిసిందే.

స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ ప్రయివేట్ సంస్థలకు..

ఆహ్వానం పలుకుతున్న ఇస్రో



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా) : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఇటీవలే అభివృద్ధి చేసిన స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ)ను ప్రయివేట్ అంతరిక్ష సంస్థలకు అప్పగించేందుకు ఆ సంస్థలకు ఆహ్వానం పలుకుతోంది. ప్రపంచ మార్కెట్‌లో చిన్న తరహా ఉపగ్రహాలకు వాణిజ్యపరంగా మంచి డిమాండ్ ఉండటంతో భూమికి అతి తక్కువ దూరంలో, అంటే లియో ఆర్బిట్‌లోకి వాటిని పంపేందుకు ఎస్ఎస్ఎల్‌వీ రాకెట్‌కు రూపకల్పన చేశారు. ప్రపంచంలో అంతరిక్ష కేంద్రాలు లేని దేశాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి దేశాలకు భారతదేశం అతి తక్కువ ధరకే చిన్న తరహా ఉపగ్రహ ప్రయోగాలు చేస్తోంది. ఇటీవల దాకా పీఎస్ఎల్‌వీ రాకెట్ల ద్వారా చిన్న తరహా ఉపగ్రహాలను ప్రయోగిస్తూ వచ్చారు. ఈ ప్రయోగాల కోసమే ఎస్ఎస్ఎల్‌వీ రాకెట్‌లతో పాటు ప్రయోగ కేంద్రాన్ని కూడా తమిళనాడులో కులశేఖర్‌పట్నంలో నిర్మిస్తున్నారు. ఇస్రో రూపొందించిన ఆరు రకాల రాకెట్ సిరీస్‌లలో ఎస్ఎస్ఎల్‌వీ రాకెట్ మాత్రమే ప్రయివేట్ సంస్థలకు అప్పగించబోతున్నారన్న మాట.

31.29 గంటల్లో 72 కి.మీ. ఈత!

కాచిగూడ: భారత్‌కు చెందిన ఆరుగురు దివ్యాంగ ఈతగాళ్లు ఇంగ్లాండ్–ఫ్రాన్స్ మధ్య ఉన్న ఇంగ్లిష్ చానల్‌ను రెండు వైపులా రిలేగా ఈది సరికొత్త రికార్డు నెలకొల్పారు. హైదరాబాద్‌కు చెందిన కోచ్ రాజోరియా తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన దివ్యాంగుడు శివకుమార్‌తోపాటు ఎస్‌ఏ స్నేహన్ (తమిళనాడు), ఎల్విస్ అలీ హజారికా (అస్సాం), రిమో సాహా (పశ్చిమ బెంగాల్), సత్యేంద్రసింగ్ (మధ్యప్రదేశ్), జయంత్ దూబ్లే (మహారాష్ట్ర)తో కూడిన బృందం ఇంగ్లిష్ చానల్ ఈదడానికి ఈ నెల 8న లండన్‌కు వెళ్లారు. ఈ నెల 18న కెంట్‌లోని డోవర్‌లో సమీపంలో ఉన్న షేక్‌స్పియర్ బీచ్ నుంచి ఈత ప్రారంభించి ఉత్తర ఫ్రాన్స్‌లోని విస్సంట్ ఒడ్డును చేరుకొని తిరిగి డోవర్ వద్ద ఉన్న ఓల్డ్ సౌత్ ఫోర్‌ల్యాండ్ లైట్‌హౌస్ వద్దకు ఈ నెల 19న చేరుకున్నారు. ఇంగ్లిష్ చానల్‌ను రిలేగా ఈదిన ఆసియా ప్రాంత వాసులుగా రికార్డు సృష్టించారు.

జిల్లా వార్తలు

సీఎం జగన్ సామాజిక విప్లవానికి తెర తీశారు

- దేశ చరిత్రలో ఇలాంటి నాయకుడు లేరు
- చంద్రబాబు దళిత వ్యతిరేకి..
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి మేరుగ నాగార్జున

పమిడిముక్కల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సామాజిక విప్లవానికి తెర తీశారని, దేశ చరిత్రలో ఇలాంటి నాయకుడు లేరని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. కృష్ణాజిల్లా పమిడిముక్కల మండలం మర్రివాడలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని, సిమెంట్ రోడ్లను ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. అంతకు ముందు గోపువానిపాలెంలో వైఎస్సార్ విగ్రహానికి మంత్రి, ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ పార్టీ నాయకులు మంత్రి, ఎమ్మెల్యేలను గజమాలతో సత్కరించారు. అనంతరం మర్రివాడ వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామ కూడలిలో జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ పేద ప్రజల స్థితిగతులను మెరుగు పర్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఉన్నదూ లేని విధంగా 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామని, రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలాలివ్వకుండా చంద్రబాబు అడ్డు పడుతున్నారన్నారు. టీడీపీకి కూడా పథకాలన్ని అందుతున్నాయని, కారు కూతలు కూస్తే ప్రజలు క్షమించరన్నారు. చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉన్నప్పుడు పేదలకు ఏమైనా సాయం చేశారా?అని ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలో పేదరికం 11.5 శాతం ఉండగా, నేడు 6 శాతానికి తగ్గిందన్నారు.



మర్రివాడలో సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



సభలో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున, పక్కన ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

అనిల్‌కుమార్ ముఖ్యమంత్రికి ఇష్టుడని, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న కైలేని రాబోవు ఎన్నికల్లో మంచి మెజార్టీతో గెలిపించుకోవాలని మంత్రి మేరుగ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

మర్రివాడ అభివృద్ధికి సహకరిస్తా: కైలే

మర్రివాడ గ్రామంలో సుమారు కోటి రూపాయల వ్యయంతో సచివాలయం, ఆర్బీకే, ఆరోగ్య కేంద్రం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ తెలిపారు. నాలుగేళ్లతో రూ.55 లక్షల వ్యయంతో పలు సిమెంట్ రోడ్లు వేసినట్లు చెప్పారు. రూ.3 కోట్లతో గోపువానిపాలెం– మర్రివాడ రోడ్డును అభివృద్ధి చేసినట్లు తెలిపారు. హిందూ స్మశానవాటిక అభివృద్ధి, అంబేడ్కర్ విగ్రహ ప్రాంతాన్ని మెరక చేయిస్తానని హామీ ఇచ్చారు. సభలో ఆర్డీఓ విజయకుమార్, ఎంపీడీఓ సుధా ప్రవీణ్, జెడ్పీటీసీ యేనుగ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

తల్లిని దరిచేర్చిన యూ ట్యూబ్

- రెండేళ్ల క్రితం తప్పిపోయిన ఏపీ మహిళ
- మధిరలో ఆశ్రయం కల్పించగా గుర్తించిన ఏపీ వాసి

మధిర: మతిస్థిమితం లేక తల్లి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎక్కడా వెతికినా ఆచూకీ తెలియలేదు. చివరకు కాలిపోయిన స్థితిలో కనిపించిన మహిళ మృతదేహాన్ని తల్లిదిగానే భావించి కర్మకాండలు నిర్వహించారు. ఆమె కుమారుడు యూ ట్యూబ్‌లో అనాథాశ్రమం వీడియోలను చూసే క్రమంలో తల్లి కనిపించడంతో ఆనందానికి పట్టపగ్గాలు లేకుండా పోయింది. దీంతో ఏపీ నుంచి వచ్చిన యువకుడు ఖమ్మం జిల్లా మధిరలోని ఆశ్రమం నుంచి తల్లిని తీసుకెళ్లాడు. వివరాలు... ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం పుల్లూరు శివారు కొత్తగూడెంకు చెందిన నాగేంద్రమ్మకు భర్త తిరుపతయ్య, కుమారులు ముత్తయ్య, శ్రీనివాసరావు ఉన్నారు. నాగేంద్రమ్మకు మతిస్థిమితం సరిగ్గా లేక రెండేళ్ల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోవడంతో కుటుంబీకులు చుట్టుపక్కల వెతికారు. అప్పట్లో గ్రామ సమీపంలోని గుట్టపై కాలిపోయిన మహిళ మృతదేహం లభించడంతో నాగేంద్రమ్మదిగా భావించి కర్మకాండలు పూర్తి చేశారు. ఇటీవల నాగేంద్రమ్మ కుమారుడు ముత్తయ్య యూ ట్యూబ్‌లో విజయవాడకు చెందిన హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యాన రూపొందించిన వీడియో చూశాడు. ఈ వీడియో ఒక అనాథ శరణాలయం వివరాలు ప్రసారమవుతుండగా అందులో తల్లి కనిపించడంతో వెంటనే నిర్వాహకులకు ఫోన్ చేశాడు. అది ఖమ్మం జిల్లా మధిరలో ఆర్కే ఫౌండేషన్ చైర్మన్ దోర్నాల రామకృష్ణ, జ్యోతి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఆశ్రమంగా తేలింది. ఈమేరకు నాగేంద్రమ్మ కుటుంబ సభ్యులు శుక్రవారం మధిరకు రాగా, ట్రెయినీ ఐపీఎస్ అవినాష్‌కుమార్ సమక్షాన ఆశ్రమం నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ అప్పగించారు.



పోలీసుల సమక్షాన నాగేంద్రమ్మను కుటుంబీకులకు అప్పగిస్తున్న ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకులు



నాగేంద్రమ్మను వృద్ధాశ్రమానికి తీసుకువచ్చిన రామకృష్ణ (ఫైల్)

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు

సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్

మంగళగిరి: కృష్ణాయపాలెం జగనన్న కాలనీలో ఈనెల 24న ఇళ్ల నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కృష్ణాయపాలెం జగనన్న లే అవుట్‌లో ఏర్పాట్లను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. అనంతరం వెంకటపాలెంలోని మంతెన ఆశ్రమం వద్ద వాహన పార్కింగ్‌ను వివేక్ యాదవ్ పరిశీలించారు. గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి వచ్చే వాహనాలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా, ట్రాఫిక్ రద్దీ లేకుండా పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వెంకటపాలెం శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో జరుగుతున్న సభా వేదికనూ పరిశీలించారు. షేర్ వాల్ పద్ధతిలో నిర్మిస్తున్న మోడల్ హౌస్‌ను పరిశీలించారు. రూ.72.06 కోట్లతో సోషల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు పేదల స్థిర నివాసాలతోపాటు విద్య, ఆరోగ్య ప్రమాణాలను అత్యుత్తమ స్థాయికి తీసుకువెళ్లేందుకు అమరావతిలోని 25 లేఅవుట్లలో రూ.72.06 కోట్లతో సోషల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులను చేపట్టినట్లు వివేక్‌యాదవ్ వెల్లడించారు. ఈ లేఅవుట్లతోపాటు ప్రస్తుతం ఉన్న టిడ్కో గృహాల్లో సుమారు 2.36 లక్షల మంది జీవనం కొనసాగించనున్న నేపథ్యంలో ఐదువేల మొక్కలను నాటే కార్యక్రమాన్ని నవులూరులో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వివేక్‌యాదవ్ వెంట ఇంజినీర్లు సీహెచ్ ధనుంజయ, పీవీ పల్లంరాజు, ల్యాండ్ స్కేప్ ఎన్విరాన్‌మెంట్ సహాయ సంచాలకులు ఎం.హరిప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి ఎ. శివరామకృష్ణ, ఏపీ సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ అలీం బాషాలతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



జగనన్న లేఅవుట్, సభా వేదికను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ఎమ్మెల్సీ ఎం.హనుమంతరావు, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు

తలశిల సూచనలు...

కృష్ణాయపాలెంలోని జగనన్న లేఅవుట్‌లో గృహ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమ ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ కూడా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ శివరామకృష్ణ, ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, డీఆర్‌డీఏ పీడీ హరనాథ్, డ్వామా పీడీ యుగంధర్ కుమార్, డీఎస్పీలు జె రాంబాబు, పోతురాజు పాల్గొన్నారు.



జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్‌యాదవ్

గ్రామ సచివాలయ చట్టం అమల్లోకి తేవడం సంతోషం

ఏపీ జీపీ ఎస్‌డబ్ల్యూఎస్‌ఎ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్



అవనిగడ్డ: గ్రామ సచివాలయ చట్టంను అమల్లోకి తీసుకువచ్చిన సందర్భంగా ఏపీ గ్రామ పంచాయతీ సెక్రటరీస్ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ (ఏపీ జీపీ ఎస్‌డబ్ల్యూఎస్‌ఎ) రాష్ట్ర అధ్యక్షుడు ఆది అశోక్ సీఎం వైఎస్ జగన్‌కి శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో గ్రామ సచివాలయ చట్టాన్ని ఆమోదించారని చెప్పారు. శుక్రవారం ఈ చట్టం అమల్లోకి తీసుకురావడంపై రాష్ట్ర ప్రభుత్వానికి అశోక్ ధన్యవాదాలు తెలిపారు. గ్రేడ్ 5లో ఉన్న పంచాయతీ కార్యదర్శులకు ఇంత వరకూ ఎలాంటి అధికారాలు లేకపోవడం వల్ల ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, చట్టం అమల్లోకి తీసుకురావడంతో రాష్ట్ర వ్యాప్తంగా 6,166 ఉద్యోగులకు అధికారాలు రానున్నాయని చెప్పారు.

విజయవాడ స్టేషన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డీఆర్‌ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్ బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారిగా శుక్రవారం విజయవాడ రైల్వేస్టేషన్‌లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. తూర్పు ప్రవేశ ద్వారా నుంచి తనిఖీలు చేపట్టి ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై బాపు, మహాత్మాగాంధీ వెయింటింగ్ హాల్స్‌లోని సిట్టింగ్ ఏర్పాట్లు, టాయిలెట్లు, తాగునీరు, క్లోక్ రూమ్‌లు తనిఖీ చేశారు. విజయవాడ–లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ రైలులోని బయో టాయిలెట్, కోచ్‌లో పరిశుభ్రతను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు రాకుండా డిపోలోనే క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాలని మెయింటెనెన్స్ విభాగం అధికారులను ఆదేశించారు. అదే విధంగా ప్లాట్‌ఫామ్‌లపై లీకేజీలను అరికట్టాలని, వర్షాకాలంలో ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. అనంతరం ప్లాట్‌ఫాం నంబర్ 6లో కంసమ్ కిచెన్, సౌత్ ఎఫ్‌ఓబి, రిటైరింగ్ రూమ్‌లను తనిఖీ చేశారు. రైల్వే స్టేషన్‌లో ఆహ్లాదకర వాతావరణంతో ప్రయాణికులు చక్కటి అనుభూతి పొందే విధంగా పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షించాలని డీఆర్‌ఎం అధికారులను ఆదేశించారు.



విజయవాడ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపట్టిన డీఆర్‌ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్

ఈ పర్యటనలో సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు, సీనియర్ డీఈఈ టి.సురేష్, సీనియర్ డీఓఎమ్ డి.నరేంద్రవర్మ, సీనియర్ డీఎమ్ఈ ఎమ్.రవికిరణ్, స్టేషన్ డైరెక్టర్ పీబీఎస్ ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

గ్రామ, వార్డు మహిళా పోలీసులను లా అండ్ ఆర్డర్‌కు వద్దు: డీజీపీ

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల్లోని మహిళా పోలీసులను పోలీసు శాఖలోని సాధారణ విధులైన బందోబస్తు, రిసెప్షన్, శాంతిభద్రతల వంటి విధులకు వినియోగించవద్దని డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశించారు. మహిళా పోలీసులను తరచూ పోలీస్ స్టేషన్లకు పిలిపించవద్దని చెప్పారు. గ్రామాల్లో, పట్టణాల్లో మహిళలు, చిన్నారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ఇతర శాఖలకు పూర్తి సహాయ సహకారాలు అందించడం మహిళా పోలీసుల ముఖ్య విధి అని ఆయన తెలిపారు. అందుకు విరుద్ధంగా మహిళా పోలీసులను పోలీసు విధులకు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ మేరకు డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి డీఐజీలు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలకు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

ఆగస్టులో మెగా డీఎస్సీ హర్షణీయం

సాక్షి, అమరావతి: ఆగస్టులో మెగా డీఎస్సీ విడుదలతో పాటు త్వరలో అన్ని ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేస్తామని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ హామీ ఇచ్చినట్లు ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ చెప్పారు. శుక్రవారం విజయవాడలో మంత్రి బొత్సను కలిసి నిరుద్యోగుల సమస్యలపై వినతిపత్రమిచ్చారు. ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఇటీవల జరిగిన ప్రాథమిక పరీక్షలో తప్పుదొర్లిన ప్రతి ప్రశ్నకి ఒక మార్కు కేటాయించాలని కోరారు. జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ, డిజిటల్ గ్రంథాలయ శాఖ, పోలీసు విభాగాల్లో పోస్టులకు నోటిఫికేషన్ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. జనరల్ కేటగిరీల్లో వయోపరిమితిని ఏపీపీఎస్సీ, డీఎస్సీ అభ్యర్థులకు 47 ఏళ్లకు, కానిస్టేబుల్‌కు 27 ఏళ్లకు, ఎస్ఐ అభ్యర్థులకు 30 ఏళ్లకు, ఫైర్, జైలు వార్డెన్స్ అభ్యర్థులకు 32 ఏళ్లకు పెంచాలని కోరారు. హోంగార్డులకు జనరల్ అభ్యర్థులతో కాకుండా ప్రత్యేకంగా రాత పరీక్ష పెట్టాలన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని చెప్పారు.

పవన్‌పై కేసు.. నీతిమాలిన చర్య : చంద్రబాబు

సాక్షి, అమరావతి: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌పై ప్రభుత్వం పరువు నష్టం కేసు పెట్టడం బుద్ధిలేని, నీతిమాలిన చర్య అని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు విమర్శించారు. ప్రజలు తమ సమస్యలను ప్రస్తావిస్తే దాడులు చేస్తున్నారని, రాజకీయ పక్షాలు ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలని, అణచివేత ధోరణి మానుకోవాలన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం కూడా నేరమనే పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని తెలిపారు. నిబంధనలకు వ్యతిరేకంగా ప్రజల వ్యక్తిగత వివరాలను వలంటీర్ల ద్వారా సేకరించడాన్ని పవన్‌కళ్యాణ్ ప్రశ్నిస్తే కేసు పెడతారా అని ప్రశ్నించారు. ప్రజల వ్యక్తిగత వివరాలు, కుటుంబ వ్యవహారాలపై ప్రభుత్వం సమాచారం సేకరించడం తప్పన్నారు. కేసు పెట్టాల్సి వస్తే ప్రభుత్వ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న సీఎం జగన్‌పై ముందు కేసు పెట్టి విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

వానలే వానలు..

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో వర్షాలు కొనసాగడానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. ప్రస్తుతం వాయవ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న ఒడిశా తీరంలో అల్పపీడనం కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా దక్షిణ ఒడిశా మీదుగా ఉత్తరాంధ్ర సమీపంలో వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. ఇది ఆదివారం లోగా పశ్చిమ వాయవ్య దిశగా కదులుతుంది. మరోవైపు ఈ నెల 24న వాయవ్య బంగాళాఖాతానికి ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. వీటన్నిటి ప్రభావంతో శనివారం కోస్తాంధ్ర, రాయలసీమల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. 23, 24, 25 తేదీల్లో కోస్తాంధ్ర, రాయలసీమల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరుగాను, అక్కడక్కడ భారీ వర్షాలకు ఆస్కారం ఉందని వివరించింది. తీరం వెంబడి గంటకు 40–45 కిలోమీటర్లు.. గరిష్టంగా 55 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లవద్దని హెచ్చరించింది.

కృష్ణా నదిలో పెరుగుతున్న వరద

సాక్షి, అమరావతి/సాక్షి, బళ్లారి: పశ్చిమ కనుమల్లో వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా నదిలో వరద ప్రవాహం క్రమేణ పెరుగుతోంది. దీంతో శుక్రవారం కర్ణాటకలోని ఆల్మట్టి డ్యామ్‌లోకి ఇన్‌ఫ్లో 70,780 క్యూసెక్కులు రాగా, డ్యామ్‌లో నీటి నిల్వ 38.40 టీఎంసీలకు చేరింది. అయితే, ఆల్మట్టికి దిగువన ఉన్న నారాయణపూర్ డ్యామ్‌లోకి వరద ప్రవాహం చేరడం లేదు. తుంగభద్ర డ్యామ్‌లోకి మాత్రం వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. ప్రస్తుతం 13,340 క్యూసెక్కులు చేరుతుండటంతో తుంగభద్ర డ్యామ్‌లో నీటి నిల్వ 13.72 టీఎంసీలకు చేరుకుంది. శ్రీశైలం డ్యామ్‌కు దిగువన కృష్ణా బేసిన్‌లో కురిసిన వర్షాల వల్ల నాగార్జున సాగర్‌కు 5,988 క్యూసెక్కులు వరద నీరు చేరుతోంది.

ఆ రైత్వారీ పట్టాలు చెల్లుతాయి

గ్రామ సర్వీసు ఈనాం భూములపై రెవెన్యూ శాఖ ఉత్తర్వులు

- రికార్డుల్లోకి ఆ భూముల పట్టాదారుల పేర్లు
- పట్టాదారుల వారసులు, వారి నుంచి కొన్న వారి పేర్లూ రికార్డుల్లోకి
- 2013 చట్ట సవరణలు గ్రామ ఈనాం సర్వీస్ భూములకు వర్తించవు
- రెవెన్యూ యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలతో జీవో నంబర్ 310 జారీ
- ఇటీవలే మంత్రివర్గ సమావేశంలో ఈ ప్రతిపాదనలకు ఆమోదం
- వెంటనే చర్యలు చేపట్టిన రెవెన్యూ శాఖ
- 22 (ఎ) నిషేధిత జాబితా నుంచి తొలగనున్న 1.68 లక్షల ఎకరాలు
- 1.13 లక్షల కుటుంబాలకు మేలు

సాక్షి, అమరావతి : గ్రామ సర్వీసు ఈనాం భూములను నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆ భూములపై ఉన్న ఆంక్షలను తొలగించేందుకు ఇటీవలే రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అందుకనుగుణంగా గ్రామ సర్వీసు ఈనాం భూములకు జారీ చేసిన రైత్వారీ పట్టాలు చెల్లుబాటవుతాయని రెవెన్యూ శాఖ తెలిపింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్ జీఓ నంబర్ 310 జారీ చేశారు. ఈ భూములకు గతంలో జారీ చేసిన రైత్వారీ పట్టాదారుల పేర్లను అన్ని రికార్డుల్లోకి ఎక్కించాలని రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించారు. పట్టాదారులు లేని పక్షంలో వారి వారసులు (లీగల్ హైర్స్), లేకపోతే వారి నుంచి కొనుగోలు చేసిన వ్యక్తుల పేర్లను రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. రీ సర్వే రికార్డుల్లోనూ వారి పేర్లను చేర్చాలని స్పష్టం చేశారు. దీంతో 1.13 లక్షల మందికి చెందిన 1.68 లక్షల ఎకరాలు గ్రామ సర్వీసు ఈనాం భూములు 22 (ఎ) జాబితా నుంచి తొలగి, ఆ కుటుంబాలకు మేలు కలుగుతుంది.

ఈనాం భూముల చట్ట సవరణతో 22 (ఎ)లోకి సర్వీసు ఈనాం భూములు

దశాబ్దాల క్రితం గ్రామానికి సేవ చేసే కుల వృత్తుల వారి జీవన భృతి కోసం ఈనాంగా భూములిచ్చారు. 1956 ఈనాం (రద్దు, రైత్వారీ పట్టాలుగా మార్పు) చట్టం ప్రకారం కొన్ని ఈనాం భూములు రద్దవగా, కొన్ని రైత్వారీ భూములుగా మారాయి.



రైత్వారీ భూములకు అప్పట్లోనే రైత్వారీ పట్టాలు జారీ చేశారు. ఈనాందారులు తమ భూములను ఎవరికైనా అమ్ముకునే హక్కు కూడా ఈనాం చట్టం కల్పించింది. దీంతో ఆ భూములను కొన్న వారికి రక్షణ ఏర్పడింది. అయితే గ్రామ సర్వీసు చేసిన వారికే కాకుండా ధార్మిక సంస్థలు, దేవాలయాల మనుగడ కోసం వాటికి ఈనాంగా భూములిచ్చారు. ఆ దేవాలయాల భూములు చాలావరకు ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఆ దేవాలయాల్లో ఏ సేవల కోసం భూమి ఇచ్చారో ఆ సేవలు కూడా ప్రస్తుతం లేవు. దీంతో వాటి రక్షణ కోసం 2013లో ఈనాం చట్టానికి సవరణలు చేశారు. దీని ప్రకారం ఈనాం భూములన్నింటిపైనా ఆంక్షలు విధించి వాటిని నిషేధిత జాబితా 22 (ఎ)లో చేర్చారు. దీంతో దేవాలయాల ఈనాం భూములతోపాటు గ్రామ సర్వీసు ఈనాం కింద పొందిన రైత్వారీ పట్టా భూములు కూడా 22 (ఎ) జాబితాలో చేరిపోయాయి. రాష్ట్రంలో భూముల రీ సర్వే జరుగుతున్న క్రమంలో గ్రామ సర్వీసు ఈనాం భూములపై రైతుల నుంచి పెద్దఎత్తున వినతులు వచ్చాయి. రైత్వారీ పట్టాలు పొందిన వారి నుంచి తాము కొన్నామని, తమ పేర్లను రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కించడంలేదని, తమకు న్యాయం చేయాలని కోరారు.

ధార్మిక సంస్థల ఈనాం, సర్వీసు ఈనాం భూముల మధ్య తేడా ఇదే


ఈ వినతులను పరిశీలించిన ప్రభుత్వం దేవాలయ, ధార్మిక సంస్థల ఈనాం, గ్రామ సర్వీసు ఈనాం భూముల మధ్య ఉన్న తేడాపై స్పష్టత ఇచ్చింది. ధార్మిక సంస్థల ఈనాం భూములను కేవలం ఆ దేవాలయాలు, అందులోని దేవుడి సేవల కోసం మాత్రమే ఇచ్చారు. అవి ఎప్పటికీ దేవాలయాలవే తప్ప వేరే వ్యక్తులు పొందే అవకాశం ఉండదు. గ్రామ సర్వీసు ఈనాం భూములను అందరి మేలు కోసం పనిచేసిన కుల వృత్తుల వారికి (క్షురకులు, చాకలి, మంగలి వంటి వృత్తులు) ఇచ్చారు. ఆ భూములు ఆ వ్యక్తులు, వారి వారసులకు వస్తాయి. ఇలా సర్వీసు చేసిన కుల వృత్తుల వారి సంఖ్య గ్రామాల్లో చాలా పెద్ద సంఖ్యలో ఉండడం వల్లే వారికి రైత్వారీ పట్టాలు మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో 2013లో ఈనాం చట్టానికి చేసిన సవరణలు గ్రామ సర్వీసు ఈనాం భూములకు వర్తించవని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఈ భూములన్నింటినీ 22(ఎ) నుంచి తొలగించాలని, వారి పేర్లను రికార్డుల్లోకి ఎక్కించాలని జిల్లా కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లను ఆదేశించారు.

వలంటీర్లపై విషం కక్కడం సరికాదు

- సినిమాల్లో యాక్టింగ్ చేసినట్లు నిజజీవితంలో కుదరదు
- రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రజలంతా కావాలనుకుంటున్న వలంటీర్ వ్యవస్థపై ప్రతిపక్షాలు విషం కక్కడం సరికాదని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళంలోని ఫాజుల్‌బాగ్‌పేటలో శుక్రవారం నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వలంటీర్లు కోవిడ్ వంటి ఆపత్కాలంలో ప్రజలకు అండగా నిలిచి ఆదుకున్నారని, వారి సేవలు చూసి ఓర్వలేకే ఎల్లో మీడియాతోపాటు ప్రతిపక్షాలు విషం కక్కుతున్నాయని విమర్శించారు. విపక్షాలు చేసే అబద్ధపు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. సినిమాల్లో యాక్టింగ్ చేసినట్లు నిజ జీవితంలోనూ చేయవచ్చనే అపోహల నుంచి పవన్ కళ్యాణ్ బయటకు రావాలని సూచించారు. సినిమాల మాదిరిగా రాజకీయాలు ఉండవని ప్రజా సంక్షేమం కోసం ఏ నాయకుడైతే ఆలోచన చేస్తారో వారే రియల్ హీరో అని అన్నారు. శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంవీ స్వరూప్, నాయకులు పాల్గొన్నారు.

ఆతిథ్యానికి అందలం



▶ మొదటి పేజీ తరువాయి

పర్యాటక ప్రాజెక్టులకు ప్రభుత్వం వేగంగా అనుమతులు మంజూరు చేస్తోంది. విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)లో ఒప్పందం కుదిరిన ప్రాజెక్టులకు మరింత ప్రాధాన్యత ఇస్తోంది. ఇప్పటికే ఐదు ప్రదేశాల్లో రూ.1,350 కోట్ల అంచనాతో 7 స్టార్ సౌకర్యాలతో లగ్జరీ రిసార్ట్స్ నిర్మాణానికి ఒబెరాయ్ ముందుకొచ్చింది. ఇందులో విశాఖ (అన్నవరం), తిరుపతి (పేరూరు), గండికోటలో నిర్మాణాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. త్వరలోనే పిచ్చుకలంక, హార్సిలీహిల్స్‌లో కూడా ఒబెరాయ్ నిర్మాణాలకు ఒప్పందాలు జరగనున్నాయి. రాష్ట్రంలో ఒక్క ఒబెరాయ్ సంస్థ ద్వారానే సుమారు 10,900 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. తాజాగా విశాఖలో మేఫెయిర్, తిరుపతిలో ఎంఆర్‌కేఆర్ (హయత్) సంస్థల ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటికి ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ వెంటనే స్థలాలను సైతం కేటాయించింది.

తిరుపతిలో 5 స్టార్ హోటల్

ప్రపంచ ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతికి ఏటా 30 నుంచి 40 మిలియన్ల యాత్రికులు వస్తుంటారు. దీనికి తోడు చెన్నై – తిరుపతి – నెల్లూరు పారిశ్రామిక హబ్ కూడా ఈ ప్రాంతంలో వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ క్రమంలో తిరుపతిలోని పేరూరులో 5 స్టార్ లగ్జరీ హోటల్ నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్స్ (హయత్ గ్రూప్) ముందుకొచ్చింది. రూ.218 కోట్ల పెట్టుబడితో 1550 మందికిపైగా ఉపాధి కల్పన లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందించింది. దీని ద్వారా వచ్చే 25 ఏళ్లలో రాష్ట్రానికి రూ.230.08 కోట్ల ఆదాయం లభించనుంది. ఇందులో సుమారు 144 గదులు (స్టాండర్డ్, సుపీరియర్, డీలక్స్, సూట్స్), అత్యాధునిక రెస్టారెంట్, కాన్ఫరెన్స్, బాంకెట్ హాల్, వివాహాలు, ఎగ్జిబిషన్లకు ప్రత్యేక వేదిక, హెల్త్ హబ్ ఇతర ప్రపంచ స్థాయి సౌకర్యాలు ఉంటాయి.

విశాఖలో రూ.525 కోట్లతో విల్లాల సముదాయం

విశాఖపట్నానికి సమీపంలోని అన్నవరం వద్ద మేఫెయిర్ సంస్థ (భువనేశ్వర్) అత్యాధునిక లగ్జరీ రిసార్ట్‌ను అభివృద్ధి చేయనుంది. సుమారు 40 ఎకరాల్లో రూ.525 కోట్లతో 250 రిసార్టులను నిర్మిస్తుంది. దీని ద్వారా 1,750 మందికి ఉపాధి లభిస్తుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 25 ఏళ్లలో రాష్ట్రానికి రూ.852.40 కోట్లు ఆదాయం లభిస్తుంది. ఇందులో భారీ కన్వెన్షన్ సెంటర్, రెస్టారెంట్, మినీ గోల్ఫ్ కోర్సు, 4,500 మంది కూర్చునేలా బ్యాంకెట్ హాల్, మరో 10 చిన్న బాంకెట్ హాళ్లు, ఓపెన్ స్కై బాంకెట్ హాల్, షాపింగ్ మాల్స్ ఉంటాయి.

రూ.69.37 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన

పర్యాటక రంగంలో మౌలిక సదుపాయాల కల్పన ద్వారా ఎక్కువ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. తొలిదశలో భాగంగా విశాఖపట్నంలోని అన్నవరం, పేరూరు, గండికోట గ్రామాలను పర్యాటకంగా అభివృద్ధి చేయనుంది. సుమారు రూ.69.37 కోట్లతో గ్రామాల్లో పెద్ద రహదారులను కలుపుతూ రోడ్ల నిర్మాణం, నీటి సౌకర్యం మెరుగుదల, ప్రత్యేక విద్యుత్ లైన్లు, అత్యాధునిక మురుగు పారుదల వ్యవస్థను అందుబాటులోకి తేనుంది. వీటికి త్వరలో టెండర్లు పిలిచి పనులను ప్రారంభించనుంది.

సీఎం జగన్ బ్రాండింగ్‌తోనే పెట్టుబడులు

సీఎం జగన్ బ్రాండింగ్‌తో రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయి హోటల్ రంగ సంస్థలు వస్తున్నాయి. ఒబెరాయ్‌తో పాటు మేఫెయిర్, హయత్ గ్రూప్‌ల హోటళ్లు, లగ్జరీ విల్లాల నిర్మాణానికి వేగంగా అనుమతులు ఇచ్చాం. పర్యాటకంతో పాటు స్థానిక యువతకు ఉపాధి కల్పనే ఈ ప్రాజెక్టుల లక్ష్యం. జీఐఎస్‌లో కుదిరిన ప్రతి ఒప్పందాన్ని క్షేత్ర స్థాయిలోకి తీసుకొస్తాం. తిరుపతి, విశాఖ, గండికోటను ప్రపంచ పటంలో మరింత ఉన్నతంగా నిలబెడతాం. పర్యాటకానికి అవకాశాలుండే ప్రాంతాలను గుర్తించి ప్రభుత్వమే అభివృద్ధి చేస్తుంది. తద్వారా మరింతగా పెట్టుబడులను ఆకర్షిస్తాం.

– ఆర్కే రోజా, పర్యాటక శాఖ మంత్రి

గోదావరి తగ్గుముఖం



యలమంచిలి మండలం కనకాయలంక వద్ద కాజ్‌వే పై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పడవపై ముంపు ప్రాంతాలకు తరలిస్తున్న బియ్యం బస్తాలు

▶ మొదటి పేజీ తరువాయి

ఎగువ నీటి మట్టాలు తగ్గుతుండడంతో ధవళేశ్వరం వద్ద రాత్రి 8గంటలకు కూడా నీటిమట్టం 11.70 అడుగులు ఉంది.

వరద నీటిలో గండిపోశమ్మ గుడి

దేవీపట్నం మండలంలోని గండిపోశమ్మ ఆలయం శుక్రవారం పూర్తిగా వరద నీటలో మునిగిపోయింది. విలీన మండలాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లోని ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ స్థానిక ఐటీడీఏలో ఉంటూ సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న వారికి నిత్యావసరాలు అందజేయాలని ఆయన ఆదేశించారు. నాలుగు మండలాల్లో 12 లాంచీలు, మర పడవలను సిద్ధంగా ఉంచారు. శబరి నది కూడా శాంతించింది. ఇక.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నదీపాయల మధ్య ఉన్న లంకలకు బాహ్య ప్రపంచంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో లంకవాసులు పడవల మీదనే రాకపోకలు సాగిస్తున్నారు. ఎగువన తగ్గినా దిగువన వరద పెరుగుతోంది. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం కనకాయలంక వద్ద కాజ్‌వేపై నుంచి నాలుగు అడుగుల వరద నీరు ప్రవహిస్తోంది.

త్వరలోనే బ్యాంకు బకాయిల చెల్లింపు

- కరోనా సమయంలో ఇబ్బందులవల్లే జాప్యం
- పచ్చపత్రికల్లో దుష్ప్రచారం టీడీపీ నేతల పనే
- పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి : 'బ్యాంకు బకాయిలు త్వరలోనే పద్ధతి ప్రకారం సాయి సుధీర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ చెల్లిస్తుంది. సంస్థ నుంచి నేను పదేళ్ల క్రితమే బయటకొచ్చి రాజకీయాల్లోకి ప్రవేశించా. నా రాజకీయాలకు.. సంస్థ వ్యాపార లావాదేవీలకు ఎలాంటి సంబంధం లేదు. 30 ఏళ్లుగా కెనరా బ్యాంకుతో మా సంస్థ లావాదేవీలు చేస్తోంది. కరోనా సమయంలో మా సంస్థ కొన్ని ఒడిదుడుకులకు గురైంది. ఫలితంగా బకాయిలు చెల్లించడంలో జాప్యం జరిగింది. ఈ క్రమంలో బ్యాంకు నుంచి నోటీసులు వచ్చాయి. దీనిపై పచ్చ మీడియా, టీడీపీ నేతలు దుష్ప్రచారం చేయడం సరికాదు.' అని శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. పుట్టపర్తిలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బ్యాంకు బకాయిలు ఎగ్గొట్టారని రెండ్రోజులుగా తనపై వస్తున్న వార్తలను ఖండించారు.



పదేళ్ల క్రితమే బయటికొచ్చా

సాయి సుధీర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ నుంచి తాను పదేళ్ల క్రితమే బయటకొచ్చి రాజకీయాల్లోకి ప్రవేశించినట్లు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సుధీర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ 30 ఏళ్లుగా దేశంలోని సుమారు 15 రాష్ట్రాల్లో వ్యాపార లావాదేవీలు చేస్తోందన్నారు. ఏనాడూ బ్యాంకు బకాయిలు ఎగ్గొట్టి పారిపోవాలని ఆలోచించలేదన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేని ప్రత్యర్థులు కుయుక్తులు పన్ని పచ్చ పత్రికల్లో దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను పోటీలో ఉంటే గెలవడం కష్టమని భావించిన టీడీపీ మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి చేసిన కుట్ర ఇదని దుయ్యబట్టారు. నిజానికి.. సాయి సుధీర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఎక్కువ పనులు కర్ణాటకలో చేసినట్లు తెలిపారు. అక్కడ ఎన్నికలు రావడంతో తమ సంస్థకు బిల్లులు పెండింగ్‌లో పడ్డాయన్నారు. కర్ణాటకలో సిద్ధరామయ్య ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికారులను సంప్రదించి బిల్లులు త్వరగా మంజూరుచేయాలని కోరామన్నారు.

బొట్టు పెట్టి ఆహ్వానం



ఇంటి లబ్ధిదారుకు బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్న మహిళా నేత



కృష్ణాయపాలెం లే అవుట్‌లో కొనసాగుతున్న విద్యుత్ ఏర్పాటు పనులు

తోబుట్టువులా తోడుగా..



వలంటీర్‌గా పనిచేస్తున్నా. నా భర్త వ్యవసాయ కూలీ. పెళ్లయి 13 ఏళ్లు అవుతోంది. అప్పటి నుంచి అద్దె ఇంట్లోనే ఉంటున్నాం. గత ప్రభుత్వం హయాంలో రెండు సార్లు ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా నిరాశే ఎదురైంది. ఇప్పుడు ఒక్కసారి దరఖాస్తు చేయగానే ఇంటి స్థలం, ఇల్లు మంజూరైంది. కృష్ణాయపాలెం లేఅవుట్‌లో నాకిచ్చిన స్థలంలో నా ఇంటినే మోడల్ హౌస్‌గా నిర్మించారు. సీఆర్‌డీఏలో పూర్తయిన మొదటి ఇల్లు నాదే. మాటల్లో చెప్పలేనంత సంతోషంగా ఉంది. పిల్లల చదువుకు అమ్మ ఒడి కింద సాయం చేశారు. పొదుపు సంఘంలో ఉన్న నాకు నాలుగు విడతల్లో రూ.10 వేల చొప్పున రుణమాఫీ అందించారు. తోబుట్టువులా సీఎం జగన్ అండగా ఉన్నారు. ప్రభుత్వం మాకు ఇళ్లు ఇస్తుంటే కొందరు కోర్టుల్లో కేసులు వేస్తున్నారు. ఆ వార్తలు విన్నప్పుడు ఎక్కడ ఇల్లు రాకుండా పోతుందోనని భయంగా ఉంటుంది.

– ఈపూరి జీవరత్నం, ఇంటి లబ్ధిదారురాలు, కృష్ణాయపాలెం, గుంటూరు జిల్లా

6 - 8 నెలల్లో నిర్మాణాలు పూర్తి



సీఆర్‌డీఏలో ఆరు నుంచి ఎనిమిది నెలల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. నిబద్ధతతో పనిచేసే లేబర్ ఏజెన్సీలను కలెక్టర్లు గుర్తించారు. ఈ నెల 24న సీఎం జగన్ చేతుల మీదుగా ఇళ్ల నిర్మాణాల శంకుస్థాపన కార్యక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

– లక్ష్మీశా, ఎండీ, ఏపీ గృహ నిర్మాణ సంస్థ

▶ మొదటి పేజీ తరువాయి

చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి లబ్ధిదారులను సగౌరవంగా ఆహ్వానిస్తున్నారు. వలంటీర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి బొట్టుపెట్టి ఈ కార్యక్రమానికి రావాలని సాదరంగా కోరుతున్నారు. వన మహోత్సవం సందర్భంగా అదే రోజు అమరావతిలో 5 వేల మొక్కలను నాటే కార్యక్రమానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మూడు రోజుల్లో మోడల్ హౌస్

గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కృష్ణాయపాలెం లేఅవుట్‌లో లబ్ధిదారురాలు ఈపూరి జీవరత్నం ఇంటిని మోడల్ హౌస్‌గా నిర్మించారు. షీర్ వాల్ పద్ధతిలో మూడు రోజుల స్వల్ప వ్యవధిలోనే అజయ వెంచర్స్ లేబర్ ఏజెన్సీ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసింది. వీలైనన్ని ఇళ్లను షీర్ వాల్ పద్ధతిలో నిర్మించి వేగంగా పేదలకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. లబ్ధిదారులకు సులభంగా అర్థం అయ్యేలా మోడల్ హౌస్‌ను నిర్మించారు.

అత్యధికంగా ఆప్షన్–3 ఇళ్లు

ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన 50,793 మంది పేదలకు ప్రభుత్వం సీఆర్డీఏలో 1,366.48 ఎకరాల్లో 25 లేఅవుట్లలో ఇంటి స్థలాలను పంపిణీ చేసింది. 47,017 మంది లబ్ధిదారుల (ఎన్టీఆర్ జిల్లా 23,821, గుంటూరు జిల్లా 23,196) ఇళ్ల నిర్మాణానికి ఇప్పటికే అనుమతులు లభించాయి. వీరిలో 45,100 మంది ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి ఇచ్చే ఆప్షన్–3ని ఎంపిక చేసుకున్నారు. 24,200 ఇళ్లను షీర్‌వాల్ పద్ధతిలో, మిగిలినవి సాధారణ పద్ధతిలో నిర్మించేందుకు 36 లేబర్ ఏజెన్సీలను గుర్తించారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు వీలుగా రూ.365.91 కోట్లతో విద్యుత్, నీటి సదుపాయంతో పాటు అప్రోచ్ రోడ్లను వేస్తున్నారు. ఈ లేఅవుట్లలో రూ.72.06 కోట్లతో మౌలిక వసతులు, స్కూళ్లు, హెల్త్ సెంటర్లు, అంగన్‌వాడీలు, డిజిటల్ లైబ్రరీలు వంటి సదుపాయాలను కల్పించనున్నారు.

పేదలకు 30 లక్షలకుపైగా ఇళ్లు

రాష్ట్రంలో ఇళ్లు లేని పేదల కోసం 30 లక్షలకు పైగా గృహ నిర్మాణం లక్ష్యంగా నవరత్నాలు పథకం ద్వారా సీఎం జగన్ చర్యలు చేపట్టారు. 30.65 లక్షల మందికి ఉచితంగా ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు. ఇళ్ల స్థలాల కింద పేదలకు అందించిన స్థలాల మార్కెట్ విలువ రూ.75 వేల కోట్ల మేరకు ఉంటుంది. కేవలం స్థలాలిచ్చి సరిపుచ్చకుండా రెండు దశల్లో 21.25 లక్షల (టిడ్కో ఇళ్లు 2.62 లక్షలు, సాధారణ ఇళ్లు 18.63 లక్షలు) ఇళ్ల నిర్మాణానికి ఇప్పటివరకూ అనుమతులు ఇచ్చారు. సీఆర్‌డీఏలో నిర్మించే ఇళ్లు వీటికి అదనం. సాధారణ ఇళ్లలో ఇప్పటికే 4.40 లక్షల గృహ నిర్మాణాలు పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. రూ.లక్షల విలువ చేసే స్థలాలను ఉచితంగా సమకూర్చడంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు, పావలా వడ్డీకి రూ.35 వేల రుణ సాయాన్ని అందచేస్తున్నారు. దీంతోపాటు ఉచితంగా ఇసుక, సబ్సిడీపై స్టీల్, సిమెంట్, ఇతర నిర్మాణ సామాగ్రిని సరఫరా చేస్తున్నారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 24న తొలుత కృష్ణాయపాలెం చేరుకుని ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తారు. అనంతరం పైలాన్‌ను ఆవిష్కరించి లబ్ధిదారులతో ముచ్చటిస్తారు. వెంకటాయపాలెం బహిరంగ సభలో పాల్గొని లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి సంబంధించి శాంక్షన్ లెటర్ అందచేస్తారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి, సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్‌యాదవ్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సభాస్థలితో పాటు సీఎం ప్రసంగ వేదికను శుక్రవారం పరిశీలించారు. నవులూరు లే అవుట్ వద్ద సీఎం 5 వేల మొక్కలను నాటే కార్యక్రమానికి శ్రీకారం చుడతారని సీఆర్‌డీఏ కమిషనర్ తెలిపారు. సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, గృహ నిర్మాణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్, ఎండీ లక్ష్మీశా తదితరులు ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షం పడినా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

సాక్షి బిజినెస్
శనివారం
22-7-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
888	234
66,684	19,745

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	14,096	▽	33
డోజోన్స్	35,297	△	72
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,664	△	18
డాక్స్	16,177	▽	27
షాంఘై	3,168	▽	2
నికాయ్	32,304	▽	186

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	59,455	▽	408
బంగారం (22 క్యారట్)	59,217	▽	406
వెండి (కిలో)	74,622	▽	1,146

కియా కొత్త సెల్టోస్ వచ్చింది



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ కియా ఇండియా ఆధునీకరించిన సెల్టోస్ విడుదల చేసింది. పరిచయ ఆఫర్‌లో ధర ఎక్స్‌షోరూంలో రూ.10.89 లక్షల నుంచి మొదలుకుని రూ.19.99 లక్షల వరకు ఉంది. పెట్రోల్, డీజిల్ పవర్‌ట్రెయిన్స్‌తో 18 ట్రిమ్స్‌లో లభిస్తుంది. మోడల్‌నుబట్టి 26.04 సెంటీమీటర్ల ఫుల్లీ డిజిటల్ క్లస్టర్‌తో డ్యూయల్ స్క్రీన్ పనోరమిక్ డిస్‌ప్లే, 26.03 సెంటీమీటర్ల హెచ్‌డీ టచ్‌స్క్రీన్ నావిగేషన్, డ్యూయల్ పేన్ పనోరమిక్ సన్‌రూఫ్, ఎలక్ట్రిక్ పార్కింగ్ బ్రేక్, అడ్వాన్స్‌డ్ ఫార్వార్డ్ కొలీషన్ అవాయిడెన్స్ అసిస్ట్, లేన్ కీప్ అసిస్ట్, స్మార్ట్ క్రూజ్ కంట్రోల్, ఆరు ఎయిర్‌బ్యాగ్స్ వంటి ఫీచర్లు జోడించారు. టాప్ వేరియంట్స్ అయిన జీటీ లైన్, ఎక్స్ లైన్ అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్‌తో (ఏడీఏఎస్) రూపుదిద్దుకున్నాయి. బుకింగ్స్ ప్రారంభమైన తొలి రోజే కొత్త సెల్టోస్ కొనుగోలు కోసం 13,424 మంది కస్టమర్లు తమ పేర్లను నమోదు చేసుకున్నట్టు కంపెనీ తెలిపింది.

అశోక్ లేలాండ్ లాభం జూమ్

జూన్ క్వార్టర్‌లో రూ. 576 కోట్లు



న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజం అశోక్ లేలాండ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్ (క్యూ1)లో స్టాండెలోన్ నికర లాభం 8 రెట్లు ఎగసి రూ. 576 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 68 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 7,223 కోట్ల నుంచి రూ. 8,189 కోట్లకు బలపడింది. నిర్వహణ లాభం(ఇబిటా) 10 శాతం వృద్ధితో రూ. 821 కోట్లను తాకింది. దేశీయంగా భారీ, మధ్యతరహా వాణిజ్య వాహన (ఎంహెచ్‌సీవీ) విక్రయాలు(పరిమాణం) 7 శాతం పుంజుకున్నట్లు కంపెనీ పేర్కొంది. ఈ విభాగంలో మార్కెట్ వాటా 31.2 శాతానికి చేరినట్లు వెల్లడించింది. తేలికపాటి వాణిజ్య వాహన అమ్మకాలు 3 శాతం అధికమై 14,821 యూనిట్లకు చేరినట్లు తెలియజేసింది. ఈ కాలంలో రూ. 172 కోట్ల డిఫర్డ్ ట్యాక్స్ క్రెడిట్ నమోదైనట్లు కంపెనీ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో అశోక్ లేలాండ్ షేరు 3.6 శాతం ఎగసి రూ. 182 వద్ద ముగిసింది.


రిలయన్స్ లాభం 11 శాతం డౌన్

- క్యూ1లో రూ. 16,011 కోట్లు
- ఓ2సీ విభాగ బలహీన పనితీరు, అధిక వడ్డీలు, తరుగుదల వ్యయాలు కారణం
- ఆదాయం రూ. 2.1 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో వ్యాపార దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ నికర లాభం 11 శాతం క్షీణించి రూ. 16,011 కోట్లకు (ఒక్కో షేరుకు రూ. 23.66) పరిమితమైంది. కీలకమైన ఆయిల్–టు–కెమికల్ (ఓ2సీ) వ్యాపార పనితీరు బలహీనపడటంతో పాటు అధిక వడ్డీల భారం, తరుగుదల వ్యయాలు ఇందుకు కారణం. గత ఆర్థిక సంవత్సరంలో లాభం రూ. 17,955 కోట్లు (ఒక్కో షేరుకు రూ. 26.54). త్రైమాసికాలవారీగా జనవరి–మార్చి క్వార్టర్‌లో నమోదైన రూ. 19,299తో పోల్చినా లాభం తగ్గింది. గతేడాది ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో డీజిల్, పెట్రోల్, జెట్ ఇంధనం మార్జిన్లు రికార్డు స్థాయిలో పరుగులు తీయగా.. ప్రస్తుతం అవి సాధారణ స్థాయికి రావడంతో రిలయన్స్ వంటి రిఫైనర్ల ఆదాయంపై ప్రభావం పడింది. క్రూడాయిల్ ధరలు 31 శాతం క్షీణించడంతో ఆదాయం రూ. 2.22 లక్షల కోట్ల నుంచి రూ. 2.1 లక్షల కోట్లకు పడిపోయింది. జనవరి–మార్చి త్రైమాసికంలో ఆదాయం 2.16 లక్షల కోట్లు. 'మాంద్యం, అధిక వడ్డీ రేట్లు, చైనా మార్కెట్లు ఊహించిన దానికన్నా నెమ్మదిగా కోలుకునే అవకాశాలు ఉన్నాయన్న భయాలతో ఇంధన నిల్వలను తగ్గించుకోవడం డిమాండ్‌పై ప్రతికూల ప్రభావం చూపింది' అని సంస్థ వెల్లడించింది. 'వివిధ పరిశ్రమలు, వినియోగదారులకు సేవలు అందిస్తున్న మా పోర్ట్‌ఫోలియో సంస్థల పటిష్టమైన ఆర్థిక, నిర్వహణ పనితీరుకు ఈ క్వార్టర్ ఫలితాలు నిదర్శనం. జియో 'ట్రూ 5జీ' సేవల విస్తరణతో దేశ డిజిటల్ పరివర్తన మరింత వేగం పుంజుకోగలదు. ఎంజే క్షేత్రంలో కార్యకలాపాలు ప్రారంభించడంతో దేశ ఇంధన భద్రతకు ఊతం లభించనుంది. అందరినీ ఆర్థిక సేవల పరిధిలోకి తెచ్చేందుకు జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ తోడ్పడనుంది' అని రిలయన్స్ సీఎండీ ముకేశ్ అంబానీ తెలిపారు.

రిటైల్ లాభం 19 శాతం అప్..

క్యూ1లో రిలయన్స్ రిటైల్ విభాగం ఆదాయం రూ. 58,554 కోట్ల నుంచి రూ. 62,159 కోట్లకు పెరగ్గా లాభం 19 శాతం పెరిగి రూ. 2,061 కోట్ల నుంచి రూ. 2,448 కోట్లకు చేరింది. తొలి త్రైమాసికంలో కంపెనీ మొత్తం స్టోర్ల సంఖ్య 18,446కి చేరింది. మెట్రో క్యాష్ అండ్ క్యారీ ఇండియా కొనుగోలు ప్రక్రియ పూర్తి కాగా.. దాన్ని రిలయన్స్ రిటైల్‌లో అనుసంధానం చేసే ప్రక్రియ కొనసాగుతోంది.



ఇతరత్రా వివరాలు...

- ప్రధానమైన ఆయిల్ రిఫైనింగ్, పెట్రోకెమికల్స్ వ్యాపార విభాగం ఆదాయం 23.2% క్షీణించి రూ. 15,271 కోట్లకు పరిమితమైంది. ముడిచమురును వివిధ ఇంధనాల రూపంలో శుద్ధి చేయడం ద్వారా వచ్చే మార్జిన్లను పరిశీలిస్తే.. ఈ జూన్‌లో డీజిల్‌పై మార్జిన్లు 16–19 డాలర్ల మధ్య, పెట్రోల్‌పై మార్జిన్లు 10–14 డాలర్ల మధ్య తిరుగాడాయి.
- సంస్థ నికర రుణభారం రూ. 1.26 లక్షల కోట్లుగా ఉంది.
- గత ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 10 ముఖవిలువ గల ఒక్కో షేరుకు కంపెనీ రూ. 9 డివిడెండ్ ప్రకటించింది.

రిలయన్స్ షేరు 3% క్షీణించి 2,536 వద్ద క్లోజైంది. మార్కెట్ ముగిశాక ఫలితాలు వెలువడ్డాయి.

జియో ప్లాట్‌ఫామ్స్ లాభం 5,098 కోట్లు

సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య, యూజర్లపై ఆదాయం పెరగడంతో క్యూ1లో డిజిటల్ సర్వీసుల విభాగం జియో ప్లాట్‌ఫామ్స్ లాభం 12.5 శాతం పెరిగి రూ. 4,530 కోట్ల నుంచి రూ. 5,098 కోట్లకు చేరింది. ఆదాయం రూ. 23,467 కోట్ల నుంచి 11.3 శాతం వృద్ధి చెంది రూ. 26,115 కోట్లకు పెరిగింది. కీలకమైన టెలికం విభాగం రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌తో పాటు పలు స్టార్టప్‌లు, మ్యూజిక్.. వీడియో స్ట్రీమింగ్ యాప్‌లు జియో ప్లాట్‌ఫామ్స్‌లో భాగంగా ఉన్నాయి. విడిగా రిలయన్స్ జియో ఆదాయం రూ. 21,995 కోట్ల నుంచి రూ. 24,127 కోట్లకు పెరగ్గా లాభం రూ. 4,335 కోట్ల నుంచి రూ. 4,863 కోట్లకు చేరింది. సగటున యూజరుపై వచ్చే ఆదాయం (ఏఆర్‌పీయూ) 2.8 శాతం మెరుగుపడి రూ. 180.50కి చేరింది. నికరంగా సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య 90 లక్షల మేర పెరిగి 44.85 కోట్లకు చేరింది.

గో ఫస్ట్ సేవల పునరుద్ధరణకు డీజీసీఏ ఆమోదం



న్యూఢిల్లీ/ముంబై: స్వచ్ఛందంగా దివాలా పిటిషన్ వేసిన గో ఫస్ట్ తమ కార్యకలాపాలను పరిమిత స్థాయిలో పునఃప్రారంభించేందుకు విమానయాన రంగ నియంత్రణ సంస్థ డీజీసీఏ ఆమోదముద్ర వేసింది. 15 విమానాలతో రోజూ 114 ఫ్లయిట్స్ నడిపేందుకు పలు షరతులతో కూడిన అనుమతులిచ్చింది. హైకోర్టు, నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లపై ఉత్తర్వులకు లోబడి ఈ అనుమతులు ఉంటాయని స్పష్టం చేసింది. ప్రతిపాదిత ఫ్లయిట్ షెడ్యూల్, అర్హులైన పైలట్లు, సిబ్బంది ఇతరత్రా కీలక వనరుల లభ్యత తదితర వివరాలన్నింటినీ పరిష్కార నిపుణుడు (ఆర్‌పీ) డీజీసీఏకి సమర్పించాల్సి ఉంటుంది. ఫ్లయిట్ షెడ్యూల్ ఆమోదం తర్వాతే గో ఫస్ట్ టికెట్ల బుకింగ్‌ను ప్రారంభించేందుకు అనుమతి లభిస్తుంది. 26 విమానాలతో రోజుకు 160 ఫ్లయిట్స్ నడిపేలా జూన్‌లో ఆర్‌పీ ఒక ప్రతిపాదన సమర్పించగా.. డీజీసీఏ దాన్ని సమీక్షించి తాజా నిర్ణయం తీసుకుంది. ఆర్థిక సంక్షోభం కారణంగా గో ఫస్ట్ స్వచ్ఛంద దివాలా ప్రకటించిన నేపథ్యంలో విమాన సేవలు మే నెల 3 నుంచి నిల్చిపోయిన సంగతి తెలిసిందే.

వేదాంతా లాభం నేలచూపు

క్యూ1లో రూ. 3,308 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్ (క్యూ1)లో నికర లాభం 40 శాతం క్షీణించి రూ. 3,308 కోట్లకు పరిమితమైంది. గతేడాది (2022–23) ఇదే కాలంలో రూ. 5,592 కోట్లు ఆర్జించింది. ఆదాయం తగ్గడం ప్రధానంగా ప్రభావం చూపింది. మొత్తం ఆదాయం రూ. 39,355 కోట్ల నుంచి రూ. 34,279 కోట్లకు బలహీనపడింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 32,095 కోట్ల నుంచి రూ. 31,973 కోట్లకు తగ్గాయి. 2023 జూన్ 30 నాటికి కంపెనీ నికర రుణ భారం రూ. 59,192 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో వేదాంతా షేరు 1.4 శాతం క్షీణించి రూ. 278 వద్ద ముగిసింది.

హిందుస్తాన్ జింక్ లాభం క్షీణత

తొలి త్రైమాసికంలో రూ. 1,964 కోట్లు



న్యూఢిల్లీ: మెటల్ రంగ దిగ్గజం హిందుస్తాన్ జింక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్ (క్యూ1)లో నికర లాభం 36%పైగా క్షీణించి రూ. 1,964 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 3,092 కోట్లు ఆర్జించింది. ఇతర ఆదాయం తగ్గడం ప్రధానంగా ప్రభావం చూపింది. ఆదాయం సైతం రూ. 9,697 కోట్ల నుంచి రూ. 7,564 కోట్లకు బలహీనపడింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 5,025 కోట్ల నుంచి రూ. 4,954 కోట్లకు తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో హిందుస్తాన్ జింక్ షేరు 1.5 శాతం క్షీణించి రూ. 318 వద్ద ముగిసింది.

రికార్డుల ర్యాలీకి 'ఇన్ఫీ' షాక్

- సెన్సెక్స్ 888 పాయింట్లు క్రాష్
- 234 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ
- ప్రపంచ మార్కెట్ల నుంచి ప్రతికూలతలు
- గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణ
- నాలుగున్నర నెలల్లో అతిపెద్ద నష్టం



ముంబై: స్టాక్ మార్కెట్ ఆరు రోజుల వరుస రికార్డుల ర్యాలీకి ఇన్ఫోసిస్ షేరు బ్రేక్ వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు ఆదాయ వృద్ధి అంచనాల్లో భారీగా కోత విధించడంతో దేశీయ రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ షేరు ఎనిమిది శాతం క్షీణించింది. అలాగే లార్జ్ క్యాప్ రిలయన్స్, హెచ్‌యూఎల్ షేర్ల మూడు శాతం పతనం సైతం సూచీలను నష్టాల ఊబిలోకి నెట్టాయి. అధిక వాల్యుయేషన్ల ఆందోళనలు, అమెరికా నాస్‌డాక్ సూచీ నుంచి నష్ట భయాలు ఎదురవడంతో ఇన్వెస్టర్లు గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. ప్రపంచ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న దేశీయ మార్కెట్ ఉదయం భారీ నష్టంతో మొదలైంది. ఒక దశలో సెన్సెక్స్ 1038 పాయింట్లు క్షీణించి 66,534 వద్ద, నిఫ్టీ 279 పాయింట్లు పతనమై 19,700 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. ఆఖరికి సెన్సెక్స్ 888 పాయింట్లు నష్టపోయి 66,684 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 234 పాయింట్లు పతనమై 19,745 వద్ద నిలిచింది. వెరసి సూచీలు నాలుగున్నర నెలల్లో అతిపెద్ద నష్టాన్ని చవిచూశాయి.

ఇతర ముఖ్యాంశాలు...

- దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ఆదాయ వృద్ధి అంచనాల్లో భారీగా తగ్గించడంతో ఈ కంపెనీ షేరు 8% నష్టపోయింది. సెన్సెక్స్, నిఫ్టీల్లో అత్యధికంగా నష్టపోయిన షేరు ఇదే. దీంతో కంపెనీ మార్కెట్ విలువ ఒక్కరోజులోనే రూ.49,159 కోట్లు ఆవిరై రూ.5.52 లక్షల కోట్లకు దిగివచ్చింది. ఈ ప్రతికూలత ఇతర ఐటీ షేర్లపై పడింది. పర్‌సిస్టెంట్ 6%, కోఫోర్జ్ 4%, హెచ్‌సీఎల్ టెక్, విప్రోలు 3%, టీసీఎస్ 2.50%, టెక్ మహీంద్రా 2%, ఎల్‌టీఐఎం, ఎల్‌టీటీఎస్ షేర్లు 1% నష్టపోయాయి.
- అంతర్జాతీయ బ్రోకరేజ్ మెక్వారీ రిలయన్స్ షేరు రేటింగ్‌ను డౌన్‌గ్రేడ్ చేసింది. ఫలితంగా బీఎస్‌ఈలో నాలుగుశాతం నష్టపోయి రూ.2,523 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 3% క్షీణించి రూ.2,536 వద్ద స్థిరపడింది.
- ఫలితాలు నిరాశపరచడంతో హెచ్‌యూఎల్ షేరు 4% నష్టపోయి రూ.2,603 వద్ద స్థిరపడింది. ఫలితంగా ఇదే రంగ టాటా కన్జూమర్, డాబర్ షేర్లు 3–2% చొప్పున పతనమయ్యాయి.

లిస్టింగ్ రోజే భారీ లాభాలు

లిస్టింగ్ రోజే ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు షేరు భారీ లాభాల్ని పంచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.25)తో పోలిస్తే 59.8 శాతం ప్రీమియంతో 39.95 వద్ద లిస్టయ్యింది. 92% ర్యాలీ చేసి ఇంట్రాడే గరిష్ట స్థాయి రూ.47.94 వద్ద స్థిరపడింది.



విఘ్నేశ్‌కు 2 స్వర్ణాలు

తాష్కెంట్‌లో జరుగుతున్న ఆసియా స్కూల్స్ ర్యాపిడ్ అండ్ చెస్ చాంపియన్‌షిప్–2023లో తెలంగాణ ఆటగాళ్లు సత్తా చాటారు. దాంతో భారత్ ఖాతాలో 2 స్వర్ణాలు, ఒక కాంస్యం చేరాయి. అండర్–15 బాలుర విభాగం ర్యాపిడ్, బ్లిట్జ్ ఈవెంట్‌లలో విఘ్నేశ్ అద్వైత్ వేముల రెండు స్వర్ణాలు సాధించడం విశేషం. అండర్–15 బాలికల కేటగిరీ బ్లిట్జ్‌లో యశ్వి జైన్ కాంస్యం పతకం సొంతం చేసుకుంది.

నేడు చివరి వన్డే

భారత మహిళలు, బంగ్లాదేశ్ మహిళల మధ్య నేడు మిర్పూర్‌లో మూడో వన్డే మ్యాచ్ జరగనుంది. ఇరు జట్లు చెరో మ్యాచ్ గెలిచి 1–1తో సమంగా ఉండటంతో ఈ మ్యాచ్‌తో సిరీస్ విజేత ఎవరో తేలనుంది. భారత మహిళల జట్టు ఇప్పటి వరకు బంగ్లా చేతిలో సిరీస్ ఓడలేదు.



సెమీఫైనల్లో సాత్విక్ జోడీ



యోసు (కొరియా): భారత అగ్రశ్రేణి బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్ సాయిరాజ్– చిరాగ్ శెట్టి కొరియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 టోర్నమెంట్‌లో సెమీ ఫైనల్లో అడుగుపెట్టింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంకు జంట వరుస సెట్లలో ఐదో సీడ్ టకురో హొకి–యుగొ కొబయషి (జపాన్) ద్వయంపై అలవోక విజయం సాధించింది. 40 నిమిషాల్లో ముగిసిన ఈ క్వార్టర్స్ పోరులో సాత్విక్–చిరాగ్ జోడీ 21–14, 21–17తో జపాన్ ద్వయంపై గెలుపొందింది. గత నెల ఇండోనేసియా ఓపెన్ డబుల్స్ టైటిల్ నెగ్గి జోరు మీదున్న భారత షట్లరు ఈ టోర్నీలోనూ అదే దూకుడు కొనసాగిస్తున్నారు. తొలి గేమ్ ఆరంభంలోనే వరుసగా ఆరు పాయింట్లతో ప్రత్యర్థిపై పైచేయి సాధించిన సాత్విక్–చిరాగ్ ద్వయం గేమ్ గెలిచేందుకు ఎక్కువ సమయం పట్టలేదు. రెండో గేమ్‌లో భారత జోడీ 3–6తో కాస్త వెనుకపడినట్లు కనిపించింది. అయితే అక్కడి నుంచి సాత్విక్–చిరాగ్‌లిద్దరు తమ షాట్లకు పదునుపెట్టడంతో వరుసగా 6 పాయింట్లు గెలిచారు. అక్కడి నుంచి ఆధిక్యాన్ని అంతకంతకు పెంచుకుంటూ పోయారు.

ఇటీవలే 'యోనెక్స్' ఫ్యాక్టరీలో ల్యాబ్‌లో ఫాస్టెస్ట్ స్మాష్‌తో గిన్నిస్ రికార్డు నమోదు చేసిన సాత్విక్ సాయిరాజ్ కోర్టులోనూ ఈ సారి అలాంటి ఫీట్‌ను మళ్లీ సాధించడం విశేషం. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో సాత్విక్ రికార్డు వేగంతో స్మాష్ బాదాడు. అతను కొట్టిన స్మాష్‌కు షటిల్ గంటకు 500 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయింది.

పాణీరావు కన్నుమూత



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం కోశాధికారి ఎస్. పాణీరావు శుక్రవారం మృతి చెందారు. హైదరాబాద్ బ్యాడ్మింటన్ సంఘానికి కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తున్న 72 ఏళ్ల పాణీరావు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సీనియర్ అడ్మినిస్ట్రేటర్‌గా దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా ఆయనకు బ్యాడ్మింటన్‌తో అనుబంధం ఉంది. ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ సంఘం రోజులనుంచి ప్రస్తుతం తెలంగాణ సంఘం వరకు వేర్వేరు హోదాల్లో ఆయన పని చేశారు. ముఖ్యంగా వివిధ వయో విభాగాలకు సంబంధించిన టోర్నీల నిర్వహణలో ప్రత్యేక అనుభవం ఉన్న పాణీరావు వర్ధమాన ఆటగాళ్లను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించారు.

మెరిసిన యశ్, నిశాంత్

- 'ఎమర్జింగ్' ఫైనల్లో భారత్
- సెమీఫైనల్లో బంగ్లా 'ఎ'పై గెలుపు
- తుది పోరులో పాకిస్తాన్‌తో ఢీ



కొలంబో: యువ భారత జట్టు ఆసియా ఎమర్జింగ్ కప్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో భారత్ 'ఎ' 51 పరుగుల తేడాతో బంగ్లాదేశ్ 'ఎ' జట్టుపై ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ 49.1 ఓవర్లలో 211 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' యశ్ ధుల్ () అర్ధ సెంచరీ సాధించగా, అభిషేక్ శర్మ (34; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. ఇతర బ్యాటర్లలో సాయి సుదర్శన్ (21; 3 ఫోర్లు) పర్వాలేదనిపించగా... మిగతావారంతా విఫలమయ్యారు. 137 పరుగులకే జట్టు 7 వికెట్లు కోల్పోగా... మానవ్ సుథార్ (21; 3 ఫోర్లు)తో కలిసి ధుల్ ఎనిమిదో వికెట్‌కు 41 పరుగులు జోడించడంతో జట్టు స్కోరు 200 దాటింది. బంగ్లా బౌలర్లలో మెహ దీహసన్, తన్‌జీమ్ హసన్, రకీబుల్ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం సులువైన లక్ష్యమే అయినా భారత స్పిన్ బౌలింగ్ ముందు బంగ్లాదేశ్ బ్యాటర్లు తలవంచారు. దీంతో 34.2 ఓవర్లలో 160 పరుగులకే బంగ్లా 'ఎ' ఆలౌటైంది. ఓపెనర్లు తన్‌జీద్ హసన్ (51; 8 ఫోర్లు), నయీమ్ (38; 6 ఫోర్లు) తొలి వికెట్‌కు 70 పరుగులు జోడించి శుభారంభం ఇచ్చారు. కానీ తర్వాత వచ్చిన వారంతా లెఫ్టార్మ్ స్పిన్నర్లు నిశాంత్ సింధు (5/20), మానవ్ (3/32)ల ఉచ్చులో చిక్కుకున్నారు. కెప్టెన్ సైఫ్ హసన్ (22; 4 ఫోర్లు), మహ్ముదుల్ (20) పోరాడినా లాభం లేకపోయింది. 90 పరుగుల వ్యవధిలో బంగ్లా పది వికెట్లూ కోల్పోయింది. అంతకుముందు జరిగిన తొలి సెమీఫైనల్లో పాకిస్తాన్ 'ఎ' 60 పరుగుల తేడాతో శ్రీలంక 'ఎ'పై గెలిచింది. రేపు చిరకాల ప్రత్యర్థులు భారత్, పాక్‌ల మధ్య టైటిల్ పోరు జరుగుతుంది.

'అంతా కోలుకుంటున్నారు'



బెంగళూరు: గాయాలకు గురైై జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో రీహాబిలిటేషన్‌లో ఉన్న ఐదుగురు భారత క్రికెటర్ల ఫిట్‌నెస్‌కు సంబంధించి బీసీసీఐ మెడికల్ బులెటిన్‌ను విడుదల చేసింది. వేర్వేరు కారణాలతో ఎన్‌సీఏలో కోలుకుంటున్న వీరందరి ఫిట్‌నెస్ స్థాయి ప్రస్తుతం మెరుగ్గా ఉందని బోర్డు వెల్లడించింది. బోర్డు చెప్పిన వివరాల ప్రకారం... పేస్ బౌలర్లు జస్‌ప్రీత్ బుమ్రా, ప్రసిధ్ కృష్ణ రీహాబిలిటేషన్ చివరి దశలో ఉన్నారు. నెట్స్‌లో పూర్తి స్థాయిలో బౌలింగ్ కూడా చేస్తున్నారు. ఎన్‌సీఏ నిర్వహించే ప్రాక్టీస్ మ్యాచ్‌లలో వీరిద్దరు ఆడతారు. ప్రాక్టీస్ గేమ్‌లను పరిశీలించిన తర్వాత వీరిద్దరిపై తుది నిర్ణయం తీసుకుంటారు. బ్యాటర్లు శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ నెట్స్‌లో బ్యాటింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం స్ట్రెంత్, ఫిట్‌నెస్ డ్రిల్స్ చేస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ డ్రిల్స్ తీవ్రత పెంచి వారి పరిస్థితిని అంచనా వేస్తారు. కారు ప్రమాదానికి గురైై కోలుకుంటున్న వికెట్ కీపర్ రిషభ్ పంత్ రీహాబిలిటేషన్ చాలా వేగంగా సాగుతోంది. నెట్స్‌లో బ్యాటింగ్ సాధనతో పాటు వికెట్ కీపింగ్ కూడా పంత్ మొదలు పెట్టాడు. స్ట్రెంత్, ఫ్లెక్సిబిలిటీ, రన్నింగ్‌కు సంబంధించి అతని కోసమే ప్రత్యేకంగా రూపొందించిన ఫిట్‌నెస్ కార్యక్రమాన్ని పంత్ అనుసరిస్తున్నాడు.

పట్టు బిగించిన ఇంగ్లండ్

- తొలి ఇన్నింగ్స్‌లో 275 పరుగుల ఆధిక్యం
- రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ 113/4



బెయిర్‌స్టో

మాంచెస్టర్: 'యాషెస్' సిరీస్ నాలుగో టెస్టులో విజయంపై ఇంగ్లండ్ గురి పెట్టింది. మూడో రోజు ఆట ముగిసే సరికి ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ ఓటమినుంచి తప్పించుకునేందుకు పోరాడుతోంది. రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా ప్రస్తుతం 4 వికెట్లు కోల్పోయి 113 పరుగులు చేసింది. వార్నర్ (28), ఖ్వాజా (18), స్మిత్ (17), హెడ్ (1) పెవిలియన్ చేరగా...లబుషేన్ (44 నాటౌట్), మార్ష్ (1 నాటౌట్) క్రీజ్‌లో ఉన్నారు. ఆస్ట్రేలియా ఇంకా 162 పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 384/4తో ఆట కొనసాగించిన ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 592 పరుగులకు ఆలౌటైంది. హ్యారీ బ్రూక్ (61), బెన్ స్టోక్స్ (51) అర్ధ సెంచరీలు సాధించగా...జానీ బెయిర్‌స్టో (81 బంతుల్లో 99 నాటౌట్; 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) త్రుటిలో సెంచరీ అవకాశం కోల్పోయాడు. హాజల్‌వుడ్ 5 వికెట్లు పడగొట్టగా, గ్రీన్, స్టార్క్ చెరో 2 వికెట్లు తీశారు. 99 వద్ద నాటౌట్‌గా ముగించిన ఏడో బ్యాటర్‌గా బెయిర్‌స్టో నిలిచాడు.

500లో 100

- టెస్టుల్లో 29వ సెంచరీ
- తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 438 ఆలౌట్
- విండీస్‌తో రెండో టెస్టు



పోర్ట్ ఆఫ్ స్పెయిన్: భారత బ్యాటింగ్ కింగ్ విరాట్ కోహ్లి 500వ అంతర్జాతీయ మ్యాచ్‌ను సెంచరీతో చిరస్మరణీయం చేసుకున్నాడు. విరాట్ కోహ్లి (206 బంతుల్లో 121; 11 ఫోర్లు) శతకానికి తోడు రవీంద్ర జడేజా (152 బంతుల్లో 61; 5 ఫోర్లు), రవిచంద్రన్ అశ్విన్ (78 బంతుల్లో 56; 8 ఫోర్లు) కూడా అర్ధ సెంచరీలు సాధించారు. దాంతో తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 438 పరుగుల భారీ స్కోరు సాధించింది.

రెండో రోజు ఆట ఆరంభమైన కాసేపటికే భారత్ స్కోరు 300 పరుగులు దాటింది. ఆ వెంటనే కోహ్లి కూడా 180 బంతుల్లో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. ఆ ఓవర్లోనే జడేజా అర్ధ సెంచరీ పూర్తయ్యింది. కొత్త బంతితో కరీబియన్ జట్టు శుక్రవారం ఆట ఆరంభించినప్పటికీ సీమర్లు ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. క్రితంరోజు లాగే కోహ్లి–జడేజా తొలిసెషన్‌లో క్రీజును వీడకుండా విండీస్ బౌలర్లను ఆటాడుకున్నారు. యథేచ్ఛగా బ్యాటింగ్ చేయడంతో పరుగులు సులువుగానే వచ్చాయి. ఐదో వికెట్‌కు 159 పరుగులు జోడించాక జట్టు స్కోరు 341 వద్ద కోహ్లి ఇన్నింగ్స్ ముగిసింది. స్క్వేర్‌లెగ్ దిశగా ఆడిన కోహ్లి సింగిల్ తీసే క్రమంలో కాస్త వెనకడుగు వేశాడు. అయితే ముందుకే వెళ్లినా...జోసెఫ్ డైరెక్ట్ త్రో నాన్‌స్ట్రైకింగ్ ఎండ్ వద్ద వికెట్లను తాకడంతో రనౌటయ్యాడు. మరికొద్దిసేపటికే రోచ్ బౌలింగ్‌లో జడేజా వెనుదిరిగాడు. లంచ్ విరామ సమయానికి 373/6 స్కోరు వద్ద ఇషాన్ కిషన్ (25; 4ఫోర్లు), అశ్విన్ క్రీజ్‌లో ఉన్నారు. అనంతరం టెయిలెండర్లు ఉనాద్కట్ (7), సిరాజ్ (0)లతో కలిసి అశ్విన్ జట్టు స్కోరును 400 దాటించాడు. రోచ్ బౌలింగ్‌లో రెండు వరుస బౌండరీలతో ఫిఫ్టీ పూర్తిచేసుకున్న అశ్విన్ మరో ఫోర్ కొట్టి ఆఖరి బంతికి బౌల్డ్ కావడంతో భారత్ తొలి ఇన్నింగ్స్ 128 ఓవర్లలో 438 పరుగుల వద్ద ముగిసింది. వారికన్, రోచ్ చెరో 3 వికెట్లు తీశారు.

తొలిరోజు ఆఖరి సెషన్‌లో...

రెండో సెషన్‌లో వరుస విరామాల్లో 4 వికెట్లు పడగొట్టిన వెస్టిండీస్‌కు ఆఖరి సెషన్‌లో చుక్కెదురైంది. కోహ్లి, జడేజా క్రీజులో పాతుకుపోవడంతో ఆతిథ్య జట్టుకు కష్టాలు తప్పలేదు. కోహ్లి 97 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇద్దరు మూడో సెషన్ ఆసాంతం ఆడి అబేధ్యమైన ఐదో వికెట్‌కు 106 పరుగులు జతచేశారు. 288/4 స్కోరు వద్ద తొలిరోజు ఆట ముగిసింది.



జడేజా

అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన వెస్టిండీస్ కడపటి వార్తలందేసరికి 4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 7 పరుగులు చేసింది. బ్రాత్‌వైట్ (4 బ్యాటింగ్), తేజ్‌నారాయణ్ (3 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

స్కోరు వివరాలు

భారత్ తొలిఇన్నింగ్స్: జైస్వాల్ (సి) మెకెంజీ (బి) హోల్డర్ 57; రోహిత్ (బి) వారికన్ 80; శుబ్‌మన్ (సి) జొషువా (బి) రోచ్ 10; కోహ్లి రనౌట్ 121; రహానె (బి) గ్యాబ్రియెల్ 8; జడేజా (సి) జొషువా (బి) రోచ్ 61; ఇషాన్ కిషన్ (సి) జొషువా (బి) హోల్డర్ 25; అశ్విన్ (బి) రోచ్ 56; ఉనాద్కట్ (స్టంప్డ్) జొషువా (బి) వారికన్ 7; సిరాజ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) వారికన్ 0; ముకేశ్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం** (128 ఓవర్లలో ఆలౌట్) 438.
వికెట్ల పతనం: 1–139, 2–153, 3–155, 4–182, 5–341, 6–360, 7–393, 8–416, 9–426, 10–438. **బౌలింగ్:** రోచ్ 22–2–104–3, జోసెఫ్ 22–0– 97–0, గ్యాబ్రియెల్ 18–0–74–1, వారికన్ 39–7–89–3, హోల్డర్ 21–3–57–2, అలిక్ 4–0–12–0, బ్రాత్‌వైట్ 2–1–1–0.

29 టెస్టుల్లో కోహ్లి సెంచరీల సంఖ్య. డాన్ బ్రాడ్‌మన్ (29)ను అతను సమం చేశాడు.

76 అంతర్జాతీయ క్రికెట్‌లో కోహ్లి శతకాల సంఖ్య

5 భారత్ తరఫున టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో సెహ్వాగ్ (8586)ను దాటి కోహ్లి (8676) ఐదో స్థానానికి చేరాడు. ఈ జాబితాలో సచిన్ (15,921), ద్రవిడ్ (13,288), సునీల్ గావస్కర్ (10,122), వీవీఎస్ లక్ష్మణ్ (8781) మాత్రమే కోహ్లికంటే ముందున్నారు.

400 అంతర్జాతీయ క్రికెట్‌లో కీమర్ రోచ్ 400 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు.

■ గ్రంథాలయాల్లో పుస్తక సంపదను పెంపొందించడం ద్వారా సామాజిక, వైజ్ఞానిక చైతన్యానికి బాటలు వేయాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు అన్నారు. శుక్రవారం మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో రాష్ట్రస్థాయి పుస్తకాల ఎంపిక కమిటీ (ఎస్‌బీఎస్‌సీ)తో సమావేశం నిర్వహించారు.



ముగిసిన నూజివీడు ట్రిపుల్‌ఐటీ ప్రవేశాల కౌన్సెలింగ్

రెండు రోజుల్లో 956 సీట్ల భర్తీ

నూజివీడు/వేంపల్లె: ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో రెండు రోజులుగా నిర్వహిస్తోన్న ప్రవేశాల కౌన్సెలింగ్ శుక్రవారంతో ముగిసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన అభ్యర్థుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. రెండో రోజు కౌన్సెలింగ్‌కు 540 మంది అభ్యర్థులకు కాల్‌లెటర్లు పంపించి పిలవగా అందులో 475 మంది హాజరయ్యారు. వారందరికీ సీట్లు కేటాయించారు. రెండు రోజుల్లో 1,085 మందికి గాను 956 మందికి అడ్మిషన్లు కల్పించారు. కౌన్సెలింగ్‌కు రాని అభ్యర్థులు ఇంటర్, పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరి ఉండొచ్చని ట్రిపుల్‌ఐటీ అధికారులు భావిస్తున్నారు. మరో 129 సీట్లు మిగిలిన నేపథ్యంలో 4 ట్రిపుల్‌ఐటీల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసిన తరువాత రెండో జాబితాను ప్రకటించి కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తామని అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య గోపాలరాజు తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియను డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు పరిశీలించారు.

ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

ఇడుపులపాయ ఆర్‌కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఆర్‌కేవ్యాలీ క్యాంపస్‌లో ఆరేళ్ల సమీకృత సాంకేతిక విద్యకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రారంభమైంది. టాప్‌లో నిలిచిన విద్యార్థులు కృష్ణా జిల్లా అవనిగడ్డ గ్రామానికి చెందిన ఆకుల ప్రేమ్‌సాయి, కడప జిల్లా సోములవారిపల్లె గ్రామానికి చెందిన శీల హరిణి, కడప జిల్లా గోపవరం గ్రామానికి చెందిన సోమల వెంకటరామ శరణ్య, నంద్యాల జిల్లా అవుకు గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ సమీర్, ప్రకాశం జిల్లా దొర్నాల గ్రామానికి చెందిన బండారు కార్తీక్‌లు ఆర్జీయూకేటీ చాన్స్‌లర్ కె.చెంచురెడ్డి, వైస్ చాన్స్‌లర్ విజయ్‌కుమార్‌ల చేతుల మీదుగా అడ్మిషన్ల పత్రాలను పొందారు. మొదటి రోజు 444మంది అడ్మిషన్లు పొందారు.



ఆర్జీయూకేటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.చెంచురెడ్డి నుంచి అడ్మిషన్ పొందుతున్న విద్యార్థి ప్రేమ్ సాయి

ఏపీ అభివృద్ధికి సహకరించండి

వియత్నాం చాంబర్ ఆఫ్ కామర్స్ వైస్ ప్రెసిడెంట్‌తో ఆర్థిక మంత్రి బుగ్గన చర్చలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సహకారం అందించాలని వియత్నాం చాంబర్ ఆఫ్ కామర్స్ వైస్ ప్రెసిడెంట్ న్గుయెన్ క్వాంగ్ విన్‌ను రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ కోరారు. దక్షిణ కొరియాలో బుగ్గన పర్యటన శుక్రవారం ముగిసింది. చివరి రోజు ఆయన హనోయిలో వియత్నాం చాంబర్ ఆఫ్ కామర్స్ వైస్ ప్రెసిడెంట్ న్గుయెన్ క్వాంగ్ విన్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని అవకాశాలను మంత్రి వివరించారు.

రఘురామకృష్ణరాజు పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర ప్రభుత్వంపై నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రుణాలు సేకరించడం రాజ్యాంగ విరుద్ధమంటూ రఘురామరాజు తొలుత హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో తీర్పు అనుకూలంగా రాకపోవడంతో సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్ శుక్రవారం సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్డీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించింది. హైకోర్టు తీర్పు తర్వాత ఎనిమిది నెలలు ఆలస్యంగా పిటిషన్ దాఖలు చేసినట్లు ధర్మాసనం గుర్తించింది. ఈ నేపథ్యంలో తాము జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసి పిటిషన్‌ను కొట్టేసింది.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

శనివారం । 22 । జూలై । 2023



సామాజిక విప్లవానికి శ్రీకారం
పమిడిముక్కల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక విప్లవానికి తెర తీశారని, మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. శుక్రవారం కృష్ణా జిల్లా మర్రివాడ సభలో మంత్రి మాట్లాడారు.



అరగంటలోనే దుర్గమ్మ దర్శనం
దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం భక్తుల రద్దీ సాధారణంగా కనిపించింది. అధిక శ్రావణం కావడంతో భక్తులు తక్కువగా వచ్చారు. -IIలో▸



మునేరుకు భారీగా వరద
భారీ వర్షాలతో మునేరుకు గురువారం అర్ధ రాత్రి నుంచి మునేరుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో మునేరులోకి ఎవరూ వెళ్లకుండా గేటు వేయించారు. -IIలో▸

న్యూస్‌రీల్

జిల్లా అభివృద్ధికి ఖనిజ ఫౌండేషన్ ట్రస్ట్ నిధులు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో మైనింగ్ సంబంధిత కార్యకలాపాల ద్వారా ప్రభావితమైన ప్రజలు, ప్రాంతాల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన జిల్లా ఖనిజ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) నిధులను ఖర్చు చేయాలని కృష్ణా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. ఆయన చాంబర్‌లో శుక్రవారం సాయంత్రం జిల్లా ఖనిజ ఫౌండేషన్ ట్రస్ట్ నిధుల వినియోగంపై భూగర్భగనులశాఖ అధికారులు, కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ డీఎంఎఫ్‌టీ నిధులతో జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో రూ. 19.11 కోట్లు అంచనాలతో 161 రకాల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వీటిలో 31 పనులు పూర్తయ్యాయని అందుకు రూ. 1.32 కోట్లు చెల్లించామని చెప్పారు. గన్నవరం నియోజకవర్గంలో రూ. 9.41 కోట్ల అంచనాతో 108 పనులను చేపట్టినప్పటికీ రూ. 90 లక్షల విలువైన పనులు మాత్రమే పూర్తయ్యాయన్నారు. సమావేశంలో భూగర్భగనులశాఖ అసిస్టెంట్ జియాలజిస్ట్ కొండారెడ్డి, జెడ్పీ సీఈవో జ్యోతిబసు, పరిశ్రమలశాఖాధికారి ఆర్. వెంకట్రావు, డీఆర్‌డీఏ పీడీ ప్రసాద్, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎం. పద్మావతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితా పరిశీలన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి బీఎల్‌ఓలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ఎంతో కీలకమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. శుక్రవారం పశ్చిమ నియోజవకర్గం భవానీపురం ఏకలవ్య నగర్ పోలింగ్ కేంద్రం పరిధిలో బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు స్వయంగా అక్కడకు వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇంటింటి సర్వే ప్రారంభమైందన్నారు. నెల రోజులపాటు బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలిస్తారన్నారు. పశ్చిమ నియోజకవర్గం 2, 37, 382 మంది ఓటర్లు ఉన్నారని, 253 మంది బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్నారన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ కాశీ లక్ష్మి, డెప్యూటీ తహసీల్దార్ ధరియా తదితరులు ఉన్నారు.

రైఫిల్ షూటింగ్ విజేతకు ఘన స్వాగతం



గన్నవరం: జూనియర్ వరల్డ్ రైఫిల్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన కేఎల్‌యూ విద్యార్థి మద్దినేని ఉమామహేష్‌కు గన్నవరం విమానాశ్రయంలో శుక్రవారం ఘన స్వాగతం లభించింది. ఉత్తర కొరియాలో జరిగిన పోటీల అనంతరం ఉమామహేష్ న్యూఢిల్లీ నుంచి ఇక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయంలో అతనికి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథివర్మ, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ హనుమంతరావు, క్రీడల విభాగం అసోసియేట్ డీన్ డాక్టర్ కె. హరికిషోర్, పీడీ ఉమామహేష్, కోచ్ సుబ్రహ్మణ్యం, పెద్ద సంఖ్యలో విద్యార్థులు స్వాగతం పలికారు. అనంతరం ఉమామహేష్ మాట్లాడుతూ ఉత్తర కొరియాలోని చాంగ్‌వాన్‌లో జరిగిన ఈ పోటీల్లో కాంస్య పతకం సాధించడం సంతోషంగా ఉందన్నారు.

సివిల్స్, గ్రూప్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ స్టడీ సర్కిల్ నందు ఎస్సీ, ఎస్టీ, ఇతర వర్గాలకు చెందిన నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అండ్ ఎంపవర్ మెంట్ ఆఫీసర్ బి. విజయభారతి ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసి రూ.6 లక్షలలోపు వార్షిక ఆదాయ కలిగిన అభ్యర్థులు https: apstdc.apcfss.in నందు ఆగస్టు 5వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో సివిల్స్, విజయవాడలో గ్రూప్–1, తిరుపతిలో గ్రూప్– 2 పరీక్షలకు శిక్షణ అందిస్తామని విజయభారతి వివరించారు.

సెమ్-2కి సమాయత్తం

- 22న పాఠశాలల్లో విద్యార్థులకు అందజేత
- ఈ ఏడాది 6 నుంచి 9వ తరగతి వరకూ సెమిస్టర్ విధానం
- నవంబర్ మొదటి వారం నుంచి రెండో సెమిస్టర్ ప్రారంభం
- ఉమ్మడి జిల్లాలో 7,06,450 పాఠ్యపుస్తకాలు
- మండల కేంద్రాల నుంచి పాఠశాలలకు చేరుకున్న పుస్తకాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యారంగానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారు. ప్రపంచ స్థాయి బోధన పేద విద్యార్థులకు అందాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి అనేక మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. అందులో భాగంగా పాఠశాల విద్యాబోధనలో సెమిస్టర్ విధానాన్ని తీసుకువచ్చారు. రాష్ట్రంలోని హైస్కూల్‌లో విద్యాభ్యాసం చేస్తున్న ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల విద్యార్థులకు 2023–2024 విద్యా సంవత్సరం నుంచి సెమిస్టర్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ ఏడాది పాఠశాలలు తెరచుకున్న మొదటి రోజునే తొలి సెమిస్టర్ పుస్తకాలను విద్యార్థులకు అందించగా.. ఇప్పుడు రెండో సెమిస్టర్‌కు సంబంధించిన పాఠ్య పుస్తకాలు కూడా సిద్ధం చేసేశారు.

నాలుగు మాసాలుండగానే..

రాష్ట్రంలోని ఉన్నత పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఈ ఏడాది విద్యాబోధన రెండు సెమిస్టర్లుగా నిర్వహించి పరీక్షలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా జూన్ 12 నుంచి అక్టోబర్ 30వ తేదీ వరకూ మొదటి సెమిస్టర్ పూర్తి చేస్తారు. ఆ తర్వాత నవంబర్ మొదటి వారం నుంచి రెండో సెమిస్టర్ ప్రారంభం కానుంది. రెండో సెమిస్టర్‌కు సంబంధించిన పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం సుమారు నాలుగు మాసాలు ముందుగానే విద్యార్థులకు అందించటానికి ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని 50 మండలాలకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు విజయవాడ డిపో కేంద్రం నుంచి అన్ని మండలాలకు గడిచిన వారం రోజులుగా తరలివెళ్తున్నాయి.

నాలుగు నెలల ముందుగానే పాఠ్య పుస్తకాలు



పాఠశాలలకు చేరుకున్న పాఠ్య పుస్తకాలు



వివిధ తరగతులకు చెందిన బుక్ టైటిల్స్

గత అనుభవాల దృష్ట్యా..

గతంలో పుస్తకాల సరఫరాలో ఎదురైన ఇబ్బందులను గమనంలో ఉంచుకొని ఈ సారి విద్యాశాఖ పలు నిర్ణయాలు తీసుకుంది. అందులో భాగంగా ఉపాధ్యాయులపై భారం లేకుండా ఈ సారి పౌరసరఫరాల శాఖకు చెందిన ఎండీయూ వాహనాల ద్వారా పాఠ్య పుస్తకాలను నేరుగా పాఠశాలలకు సరఫరా చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. గురువారం ఆయా మండల విద్యాశాఖాధికారులతో ఉన్నతాధికారులు సమావేశాన్ని నిర్వహించి సమన్వయంతో పుస్తకాల పంపిణీని పూర్తి చేయాలన్నారు. జూలై 22వ తేదీన విద్యార్థులకు అందించాలని ఆయా ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు.

ఉమ్మడి జిల్లాకు 7,06,450 పుస్తకాలు..

రెండో సెమిస్టర్‌కు సంబంధించి ఉమ్మడి కృష్ణా జిల్లాలో 50 మండలాలకు చెందిన ఆయా పాఠశాలలకు సుమారుగా 7,06,450 పుస్తకాలు అవసరమని ఇండెంట్ వచ్చింది. దాని ప్రకారం విజయవాడ డిపో నుంచి మూడు జిల్లాల్లోని మండల కేంద్రాలకు పుస్తకాలు చేరుకున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలోని 17 మండలాలకు చెందిన విద్యార్థులకు 3,07,980 పుస్తకాలు, కృష్ణాజిల్లాలోని 25 మండలాలకు చెందిన విద్యార్థులకు 2,94,715 పుస్తకాలు, ఏలూరు జిల్లాలోని ఎనిమిది మండలాల విద్యార్థుకు సంబంధించి 1,03,755 పుస్తకాలను పంపిణీ చేశారు.

వంద శాతం పూర్తి..



రెండో సెమిస్టర్ పాఠ్య పుస్తకాలు దాదాపుగా అన్ని పాఠశాలలకు చేరిపోయాయి. అన్ని పాఠశాలల్లోనూ 22వ తేదీన పుస్తకాలను విద్యార్థులకు అందజేయాలని ఆదేశించాం. నవంబర్ నుంచి ప్రారంభమయ్యే సెమిస్టర్‌కు చాలా ముందుగానే పుస్తకాలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించి ఆ మేరకు చర్యలు చేపట్టాం. పాఠ్యపుస్తకాలకు సంబంధించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది.

– సీవీ రేణుక, డీఈవో, ఎన్టీఆర్ జిల్లా

50 మండలాలకు పంపించాం..



ఉమ్మడి కృష్ణాజిల్లాకు సంబంధించి 50 మండలాలకు పుస్తకాలను పంపించటం పూర్తయింది. ఆయా పాఠశాలల నుంచి మండల స్థాయికి, అక్కడి నుంచి జిల్లా స్థాయి, వారి నుంచి వచ్చిన ఇండెంట్ల ప్రకారం పుస్తకాలను పంపించాం. నూతన కృష్ణాజిల్లాలో 25, ఎన్టీఆర్ జిల్లాలో 17, ఏలూరు జిల్లాలోని ఎనిమిది మండలాలకు ఆయా ఇండెంట్ల వారీగా పూర్తి స్థాయిలో పుస్తకాలను పంపించాం.

– ఏఎస్‌కే ఆంజనేయులు, డిపో మేనేజర్, విజయవాడ

గవర్నర్ పర్యటనకు పక్కా ఏర్పాట్లు

కృష్ణా జేసీ అపరాజితాసింగ్

పెనమలూరు: గవర్నర్ అబ్దుల్ నజీర్ గంగూరు పర్యటన సందర్భంగా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజితా సింగ్ అన్నారు. ఆమె శుక్రవారం గంగూరు గ్రామానికి వచ్చి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన గవర్నర్ గంగూరు గ్రామానికి వచ్చి రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతుల సంక్షేమం కోసం అందుతున్న సేవలను పరిశీలిస్తారన్నారు. అదే విధంగా రైతులతో ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని అన్నారు. గవర్నర్ పర్యటన సందర్భంగా వ్యవసాయ, అనుబంధ శాఖల ప్రదర్శన శాలలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇవే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అమలు చేస్తున్న వివిధ పథకాల సమాచారం పూర్తిగా అందుబాటులో ఉంచాలన్నారు. గవర్నర్‌కు సభావేదికతో పాటు, రైతులతో ముఖాముఖీ మాట్లాడటానికి తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. గవర్నర్ పర్యటన సందర్భంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఆర్డీఓ విజయ్‌కుమార్, ఎంపీడీఓ సునీతాశర్మ, తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, పీఆర్ డీఈ శ్రీనివాస్, ఏఈ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేత అక్బర్‌పాషా పలువురు పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జేసీ అపరాజితాసింగ్



నందనవనం



విజయవాడ నగరంలో పలు చోట్ల ఉద్యాన వనాలు అందంగా ముస్తాబవుతున్నాయి. చిరు జల్లులతో ఆహ్లాదంగా మారిన వాతావరణానికి పార్కుల్లో పరుచుకున్న పచ్చని పచ్చిక మరింత ఆకర్షణీయంగా కనిపిస్తోంది. తుది మెరుగులు దిద్దుకుంటున్న కృష్ణలంక ప్రాంతంలోని అంబేడ్కర్ పార్కును చిత్రంలో చూడొచ్చు. ఇది త్వరలో సందర్శకులకు అందుబాటులోకి రానుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ

నేస్తం.. చేనేతకు ఆపన్న హస్తం

నేతన్నకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఐదో విడత నేతన్న నేస్తం నగదు విడుదల
- జిల్లాలో 134 మందికి రూ. 32.16 లక్షల లబ్ధి
- జిల్లా స్థాయి కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే వెలంపల్లి



లబ్ధిదారులకు నేతన్న నేస్తం చెక్కును అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం చేనేత కార్మికులకు ఆపన్న హస్తం అందిస్తోందని కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తిరుపతి జిల్లా వెంకటగిరి నుంచి వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ఆర్థిక సహాయాన్ని బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారు. ఈ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావులు లబ్ధిదారులతో కలిసి వీక్షించారు.

జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ చేనేత కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. చేనేత కార్మికులను అభివృద్ధి పథంలో నడిపిస్తూ మగ్గానికి మహర్దశ తీసుకొస్తుందన్నారు. ఇటువంటి పథకం దేశంలో మరే రాష్ట్రంలోనూ లేదన్నారు. పథకంతో నేతన్నల జీవితాలలో వెలుగులు నింపుతున్నామన్నారు. కార్మికుల స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అన్ని విధాల చేయూతనందిస్తోందన్నారు. ఈ పథకం ద్వారా ఏటా ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామన్నారు. సొంత మగ్గం కలిగి చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న చేనేత కుటుంబాలకు ఏడాదికి రూ. 24 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామన్నారు. గత నాలుగేళ్లుగా ఈ సహాయాన్ని క్రమం తప్పక అందిస్తున్నామన్నారు. నేతన్నలకు ఆర్థిక సహాయంతోపాటు వారు ఉత్పత్తి చేసిన వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తోందన్నారు. దీనిలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా చేనేత వస్త్రాలకు అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యం కల్పించి నేతన్నల ఆదాయం పెంపునకు చర్యలు చేపట్టామన్నారు. ప్రముఖ ఈ–కామర్స్ సంస్థలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మిన్‌త్రా, లూమ్ ఫోక్స్, మిర్రా, పేటీఎం, గోకూప్ తదితర వ్యాపార దిగ్గజాలతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందన్నారు.

జిల్లాలో లబ్ధి ఇలా..

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ సొంత మగ్గంతో చేనేత వృత్తిపై ఆధారపడి జీవించే కార్మికులకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఐదో విడతలో 134 మంది లబ్ధిదారులకు రూ.32.16 లక్షలు ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా జమ చేశామని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఆర్థిక సహాయం చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి. సంపత్‌కుమార్, చేనేత జౌళి శాఖ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి. రాజశేఖర్, ఏడీఓ జయకృష్ణ, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు మాదు శివరామకృష్ణ, అడపా శేషగిరి, డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి, టి. శ్రీకాంత్, దుర్గగుడి ట్రస్ట్ బోర్డు మెంబర్ మాధవి కృష్ణ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కనకారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ పంట రుణాలు

- సకాలంలో అందించేలా చర్యలు
- వ్యవసాయ సలహామండలి సమావేశంలో జేసీ అపరాజితాసింగ్



మాట్లాడుతున్న జేసీ అపరాజితాసింగ్, చిత్రంలో జన్ను రాఘవరావు, పద్మావతి

చిలకలపూడి(మచిలీపట్నం): రైతులకు బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజితా సింగ్ అన్నారు. జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశం కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు జన్ను రాఘవరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మండల వ్యవసాయాధికారులు, సలహామండలి సభ్యులు, వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు, తహసీల్దార్లతో వచ్చే గురువారం సమావేశం నిర్వహిస్తామని రైతుల సమస్యలపై అప్పుడు చర్చిస్తామన్నారు. సీసీఆర్‌సీ కార్డులు జిల్లాలో 61 వేలు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు 46,281 కార్డులను జారీ చేశామన్నారు. మిగిలిన కార్డుల జారీ వేగవంతం చేయాలన్నారు.

బోర్లకు అనుమతి ఇవ్వడం లేదు..

జిల్లా వ్యవసాయాధికారి ఎన్. పద్మావతి గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలపై నివేదికను సభకు వివరించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి జె. జ్యోతి మాట్లాడుతూ కృత్తివెన్ను మండలం చినగొల్లపాలెం ప్రాంతంలో హార్టికల్చర్ సాగు బాగుందని అయితే సెలినిటీ ఎక్కువగా ఉందనే కారణంతో బోర్లు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇవ్వటం లేదన్నారు. పాత రిపోర్టులను పరిశీలించి ఏ ప్రాతిపదికన బోర్లకు అనుమతి ఇవ్వటం లేదో సెలినిటీ చెక్ చేసి అనుమతులు పునరుద్ధరించేలా చర్యలు చేపడతామని జాయింట్ కలెక్టర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

- సలహామండలి సభ్యుడు శ్రీకాకోళపు నాగేశ్వరరావు మాట్లాడుతూ తాళ్లపాలెం ప్రాంతంలో వేరుశనగ రైతులకు డిమాండ్ ఉన్న రకాల విత్తనాలు సరఫరా చేసేలా చూడాలన్నారు.
- మరో సభ్యుడు పెన్నేరు ప్రభాకరరావు మాట్లాడుతూ పంట రుణాల కోసం రైతులు వెళ్తే వద్దమన్నాడు ఇండియన్ బ్యాంక్‌లో 15 రోజుల సమయం పడుతోందని అలా కాకుండా ఒకటి, రెండు రోజుల్లో మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
- సభ్యులు పట్టపు శ్రీనివాసరావు మాట్లాడుతూ కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లోని 21 వేల ఎకరాలకు సాగునీరు అందటం లేదని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సమావేశంలో మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ ఈఈ ఎం. భాస్కరరావు తదితర అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఉద్యానశాఖకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచండి..

సలహామండలి జిల్లా చైర్మన్ జన్ను రాఘవరావు మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని రైతులకు అవసరమైన పరిమాణంలో విత్తనాలు, ఎరువులు ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచాలన్నారు. సాగునీటి కాలువలు, డ్రెయిన్లలో పూడికతీత పనులు, గుర్రపుడెక్క, తూడు తొలగింపు వంటి పనులను వేగవంతం చేయాలన్నారు. వ్యవసాయ, ఆక్వా రైతులకు విద్యుత్ కనెక్షన్లు సకాలంలో మంజూరు చేయటం, అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయటంతో పాటు ఆక్వా రైతులకు విద్యుత్‌సబ్సిడీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు సంక్షేమ పథకాలు పొందటంలో ఇబ్బందులు ఏర్పడకుండా ఈ–క్రాప్ నమోదు జాగ్రత్తగా నిర్వహించాలన్నారు.

ప్రజా భాగస్వామ్యంతో ఆదర్శ గ్రామాలు

రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి బూడిత రాజశేఖర్

జూపూడి(ఇబ్రహీంపట్నం): ప్రజలందరి భాగస్వామ్యంతో ఆదర్శవంతమైన గ్రామాలు ఏర్పడతాయని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి బూడిత రాజశేఖర్ అన్నారు. మండలంలోని జూపూడి గ్రామంలోని కేంద్ర ఘన ద్రవ వ్యర్థాల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న మోడల్ విలేజ్ పనులు శుక్రవారం ఆయన పరిశీలించారు. గ్రామంలో ఎంపిక చేసిన డ్రైనేజీ అడుగున మురునీరు ప్రవహించి పైన పూల మొక్కలు, ఆకు కూరలు, దొండపాదులు, పశుగ్రాసం పెంచడం ఆదర్శనీయమన్నారు. ఇక్కడ ఈ ప్రాజెక్ట్ విజయవంతం అయితే అన్ని గ్రామాల్లో అమలు చేయవచ్చన్నారు. అయితే వీటి సంరక్షణ బాధ్యత స్వయం సహాయక, యువజన సంఘాలు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో నిర్వహించే పారిశుద్ధ్య చర్యలతో ఆదాయాన్ని కూడా ఆర్జించవచ్చన్నారు. అనంతరం కొబ్బరి మొక్కలు నాటారు. చేపట్టబోయే అభివృద్ధి ప్రణాళికను కేంద్ర ఘన ద్రవ వ్యర్థాల సంస్థ కన్సల్‌టెంట్ శ్రీనివాసన్, జిల్లా పంచాయతీ అధికారి జయచంద్ర గాంధీ వివరించారు. జేసీ సంపత్ కుమార్, డ్వామా పీడీ సునీత, ఎంపీడీవో రామకృష్ణనాయక్, సర్పంచి కాకి దేవమాత తదితరులు పాల్గొన్నారు.



జూపూడిలో కొబ్బరి మొక్క నాటుతున్న రాజశేఖర్

హంసలదీవిలో ‘అల’జడి

కోడూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో హంసలదీవి సాగరతీరం అల్లకల్లోలంగా మారింది. తీరంలో ఈదురుగాలుల తీవ్రత కూడా అధికమవ్వడంతో అలల ఉద్ధృతి పెరిగింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి పాలకాయతిప్ప బీచ్ వద్ద వాతావరణ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. సముద్ర అలలు 500 మీటర్ల మేర ముందుకు చొచ్చుకువచ్చాయి. బీచ్ వద్ద నుంచి సాగరగసంగమం వరకు ఇసుకతిన్నెలు భారీ స్థాయిలో కోతకు గురయ్యాయి. పలు ప్రాంతాల్లో గుంతలు ఏర్పడ్డాయి. దీంతో పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు అప్రమత్తమయ్యారు. బీచ్ వరకు మాత్రమే పర్యాటకులను అనుమతించారు.



అలల ధాటికి కోతకు గురైన ఇసుకతిన్నెలు

సిబ్బంది సమస్యలకు పరిష్కారం

కృష్ణా జిల్లా ఎస్పీ జాషువ

కోనేరుసెంటర్(మచిలీపట్నం): పోలీస్ దర్బార్ ద్వారా జిల్లాలోని పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపుతున్నట్లు కృష్ణా జిల్లా ఎస్పీ పి. జాషువ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం ఎస్పీ శుక్రవారం తన కార్యాలయం నుంచి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లకు సంబంధించిన సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. పలువురు బదిలీలకు సంబంధించి ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎస్పీ దృష్టికి తీసుకురాగా, మరి కొంత మంది పోలీసుశాఖ నుంచి అందాల్సిన ఏపీజీఎల్ఐ ఫండ్, ఇంకొంత మంది కో–ఆపరేటివ్ రుణాల గురించి పడుతున్న ఇబ్బందులను ఎస్పీ దృష్టికి తీసుకు వచ్చారు. స్పందించిన ఎస్పీ సిబ్బంది సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మొత్తం 37 మంది తమ సమస్యలను ఎస్పీకి విన్నవించగా, వాటిపై సానుకూలంగా స్పందించారు. అడిషనల్ ఎస్పీ ఆర్. శ్రీహరిబాబు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్‌వీడీ ప్రసాద్ పాల్గొన్నారు.



క్లుప్తంగా

మునేరుకు భారీగా వరద నీరు

అధికారుల రక్షణ చర్యలు



పెనుగంచిప్రోలు: మునేరుకు ఎగువన ఖమ్మం , వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గురువారం అర్ధరాత్రి నుంచి మునేరుకు భారీగా వరద నీరు వచ్చి చేరింది. మరికొన్ని రోజులు వర్షాలు ఉంటాయనే వాతావరణ శాఖ హెచ్చరికలతో వరద మరింత పెరుగుతుందని ప్రజలు భావిస్తున్నారు. శ్రీతిరుపతమ్మ వారి ఆలయం వద్ద మునేరులోకి ఎవరూ వెళ్లకుండా గేటు వేయించి హోంగార్డులను రక్షణగా ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ కె.దుర్గాప్రసాద్, రెవెన్యూ అధికారులు ప్రజలు మునేరులోకి వెళ్లకుండా రక్షణ చర్యలు చేపట్టారు.

ధ్రువీకరణ పత్రాలు, బంగారు ఆభరణాలు ఇవ్వండి

ఇండియన్ బ్యాంక్ అధికారులను ఆదేశించిన వినియోగదారుల కమిషన్

చిలకలపూడి(మచిలీపట్నం): ఖాతాదారులకు ఆస్తి ధ్రువీకరణ పత్రాలు, బంగారు ఆభరణాలు అందజేయాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీ రాయల శుక్రవారం తీర్పు చెప్పారు. కృత్తివెన్నులోని ఇండియన్ బ్యాంక్ బ్రాంచ్‌లో శ్రీనివాస మహంకాళరావు అనే వ్యక్తి వ్యవసాయ పంట రుణం, గోల్డ్‌లోన్ తీసుకున్నారు. అనంతరం ఆయన మృతి చెందారు. లీగల్ హెయిర్ అయిన అతని భార్య పి.సీత పంట రుణం, గోల్డ్‌లోన్ చెల్లించినప్పటికీ బ్యాంకు అధికారులు హామీ పెట్టిన పత్రాలు, బంగారు ఆభరణాలు తిరిగి ఇవ్వకపోవటంతో వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. పూర్వాపరాలు విచారించిన అనంతరం కమిషన్ ధ్రువీకరణ పత్రాలు, బంగారంతో పాటు మానసిక వేదన కలిగించినందుకు రూ.25 వేలు, వ్యాజ్యం ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు తీర్పు చెప్పిన 30 రోజుల్లోగా సీతకు చెల్లించాలని ఆదేశించారు.

యార్డులో 25,762 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 23,914 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 25,762 బస్తాలు అమ్మకాలు జరిగాయి. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 8,354 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సందర్శకులు కోటి..ఆదాయం రూ.10 కోట్లు

- గణనీయంగా పెరిగిన తిరుపతమ్మ ఆలయ ఆదాయం
- 2022–23లో రూ.10.33 కోట్లకు పైగా వార్షిక రాబడి
- 2021–22 కంటే రూ.2.18 కోట్లకు పైగా అదనం
- రూ.15 కోట్లతో ఆలయంలో అభివృద్ధి పనులు



పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి ఆలయం (ఇన్‌సెట్‌లో) శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మవారు

పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): రాష్ట్రంలో ప్రముఖ దేవాలయాల్లో ఒకటైన ఎన్టీఆర్ జిల్లాలోని శ్రీతిరుపతమ్మ వారి ఆలయ వార్షికాదాయం రూ.10.33 కోట్లకు చేరుకుంది. 2019 తరువాత కోవిడ్ కారణంగా అమ్మవారి ఆలయ ఆదాయం గణనీయంగా తగ్గింది. కోవిడ్‌కు ముందు ఆలయ ఆదాయం రూ.8 కోట్ల నుంచి రూ.9 కోట్ల లోపు ఉండేది. కోవిడ్ సమయంలో ఆదాయం రూ.4 కోట్లకు పడిపోయింది. ఆ తర్వాత 2021–22 ఆర్థిక సంవత్సరం వార్షికాదాయం రూ.8,15,27,180 వచ్చింది. 2022–23 సంవత్సరంలో ముందెన్నడూ లేనివిధంగా రూ.10,33,56,802 ఆదాయం సమకూరింది.

అభివృద్ధితో పాటు పెరుగుతున్న ఆదాయం

శ్రీతిరుపతమ్మ వారి ఆలయం దినదినాభివృద్ధి చెందుతున్న విధంగానే ఆలయ ఆదాయం కూడా పెరుగుతోంది. ప్రస్తుతం ఆలయానికి సంబంధించి సుమారుగా రూ.15 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రతి శుక్ర, ఆదివారాల్లో 20 నుంచి 40 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటుండగా, మిగిలిన రోజుల్లో 2 నుంచి 5 వేల మంది భక్తులు దర్శించుకుంటారు. ఏడాదిలో సుమారు కోటి మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. ముఖ్యంగా ఈ క్షేత్రంలో సంతానం కావాల్సిన వారు అమ్మవారికి ముడుపులు కట్టటం, అన్నప్రాసన, పుట్టింట్రుకలు, కల్యాణాలు చేసుకోవటం, కుంకుమపూజ, గోపూజతోపాటు అమ్మవారికి పాలు, పొంగళ్లతో బోనాలు చేయటం ఆనవాయితీగా వస్తోంది. దీంతో ఆంధ్రా నుంచే కాకుండా తెలంగాణ నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వీఐపీల తాకిడి కూడా పెరుగుతోంది. భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు అందుతున్నాయి. దాతలు నిత్యాన్నదానం, గదుల నిర్మాణం, స్వామివారి బంగారు తలపాగా, గోవుల సంరక్షణ అంకమ్మవారి ఆలయ గోపురం వెండి తాపడం తయారీకి విరాళాలు అందజేస్తున్నారు.

ఆలయ అభివృద్ధిపై దృష్టి



అమ్మవారి ఆలయం అభివృద్ధి చెందుతోంది. నిత్యాన్నదానంలో కూడా భక్తుల సంఖ్య పెంచాం. ఆలయ అభివృద్ధికి దాతలు కూడా ముందుకు వస్తున్నారు. దాతల సాయంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రస్తుతం రూ.15 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయి.

– కె.రమేష్‌నాయుడు, ఆలయ ఈఓ

అమ్మవారి వార్షిక ఆదాయ వివరాలు.....

విభాగం	2021-22	2022-23	పెరిగిన ఆదాయం
హుండీలు	రూ.3,67,30,358	రూ.4,41,18,677	రూ.73,88,319
గదులు, సత్రాలు	రూ.16,41,000	రూ.26,84,000	రూ.10,43,000
ప్రసాదాలు	రూ.2,57,20,780	రూ.2,89,62,055	రూ.32,41,275
దర్శనాలు	రూ.1,70,60.755	రూ.2,70,30,464	రూ.99,69,709
సేవలు			
కానుకలు	రూ.3,74,287	రూ.5,61,606	రూ. 1,87,319
మొత్తం	రూ.8,15,27,180	రూ.10,33,56,802	రూ.2,18,29,622

స్వాతంత్య్ర దిన వేడుకలకు ముందస్తు ఏర్పాట్లు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): 77వ భారత స్వాతంత్య్ర దిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డికి వివరించారు. స్వాతంత్య్ర దిన వేడుకల ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి శుక్రవారం తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని కలెక్టరేట్ కార్యాలయం నుంచి కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఆగస్టు 15 వ తేదీన నిర్వహించే 77వ స్వాతంత్య్ర దిన వేడుకలకు నగరపాలక సంస్థ, సాధారణ పరిపాలన శాఖ, వైద్య ఆరోగ్య, విద్యుత్, పోలీస్, ఫైర్ శాఖలతో సమన్వయం చేసుకుని ముందస్తు ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి స్వాతంత్య్ర దిన వేడుకలకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వేడుకలు విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులకు విధులను కేటాయిస్తామన్నారు. స్టేడియంతో పాటు పరిసరాలు, ప్రాంగణాన్ని వేడుకలకు అనుగుణంగా సిద్ధం చేస్తున్నామన్నారు. సామాన్య ప్రజలకు వీఐపీలు, వీవీఐపీలకు సౌకర్యాలు, వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ కేటాయించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేడుకలకు ప్రతి రోజు నిర్వహించే రిహార్సల్స్‌కు అన్ని ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ ఢిల్లీరావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డికి వివరించారు.

వేగ జ్యూయలర్స్ ఆషాఢం లక్కీ డ్రా విజేతలు వీరే!



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): వేగ జ్యూయలర్స్‌లో ఆషాఢ మాసం సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రాకు విశేష ఆదరణ లభించిందని వేగ జ్యూయలర్స్ యజమానులు వనమా నవీన్, వనమా సుధాకర్ చెప్పారు. వారు శుక్రవారం సాయంత్రం తమ షోరూమ్‌లో ఖాతాదారుల సమక్షంలో లక్కీడ్రా తీశారు. విజయవాడకు చెందిన ఉమారాణి, హైదరాబాద్‌కు చెందిన మహేశ్వరి, విజయవాడకు చెందిన నాగలక్ష్మి మూడు డైమండ్ నెక్లెస్‌లను లక్కీ డ్రాలో గెలుచుకున్నారని చెప్పారు. త్వరలో అమెరికాలో కూడా తమ జ్యూయలరీ షోరూమ్‌ను ప్రారంభిస్తున్నామని వెల్లడించారు.

ఆటోను ఢీకొని వ్యక్తి మృతి

కంచికచర్ల: రోడ్డు పక్కన ఆగిఉన్న ఆటోను బైక్ ఢీకొనగా బైక్‌పై ఉన్న వ్యక్తి రోడ్డుపై పడి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన కంచికచర్లలో శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు చందర్లపాడు గ్రామానికి చెందిన బొందల బాలస్వామి(52) అనే వ్యక్తి స్థానిక సంజీవనగర్ కాలనీలో అక్క దగ్గర ఉంటూ ప్రయివేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. గొట్టుముక్కల రోడ్డులో బైక్‌పై వెళుతుండగా రోడ్డుపై ఆగిఉన్న ఆటోను ఢీకొన్నాడు. దీంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు ఏపీ మీడియా అకాడమీ ప్రత్యేక ప్రసంగాలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సంయుక్తంగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న డిప్లొమో కోర్సు ఇన్ జర్నలిజంలో భాగంగా శనివారం వర్చువల్ విధానంలో ప్రత్యేక ప్రసంగాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సమాచార హక్కు చట్టం కమిషనర్ యు.హరిప్రసాద్‌రెడ్డి సమాచార హక్కు చట్టాలపై,ఉదయం 9 నుంచి 10 వరకు తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి మాధ్యమాలు–తెలుగు భాష అనే అంశంపై మాట్లాడతారని వివరించారు. డిప్లొమా అభ్యర్థులతో పాటు ఇతరులు జూమ్ ఐడీ–815 9892 6979, పాస్‌వర్డ్ –12345 తో హాజరు కావచ్చునని పేర్కొన్నారు.

ఇద్దరు యువతుల అదృశ్యం

ఫిర్యాదు అందిన 4 గంటల్లో ఆచూకీ లభ్యం

పెనమలూరు: తల్లిదండ్రుల ఒత్తిడి కారణంగా ఇద్దరు యువతులు ఇంటి నుంచి వెళ్లిపోయారు.ఈ ఘటనపై పోలీసులు ఫిర్యాదు అందిన నాలుగు గంటల్లో యువతుల ఆచూకీ తెలుసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం కానూరు మురళీనగర్ కమలమ్మబజార్‌లో ఉంటున్న దంపతులకు 18, 15 ఏళ్ల వయసున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఒకరు బీటెక్ 3వ సంవత్సరం చదువుతుండగా మరొకరు ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. తల్లిదండ్రులు శుక్రవారం ఉదయం లేచి చూడగా ఇంట్లో ఇద్దరు కుమార్తెలు కనిపించలేదు. వారు రాసిన లెటర్‌లో తమ గురించి వెతకవద్దని, తాము ఇంటి నుంచి వెళ్లిపోతున్నామని పేర్కొన్నారు. బంధువులు, కాలేజీ వద్దకు వెళ్లి వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో శుక్రవారం సాయంత్రం పెనమలూరు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించారు. యువతుల స్నేహితులను విచారించారు. చివరికి ఇద్దరు యువతులు గురునానక్‌కాలనీలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో చేరినట్లు సమాచారం తెలుసుకుని వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకు వచ్చి తల్లితండ్రులకు అప్పగించారు.

సత్ఫలితాలు ఇస్తున్న అమృత్ సరోవర్ పథకం

జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్



పరిటాలలో క్వారీ దిబ్బ గురించి జేసీ, డీపీఓలకు వివరిస్తున్న సర్పంచి ఆనందజ్యోత్స్న

పరిటాల(కంచికచర్ల): ప్రకృతి అందించిన ప్రతి వర్షపు బొట్టును వడిసి పట్టుకుని చెరువులను నింపడం ద్వారా రైతాంగానికి సాగునీరు, పశువులకు తాగునీరు అందించడంలో అమృత్ సరోవర్ సత్ఫలితాలను ఇస్తుందని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. కంచికచర్ల మండలంలోని పరిటాల క్వారీ దిబ్బను ,ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్న వాకింగ్ ట్రాక్ పనులను అధికారులతో కలసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమృత్ సరోవర్ కింద చెరువులు, క్వారీ దిబ్బలను అభివృద్ధి చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని చెప్పారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సహకారంతో అమృత్ సరోవర్ పథకం ద్వారా కుంటలు, చెరువులను అభివృద్ధి చేసి నీటి నిల్వల సామర్థ్యం పెంచే చర్యలు తీసుకున్నామన్నారు. అమృత్ సరోవర్ ద్వారా సంపూర్ణంగా సాగునీరు, పశువులకు తాగునీరు అందించగలుగుతున్నామన్నారు. గ్రామీణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలనే లక్ష్యంతో దిబ్బ చుట్టూ గట్లను అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్, గట్లపై ఫలసాయపు మొక్కలు నాటి సిమెంటు బల్లలను ఏర్పాటు చేయటం ద్వారా పార్కులను తలపించే వాతావరణాన్ని తీసుకువస్తున్నామన్నారు. ప్రకృతి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సునీత, జిల్లా పంచాయతీ అధికారి జయచంద్ర గాంధీ, డీటీ నాగుల్‌మీరా, సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, ఎంపీటీసీ సభ్యురాలు కర్ల రాధిక, వైఎస్సార్‌సీపీ నాయకులు యద్దనపూడి విజయారావు, చింతా రవీంద్రనాథ్, మార్త శ్రీనివాసరావు, కర్ల రామకృష్ణ, ఎంపీడీఓ కె.బాలశంకరరావు, తహసీల్దార్ శంకరబాబు, పంచాయతీ కార్యదర్శి మీర్జావలి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక స్పందన

కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శివనారాయణరెడ్డి



ఉద్యోగుల సమస్యలు వింటున్న కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శివనారాయణరెడ్డి

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ డి.శివనారాయణరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో శుక్రవారం వివిధ శాఖల ఉద్యోగుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. శివనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ఈ ప్రక్రియను ప్రారంభించిందన్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ప్రతి నెల మూడో శుక్రవారం ప్రత్యేక స్పందన కార్యక్రమం ద్వారా ఉద్యోగుల నుంచి వినతిపత్రాలు స్వీకరించి వాటిని జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. సంబంధిత శాఖలు తగిన చర్యలు తీసుకుని వాటిని పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను నమోదు చేసి కలెక్టర్ రాజాబాబు దృష్టికి తీసుకువెళ్లి సంబంధిత అధికారులతో తగిన చర్యలు చేపట్టేందుకు పంపుతామన్నారు. ప్రత్యేక స్పందన కార్యక్రమంలో 12 వినతిపత్రాలను స్వీకరించామని తెలిపారు. ఏపీ రివైజ్డ్ నేషనల్ టీబీ కంట్రోల్ ప్రోగ్రాం కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం వారు 2014 జూన్ 2వ తేదీ నాటికి 5 సంవత్సరాల సర్వీసును పూర్తి చేశామని, తమ సర్వీసులను కూడా క్రమబద్ధీకరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ సీపీఎస్ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో జీవీ ప్రసాద్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ టీవీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అరగంటలోనే అమ్మవారి దర్శనం

అధిక శ్రావణం కావడంతో దుర్గ గుడిపై రద్దీ సాధారణం



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శుక్రవారం భక్తుల రద్దీ సాధారణంగా కనిపించింది. శుక్రవారం అయినప్పటికీ అధిక శ్రావణం కావడంతో భక్తుల రద్దీ తక్కువగా ఉండటంతో అర్ధగంటలోనే అమ్మవారి దర్శనం పూర్తవుతోంది. ఉదయం నుంచి భక్తుల రద్దీ అంతంత మాత్రంగానే ఉండగా, మధ్యాహ్నం మహా నివేదన అనంతరం కొంత కనిపించింది. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ మరో కొద్ది రోజుల్లో ప్రారంభం కానుండటంతో యువతీ, యువకులు తమకు నచ్చిన కాలేజీలో సీటు రావాలని అమ్మవారిని మొక్కుకున్నారు. మధ్యాహ్నం 12.20 గంటలకు తిరిగి దర్శనాలు ప్రారంభం కాగా 1.30 గంటల వరకు భక్తుల రద్దీ కనిపించింది. మరో వైపున వాతావరణం చల్లగా ఆహ్లాదకరంగా ఉండటంతో కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రికి విచ్చేసిన భక్తులు అమ్మవారి దర్శనం అనంతరం అన్నప్రసాదాన్ని స్వీకరించి ఆలయ ప్రాంగణంలోనే సేద తీరారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత క్యూలైన్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. సాయంత్రం ఆరు గంటలకు అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కొంత రద్దీ కనిపించింది.

శరవేగంగా విజయవాడ బైపాస్ రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణం

మర్లపాలెం ఫ్లై ఓవర్ నెలరోజుల్లో పూర్తికి సన్నాహాలు



మర్లపాలెం వద్ద రైల్వేట్రాక్‌పై నిర్మించిన ఫ్లై ఓవర్

గన్నవరం: భారతమాల ప్రాజెక్ట్‌లో భాగంగా మండలంలోని చిన్నఅవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు చేపట్టిన జాతీయ రహదారి బైపాస్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. విజయవాడ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు సుమారు రూ.1,225 కోట్లతో ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టారు. ప్యాకేజీ–3లో భాగంగా బైపాస్ నిర్మాణ పనుల కాంట్రాక్ట్‌ను దక్కించుకున్న మెగా ఇంజినీరింగ్ సంస్థ ఇప్పటికే 80 శాతం పనులను పూర్తిచేసింది. ఈ ప్రాజెక్ట్‌లో కీలకమైన గొల్లపూడి, గన్నవరం శివారు మర్లపాలెం వద్ద రెండు రైల్వే ఫ్లై ఓవర్‌ల నిర్మాణ పనులను కూడా మెగా సంస్థ ప్రారంభించింది. ఇందుకు అవసరమైన అనుమతులు రైల్వే శాఖ నుంచి రావడంతో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను వేగవంతం చేశారు. మర్లపాలెం రైల్వే ట్రాక్ వద్ద ఇరువైపులా నిర్మించిన పిల్లర్లపై ఐరన్ గడ్డర్ల అమరిక పనులను పూర్తిచేశారు. ఐరన్ గడ్డర్లపై ఆరు లైన్ల రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. ఫ్లై ఓవర్‌ను బీబీ గూడెం, చిన్నఅవుటపల్లి వైపు అనుసంధాన పనులను చేస్తున్నారు. మరో నెల రోజుల్లో రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను పూర్తి చేసి వాహనాల రాకపోకలకు సిద్ధం చేసేందుకు కాంట్రాక్ట్, నేషనల్ హైవే అథారిటీ అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్తున్నారు. గొల్లపూడి రైల్వే ఫ్లై ఓవర్ కూడా పూర్తయితే బైపాస్ నిర్మాణ పనులు ఓ కొలిక్కి వచ్చినట్లేనని అధికారులు పేర్కొంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కంచికచర్ల: గుర్తు తెలియని వాహనం ఢీకొనగా ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలో శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు కంచికచర్లకు చెందిన చక్కం మధు(48)అనే వ్యక్తి భిక్షాటన చేస్తూ జీవిస్తుండేవాడు. గతంలో అతని తండ్రి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కారుడ్రైవర్‌గా పని చేసి మృతిచెందాడు. ఆ తర్వాత మధుకు అటెండర్ పోస్టు ఇచ్చారు. జి.కొండూరు మండల పరిషత్ కార్యాలయంలో కొంతకాలం అటెండర్‌గా పనిచేశాడు. మతిస్థిమితం లేకపోవటంతో అటెండర్ ఉద్యోగాన్ని మానుకుని కంచికచర్లలో భిక్షాటన చేస్తూ ఒంటరిగా నివాసముంటున్నాడు. మండలంలోని పరిటాల శివారు దొనబండ పోలీస్ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం నేషనల్ హైవేపై నడుచుకుంటూ వెళుతుండగా విజయవాడ వైపు వెళుతున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మధు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీ

176 గ్రాముల బంగారం, రూ.20 వేల నగదు అపహరణ

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని విష్ణుప్రియనగర్‌లో గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు ఇంటి తలుపులు పగలగొట్టి ఇనుప బీరువా తెరిచి 176 గ్రాముల బంగారం, రూ.20 వేల నగదు అపహరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. విష్ణుప్రియనగర్‌లో నివాసం ఉంటున్న కస్తాల వెంకట శేషగిరి మండలంలోని హేమాద్రి సిమెంట్ ఫ్యాక్టరీలో సూపర్‌వైజర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. భార్యభర్తలు ఇద్దరే ఇంట్లో ఉంటున్నారు. ఈనెల 19 వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో శేషగిరి దంపతులు ఇద్దరూ విజయవాడ వెళ్లి 20 వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు తిరిగి వచ్చారు. వచ్చి చూసేటప్పటికి బయట తలుపులకు తాళం పగులగొట్టి ఉంది.లోపలకు వెళ్లి చూడగా బీరువా తెరిచి, దానిలో ఉన్న 176 గ్రాముల బంగారం, రూ.20 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. బాధితుడు శేషగిరి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బీవీ రామారావు తెలిపారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ నిలిపివేత

ఆటోనగర్(విజయవాడతూర్పు):రామలింగేశ్వరనగర్ సమీపంలోని విద్యుత్ ఉపకేంద్రం 11 కేవీ, పటమటలంక ఫీడర్‌లోని కరెంట్ తీగల మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ తెలిపారు. నేతాజీ స్ట్రీట్, సీతారామనగర్, జాస్తీవారివీధి, కోగంటి సత్యంవీధితో పాటు బృందావన్ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్టు చెప్పారు. వినియోగదారులు సిబ్బంది సహకరించాలని ఆయన కోరారు.

24న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన దీక్ష



కృష్ణలంక(విజయవాడతూర్పు):ఇంటర్మీడియట్ విద్యార్థుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా జరిగే నిరసన దీక్షను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో దీక్షకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ జూనియర్ కళాశాలలు ప్రారంభమై 49 రోజులు అయినప్పటికీ ప్రభుత్వం నేటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించలేదన్నారు. దాదాపు 3 వేల అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నా వాటిని భర్తీ ఊసేలేదన్నారు. పుస్తకాలు, అధ్యాపకుల కొరత వలన గత విద్యా సంవత్సరం 36 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారని గుర్తు చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకటేశ్వరరావు, ఎం.సోమేశ్వరరావు, మన్మధ, కుమారస్వామి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

220 మందికి ఉచిత వైద్య పరీక్షలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ ఐరన్ అండ్ హార్డ్‌వేర్ మర్చంట్స్ అసోసియేషన్, మానస హాస్పటల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం భవానీపురం ఐరన్ కాంప్లెక్స్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జీర్ణకోశ వ్యాధుల నిపుణులు డాక్టర్ నూరె పవన్‌కుమార్, మానసిక వ్యాధుల నిపుణులు డాక్టర్ ఆర్‌కే అయోధ్య, చైల్డ్ అండ్ అడల్ట్స్ సైకియాట్రిస్ట్ డాక్టర్ మానస కాజులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నూరె పవన్‌కుమార్ మాట్లాడుతూ జీర్ణకోశ వ్యాధులను అశ్రద్ధ చేయకుండా తగు వైద్యం పొందుతూ, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రస్తుతం ఆహారపు అలవాట్లు జీవనశైలిలో ఎక్కువ మంది జీర్ణకోశవ్యాధుల భారిన పడుతున్నట్లు పేర్కొన్నారు. మానసిక ఒత్తిళ్లు, వ్యాధులపై డాక్టర్ ఆర్కే అయోధ్య అవగాహన కలిగించారు. మానసిక రుగ్మతలను సత్వరమే గుర్తించి వైద్యం పొందాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఐరన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణయ్య, కార్యదర్శి కొనకళ్ల సూర్యశంకర్‌లు వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు.

26న గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ 2023

లబ్బీపేట(విజయవాడతూర్పు):ఈ నెల 26న నగరంలో యూనిఎక్స్‌ఫర్ట్స్ గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ 2023 నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి ఇంతియాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. మహాత్మాగాంధీరోడ్డులోని హోటల్ ఫార్చ్యన్ మురళీపార్కులో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిర్వహించే ఈ ఫెయిర్‌లో పలు దేశాలకు చెందిన విశ్వ విద్యాలయాల ప్రతినిధులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఆస్ట్రేలియా, యూఎస్ఏ, కెనడా, యూకే, దుబాయ్, జర్మనీ వంటి దేశాల్లో 60కి పైగా విశ్వ విద్యాలయాలు ప్రతినిధులు పాల్గొననున్నట్లు తెలిపారు. విదేశీ విశ్వ విద్యాలయాల్లో గ్రాడ్యుయేషన్, పోస్టుగ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశం కోరుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటరాక్టివ్ స్టడీ, విదేశీ సెషన్‌లు, ప్రోగ్రామ్ ఎంపిక, దరఖాస్తు ప్రక్రియ, వీసా అవసరాలు, సాంస్కృతిక సూక్ష్మ నైపుణ్యాలు, ప్రవేశానంతరం విద్యార్థి జీవితం వంటి అనేక అంశాలపై సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు.

రైల్వే పారిశుద్ధ్య కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):అకారణంగా తొలగించిన రైల్వేస్టేషన్‌లోని పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లో తీసుకోవాలని రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నగర కార్యదర్శి ఈవీ నారాయణ డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిరసిస్తూ శుక్రవారం కార్మికుల మస్టర్ పాయింట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ రక్షక్ కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యంగా కార్మికులను తొలగించి వారిని రోడ్డు పాలు చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ తన లాభాల కోసం కార్మికుల కడుపులు కొట్టే పద్ధతి మార్చుకోవాలని కోరారు. రైల్వే అధికారులు కూడా ఈ సమస్యపై స్పందించి కార్మికులందరినీ పనిలోకి పెట్టించే చర్యలు చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

డివిజన్ల అభివృద్ధికి నిరంతర కృషి

స్థాయీ సంఘం సమావేశంలో మేయర్ భాగ్యలక్ష్మి



స్థాయీ సంఘం సమావేశం నిర్వహిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని ఆయా డివిజన్ల అభివృద్ధికి తాము నిరంతరం కృషి చేస్తున్నామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో మేయర్ అధ్యక్షతన శుక్రవారం స్థాయీ సంఘం సమావేశం నిర్వహించారు. మొత్తం 26 అంశాలు ఎజెండాలో పొందుపరచగా అందులో 20 ఆమోదించారు. మూడు ర్యాటిఫై చేశారు. ఒక అంశాన్ని వాయిదా వేయగా, ఒకటి రికార్డు, మరొక అంశాన్ని ధ్రువపరుస్తూ తీర్మానించారు. స్థాయీ సంఘం సభ్యులతోపాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రధానాంశాలు ఇవే...

- నగరంలోని ప్రధాన కూడళ్లు, ఆయా ప్రాంతాల్లో గ్రీనరీని పెంపొందించేందుకు 2023–24 ఏడాదికి ఎవెన్యూ ప్లాంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా ట్రీగార్డులు, స్టాకింగ్ స్టిక్స్, ఎరువుల కొనుగోలుకు రూ. 25 లక్షలు అంచనాలు రూపొందించారు. వాటిని వీఎంసీ సాధారణ నిధుల నుంచి వినియోగించుకునేందుకు ప్రతిపాదన రాగా సభ్యులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు.
- సర్కిల్–1 పరిధిలోని 54వ డివిజన్‌లోని వించిపేట ఇఫెన్స్‌ట్రీట్ నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు రూ. 43.78 లక్షల నిధులు ఖర్చుకు వచ్చిన ప్రతిపాదనను స్థాయీ సంఘం సభ్యులు ఆమోదం తెలిపారు.
- సర్కిల్–3 పరిధిలోని 3వ డివిజన్‌లో గణేష్‌నగర్ కాలనీలో 8, 8ఏ, 11 అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ. 39.50 లక్షల నిధులు వెచ్చించేందుకు వచ్చిన ప్రతిపాదనను ఆమోదిస్తూ తీర్మానం చేశారు.
- వీఎంసీ ఇంజినీరింగ్ వర్క్స్ డివిజన్–2లో 2021 ఫిబ్రవరి 1 తేదీ నుంచి ఈ ఏడాది మే 31వ తేదీ వరకు 54 పనులు అత్యవసరంగా నామినేషన్ పద్ధతిలో పనుల కేటాయింపులు, బిల్లుల చెల్లింపులకు వచ్చిన ప్రతిపాదను కమిటీ సభ్యులు వాయిదా వేశారు.

యానిమేల్స్ ది వైల్డ్ షాడోస్ చిత్ర ట్రైలర్ ఆవిష్కరణ



యానిమేల్స్ చిత్ర ట్రైలర్‌ను ఆవిష్కరిస్తున్న నటుడు అజయ్ ఘోష్

కృష్ణలంక(విజయవాడతూర్పు):నగరంలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో యానిమేల్స్ ది వైల్డ్ షాడోస్ చిత్ర ట్రైలర్‌ను ప్రముఖ నటుడు అజయ్ ఘోష్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగంతో యువత తమ జీవితాలను ఎలా నాశనం చేసుకుంటున్నారు అనే అంశంపై పూర్తి స్థాయి సినిమాను యానిమేల్స్ మూవీ ద్వారా చూపించడం అభినందనీయమన్నారు. చిత్ర దర్శక నిర్మాతలు భార్గవ్ రేణిమడుగు, షేక్ షహనాజ్ ఇద్దరూ మంచి సినిమాను తెరకెక్కించారని ప్రశంసించారు. కేవలం విజయవాడ నటీనటులతో నగర పరిసర ప్రాంతాల్లో ఈ సినిమాను తెరకెక్కించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆదిపరాశక్తి డెమో ఫిలింను యూట్యూబ్‌లోకి లాంచ్ చేశారు. కార్యక్రమంలో యానిమేల్స్ చిత్ర బృందం, ఆదిపరాశక్తి బృందం పాల్గొన్నారు.

రుచికరమైన వంటల తయారీపై సదస్సు



రుచికరమైన వంటలపై అవగాహన కలిగిస్తున్న దృశ్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): నోరూరించే రుచికరమైన వంటకాల తయారీపై శుక్రవారం శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో సదస్సు నిర్వహించారు. ఆశీర్వాద్ స్పైసెస్, రెడ్ ఎఫ్ఎం 93.5 ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చెఫ్ రాణి రుచికరమైన వంట తయారు చేసే టిప్స్‌పై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా పలు వంటకాలను లైవ్‌లో తయారు చేసి చూపించారు. వాటిని టేస్ట్ ఆఫ్ బెజవాడకు చెందిన ఫుడ్ ఇన్‌ఫ్లూయన్సర్స్ దాన్య, నందా రుచి చూసి వారి ఫీడ్‌బ్యాక్ చెప్పారు. అంతేకాక రెడ్ ఎఫ్ఎం ఆర్‌జేలు విద్యార్థినులతో పలు గేమ్స్ ఆడించారు. ఆ కళాశాల డైరెక్టర్ టి. విజయలక్ష్మి విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో రెడ్ఎఫ్ఎం ఆర్‌జేలు ఆర్య, ఇస్మార్ట్ స్వీటీతో పాటు స్టేషన్ హెడ్ క్రాంతికుమార్, ప్రోగ్రామింగ్ హెడ్ ఆదిల్‌బాషా పాల్గొన్నారు.

మధురంగా శాస్త్రీయ సంగీత కచేరీలు



సంకీర్తనలు గానం చేస్తున్న వలివేటి నీరజ

విజయవాడ కల్చరల్: స్వరఝరి సంగీత సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ షష్టి పూర్తి సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించే సంగీత మహోత్సవాలు లబ్బీపేట శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్వాంసులు, వాగ్గేయకారులు త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, స్వాతి తిరునాళ్, అన్నమయ్య, రామదాసు, రచించి స్వరపరచిన కీర్తనలు ఆలపించారు. టి.రుక్మిణీ కృష్ణ తిరుచ్చినాపల్లి, ఎస్‌పీ రాగమయూరి అబుదాబి, లోళ్ళ జయరాం, శివలెంక విశ్వనాథ్, వలివేటి నీరజ, ఎం.హరిప్రియ, లంక తేజస్వి సంప్రదాయ కీర్తనలు ఆలపించారు. కార్యక్రమాలను ప్రారంభించిన వయోలిన్ విద్వాంసుడు అన్నవరపు రామస్వామి మాట్లాడుతూ గురు శిష్యుల సంబంధం దైవ సంబంధమైనదన్నారు. నగరం సకళ కళానిలయమని, ఎందరో సంగీత విద్వాంసులకు వేదికైందని తెలిపారు. సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ సంగీత సేవలను వివరించారు. వేమూరి విశ్వనాథ్, భమిడిపాటి శ్రీలలిత నిర్వహించారు.

నోరీ ఆసుపత్రిలో 40 రోజుల పాపకు అరుదైన చికిత్స



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు గురవయప్ప

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్‌లోని నోరీ ఆసుపత్రిలో 40 రోజుల పాపకు వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. హనుమాన్ జంక్షన్‌కు చెందిన రాజేష్, అలేఖ్య దంపతులకు 40 రోజుల పాప. కామెర్ల వ్యాధితో బాధ పడుతుండడంతో నోరి ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షలు చేసి పిత్తాశయం పగిలిందని గుర్తించారు. వెంటనే పాపకు కోలిసిస్టెక్టమి ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. పూర్తి ఆరోగ్యంతో ఉన్న పాపను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో డాక్టర్ నోరి సూర్యనారాయణ, డాక్టర్ గురువయప్ప, డాక్టర్ వెంకటకృష్ణ మాట్లాడుతూ ఇలాంటి సమస్య పసిపిల్లలో చాలా అరుదని పేర్కొన్నారు. త్వరితగతిన వ్యాధిని నిర్ధారించి సకాలంలో ఆపరేషన్ చేశామన్నారు. ఎటువంటి ప్రాణాపాయం లేకుండా పాపను కాపాడగలిగామని వివరించారు. తమ పాప ప్రాణాలను కాపాడిన నోరి అసుపత్రి వైద్యులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

● సుందరంగా రైతుబజారు మార్కెట్



ఏపీఐఐసీ కాలనీలో రైతుబజారు మార్కెట్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ నిధులు రూ.90 లక్షలతో దీనిని నిర్మించారు. మార్కెట్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని అందరికీ సౌకర్యవంతంగా నిర్మించారు. ఈ రైతుబజారు సమీపంలోని ఆరు కాలనీల ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ఆగస్టు మొదటి వారంలో మార్కెట్‌ను ప్రారంభించనున్నారు.

– ఆటోనగర్(విజయవాడతూర్పు)

పవన్‌కల్యాణ్ పెద్ద రాజకీయ అజ్ఞాని

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మతి చెలించటం వల్ల అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేస్తున్న దిగజారుడు వ్యాఖ్యలను ఆసిఫ్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వించిపేటలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. పవన్‌కల్యాణ్ పెద్ద రాజకీయ అజ్ఞాని అని విమర్శించారు. చంద్రబాబుకు ఊడిగం చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చిన పవన్ కల్యాణ్ రాష్ట్ర ప్రజల మనస్సులను గెలుచుకున్న జగన్‌మోహన్‌రెడ్డిపై నోటికొచ్చినట్లు మాట్లాడటం దుర్మార్గమన్నారు. గత ఎన్నికల్లో రెండు చోట్ల నిలబడి డిపాజిట్లు కూడా రాని ఆయన దేశంలోనే అత్యధిక మెజార్టీ ఓట్లతో ఎంపీగా, ఎమ్మెల్యేగా గెలుపొందిన జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ముఖ్యంగా 50 శాతానికి పైగా ఓట్లతో గెలుపొందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని తరిమికొడతానంటూ పవన్‌కల్యాణ్ మాట్లాడుతుంటే రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారని చెప్పారు. మహిళల పట్ల ఏ మాత్రం గౌరవం లేని పవన్ కల్యాణ్ వలంటీర్లలో 60 శాతానికి పైగా ఉన్న మహిళలను, అందులోనూ అత్యధికంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాలను నొటికొచ్చినట్లు మాట్లాడటం సిగ్గు చేటన్నారు. పవన్‌కల్యాణ్‌కు బుద్ధి చెప్పటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గౌరవ ముఖ్యమంత్రిని ఏకవచనంతో మాట్లాడటమే కాకుండా కేంద్ర నిఘావర్గాలు చెప్పాయంటూ సొల్లుకబుర్లు చెబుతున్న పవన్‌కల్యాణ్ దమ్ముంటే రాష్ట్రంలో ఒంటరిగా, 175 నియోజకవర్గాల్లో పోటీ చేసి తన సత్తా చూపించాలన్నారు. మరోసారి ముఖ్యమంత్రిపై విమర్శలు చేస్తే ప్రజలు సహించరన్నారు.

24 నుంచి ఇంటర్ తప్పిన విద్యార్థులకు ఉచిత శిక్షణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):కేబీఎన్ కళాశాలలో 2023 ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు తప్పిన విద్యార్థులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. కళాశాల ప్రాంగణంలో ప్రత్యేక శిక్షణనిచ్చి వారిని పరీక్షలకు హాజరయ్యేందుకు సహకరిస్తామని పేర్కొన్నారు. ఈ శిక్షణను పూర్తిగా ఉచితంగా అందిస్తామని, ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదన్నారు. తరగతులను 24వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం తొమ్మిదిన్నర గంటల నుంచి ప్రారంభమవుతాయని వివరించారు. మరింత సమాచారం కోసం ఫోన్ నెం 8919316615కు సంప్రదించాలని కోరారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యాయత్నం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):యువకుడి వేధింపులు తాళలేక వివాహిత ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. అడ్డరోడ్డుకు చెందిన మహిళ ఇళ్లల్లో పని చేసుకుంటూ జీవిస్తుంది. కొంత కాలంగా ఆమెను సంతోష్ అనే యువకుడు వేధింపులకు గురిచేస్తున్నాడు. బాధలు తట్టుకోలేక ఆ మహిళ గురువారం రాత్రి ఎలుకల మందు తినింది. గమనించిన భర్త హుటాహుటిన ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీ ఐడీసీఎల్ అభివృద్ధికి కృషి చేస్తా

భవానీపురం(విజయవాడపశ్చిమ):ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఐడీసీ) లిమిటెడ్ చైర్‌పర్సన్ బండి పుణ్యశీలరాజ్‌కుమార్ పదవీ కాలాన్ని పొడిగించిన సందర్భంగా సంస్థ డైరెక్టర్లు ఆమెను అభినందించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఆమె చాంబర్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన సమావేశంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన పలువురు డైరెక్టర్లు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ ఐడీసీఎల్ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల రాజ్‌కుమార్ మాట్లాడుతూ పదవీ కాలం పూర్తయినప్పటికీ తనపై నమ్మకం ఉంచి పొడిగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సదా రుణపడి ఉంటానని అన్నారు.

అన్న ప్రసాదాన్ని వృథా చేయకండి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గమ్మ సన్నిధిలో రాత్రి వేళ నిద్ర చేసే భక్తులకు పంపిణీ చేసే అన్న ప్రసాదాన్ని వృథా చేయరాదని చైర్మన్ కర్నాటి రాంబాబు తెలిపారు. మహా మండపం గ్రౌండ్ ఫ్లోర్‌లో రాత్రి జరిగే అన్న ప్రసాద వితరణను దుర్గగుడి చైర్మన్ శుక్రవారం పరిశీలించారు. అన్న ప్రసాద నాణ్యతను పరిశీలించడంతో పాటు భక్తుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాలు వృథా చేయవద్దని, భక్తులందరికీ అన్న ప్రసాదం అందేలా ఆలయ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.

చెత్త సేకరణలో అలసత్వం వద్దు

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



చెత్త సేకరణ పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు):చెత్త సేకరణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. సర్కిల్–3 పరిధిలోని 5 వ డివిజన్ క్రీస్తురాజుపురం అమ్మ కళ్యాణ మండపం వద్ద శుక్రవారం ఆయన పర్యటించారు. కొన్నిచోట్ల చెత్త తొలగింపులో సిబ్బంది అలసత్వాన్ని గుర్తించి , స్థానికంగా విధులు నిర్వహిస్తున్న కార్మికులు, శానిటరీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వారికి ఆయన మెరుగైన పారిశుధ్య నిర్వహణ కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. బిన్ ఫ్రీ సిటీలో భాగంగా నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డంపర్ బిన్నులను తొలగించామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఇంటి నుంచే తడి, పొడి చెత్తను విభజించి కార్మికులకు అందిచేలా స్థానికులకు చైతన్య పరచాలని సూచించారు. సచివాలయ పరిధిలో జరుగుతున్న శానిటేషన్ పనుల గురించి చెత్త సేకరణకు శానిటేషన్ సిబ్బంది ప్రతి ఇంటికి వస్తుందీ... లేనిదీ అక్కడి ప్రజలను అడిగి తెలుసుకొన్నారు. వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగర వ్యాప్తంగా ఉన్న అన్ని కాలువల్లో పూడికతీత పనులను క్రమం తప్పకుండా తీయాలని ఆదేశించారు.

డిజిటల్ ఇమేజ్ ప్రాసెసింగ్‌పై సదస్సు



ఫణి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు):డిజిటల్ ఇమేజ్ ప్రాసెసింగ్ టెక్నిక్స్‌ను మెడికల్ ఫీల్డ్‌లో ఉపయోగించి మానవ శరీరంలోని నరాల పనితీరును స్పష్టంగా తెల్సుకునేందుకు ఇన్ఫ్రారెడ్ కిరణాలు ఎంతగానో దోహదం చేస్తాయని అమృతసాయి ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ కె.ఫణి శ్రీనివాస్ చెప్పారు. సిద్ధార్థ కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో డిజిటల్ ఇమేజ్ ప్రాసెసింగ్ టెక్నిక్స్ ఇన్ మెడికల్ ఫీల్డ్ అంశంపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఫణి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం వైద్య రంగంలో మానవ శరీరంలోని అవయవాల పనితీరును గుర్తించడానికి ఎక్స్‌రే, ఈసీజీ, వివిధ రకాల స్కాన్‌లను ఉపయోగిస్తున్నారని తెలిపారు. వీటి కన్నా ఇన్ఫ్రారెడ్ కిరణాలను శరీరంలోకి పంపడం ద్వారా అవయవాల పనితీరు స్పష్టంగా తెల్సుకోవడమే కాకుండా భవిష్యత్తులో శరీరంలో వచ్చే జబ్బులను కూడా గుర్తించవచ్చని వెల్లడించారు. ప్రస్తుతం ఈ అంశంపై పరిశోధనలు జరుగుతున్నాయని, మంచి ఫలితాలే వస్తున్నాయని చెప్పారు. ప్రస్తుతం గుండె జబ్బులు అధికంగా వస్తున్నాయని, వీటిని ముందుగానే గుర్తించడం వల్ల మనిషికి బతికించుకోవచ్చునని పేర్కొన్నారు. సిద్ధార్థ కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి కేఎస్‌వీ సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల్లో చెప్పిన అంశాలతో పాటుగా ఇలాంటి అవగాహన సదస్సుల వల్ల పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం.రమేష్, డీన్ రాజేష్ సి.జంపాలతో పాటుగా అధ్యాపకులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ధర్మపథంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై శుక్రవారం విజయవాడకు చెందిన సీహెచ్ దీపాన్విత బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. రాజగోపురం ఎదుట కళావేదికపై దీపాన్విత బృందంలోని సాత్విక, ఉజ్వలసాయి, హాసిని, సింధూజ, నిందిత, జ్ఞానదీపికలు పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేశారు. అనంతరం నృత్యకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు ప్రసాదాలను అందచేశారు.

ఆగస్టు7న తిరుపతిలో ఓబీసీ 8వ జాతీయ మహాసభలు



ఓబీసీ జాతీయ మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆల్‌మెన్ రాజు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఓబీసీ 8వ జాతీయ మహాసభలు ఆగస్టు 7న తిరుపతిలోని తారక రామ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు అఖిల భారత వెనుకబడిన తరగతుల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ కె.ఆల్‌మెన్ రాజు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో ఓబీసీ మహాసభ వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఆల్‌మెన్ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఓబీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు జస్టిస్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో జాతీయ మహాసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహాసభలకు ప్రభుత్వంలోని ప్రముఖులు హాజరవుతారన్నారు. చేతి వృత్తిదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాటికొండ రంగబాబు మాట్లాడుతూ ×మా వృత్తి.... మా వాటా ..మేమెంతో... మాకంత¥ అనే నినాదంతో మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సమాఖ్య ప్రతినిధులు దేవ రవి,రాజు, రాష్ట్ర స్వర్ణకార సంఘం నాయకులు చిప్పాడ చందు, కడలి ప్రసాద్, కార్పెంటర్స్ అసోసియేషన్ గన్నవరపు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి ఆలయ పనుల పరిశీలన



ఆలయ పనులు పరిశీలిస్తున్న ఈవో భ్రమరాంబ, ఇంజినీరింగ్ అధికారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):మల్లేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణ పనులను శుక్రవారం అధికారులు పరిశీలించారు. దుర్గగుడి ఈవో భ్రమరాంబ, ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమాలతో పాటు వైదిక కమిటీ సభ్యులు మల్లేశ్వరాలయానికి చేరుకుని ఆలయ శిఖరం పనుల గురించి కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. రానున్న దసరా, కార్తీక మాసం నాటికి స్వామి వారి దర్శనం కలిగేలా ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ఆలయ శిఖర పనులు పూర్తి కానున్న నేపథ్యంలో ఆలయం చుట్టూ ఏర్పాటు చేసే విగ్రహాల తయారీని ఆదివారం వెళ్లి పరిశీలించాలని నిర్ణయించారు. ఆలయ స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు మారుతీ యజ్ఞనారాయణ శర్మ, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు. తిరుపతి సమీపంలోని శిల్పశాలను ఆదివారం దుర్గగుడి అధికారులు సందర్శించాలని భావిస్తున్నారు. చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబ, ఈఈ కోటేశ్వరరావు, ఎల్. రమాలతో పాటు కాంట్రాక్టర్, ఇతర అధికారులు తిరుపతి చేరుకుని శిల్పాలను పరిశీలిస్తారని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి.



నిన్న మొన్నటి దాకా చెమటలు పట్టించిన ఎండలు కాస్తా ఇప్పుడు మబ్బుల వెనక దాక్కుని, వానలు కురిపిస్తున్నాయి. వానలు ఆహ్లాదంగానే ఉంటాయి. అయితే సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే వ్యాధులను కూడా వెంట మోసుకొస్తాయి. ఈ అనారోగ్యాలతో పోరాడటానికి. రోగనిరోధకశక్తి బలంగా ఉండటం చాలా ముఖ్యం. వర్షాకాలంలో వ్యాధి నిరోధక శక్తిని మరింత పెంచుకోవడానికి నిత్యం తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవడం అవసరం. ఆ మార్పులేమిటో, ఈ సీజన్‌లో ఏ ఆహారం తీసుకుంటే మంచిదో చూద్దాం...

ఈ ఆహారం తింటే...

చినుకుల్లోనూ చింత ఉండదిక



ముసురు పట్టినప్పుడు వేడి వేడి టీ, కాఫీలు తాగుతుంటారు. అయితే వాటికి బదులు గ్రీన్ టీ, బ్లాక్ టీ, హెర్బల్ టీ వంటివి తీసుకోవాలి. దాంతోపాటు అల్లం, మిరియాలు, తేనెతో తయారు చేసిన టీ సేవిస్తే.. ఆరోగ్యానికి చాలా మంచిది. అదేవిధంగా బజ్జీలు, పునుగులు, బోండాలకు బదులు వేడి వేడి ఉగ్గాణి, సెనగ, పెసర గుగ్గిళ్లు, చుడువా, సగ్గుబియ్యం కిచిడీ మంచిది. పుదీనా, తులసి ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు అధికంగా ఉంటాయి కాబట్టి వీటితో కషాయం కాచుకుని తాగితే మంచిది. రాగులు, సోయా బీన్, పెసలు, మొక్కజొన్న వంటి పప్పుధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకుంటే ఎలాంటి అనారోగ్య సమస్యలూ దరిచేరవు. వీటితోపాటు పోషక విలువలు ఎక్కువగా ఉండే కూరగాయలు, పండ్లు అంటే దానిమ్మ, ఆపిల్, స్ట్రాబెర్రీ, అరటి, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బచ్చలి కూర వంటివి తీసుకుంటే మంచిది.



అల్లం: ఇది శరీర కణజాలాలకు పోషకాలను సమీకరించడానికి, సరఫరా చేయడానికి తోడ్పడుతుంది. ఈ రోజుల్లో జలుబు, దగ్గు వంటి సమస్యలు సర్వసాధారణం. అల్లం కఫాన్ని తగ్గిస్తుంది కాబట్టి అల్లం టీ తాగితే జలుబు, దగ్గు దూరం అవుతాయి. ఫ్లూతో పోరాడటానికి అల్లం తోడ్పడుతుంది. అల్లంలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు రోగనిరోధక శక్తినీ మెరుగుపరుస్తాయి. టీలు, సూప్‌లు, కూరల్లో అల్లాన్ని ఎక్కువ ఉపయోగిస్తే వ్యాధి నిరోధకతను పెంచుకోవచ్చు.



నేరేడు పండు... ఈ పండులో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజాలూ ఫైటోకెమికల్సూ రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి. నేరేడులో క్యాలరీలు తక్కువ. వానాకాలంలో వచ్చే అతిసార, కలరా వ్యాధులతో పాటు ఇతరత్రా ఇన్ఫెక్షన్లకీ నేరేడు ఔషధంలా పనిచేస్తుంది.

తులసి... ఈ కాలంలో రోజూ తులసి ఆకులను నమలడం ద్వారా అనారోగ్యాల నుంచి రక్షణ పొందవచ్చు. ఐదు తులసి ఆకులను రాత్రంతా నీటిలో నానబెట్టి.. మరుసటి రోజు ఉదయం పరగడుపునే ఆ ఆకులు తిని.. నీటిని తాగాలి. తులసి రోగనిరోధక వ్యవస్థను బూస్ట్ చేస్తుంది.



నిమ్మ... నిమ్మరసంలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఇది శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసి రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. అంతేకాదు, శరీరంలో తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచుతుంది. ఇది ఇన్ఫెక్షన్లు, అంటువ్యాధుల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది.

మిరియాలు... నల్ల మిరియాలలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సహాయపడతాయి. జీవక్రియలను పెంచుతాయి. దగ్గు, గొంతు నొప్పి ఉన్నట్లయితే నల్ల మిరియాలను పొడి చేసి నిద్రవేళకు ముందు వేడి పాలలో కలుపుకొని తాగితే ఆరోగ్యానికి చాలా మంచిది.



పసుపు... పసుపులో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని అనేక వ్యాధుల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. రోజూ రాత్రిపూట చిటికెడు పసుపు కలిపిన వేడి పాలు తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

వీటికి దూరంగా ఉండటం మేలు!

రోగనిరోధక శక్తిని బలోపేతం చేయాలంటే చక్కెర పదార్థాలకి దూరంగా ఉండాలి. ముఖ్యంగా ఐస్ క్రీం, కేక్, క్యాండీ, చాక్లెట్, కూల్‌డ్రింక్స్ తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. అలాగే ఉప్పు ఎక్కువగా ఉండే ఆహారాలు ఆరోగ్యానికి చాలా హాని కలిగిస్తాయి. రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తాయి. చాలామంది ప్యాక్ చేసిన ఆహారాలని తినడానికి ఎక్కువగా ఇష్టపడుతారు. కానీ ఇవి ఆరోగ్యానికి మంచివి కావు. అధిక ఉప్పు ఆటో ఇమ్యూన్ వ్యాధి ప్రమాదాన్ని పెంచుతుంది. అలాగే ఆల్కహాల్, ధూమపానం కూడా శరీరాన్ని బలహీనంగా మారుస్తాయి. అందుకే వీటికి వీలైనంత దూరంగా ఉంటే మేలు.



లవంగం... ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి పనిచేస్తుంది. వర్షాకాలంలో లవంగాలను తీసుకుంటే గొంతు నొప్పి వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.



దాల్చిన చెక్క... అద్భుత ఔషధ గుణాలెన్నో దాగి ఉన్న దాల్చిన చెక్క మధుమేహులకు రక్తంలో చక్కెర శాతాన్ని తగ్గిస్తుంది. రోజూ గ్లాసు పాలలో దాల్చిన చెక్క పొడి కలుపుకొని తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అంతేకాదు, శరీరంలో ఉండే కొవ్వు శాతాన్ని తగ్గించే గుణం దీనిలో ఇమిడి ఉంది.

ఉదయాన్నే పిల్లల్ని తయారు చేసి స్కూలుకు పంపించడం పేరెంట్స్‌కు పెద్దపని. ఇంతకంటే వాళ్లను నిద్రలేపడం అతిపెద్ద టాస్క్. ఎంత లేపినా నిద్ర లేవరు. కింద స్కూల్ ఆటోనో, బస్సో వచ్చి హారన్ కొడుతుంటుంది. కానీ వీళ్లు లేవరు. వీళ్లను తొందరగా నిద్ర లేపాలంటే ఇలా ప్రయత్నించి చూడండి....

బడికి వెళ్లనని మారాం చేస్తున్నారా?



సమస్యను అర్థం చేసుకోవాలి

ముందుగా నిద్ర లేవడానికి ఏమైనా ఇబ్బంది పడుతున్నారేమో గమనించాలి. రాత్రి సరిగా పడుకున్నారా లేదా... అసలు నిద్రపట్టలేదా... ఇంకేదైనా సమస్య ఉంటే అనునయంగా అడిగి తెలుసుకోవాలి.

సరిపోయిందా లేదా?

స్కూలుకెళ్లే పిల్లలు కనీసం పదిగంటలు నిద్రపోవాలి. గేమ్స్, ఫోన్లు చూస్తూ సరిగా పడుకోరు. రోజూ ఒక నిర్దేశిత సమయాన్ని కేటాయించి వాళ్లు కచ్చితంగా పడుకునేలా చేయాలి.

ప్రేమతో లేపాలి

ఉదయం ఎంత ఉత్సాహంగా లేస్తే రోజంతా అలానే గడుస్తుంది. అందుకే పిల్లలు త్వరగా లేవకపోయినా ప్రేమగా నిద్రలేపాలి. పిల్లలకు అర్థమయ్యే ప్రేమ భాషలోనే నిద్ర లేపాలి. ఇందుకోసం వాళ్లకు నచ్చే మంచి విషయాలు, స్కూలుకు వెళ్లడం ఎంతముఖ్యమో ప్రేమతో చెప్పాలి.

ఇష్టమైన ఫుడ్

పిల్లలు ఇష్టంగా తినే ఆహారాన్ని బ్రేక్‌ఫాస్ట్‌లో ఇవ్వాలి. అది తినడం కోసం అయినా త్వరగా నిద్ర లేస్తారు. ఈ నాలుగు చిట్కాలు ప్రయత్నిస్తే మీ సమస్య తీరినట్టే.

దిండు లేకుండా పడుకోలేరా?

రాత్రిపూట నిద్రించేటప్పుడు చాలా మంది తలకింద దిండు పెట్టుకొని పడుకుంటారు. అయితే తక్కువ ఎత్తు ఉన్న దిండు ఫరవాలేదు కానీ, పెద్ద దిండు పెట్టుకోవడం వల్ల చాలా ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయి. ఇది మొదట్లో తెలియదు కానీ కొన్ని రోజులు గడిచిన తర్వాత ముందుగా మెడ నొప్పి ఎదురవుతుంది. ఈ నొప్పి దీర్ఘకాలికంగా వేధిస్తుంది. కొంతమందికి ఉదయం నిద్రలేవగానే వెన్నులో నొప్పితో బాధపడతారు. మీకు ఇలాంటి సమస్య ఎదురైతే పడుకునేటప్పుడు మీరు ఎత్తయిన దిండు ఉపయోగిస్తున్నట్లు లెక్క. దీనివల్ల వెన్నెముక వంగిపోతుంది. డిస్క్‌లలో దూరం పెరిగి వెన్నునొప్పి వస్తుంది. అందువల్ల దిండు లేకుండా నిద్రించడం అలవాటు చేసుకోవాలి.



తలలో రక్త ప్రసరణ జరగదు: ఎత్తయిన దిండు పెట్టుకొని నిద్రపోతే తలకి రక్త సరఫరా సరిగ్గా జరగదు. రాత్రిపూట చాలా గంటలు ఇలాగే ఉండటం వల్ల రక్త సరఫరా లేక జుట్టుకు సరైన పోషణ లభించదు. దీనివల్ల జుట్టు రాలే సమస్య మొదలవుతుంది. అంతేకాదు, తరచు తలనొప్పి వస్తుంది. లావుపాటి దిండు పెట్టుకొని నిద్రించడం వల్ల శరీరంలోని కొన్ని భాగాలకి రక్త సరఫరా సరిగ్గా అందక తిమ్మిర్ల సమస్యలు ఏర్పడుతాయి. అందువల్ల మెడనొప్పి ఉండకూడదంటే తక్కువ ఎత్తు ఉండే చిన్న దిండుని ఉపయోగించాలి లేదంటే మెత్తటి టవల్ లేదా పలుచటి దుప్పటిని మడత పెట్టి తలకింద పెట్టుకోవడం ఉత్తమం.

హెల్త్ టిప్స్



మందారం ఆకుల్ని నూరి షాంపూగా వాడితే జుత్తు బాగా పెరుగుతుంది. చుండ్రు నివారణలోనూ, తెల్ల వెంట్రుకల నిరోధకంలోనూ సాయమవుతుంది. కప్పు నీటిలో ఒక మందార పువ్వు వేసి మరిగించి ఆ నీళ్లను తాగితే రక్తంలో ఐరన్ పెరుగుతుంది.



కరివేపాకులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఓ 10 ఆకులతో పేస్ట్ తయారు చేసి మజ్జిగలో కలిపేసుకుని రోజూ తాగితే కాలేయం వ్యర్థపదార్థాల నుంచి రక్షణ పొందుతుంది. రోజూ ఓ 8 ఆకుల్ని మిరియాలతో కలిపి తింటే ముక్కులో వచ్చే అలర్జీలు తగ్గిపోతాయి.



రోజూ రెండు మూడు పుదీనా ఆకుల్ని నమిలి మింగుతుంటే జీర్ణశక్తి పెరిగి, కడుపు ఉబ్బరం, తేన్పులు తగ్గుతాయి. శ్వాసకోశాల శక్తి పెరుగుతుంది.



వేపాకు, యాంటీ సెప్టిక్‌గానూ, క్రిమి సంహారిణిగానూ బాగా పనిచేస్తుంది. వేపాకు పొడిని నీళ్లల్లో కలిపి చల్లితే ఎన్నో రకాల క్రిమి కీటకాలు దూరంగా వెళ్లిపోతాయి. వేపాకుల్ని నీటిలో వేసి మరిగించి స్ప్రే చేస్తే దోమల బెడద తప్పుతుంది. వేపాకు పొడిని పేస్ట్‌గా చేసి వాడితే పలు రకాల చర్మ సమస్యలు, మొటిమలు, ఎగ్జిమాల బాధలు తప్పుతాయి.

పసుపును పేస్ట్‌గా రోజూ ముఖానికి వాడితే, ముఖం మీద ఉండే సన్నని వెంట్రుకలు రాలిపోతాయి. అలాగే మొటిమలు, మచ్చలు కూడా మాయమవుతాయి. ఇది గొప్ప యాంటీ ఆక్సిడెంటు కాబట్టి రోజు మొత్తంలో ఒక టీ స్పూను దాకా కడుపులోకి తీసుకోవచ్చు.



సినిమా

అంతం ఆరంభమవుతుంది!



• ప్రభాస్

వెండితెరపై ప్రభాస్ కల్కి అవతారం ఎత్తారు. ప్రభాస్, కమల్‌హాసన్, అమితాబ్ బచ్చన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ముఖ్య తారలుగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో 'ప్రాజెక్ట్ కె' వర్కింగ్ టైటిల్‌తో ఓ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న 'శాన్ డియాగో కామిక్ కాన్ – 2023' వేడుకలో ఈ సినిమాకు 'కల్కి 2898 ఏడీ' టైటిల్‌ను ఖరారు చేసినట్లు శుక్రవారం వెల్లడించి, గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. 'ప్రపంచాన్ని చీకటి కమ్మేసినప్పుడు ఒక శక్తి ఉద్భవిస్తుంది. అప్పుడు అంతం ఆరంభం అవుతుంది' అన్నట్లుగా ఈ వీడియోలో ఉంది. ఈ వేడుకలో కమల్‌హాసన్ మాట్లాడుతూ– ''మేం స్టోరీలు చేస్తుంటే వారు (ఆడియన్స్) మమ్మల్ని స్టార్స్ చేస్తున్నారు. 'కల్కి 2898 ఏడీ'లో పెద్ద విజన్ ఉంది. ఈ సినిమాలో భాగం కావడం గౌరవంగా ఉంది'' అన్నారు. ''ఈ సినిమాలో నాగ్ అశ్విన్ నా క్యారెక్టర్‌ను డిజైన్ చేసిన తీరు బాగా నచ్చింది. సినిమాలో స్ట్రాంగ్ ఎమోషన్స్ ఉన్నాయి'' అన్నారు ప్రభాస్. ''ఈ సినిమా నాకో అద్భుతమైన అనుభవం. దీని వెనక గొప్ప పరిశోధన ఉంది'' అని వర్చ్యువల్‌గా అమితాబ్ బచ్చన్ మాట్లాడారు. ''నేను సైన్స్ ఫిక్షన్, పురాణాలను ఇష్టపడతాను. మహాభారతం, స్టార్ వార్స్... రెండింటినీ చూస్తూ, వింటూ పెరిగాను. ఈ రెండు ప్రపంచాలను కలిపే ఒక గొప్ప సినిమా చేయాలనుకున్నప్పుడు 'కల్కి 2898 ఏడీ' పుట్టింది'' అన్నారు నాగ్ అశ్విన్. ''ఈ సినిమా మాకు గర్వకారణం'' అన్నారు నిర్మాత అశ్వనీదత్. ఈ వేడుకలో రానా, ప్రియాంకా దత్, స్వప్నా దత్ పాల్గొన్నారు. 'కల్కి 2898 ఏడీ'ను 2024 జనవరి 12న రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

రామ్‌చరణ్‌తో కలిసి నటిస్తా: ప్రభాస్

రామ్‌చరణ్‌తో కలిసి నటిస్తానని ప్రభాస్ 'కామిక్ కాన్–2023' వేడుకల్లో చెప్పారు. ఈ వేడుకల్లో 'ఆర్ఆర్ఆర్' సినిమా ప్రస్తావన రాగా... ''భారతదేశంలో ఉన్న అద్భుతమైన దర్శకుల్లో రాజమౌళి గారు ఒకరు. 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని పాటకు ఆస్కార్ రావడం నాకు చాలా సంతోషంగా అనిపించింది. అది దేశ ప్రజలందరికీ దక్కిన గౌరవంగా భావించాం. అలాగే రామ్‌చరణ్ నాకు మంచి మిత్రుడు. ఏదో ఒక రోజు మేం కచ్చితంగా కలిసి సినిమా చేస్తాం'' అని చెప్పుకొచ్చారు ప్రభాస్.



• చిరంజీవి, తమన్నా

మిల్కీ బ్యూటీ... నువ్వే నా స్వీటీ

'అచ్చ తెలుగు పచ్చి మిర్చి మగాడు వీడే.. బొంబాటు ఘాటు హాటు హాటుగున్నాడే.. కల్లోకి వచ్చేసి కన్నెగుండెల్లో సూది గుచ్చి పిల్లా నీ ముచ్చటేంది అన్నాడే...' అంటూ రొమాంటిక్ మోడ్‌లోకి వెళ్లిపోయారు హీరోయిన్ తమన్నా. చిరంజీవి టైటిల్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'భోళా శంకర్'. ఈ చిత్రంలో చిరంజీవి సరసన తమన్నా నటించగా, ఆయన చెల్లెలి పాత్రలో కీర్తీ సురేష్ నటించారు. మెహర్ రమేష్ దర్శకత్వంలో అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 11న విడుదల కానుంది. ఈ చిత్రంలోని 'మిల్కీ బ్యూటీ.. నువ్వే నా స్వీటీ..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను శుక్రవారం విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను విజయ్ ప్రకాష్, సంజన కల్మంజేతో కలసి ఈ చిత్ర సంగీతదర్శకుడు మహతి స్వర సాగర్ ఆలపించారు.



• సుదీప్, అమలాపాల్

యాక్షన్ హెబ్బులి

సుదీప్, అమలా పాల్ జంటగా ఎస్. కృష్ణ దర్శకత్వంలో రూపొందిన కన్నడ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'హెబ్బులి'. ఈ సినిమాను అదే టైటిల్‌తో సి. సుబ్రహ్మణ్యం ఆగస్టు 4న తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ– ''ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్, రొమాంటిక్ సీన్స్ మిళితమై ఉన్న పక్కా కమర్షియల్ ఫిల్మ్ 'హెబ్బులి'. కన్నడంలో రూ. 100 కోట్లు సాధించింది. తెలుగులోనూ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.



• వైష్ణవ్ తేజ్



• మహేశ్‌బాబు



• టొవినో థామస్

కిక్... పంచ్...

విలన్ ముఖం మీద హీరో పంచ్ ఇవ్వాలా? కాలితో ఒక్క కిక్ కొట్టాలా? గాల్లో ఎగిరి పల్టీలు కొట్టి మరీ విలన్‌ని కొట్టాలా? ఇవన్నీ చేయాలంటే కాస్త ట్రైనింగ్ కావాలి. రెగ్యులర్ ఫైట్స్‌కి అయితే అక్కర్లేదు. బీభత్సమైన ఫైట్స్‌కి అయితే శిక్షణ తీసుకోవాల్సిందే. అది హీరో అయినా హీరోయిన్ అయినా. ఈ మధ్య రిస్కీ రోల్స్ ఒప్పుకున్న కొందరు స్టార్స్ 'మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్' నేర్చుకోవడానికి ప్రిపేర్ అయ్యారు. కిక్ బాక్సింగ్, కరాటే, కుంగ్ ఫూ, జూడో, కలరి పయట్టు వంటివన్నీ మార్షల్ ఆర్ట్స్ కిందే వస్తాయి. ఫైట్‌కి సూట్ అయ్యే ఆర్ట్ నేర్చుకుని బరిలోకి దిగనున్న స్టార్స్ గురించి తెలుసుకుందాం.

మూడు నెలలు బ్యాంకాక్‌లో...

హీరో మహేశ్‌బాబు– డైరెక్టర్ రాజమౌళి కాంబినేషన్‌లో ఓ భారీ చిత్రం రూపొందనున్న విషయం తెలిసిందే. ఆఫ్రికన్ అడవుల నేపథ్యంలో జరిగే ఈ కథలో భారీ యాక్షన్ సన్నివేశాలు ఉంటాయట. పోరాట సన్నివేశాలు సహజంగా ఉండేందుకు కెరీర్‌లో తొలిసారి ఈ సినిమా కోసం మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోనున్నారట మహేశ్ బాబు. ఇందుకోసం మూడు నెలల పాటు బ్యాంకాక్ వెళతారని టాక్. అక్కడ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ట్రైనింగ్, హైకింగ్, ట్రెక్కింగ్ వంటివి నేర్చుకోనున్నారట. ఈ శిక్షణ ఇవ్వనున్న బ్యాంకాక్ స్టంట్ టీమ్‌కి ఓ హాలీవుడ్ ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్ నేతృత్వం వహిస్తారని తెలిసింది. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న 'గుంటూరు కారం'లో నటిస్తున్నారు మహేశ్‌బాబు. ఈ చిత్రం పూర్తయ్యాక బ్యాంకాక్‌లో శిక్షణ తీసుకుని, రాజమౌళి సినిమా షూట్‌లో జాయిన్ అవుతారట. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నారు రాజమౌళి. ఈ చిత్రానికి రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్ కథ అందిస్తున్న సంగతి తెలిసిందే.



• కాజల్

థాయ్‌ల్యాండ్‌లో...

తొలి చిత్రం 'ఉప్పెన'తో (2021) బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు వైష్ణవ్ తేజ్. ఆ తర్వాత 'కొండపొలం, రంగ రంగ వైభవంగా' వంటి చిత్రాల్లో నటించారు. ఈ మూడు చిత్రాల్లో సాఫ్ట్ క్యారెక్టర్‌తో ప్రేక్షకులను అలరించిన ఆయన తొలిసారి 'ఆదికేశవ' చిత్రంలో ఫుల్ యాక్షన్ రోల్ చేశారు. శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హై ఓల్టేజ్ యాక్షన్ సన్నివేశాల కోసం థాయ్‌ల్యాండ్‌లో మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నారు వైష్ణవ్ తేజ్. ఈ చిత్రంలో వైష్ణవ్‌కు జోడీగా శ్రీలీల నటించారు. సూర్య దేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 18న రిలీజ్ కానుంది.

కలరి మార్షల్ ఆర్ట్‌లో...

మలయాళ హీరో టొవినో థామస్ కలరి అనే మార్షల్ ఆర్ట్‌లో శిక్షణ పొందారు. టొవినో థామస్ హీరోగా నటిస్తున్న చిత్రం 'అజయంతే రండం మోషణం'. జితిన్ లాల్ దర్శకత్వం వహిస్తున్నారు. కథ పరంగా కేరళలోని కలరి అనే మార్షల్ ఆర్ట్‌కు ఈ చిత్రంలో ప్రాధాన్యం ఉండటంతో టొవినో థామస్ ఈ విద్యలో శిక్షణ తీసుకుని నటిస్తున్నారు. ఈ చిత్రంలో కృతీ శెట్టి, ఐశ్వర్య రాజేష్, సురభి లక్ష్మి హీరోయిన్లుగా నటిస్తున్నారు.

భారతీయుడు కోసం...

కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వం వహిస్తున్న 'భారతీయుడు 2' కోసం కాజల్ అగర్వాల్ మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నారు. 'భారతీయుడు' (1996) సినిమాకి సీక్వెల్‌గా 'భారతీయుడు 2' (తమిళంలో 'ఇండియన్ 2) రూపొందుతోంది. ఈ చిత్రంలో కమల్‌కు జోడీగా కాజల్ నటిస్తున్నారు. ఈ చిత్రంలో పవర్‌ఫుల్ ఫైట్స్ చేయడం కోసం అతిపురాతనమైన యుద్ధ క్రీడ కలరి పయట్టు నేర్చుకున్నారు కాజల్. కలరి సాధన చేస్తున్న ఓ వీడియోను ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేసి, 'షావోలిన్, కుంగ్ ఫూ, కరాటే, తైక్వాండో.. వంటి క్రీడలు కలరి నుంచి పుట్టుకొచ్చినవే' అని పేర్కొన్నారామె. ఈ మూవీ కోసం గుర్రపు స్వారీ కూడా నేర్చుకున్నారు కాజల్ అగర్వాల్.

కోలీవుడ్‌లో ఫెఫ్సీ కొత్త నిబంధనలు

• సినిమా షూటింగ్‌లకు ఫెఫ్సీ కొత్త నియమాలు • వెల్లువెత్తుతున్న విమర్శలు

దక్షిణ భారత సినీ కార్మికుల సంఘం (ఫెఫ్సీ) కొత్త నియమ, నిబంధనలు కోలీవుడ్‌లో చర్చనీయాంశమయ్యాయి. తమిళ చిత్రాలకు స్థానిక నటీనటులు, సాంకేతిక నిపుణులు మాత్రమే పని చేయాలని, తమిళ సినిమాల చిత్రీకరణలు తమిళనాడులోనే జరగాలని, సరైన కారణాలు లేనిదే అవుట్‌డోర్ లొకేషన్స్‌లో షూటింగ్ జరపకూడదని ఫెఫ్సీ కొత్త నియమాలు చేసిందని సమాచారం. అలాగే అనుకున్న సమయంలోపు సినిమా చిత్రీకరణ పూర్తి కాకపోయినా, బడ్జెట్ పరిమితి దాటినా నిర్మాతలకు సరైన కారణాలతో లిఖిత పూర్వకమైన లేఖను సమర్పించాలని, ఒకవేళ ఓ సినిమాకు దర్శకుడే రచయిత అయితే, ఆ సినిమా కథకు సంబంధించి ఏదైనా సమస్య ఉంటే అతనే పరిష్కరించుకోవాలని, ఆ సమస్య ప్రభావం షూటింగ్, నిర్మాతలపై పడకుండా జాగ్రత్త వహించే బాధ్యత కూడా ఆ వ్యక్తే తీసుకోవాలన్నట్లుగా కొన్ని నియమాలను 'ఫెఫ్సీ' తీసుకొచ్చిందట. ఈ కొత్త నిర్ణయాలపై కోలీవుడ్‌లోనే కాదు.. సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'ఈ నిబంధనలు ఉన్నప్పుడు తమిళ సినిమాలను తమిళనాడులోనే రిలీజ్ చేసుకోవాలి. కోలీవుడ్‌లో హీరోయిన్లకు కొరత ఏర్పడుతుంది. సినిమాకి వాడే సాంకేతిక సామాగ్రిని కూడా తమిళనాడులోనే తయారుచేసుకోవాలి' అంటూ ఫెఫ్సీ నియమాలపై సోషల్ మీడియాలో కొందరు నెటిజన్లు వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు. అయితే ఈ కొత్త నియమాలను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారని ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి పేర్కొన్నారట.